


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 27

బుధవారం 11-10-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పాకిస్తాన్ అదరగొట్టింది

శ్రీలంకపై 6 వికెట్ల తేడాతో గెలుపు.. భారీ లక్ష్యాన్ని ఛేదించిన పాక్ - 12లో



అంబానీ టాప్..

హురున్ ఇండియా కుబేరుల్లో 8 లక్షల కోట్ల సంపదతో అగ్రస్థానం - 13లో



కులగణన దేశానికి ఎక్స్‌రే

కులగణన దేశానికి ఎక్స్ రే తీయడం లాంటిదని.. ఓబీసీలు, దళితులు, ఆదివాసీల పరిస్థితులు తెలుసుకోవచ్చని రాహుల్ అన్నారు.

వివరాలు 13లో ▸



ఆప్ ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ సోదాలు

మనీలాండరింగ్ కేసులో ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది.


వివరాలు 6లో ▸



కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు.

వివరాలు 6లో ▸



కేసీఆర్‌ను పీకి పారేద్దాం

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను పీకి పారేద్దామంటూ ప్రజలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు.

వివరాలు 3లో ▸

ఫ్యాక్ట్ చెక్

కళ్లు తెరిచి చూడు రామోజీ..

- ఈ ప్రభుత్వంలో పీహెచ్‌సీలు బలోపేతమైన తీరు కనిపిస్తుంది
- మీ బాబు హయాంలో అవి బూత్‌బంగ్లాలను తలపించేవి
- నేడు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తయారైన విషయం వాస్తవం కాదా..
- ప్రతి ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు కలిపి 14 మంది సేవలు అందిస్తుంటే ఏడుపుగొట్టు రాతలా?
- టీడీపీ పాలనలో కనీస వైద్య సిబ్బందిలేరన్న విషయం మర్చిపోతే ఎలా?
- అప్పట్లో ప్రాథమిక వైద్యానికి ప్రజలుపడ్డ ఇబ్బందులపై ఒక్క వార్తయినా రాశారా రామోజీ..
- ఇప్పుడు ప్రతి మండలానికి 2 పీహెచ్‌సీలు లేదా ఒక పీహెచ్‌సీ/ఒక సీహెచ్‌సీ ఉండేలా చర్యలు
- రాత్రిపూట సేవలు కూడా అందుబాటులో ఉన్న విషయం తెలీకపోతే ఎలా?
- నాడు–నేడులో భాగంగా అన్ని వసతులతో పీహెచ్‌సీ భవనాలను తీర్చిదిద్దడం కనిపించడంలేదా?

3 లో



అవినీతిని కాపాడటానికా సెక్షన్ 17ఏ?

తప్పు చేసిన వాళ్లంతా ఈ చట్టాన్ని చూపించి అనుమతులు తెమ్మంటే ఎలా?

ఇలాగైతే దర్యాప్తు చేయడానికి ఏ అధికారి అయినా ముందుకొస్తారా?

నిజాయితీపరులకు మద్దతివ్వటానికే ఈ చట్టాలు... వాటికి సవరణలు

అంతేతప్ప అవినీతిని, అవినీతిపరుల్ని కాపాడటానికి కాదు?

సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదన

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంలో కొనసాగిన విచారణ

చంద్రబాబు తరఫున మరోసారి వాదనలు వినిపించిన హరీష్ సాల్వే, లూథ్రా

తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు

మంగళవారమే తేల్చాలని బాబు లాయర్లు కోరినా.. ధర్మాసనం నో

గవర్నరు అనుమతి తీసుకోకుండా బాబును అరెస్టు చేశారన్న సాల్వే

అక్రమంగా అరెస్టు చేశారు కనుక కేసు మొత్తాన్ని కొట్టేయాలంటూ వాదనలు

సెక్షన్ 17ఏ ప్రకారం అనుమతి ఉండాలని, లేదు కనక కేసు చెల్లదని వ్యాఖ్యలు

స్కిల్ కుంభకోణంతో ఖజానాకు తీవ్రమైన నష్టం జరిగిందన్న ముకుల్ రోహత్గీ

సాంకేతిక అంశాలు చూపుతూ కేసును కొట్టేయమనటం సరికాదని వాదన

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి జైల్లో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు.. గవర్నరుకు సమాచారమివ్వకుండా తనను అరెస్టు చెయ్యటం చెల్లదు కనుక ఈ కేసును కొట్టేయాలంటూ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో మంగళవారం కూడా ఎలాంటి ఉపశమనం లభించలేదు. మంగళవారమే దీన్ని ముగించాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులు పట్టుబట్టినప్పటికీ.. ధర్మాసనం ఈ కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. విశేషమేంటంటే తాను స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి

మిగతా 10వ పేజీలో ▶



తత్తరపాటు.. బిత్తర చూపులు!

ఇన్నర్ రింగ్ రోడ్డు అక్రమాలపై సీఐడీ విచారణలో లోకేశ్ తడబాటు.. అసహనం

అబ్బే నాకేం తెలీదన్న లోకేశ్.. మరి ఈ సంతకాలు మీవే కదా? అని ప్రశ్నించిన అధికారులు

హెరిటేజ్ భూముల కొనుగోలు దందాపైనా ఆధారాలను చూపిస్తూ సూటిగా ప్రశ్నలు

3 లో



శవాల దిబ్బలు.. శిథిల దృశ్యాలు

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటికే 1,800 మంది బలి

ఇజ్రాయెల్‌లో 1,000 మంది, గాజా, వెస్ట్‌బ్యాంకులో 800 మంది మృతి

నాలుగో రోజుకు చేరిన ఇజ్రాయెల్ వైమానిక దాడులు

మా లక్ష్యం హమాస్ మాత్రమే: ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ

గాజాపై దాడులు ఆపకపోతే బందీలను చంపేస్తాం.. ఇజ్రాయెల్‌కు హమాస్ హెచ్చరిక

6 లో



ఇజ్రాయెల్‌కు భారత్ అండదండలు

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు మంగళవారం ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్‌లోని పరిస్థితుల గురించి మోదీకి నెతన్యాహు వివరించారు. ఈ విపత్కర సమయంలో ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తామని మోదీ చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిందేనన్నారు.

మారింది పేరొక్కటే

- డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులకు నాడు నేడూ అవే విధులు
- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రమోట్ చేయడం వారి విధుల్లో భాగమే
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలుగా అభివర్ణిస్తూ తప్పుడు కథనాలు
- అయినా వారంతా ఈనాడు మాజీ ఉద్యోగులే కదా?.. నిబంధనలను అనుసరించే నియామకం

14 లో



సర్వీస్ ఈనాం భూములపై మరింత స్పష్టత

22(ఎ)1(ఎ), (బి), (డి)లో ఉన్న వాటిని కలెక్టర్లు తొలగించాలి

జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం తాజా ఆదేశాలు

సాక్షి, అమరావతి: సర్వీస్ ఈనాం భూములపై హక్కులు కల్పించే క్రమంలో అనుసరించాల్సిన విధానాలపై జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం మరింత స్పష్టత ఇచ్చింది. నిషేధిత జాబితా 22 (ఎ)లో ఉన్న వివిధ కేటగిరీ భూములపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో వివరణ ఇస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ తాజాగా మెమో జారీ చేశారు. 2013లో ఈనాం చట్టానికి చేసిన సవరణలో దేవాలయాల ఈనాం భూములతో పాటు సర్వీస్ ఈనాం భూములు కూడా నిషేధిత జాబితాలో చేరిపోయాయి. వాటిని ఇప్పుడు ఆ జాబితా నుంచి తొలగించి లక్షలాది మంది సర్వీస్ ఈనాం రైతులకు వైఎస్ జగన్ ప్రభుత్వం మేలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో జిల్లాల్లో జరుగుతున్న వెరిఫికేషన్‌లో అధికారులు పలు అంశాలు లేవనెత్తారు. ఈ భూములు 1908 రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22(ఎ)లోని 1(ఎ) అసైన్డ్ భూములు, 1(బి)- ప్రభుత్వ పోరంబోకు భూములు, 1(సి)–దేవదాయ, వక్ఫ్ భూములు..

మిగతా 2వ పేజీలో ▶

ప్రపంచ నంబర్‌వన్ జోడీగా సాత్విక్–చిరాగ్

అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి మరో ఘనత సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో పురుషుల డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకున్న తొలి భారత జోడీగా చరిత్ర సృష్టించింది.

12 లో





సచివాలయాల పనితీరు భేష్

పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, కురుపాం మేజర్ పంచాయతీలను కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈశ్వరన్ నంబూద్రితో కూడిన బృందం సందర్శించింది. గ్రామ సచివాలయాల పనితీరుపై కేరళ రాష్ట్ర బృందం ప్రశంసలు కురిపించింది. పౌరసేవలు పారదర్శకంగా అందుతుండడంపై సంతృప్తి వ్యక్తం చేసింది.

- వివరాలు 2లో



కొత్తగా వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు

'ఈ ఏడాది కొత్తగా వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేస్తున్నాం. మూడు నెలల్లో అందుబాటులోకి వస్తాయి. అలాగే దసరాకు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం 5,500 స్పెషల్ బస్సులను తిప్పుతున్నాం. రాను పోను ప్రయాణికులకు 10 శాతం రాయితీ కల్పిస్తున్నాం' అని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చెప్పారు.

- వివరాలు 3లో

తెలంగాణ

ఆ ఖాతాలకు డబ్బు ఎందుకు పంపారు?

ఆ వ్యక్తులు ఎలా తెలుసు?

నటుడు నవదీప్‌ను ప్రశ్నించిన ఈడీ అధికారులు



సాక్షి, హైదరాబాద్: 'ఈ బ్యాంకు ఖాతాకు మీరు డబ్బు ఎందుకోసం పంపారు? ఈ ఆర్థిక లావాదేవీలు జరిపిన వ్యక్తులు మీకు ఎలా తెలుసు? ఎప్పటి నుంచి ఈ బ్యాంకు ఖాతాలకు డబ్బులు పంపుతున్నారు?' ఇలాంటి అనేక కీలక ప్రశ్నలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నటుడు నవదీప్‌కు సంధించినట్లు సమాచారం. కొందరు నైజీరియన్ల బ్యాంకు ఖాతాలకు నవదీప్ బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు వెళ్లినట్టుగా ఈడీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. 2017లో నమోదైన టాలీవుడ్ డ్రగ్స్ కేసులతో పాటు ఇటీవల నమోదైన మాదాపూర్ డ్రగ్స్ కేసులలో ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించేందుకు తమ ఎదుట హాజరుకావాలంటూ ఈడీ అధికారులు నటుడు నవదీప్‌కు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం ఉదయం 10–40 గంటలకు సైఫాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి నవదీప్ చేరుకున్నారు. సమన్లలో పేర్కొన్న విధంగా బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్‌కార్డ్ సహా ఇతర డాక్యుమెంట్లను అధికారులకు అందజేశారు. జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ ఆధ్వర్యంలోని ఐదుగురు అధికారుల ప్రత్యేక బృందం నవదీప్‌ను దాదాపు 8 గంటల పాటు విచారించింది. ముఖ్యంగా నవదీప్‌కు చెందిన మూడు బ్యాంకు ఖాతాల లావాదేవీలపై ప్రశ్నించినట్టు తెలిసింది.

నైజీరియన్లతో ఆర్థిక లావాదేవీలు..

2017లో తెలంగాణ ఎక్సైజ్‌శాఖ నమోదు చేసిన డ్రగ్స్ కేసులలో కీలక నిందితుడు కెల్విన్ పట్టుబడిన తర్వాత టాలీవుడ్ డ్రగ్స్ లింకులు బయటపడ్డాయి. దీంతో హీరో నవదీప్ సహా పలువురిని ఎక్సైజ్ అధికారులు విచారించారు. ఈడీ మనీలాండరింగ్‌పై దృష్టి పెట్టింది. ప్రత్యేకంగా కేసు నమోదు చేసిన అధికారులు 2021లో నవదీప్‌తో పాటు పలువురు టాలీవుడ్ నటులను ప్రశ్నించారు. ఇప్పటికే ఒకసారి నవదీప్‌ను ప్రశ్నించిన ఈడీ అధికారులు తాజాగా మంగళవారం నాటి విచారణలోనూ ఆయన ఆర్థిక లావాదేవీలపై ఆరా తీశారు. నవదీప్‌కు ఇటీవల మాదాపూర్ డ్రగ్స్ కేసులో అరెస్టయిన వరంగల్‌కు చెందిన రామ్‌చంద్ అత్యంత సన్నిహితుడు. రామ్‌చంద్ బెంగళూరులో షెల్టర్ తీసుకుంటున్న నైజీరియన్లు అమోబి చుక్వుడి, మైకేల్, థామస్ అనఘల వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో కస్టమర్లకు అమ్మేవాడని తేలింది. కాగా హీరో నవదీప్ కూడా డ్రగ్స్ అందించేవాడని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ క్రమంలోనే నైజీరియన్లతో నవదీప్ ఆర్థికపరమైన లావాదేవీలు జరిపినట్టుగా ఈడీ ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. తాజా డ్రగ్స్ కేసులతో పాటు 2017లో నమోదైన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో కూడా నవదీప్ నుంచి వివరాలు రాబడుతున్నట్టు సమాచారం. విచారణ అనంతరం మంగళవారం రాత్రి ఈడీ కార్యాలయం నుంచి తిరిగి వెళుతున్న నవదీప్‌ను మీడియా ప్రతినిధులు పలు అంశాలపై ప్రశ్నించారు. అయితే ఆయన ఏమీ స్పందించకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

'నకిలీ విత్తు' చిత్తు!

రైతన్నలకు వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌ల భరోసా

నాణ్యమైన ఉత్పాదకాలేవో తేల్చి చెబుతున్న ఉచిత పరీక్షలు



- నాసిరకం, నకిలీలేవో ఇట్టే తేలిపోవడంతో అన్నదాతలకు రక్ష..
- పెట్టుబడి నష్టపోకుండా ముందుగానే జాగ్రత్త
- మంచి విత్తనాలతో మంచి దిగుబడులు సాధించేలా చేయూత
- అందుబాటులో 10 జిల్లా స్థాయి, 127 నియోజకవర్గ స్థాయి ల్యాబ్‌ల సేవలు
- సీడ్ జన్యు పరీక్ష కోసం గుంటూరులో రాష్ట్ర స్థాయి ల్యాబ్
- నియోజకవర్గ స్థాయిలో విత్తన, ఎరువుల నాణ్యతా నిర్ధారణ పరీక్షలు
- పరీక్షా ఫలితాల ఆధారంగా విత్తన, ఎరువుల వినియోగం..

ర్యాండమ్ చెక్ తర్వాతే ఆర్బీకేల ద్వారా అమ్మకాలు

ప్రతి ల్యాబ్‌లో ఒక అనలిస్ట్, ఇద్దరు జూనియర్ అనలిస్టులు

2 లో



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలను పరీక్షిస్తున్న సిబ్బంది



అబ్బే అదేం కాదు! అభ్యర్థుల ఎంపిక కసరత్తు చేసి వస్తున్నారు!

క్లుప్తంగా...

రేపు సీఎం కాకినాడ జిల్లా పర్యటన

సాక్షి, అమరావతి: ఈ నెల 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోటలో పర్యటించనున్నారు. అక్కడ జగనన్న కాలనీలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఉదయం 9 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరతారు. సామర్లకోటలో కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం సీఎం వైఎస్ జగన్ తాడేపల్లికి చేరుకుంటారు.

దేవదాయ శాఖ ఎస్టేట్స్ జేసీగా భ్రమరాంబ

సాక్షి, అమరావతి : దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆలయాలకు సంబంధించిన భూముల వ్యవహారాలు పర్యవేక్షించే జాయింట్ కమిషనర్ (ఎస్టేట్)గా డి. భ్రమరాంబ నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆమె విజయవాడ దుర్గగుడి ఈవోగా పనిచేయగా, ఆమె స్థానంలో ఈవోగా గతంలో శ్రీకాళహస్తి ఆర్జీవోగా పనిచేసిన కేఎస్ రామారావు కొత్తగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ల ఆలయ ఈవోగా ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్‌ను నియమించి, అక్కడ ఈవోగా పనిచేసే ఎస్‌వీఎస్ఎన్ మూర్తిని తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనర్‌గా నియమించారు.

ఉద్యోగ నియామకాల వయోపరిమితి పెంపు

సాక్షి, అమరావతి: వయసు మీరిన నిరుద్యోగులకు మేలు చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు నేరుగా భర్తీ చేసే నాన్ యూనిఫాం పోస్టులు, యూనిఫాం పోస్టులకు అభ్యర్థుల వయో పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. నాన్ యూనిఫాం పోస్టులకు అభ్యర్థుల వయో పరిమితిని 34 నుంచి 42 సంవత్సరాలకు పెంచింది. యూనిఫాం పోస్టులకు ప్రస్తుతం ఉన్న వయోపరిమితికి అదనంగా రెండు సంవత్సరాలను పెంచింది. ఈ వయోపరిమితి పెంపుదల వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి ప్రభుత్వ సాయం



కృపమ్మ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి ప్రకాష్‌నగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆశా వర్కర్ రేపూడి కృపమ్మ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అపస్మారక స్థితికి వెళ్లి మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని మరోసారి మంగళవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి పరామర్శించారు. అనంతరం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.10 లక్షల చెక్కును కృపమ్మ కుమారుడు, కుమార్తె అనిల్ కుమార్, అనిత కమల ప్రియకు అందజేశారు. ఆశా వర్కర్ రేపూడి కృపమ్మ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ప్రభుత్వం 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అలాగే వారికి నివాస స్థలాన్ని గతంలోనే కేటాయించగా.. అందులో ఇంటి నిర్మాణం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కృపమ్మకు కుమారుడు, కుమార్తెల్లో ఉద్యోగం ఎవరికి ఇవ్వాలనేది కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్న అనంతరం వారికి ఉద్యోగం ఇవ్వనున్నట్లు అధికారులు చెప్పారు.

సచివాలయాల పనితీరు భేష్

వీరఘట్టం: ఏపీలోని సచివాలయాల పనితీరుపై కేరళ రాష్ట్ర బృందం ప్రశంసల వర్షం కురిపించింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, కురుపాం మేజర్ పంచాయతీలను కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈశ్వరన్ నంబూద్రితో కూడిన బృందం మంగళవారం సందర్శించింది. జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణతో కలిసి రెండు పంచాయతీల్లో సచివాలయాల పనితీరు, పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు, తదితర అంశాలపై ఆరా తీసింది. పౌరసేవలు పారదర్శకంగా అందుతుండడంపై సంతృప్తి వ్యక్తం చేసింది. రెండు పంచాయతీలకు ఐఎస్‌ఓ గుర్తింపునకు ప్రతిపాదిస్తామని పేర్కొంది. దీనివల్ల పంచాయతీలు పట్టణాలుగా రూపాంతరం చెందుతాయని, మల్టీ నేషనల్ కంపెనీలు వచ్చి ప్రజలకు, యువతకు ఉపాధి అవకాశాలు చూపుతాయని తెలిపింది. డీఎల్‌పీఓ రామ్‌ప్రసాద్, ఈఓ వీ రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'నకిలీ విత్తు' చిత్తు!

రైతన్నలకు వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌ల భరోసా



ఇతని పేరు బుద్దా సన్యాసిరావు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం. ఈయన 5 ఎకరాల్లో సొంత విత్తనంతో సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. మొలక శాతం ఎంతుందో తెలుసుకునేందుకు ఆర్బీకే ద్వారా కోరుకొండ ల్యాబ్‌కు శాంపిల్ పంపి ఉచితంగా పరీక్ష చేయించారు. మొలక శాతం చాలా తక్కువగా ఉందని గుర్తించడంతో వాటిని పక్కన పెట్టి, డెల్టా సీడ్స్ కంపెనీ నుంచి జీపీటీ 5204 విత్తనాన్ని కొని మరోసారి పరీక్షించుకుంటే మొలక శాతం బాగా వచ్చింది. అదే విత్తనాలు నారుమడి పోసుకొని సాగు చేశాడు. నిజంగా మొలక శాతం లేని సొంత విత్తనంతో సాగు చేసి ఉంటే ఎకరాకు విత్తనానికి రూ.1,000, నారుమడి, దమ్ముకు రూ.500, బాటలు తీసి ఎరువులు, పురుగు మందులకు మరో రూ.200 చొప్పున 5 ఎకరాలకు రూ.8,500కు పైగా నష్టం వచ్చేది. పంటపై పెరిగే పురుగులు, చీడపీడల నియంత్రణకు ఎకరాకు రూ.600 నుంచి రూ.800 వరకు అదనపు పెట్టుబడి పెట్టాల్సి వచ్చేది. మొక్కలు ఎదగడానికి పట్టే 25 రోజుల విలువైన కాలమే కాకుండా, ఎకరాకు 4–6 బస్తాల దిగుబడి కోల్పోవాల్సి వచ్చేది. 'ఆ విత్తనం ఉపయోగించకపోవడం వల్ల పెట్టుబడి కోల్పోకుండా జాగ్రత్త పడడమే కాదు.. మొలక శాతం ఎక్కువగా ఉన్న జీపీటీ 5204 రకం విత్తనంతో సాగు వల్ల ఆశించిన దిగుబడులను సాధించగలిగాను. కొత్తగా ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్ వల్ల నా పంట కాపాడుకోగలిగాను' అని ఈ రైతు ఆనందంగా చెబుతున్నాడు.

పంపాన వరప్రసాదరావు,
తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ
ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ నుంచి సాక్షి ప్రతినిధి :

తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరానికి 18 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది కొరుకొండ గ్రామం. ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి వారు కొలువైన ఈ గ్రామంలో ఓ వైపు పంట పొలాలు.. మరో వైపు ఆయిల్ పామ్, మామిడి, జీడిమామిడి తోటలు. గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే కేంద్రాలున్నాయి. గ్రామం మధ్య కాపవరం రోడ్డులో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అత్యంత అధునాతనంగా నిర్మించిన భవనం ఉంది. అదే వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్. ఈ ల్యాబ్‌కు అనుబంధంగా పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్ కూడా ఉంది.



ల్యాబ్ పరిధిలో 16,691 హెక్టార్ల విస్తీర్ణం ఉండగా, 14,162 మంది రైతులున్నారు. వీరిలో 70 శాతం మంది కౌలుదారులే. ల్యాబ్‌లో అడుగు పెట్టగానే ఎటు చూసినా అత్యాధునిక పరికరాలే. విత్తన, ఎరువుల శాంపిల్స్‌ను పరీక్షించే సీడ్ బ్లోవర్, మైక్రోస్కోప్, ప్యూరిటీ బోర్డు, డిస్టిలేషన్ యూనిట్, బోర్నర్, గోనెట్ డివైడర్, సీడ్ జెర్మినేటర్, హాట్ ఎయిర్ ఓవెన్, మఫ్లే ఫర్నేస్, హాట్‌ప్లేట్, సెక్షన్ పంప్, డేస్కికేటర్ ఇలా ఒకటి కాదు.. రెండు కాదు పదుల సంఖ్యలో పరికరాలు ఉన్నాయి. రైతులు తెచ్చిన శాంపిల్స్ పరీక్షించడంలో ల్యాబ్ ఇన్‌చార్జి, వ్యవసాయాధికారి దేవరపల్లి రామతులసితో పాటు ల్యాబ్ సిబ్బంది తలమునకలైఉన్నారు. అదే సమయంలో శాంపిల్స్ పట్టుకొని కొంతమంది, ఇచ్చిన శాంపిల్స్ ఫలితాల కోసం మరికొంత మంది రైతులు ల్యాబ్‌కు రావడం మొదలైంది. ల్యాబ్ ఏమిటో? ఎవరి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందో మీకు తెలుసా? అని ఆరా తీయగా, అక్కడకు వచ్చిన రైతులే కాదు.. గ్రామంలోని పలువురు రైతులు కూడా ల్యాబ్ ఏర్పాటుతో మాకు ఎంతో మేలు జరుగుతోందని ఆనందంగా చెప్పారు. 'గతంలో ఏదైనా పరీక్షించుకోవాలంటే పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వెళ్లాల్సి వచ్చేది. అంత దూరం వెళ్లేందుకు ఆర్థిక భారం కావడంతో డీలర్లు ఇచ్చిన విత్తనాలను కనీసం పరీక్ష కూడా చేయించుకోకుండానే విత్తుకునే వాళ్లం. మొలక వస్తే అదృష్టం.. లేకుంటే మా దురదృష్టం.. అన్నట్టుగా ఉండేది మా పరిస్థితి. ఇప్పుడు మా నియోజకవర్గంలోనే ఈ ల్యాబ్ రావడంతో విత్తనాలు, ఎరువులు తనిఖీ చేయించుకోగలుగుతున్నాం' అని తెలిపారు. విత్తనం మంచిదైతే.. పంట బాగుంటుంది. పంట బాగుంటే దిగుబడిపై దిగులుండదు. ఆశించిన దిగుబడులు సాధించాలంటే మేలి రకం విత్తనం కావాలి. అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్ అద్భుత పనితీరుతో రైతులకు భరోసా కల్పిస్తున్నాయి. ఏటా రూ.వేల కోట్ల పెట్టుబడి మట్టిపాలు కాకుండా ముందుగానే పరీక్షించి హెచ్చరిస్తున్నాయి. పైసా ఖర్చు లేకుండా ఇన్‌పుట్స్‌ను ముందుగానే పరీక్షించుకోవడం ద్వారా నాసిరకం, నకిలీల బారిన పడకుండా ధైర్యంగా సాగు చేసుకోగలుగుతున్నారు. సొంతంగా తయారు చేసుకున్నవైనా, మార్కెట్‌లో కొనుగోలు చేసినవైనా నేరుగా ల్యాబ్‌కు వెళ్లి విత్తన నాణ్యతను ఉచితంగా పరీక్షించుకుని, ఫలితాల ఆధారంగా ధైర్యంగా సాగు చేసుకోగలుగు తున్నామని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది రైతులు నష్టపోకుండా అగ్రి ల్యాబ్‌లు అండగా నిలుస్తున్నాయి.

> రాష్ట్రంలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌ల ద్వారా ఏటా 50 వేలకు పైగా ఇప్పటి వరకు 1,03,215 విత్తన శాంపిళ్లను పరీక్షించారు. వీటిలో 11 వేల శాంపిళ్లు ఆర్బీకేల ద్వారా రైతులు పంపినవే. ఇందులో 1,884 నమూనాలు నాణ్యత లేనివిగా గుర్తించి వాటి తయారీ, అమ్మకం దారులపై చట్టపరంగా చర్యలకు ఆదేశించారు. తద్వారా ఆయా రైతులు నష్టపోకుండా ముందస్తుగానే అడ్డుకున్నారు. రైతులకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు నష్టాలపాలవ్వకుండా చూశారు.

గతంలో నకిలీలదే రాజ్యం

రాష్ట్రంలో ఏటా వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు కోసం 1.25 లక్షల లాట్స్ విత్తనాలు, 2.80 లక్షల బ్యాచ్‌ల పురుగు మందులు, 20 వేల బ్యాచ్‌ల ఎరువులు మార్కెట్‌కు వస్తుంటాయి. గతంలో వీటి నాణ్యతను పరీక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో 11 ల్యాబరేటరీలు మాత్రమే అందుబాటులో ఉండేవి.



పెస్టిసైడ్స్ కోసం 5, ఎరువులు, విత్తన పరీక్షల కోసం 3 చొప్పున ఉండేవి. మార్కెట్‌లోకి వచ్చే ఎరువుల్లో 30 శాతం, విత్తనాల్లో 3–4 శాతం, పురుగు మందుల్లో ఒక శాతానికి మించి శాంపిళ్లను పరీక్షించే సామర్థ్యం వీటికి ఉండేదికాదు. దీంతో మార్కెట్‌లో నకిలీలు రాజ్యమేలేవి. ఏటా వీటి బారిన పడి రైతన్నలు ఆర్థికంగా వేల కోట్ల రూపాయల పెట్టుబడి నష్టపోయేవారు. నాణ్యమైన సాగు ఉత్పాదకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో మరెక్కడా లేని విధంగా నియోజకవర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడంతో రైతుల్లో నమ్మకం, భరోసా కలిగింది.

దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా ఏపీ

ఇప్పటిదాకా తమిళనాడులో అత్యధికంగా 38 అగ్రి ల్యాబ్స్ ఉండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా నియోజకవర్గ స్థాయిలో ల్యాబ్స్ ఏర్పాటుతో ఏపీని దేశంలో నంబర్ వన్ స్థానంలో నిలిపారు. ఒక్కొక్కటి రూ.8.25 కోట్లతో జిల్లా స్థాయిలో 10 ల్యాబ్స్, ఒక్కొక్కటి రూ.82 లక్షల నుంచి 90 లక్షల అంచనాతో నియోజకవర్గ స్థాయిలో 147 ల్యాబ్స్, రూ.75 లక్షలతో నాలుగు (విశాఖ, తిరుపతి, అమరావతి, తాడేపల్లిగూడెం) రీజనల్ కోడింగ్ సెంటర్స్, రూ.8.50 కోట్ల అంచనా వ్యయంతో గుంటూరులో డీఎస్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ టెక్నాలజీతో రాష్ట్ర స్థాయి ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కాగా 2021 జూలై 8న రైతు దినోత్సవం రోజున 70 కేంద్రాలు, ఆ తర్వాత మరో 5 కేంద్రాలను ప్రారంభించగా, ఈ ఏడాది జూలై 8న మరో 52 ల్యాబ్‌ల సేవలు అందుబాటులోకి వచ్చాయి. మరో 20 ల్యాబ్స్ నిర్మాణ దశలో ఉన్నాయి. వీటికి అనుబంధంగా 154 ఇంటిగ్రేటెడ్ వెటర్నరీ, 35 ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశారు.

పరీక్షలన్నీ ఉచితమే

ల్యాబ్‌లలో విత్తన మొలక శాతం పరీక్ష నివేదికను వారం రోజుల్లోపు ఇస్తున్నారు. పురుగు మందులు, ఎరువుల నాణ్యత నిర్ధారణ రిపోర్టును 2–3 రోజుల్లోనే అందజేస్తున్నారు. రైతులు కాకుండా వ్యాపారులు, డీలర్లు, తయారీదారులు, ఇతరులు నాణ్యత ప్రమాణాల పరీక్ష నివేదిక కోసం ఎరువుల రకాన్ని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు, పురుగు మందులకు సంబంధించి రూ.3,500, విత్తనాల నివేదిక కోసం రూ.200 చొప్పున చెల్లించాలి. అదే రైతులకైతే పూర్తిగా ఉచితం. ప్రభుత్వమే ఈ వ్యయాన్ని భరించి రైతన్నకు తోడుగా నిలుస్తోంది. ఏటా 50 వేల శాంపిళ్ల చొప్పున ఇప్పటి వరకు 1,03,215 శాంపిళ్లను పరీక్షించారు. వీటిలో 11 వేల శాంపిళ్లు ఆర్బీకేల ద్వారా రైతులు పంపినవే. వీటిలో 1,884 నమూనాలు నాణ్యత లేనివిగా గుర్తించి వాటి తయారీ, అమ్మకం దారులపై చట్టపరంగా చర్యలకు ఆదేశించారు.

అత్యాధునిక పరికరాలు

నమూనాల పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ (ఇన్‌సైట్) అభివృద్ధి చేశారు. ఫలితాలను ట్యాంపర్ చేసేందుకు వీల్లేని రీతిలో ప్రతి లేబరేటరీలో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటి రికార్డు కావడంతో పాటు ఫలితాలు ఆటోమేటిక్‌గా సిస్టమ్‌లో నమోదవుతున్నాయి. ల్యాబ్‌లో ఏబ్యాచ్ శాంపిల్‌ను ఏ సమయంలో పరీక్షించారో ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా నమోదు అవుతోంది. షాపులో బ్యాచ్ నంబర్ చెక్ చేస్తే చాలు.. నాణ్యత సర్టిఫికెట్ ఉందో లేదో తెలిసిపోతుంది. ఇచ్చిన శాంపిల్స్‌కు టెస్టింగ్ జరిగిందో లేదో కూడా ట్రాక్ చేసుకోవచ్చు. జిల్లా ల్యాబ్‌లో గ్రో అవుట్ టెస్టింగ్ ఫెసిలిటీ కల్పించారు. ఇక్కడ మొక్కల జనటిక్ ప్యూరిటీ టెస్టింగ్ చేస్తున్నారు. రైతులు తెచ్చే నమూనాలకు ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదు. ప్రతి ల్యాబ్ లో ఒక అఫీషియల్ అనలిస్టు, ఇద్దరు జూనియర్ అనలిస్టులను ఏర్పాటు చేశారు. వీరికి అత్యాధునిక శిక్షణ ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్‌ను సమీప ఆర్బీకేలతో అనుసంధానించారు. ఇన్‌పుట్స్ పరీక్షించుకునేలా రైతులను ప్రోత్సహించేలా ఆర్బీకేల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

అత్యుత్తమ ల్యాబ్‌గా కోరుకొండ

నియోజకవర్గ స్థాయి ల్యాబ్‌లలో కోరుకొండ ల్యాబ్ నంబర్ వన్‌గా నిలిచింది. ల్యాబ్‌ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ర్యాంకింగ్ ఇస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు కృషి ఫలితంగా ఆర్బీకేల ద్వారా రైతులకు అవగాహన కల్పించడంతో కోరుకొండ ల్యాబ్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ల్యాబ్‌లో ఇప్పటి వరకు 1038 శాంపిల్స్ పరీక్షించారు. వీటిలో యాక్ట్ శాంపిల్స్‌లో 74 విత్తన, 26 ఎరువు శాంపిల్స్, ఆర్బీకే శాంపిల్స్‌లో 16 విత్తన, 35 ఎరువులు, రైతు శాంపిల్స్‌లో 716 విత్తన, 75 ఎరువులు, ట్రేడ్ శాంపిల్స్‌లో 66 విత్తన, 25 ఎరువు శాంపిల్స్ పరీక్షించారు. రైతు శాంపిల్స్‌లో 21 నమూనాలు నాణ్యతలేనివని గుర్తించారు. తద్వారా ఆయా రైతులు నష్టపోకుండా కాపాడగలిగారు.

ల్యాబ్‌లలో పరీక్షలు ఇలా

- జిల్లా ల్యాబ్స్‌లో జీటీ, హెచ్‌టీ పత్తి జన్యు పరీక్షలు, తేమ, మొలక శాతం, విత్తన శక్తి బాహ్య స్వచ్ఛత తదితర అధునాతన విత్తన పరీక్షలతో పాటు ఎరువుల్లో నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలైన జింక్, ఇనుము, బోరాన్, కాల్షియం, మేగ్నీషియం వంటి పోషకాల నాణ్యత పరీక్షలు, పురుగు మందుల్లో క్రియాశీల పదార్థాలను పరీక్షిస్తున్నారు.
- నియోజకవర్గ స్థాయి ల్యాబ్స్‌లో విత్తనాల్లో మొలక శాతం, బాహ్య స్వచ్ఛత, ఎరువుల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాల నాణ్యతను పరీక్షిస్తున్నారు. పురుగుల మందుల నమూనాలను జిల్లా ల్యాబ్స్‌కు పంపిస్తున్నారు.

4 కేటగిరిల్లో శాంపిల్స్ పరీక్ష..

యాక్ట్ శాంపిల్స్ : ఇవి ప్రతి మండల వ్యవసాయాధికారి మండలంలోని డీలర్ల దగ్గర, వారికి సందేహాస్పదంగా అనిపించిన శాంపిల్స్‌ను తీసి పంపిస్తారు. వీటిని ఆర్‌సీసీ కోడింగ్ వ్యవస్థ ద్వారా వివిధ ల్యాబ్‌లకు పంపి పరీక్షిస్తారు.
ఆర్బీకే శాంపిల్స్ : ఆర్బీకే ద్వారా సరఫరా చేసే ఎరువులు, విత్తన శాంపిల్స్
ఫార్మర్ శాంపిల్స్ : రైతులు సొంతంగా, నేరుగా తెచ్చుకునే శాంపిల్స్
డీలర్ శాంపిల్స్: డీలర్లు నేరుగా పంపే శాంపిల్స్

డీలర్లలో భయం



నేను 10 ఎకరాల్లో ఇటీవల కొత్తగా వచ్చిన వరి వంగడం ఎంటీయూ 1318 సాగు చేయాలనుకున్నా. కొత్త రకం కదా.. మొలక శాతం ఏలా ఉంటుందోననే ఆందోళనతో కోరుకొండ ల్యాబ్‌కు తీసుకొచ్చి పరీక్ష చేయించాను. మంచి ఫలితం వచ్చింది. నేను నారుమడి పోసి సాగు చేస్తున్నా. ఇప్పుడు ఈ ల్యాబ్‌ల వల్ల గతంలో మాదిరిగా డీలర్లు ఏది పడితే వాటిని మాకు అంటగట్టే ప్రయత్నం చేయడం లేదు. ల్యాబ్‌ల ఏర్పాటుతో ఇన్‌పుట్స్ క్వాలిటీపై రైతుల్లో మంచి అవగాహన వచ్చింది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.
– చిల్ప్రారాశెట్టి అప్పలరాజు, శ్రీరంగపట్నం, కోరుకొండ మండలం, తూర్పుగోదావరి

నాణ్యత ప్రమాణాలపై దృష్టి



జిల్లా, నియోజకవర్గ స్థాయి ల్యాబ్ సేవలు దాదాపు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. వీటిలో అత్యాధునిక ఎక్విప్‌మెంట్స్ అందుబాటులోకి తీసుకొచ్చాం. ల్యాబ్‌లలో నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగు పర్చేందుకు నాలుగు జోన్లుగా విభజించాం. విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, తిరుపతి, పల్నాడు జిల్లా వ్యవసాయాధికారులను ఈ జోన్లకు కస్టోడియన్ అధికారులుగా నియమించాం. వీరి సేవలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి.
– చేవూరు హరికిరణ్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్

దసరా మహోత్సవాలకు సీఎం జగన్‌కు ఆహ్వానం

సాక్షి,అమరావతి/శ్రీశైలం టెంపుల్: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 15 నుంచి 23 వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు, శ్రీశైలంలో ఈ నెల 15 నుంచి 24 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు హాజరుకావాలని సీఎం వైఎస్ జగన్‌ను ఆయా ఆలయాల ప్రతినిధులు ఆహ్వానించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం (దేవాదాయ శాఖ మంత్రి) కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే వెలంపల్లి, విజయవాడ దుర్గమ్మ ఆలయం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కర్నాటి రాంబాబు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థానం బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తదితరులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మంగళవారం ఆహ్వానపత్రికను అందజేశారు. ఇరు ఆలయాల తరఫున వేద పండితులు పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వేదాశీర్వచనాన్ని అందజేశారు.



దసరా మహోత్సవాల ఆహ్వానపత్రికను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తదితరులు

సర్వీస్ ఈనాం భూములపై మరింత స్పష్టత

▶ మొదటి పేజీ తరువాయి

1(డి)–మిగులు భూములు, సీలింగ్ భూములు, 1(ఈ)– కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆసక్తి ఉన్న భూములు, చుక్కల భూములు, అనాధీన భూముల కేటగిరీల్లో ఉన్నాయి. వివిధ కేటగిరీల్లో ఉన్న సర్వీస్ ఈనాం భూముల విషయంలో ఏం చేయాలని పలువురు కలెక్టర్లు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)ను స్పష్టత కోరగా.. వీటిన్నింటిపైనా సీసీఎల్ఏ ఈ మెమోలో వివరణ ఇచ్చారు. వెరిఫికేషన్‌లో తొలగించడానికి ఎంపికైన నిషేధిత జాబితాలోని 22(ఎ)1(ఎ), (బి), (డి) కేటగిరీ భూముల వివరాలను కలెక్టర్లు నేరుగా జిల్లా రిజిస్ట్రార్లకు పంపి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. 22(ఎ)1 (ఈ) కేటగిరీ భూముల వివరాలను ప్రభుత్వానికి పంపాలని, సీసీఎల్ఏ ద్వారా ప్రభుత్వం వీటిపై నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. 22 (ఎ)1(సి) కేటగిరీలోని భూముల దేవదాయ శాఖ కమిషనర్ లేదా వక్ఫ్ బోర్డు సీఈఓకు తగిన నిర్ణయం తీసుకునేందుకు పంపాలని స్పష్టం చేశారు. 22ఎ జాబితాలో చేర్చని ఈ తరహా భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదని, వాటిని అలాగే ఉంచాలని సూచించారు.

ప్రజల్లోకి మరింత ఉధృతంగా..

> వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలకు పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో గత 52 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు.. విప్లవాత్మక మార్పులతో సుపరిపాలన ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేస్తున్న మంచిని చాటిచెప్పడానికి పార్టీ శ్రేణులు మరింత ఉధృతంగా ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్ ప్రాంతీయ సమన్వయకర్తలకు దిశానిర్దేశం చేశారు. విజ యవాడలో సోమవారం జరిగిన పార్టీ ప్రతినిధుల సదస్సులో నిర్దేశించిన అంశాలపై నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించాలని సూచించిన విషయం తెలిసిందే. దసరా తర్వాత ఈనెల 26 నుంచి సామాజిక న్యాయ యాత్ర పేరుతో 3 ప్రాంతాల్లో చేపట్టే బస్సుయాత్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఆయన మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో.. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో నిర్దేశించిన కార్యక్రమాల అమలుపై వారితో చర్చించి.. వాటిని ప్రజల్లోకి ప్రభావవంతంగా తీసుకెళ్లాలని చెప్పారు.

ఇది నా పార్టీ అని పేదలు భావించాలి..

దసరా ముగిశాక.. అక్టోబర్ 26 నుంచి సామాజిక న్యాయ యాత్ర పేరుతో బస్సుయాత్ర మొదలు పెట్టాలని ప్రాంతీయ సమన్వయకర్తలకు సీఎం జగన్ సూచించారు. ఈ యాత్రను విజయవంతం చేయడానికి ప్రాంతాల వారీగా బాధ్యులను నియమిస్తామన్నారు. ఈ యాత్ర సందర్భంగా మూడు ప్రాంతాల్లో నిర్వహించే బహిరంగసభల ఏర్పాట్లను సమన్వయపరచడానికి కూడా ముగ్గురు బాధ్యులను నియమిస్తామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బస్సు యాత్ర నిర్వహించి సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ యాత్రలో భాగంగా రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో ఒక్కోటి చొప్పున ప్రతిరోజూ 3 సమావేశాలు నిర్వహించాలని స్పష్టంచేశారు. ఇది అత్యంత ముఖ్యమైన కార్యక్రమమని.. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని సమావేశాలు విజయవంతమయ్యేలా చూడాలని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు ఈ సమావేశాల్లో మాట్లాడతారని చెప్పారు. 52 నెలల పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద వర్గాలకు చేసిన మేలును ఈ సమావేశాల ద్వారా వివరించి.. ఆ వర్గాలకు పార్టీని మరింత చేరువ కావాలన్నారు. పేదవాడు మన పార్టీని తన పార్టీగా ఓన్ చేసుకునేలా బస్సుయాత్రలు ప్రభావంతంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. వచ్చే రెండు నెలలపాటు ఈ బస్సు యాత్ర జరగాలన్నారు. నియోజకవర్గాల వారీగా నిర్వహించే సమావేశాలపై తేదీ, స్థలం సహా పక్కా ప్రణాళిక తయారుచేసుకోవాలని ప్రాంతీయ సమన్వయకర్తలను సీఎం వైఎస్ జగన్ సూచించారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారిత, పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధం అంశాలను ప్రస్తావిస్తూ ఈ బస్సు యాత్ర జరగాలన్నారు.

నియోజకవర్గ స్థాయిలోనూ అవగాహన కల్పించాలి..


విజయవాడలో జరిగిన పార్టీ ప్రతినిధుల సమావేశంలో ప్రకటించిన కార్యక్రమాలపై నియోజకవర్గ స్థాయిలో కూడా అవగాహన కల్పించాలని ప్రాంతీయ సమన్వయకర్తలను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జరిగే అవగాహన సమావేశాలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, వాలంటీర్లు హాజరయ్యేలా చూడాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించి.. ఆ కార్యక్రమాన్ని సమర్థవంతంగా జరిగేలా చూడాలన్నారు. ప్రాంతీయ సమన్వయకర్తలు ఎంపీలు వి. విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు.

నేతన్నకు భరోసా

> వస్త్ర ప్రదర్శనలతో మార్కెటింగ్‌కు ప్రోత్సాహం

సాక్షి, అమరావతి: చేనేత వస్త్రాలకు ప్రచారం, విక్రయాలను విస్తృతం చేసేలా ఎగ్జిబిషన్(వస్త్ర ప్రదర్శన)లు దోహదం చేస్తాయనడంలో ఏమాత్రం సందేహంలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని చేనేత రంగానికి సంక్షేమ రంగులు అద్దుతున్న రాష్ట్ర ప్రభుత్వం నేతన్నకు మార్కెటింగ్‌కు అవసరమైన సహకారం అందిస్తోంది. సంస్కృతికి ప్రతీకలుగా నిలిచే చేనేత వస్త్రాలను అపురూప నైపుణ్యం, సృజనాత్మకతతో అందించే నేతన్నలకు భరోసాగా నిలవడంలో ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది. గత నాలుగేళ్లలో 23 భారీ చేనేత వస్త్ర ప్రదర్శనలు (ఎగ్జిబిషన్) నిర్వహించగా, 392 చేనేత సహకార సంఘాలు పాల్గొన్నాయి. మొత్తం ఎగ్జిబిషన్‌లలో రూ. 21.62 కోట్లు విక్రయాలు జరిగేలా రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవడం విశేషం. కోవిడ్ సమయంలో చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్‌కు కొంత ఇబ్బంది వచ్చినప్పటికీ మిగిలిన సమయంలో వాటిని విరివిగా నిర్వహించి చేనేత సహకార సంఘాలకు తమ ఉత్పత్తుల అమ్మకాలకు ఊతమిచ్చింది. ప్రతి యేటా అంతర్జాతీయ చేనేత దినోత్సవం రోజైన ఆగస్టు 7 నుంచి వారం పాటు రాష్ట్ర వ్యాప్తంగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోనే కాక, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యా తులు గడించిన చేనేత ఉత్పత్తి సంఘాలు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నా యి. ఇదే సందర్భంలో ఫ్యాషన్ షో నిర్వహించి చేనేత వస్త్రాలు ప్రదర్శించి వస్త్ర ప్రేమికులను ఆకట్టుకుంటున్నారు. వారంలో ఒక రోజైన చేనేత వస్త్రాలను ధరించాలని అధికా రులు, సిబ్బందికి ప్రభుత్వం సూచించింది. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగానికి ఊతమిచ్చేలా ఆన్‌లైన్ మార్కెటింగ్, ఆప్కో షోరూమ్‌లతో పాటు వస్త్ర ప్రదర్శనలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

మార్కెటింగ్ కార్యక్రమాలు (ఎగ్జిబిషన్) నిర్వహణ ఇలా..



క్లుప్తంగా...

ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ కోసం సెర్చ్ కమిటీ

సాక్షి, అమరావతి: శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ(తిరుపతి)కి నూతన వైస్ చాన్సలర్ నియామకం కోసం సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూనివర్సిటీ వీసీగా పనిచేసిన డాక్టర్ వి.పద్మనాభరెడ్డి పదవీకాలం ముగియడంతో ఇన్‌చార్జ్ వీసీ బాధ్యతలను పశుసంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేదికి అప్పగించారు. ఈ నేపథ్యంలో నూతన వీసీ నియామకం కోసం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీని నియమిస్తూ ఇన్‌చార్జి వీసీ, స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెర్చ్ కమిటీలో చాన్సలర్‌గా వ్యవహరిస్తున్న గవర్నర్ లేదా ఆయన తరఫున ఒకరు, యూజీసీ చైర్మన్ లేదా ఆయన తరఫున వీసీ స్థాయి హోదా కలిగిన వారు ఒకరు, ప్రభుత్వం తరఫున స్పెషల్ సీఎస్ లేదా అంతకు మించిన హోదా కలిగిన వారు ఉంటారు. ఈ కమిటీ నూతన వీసీ కోసం నోటిఫికేషన్ జారీ చేస్తుంది. అనుభవం, ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారిలో టాప్–3లో ఉన్న వారి పేర్లను గవర్నర్‌కు పంపించగా.. ఆయన ఆమోదంతో నూతన వీసీని నియమించనున్నారు.

ఫేజ్–2 కౌన్సెలింగ్ ఆప్షన్‌ల నమోదుకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్, ఎండీఎస్ కోర్సుల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి ఫేజ్–2 కౌన్సెలింగ్‌కు నాన్–సర్వీస్ అభ్యర్థులు ఆప్షన్లు నమోదు చేసుకోవడానికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. పీజీ మెడికల్ అభ్యర్థులు https://pgcq.ysruhs.com/ వెబ్‌సైట్‌లో, ఎండీఎస్ అభ్యర్థులు https://mdscq.ysruhs.com/ వెబ్‌సైట్‌లో ఆప్షన్‌లు నమోదు చేసుకోవచ్చు. ఆప్షన్‌ల నమోదుకు బుధవారం రాత్రి 9 గంటలు చివరి గడువుగా పేర్కొన్నారు.

మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా విజయ్‌చందర్

సాక్షి, అమరావతి: ఏపీ మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పెరియా విజయ్ చందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని బీసీ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంతరాము మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

ప్రతి రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

సీడబ్ల్యూసీ సభ్యుడు ఎస్.రఘువీరారెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని ప్రతి రాష్ట్రంలో కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎస్.రఘువీరారెడ్డి అన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మంగళవారం ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతో కలిసి రఘువీరారెడ్డి మీడియాతో మాట్లాడారు. యూపీఏ హయాంలో 2011లోనే జనగణన, కులగణన చేపట్టారని, అయితే 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇప్పటివరకు వివరాలను విడుదల చేయలేదని తెలిపారు. సోమవారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో 140 కోట్ల మంది ప్రజలకు ఆర్థికంగా, సామాజికంగా సమాన అవకాశాలు రావాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందన్నారు. 2011లో చేసిన జనగణన వివరాలను విడుదల చేసి ఉంటే మహిళా రిజర్వేషన్ చట్టం తక్షణమే అమల్లోకి వచ్చి ఉండేదని, బీసీలకు కూడా తగిన స్థానం లభించి ఉండేదన్నారు. 2024 ఎన్నికల్లోనే బీసీలకు, మహిళలకు రిజర్వేషన్లు దక్కేవని చెప్పారు. 'కులరహిత సమాజం' అనే కార్యక్రమాన్ని తొలుత ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 21న బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని ఆహ్వానించామని చెప్పారు.

ఫేసియల్ రికగ్నైజేషన్ హాజరు తప్పనిసరి

ఉద్యోగులు పాటించేలా చూడాలని అన్ని శాఖలు, కలెక్టర్లకు సాధారణ పరిపాలన శాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు నూటికి నూరు శాతం ఫేసియల్ రికగ్నైజేషన్ హాజరు నమోదు చేయాలని సాధారణ పరిపాలన శాఖ(రాజకీయ) ముఖ్య కార్యదర్శి ముత్యాల రాజు ఆదేశించారు. సంబంధిత కార్యాలయాల ఉన్నతాధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని మంగళవారం సర్క్యులర్ మెమో జారీ చేశారు. ఫేసియల్ రికగ్నైజేషన్ యాప్‌లో 45 నుంచి 50 శాతం మంది ఉద్యోగులే హాజరు నమోదు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే చాలా మంది ఉద్యోగులు కార్యాలయం నుంచి విధులు ముగించుకొని వెళ్లేటప్పుడు ఈ యాప్‌ను అసలు వినియోగించడం లేదని తెలిపారు. సెలవులను కూడా యాప్‌లోనే నమోదు చేయాలని స్పష్టం చేసినప్పటికీ.. ఉద్యోగులు తమ సెలవుల కోసం ఈ యాప్‌ను అసలు వినియోగించడం లేదని పేర్కొన్నారు. ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌చార్జ్‌లు తమ పరిధిలోని ఉద్యోగులు కార్యాలయాల దగ్గర హాజరు నమోదు చేస్తున్నారా లేదా ఇతర ప్రాంతాల నుంచి హాజరు నమోదు చేస్తున్నారా అనే విషయాన్ని పరిశీలన చేయడంలో విఫలమయ్యారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఫేసియల్ రికగ్నైజేషన్ యాప్‌లో నూరు శాతం ఉద్యోగులు హాజరు నమోదు చేసే విధంగా శాఖాధిపతులు, కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

తత్తరపాటు.. బిత్తర చూపులు!

'ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ గురించి నాకేం తెలీదు.. అసలు ఇన్నర్ రింగ్ రోడ్డును అనుకుని భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనడం గురించి నాకేం తెలియదు'
– నారా లోకేశ్

'భూముల కొనుగోలుకు తీర్మానిస్తూ హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో చేసిన తీర్మానం ఇదిగో. ఆ మీటింగ్‌లో మీరూ పాల్గొన్నారు. మినిట్స్ రికార్డుల్లో సంతకం కూడా చేశారు. అయినా కూడా మీకు భూముల కొనుగోలు గురించి తెలీదంటారా?'
– సీఐడీ అధికారుల సూటి ప్రశ్న

సీఐడీ విచారణలో లోకేశ్ తడబాటు.. అసహనం



- అబ్బే నాకేం తెలీదు... మరి ఈ సంతకాలు మీవే కదా?
- ఇన్నర్ రింగ్ రోడ్డు అక్రమాలపై ప్రశ్నించిన అధికారులు
- హెరిటేజ్ భూముల కొనుగోలు దందాపై ప్రశ్నల వర్షం
- సంతకాలతో సహా ఆధారాలను చూపిస్తూ సూటిగా ప్రశ్నలు
- కలవరపాటుతో న్యాయవాదులతో చినబాబు మంతనాలు
- ఆరు గంటల పాటు విచారణ.. నేడు మరోసారి విచారణ

సాక్షి, అమరావతి: సీఐడీ సంధించిన సూటి ప్రశ్నలకు తత్తరపాటుకు గురై బిత్తరపోవడం లోకేశ్ వంతైంది. మాజీ సీఎం చంద్రబాబు తరహాలోనే ఆయన తనయుడు నారా లోకేశ్ కూడా సీఐడీ దర్యాప్తునకు సహకరించకుండా మొండికేసేందుకు శతవిధాలుగా ప్రయత్నించారు. అయితే సీఐడీ అధికారులు పూర్తి ఆధారాలతో ప్రశ్నించేసరికి తడబాటుకు గురై అసహనం ప్రదర్శించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం కేసులో ఏ–14గా ఉన్న నారా లోకేశ్ సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణకు మంగళవారం హాజరయ్యారు. తాడేపల్లిలోని సిట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయన్ను సిట్ అధికారులు విచారించారు. న్యాయస్థానం ఆదేశాలను పాటిస్తూ లోకేశ్‌కు సమీపంలో న్యాయవాది ఉండేందుకు అవకాశం కల్పించి మరీ విచారించారు. ముందుగా సిద్ధం చేసుకున్న ప్రశ్నావళిని బట్టి సీఐడీ అధికారులు ఒక్కో ప్రశ్న అడుగుతూ విచారణ కొనసాగించారు. సుహృద్భావ వాతావరణంలో విచారణ ప్రక్రియ కొనసాగించేందుకు ప్రాధాన్యమిచ్చారు. లోకేశ్ సహకరించడం లేదని స్పష్టమవుతున్నా ఓపిగ్గా ప్రశ్నలు సంధిస్తూ ఆరు గంటల పాటు విచారించారు. ఈ కేసులో మరింత సమాచారాన్ని రాబట్టేందుకు బుధవారం మరోసారి విచారణకు హాజరు కావాలని లోకేశ్‌కు నోటీసులిచ్చారు.

ఇవిగో ఆధారాలు.. మరేమంటారు?

విచారణకు సహకరించకుండా కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు లోకేశ్ యత్నిస్తుండటంతో ఒక దశలో సీఐడీ అధికారులు ఇక లాభం లేదని గేర్ మార్చారు. అంతవరకు ఏ ప్రశ్న అడిగినా తనకు తెలియదని చెబుతూ వచ్చిన వాటికి సంబంధించి ఆధారాలను ఒక్కొక్కటిగా చూపుతూ ఆరా తీయడంతో లోకేశ్ కంగుతిన్నారు. హెరిటేజ్ ఫుడ్స్ భూములను కొనుగోలు చేసిన విషయం తనకు తెలియదని లోకేశ్ మొదట బుకాయించారు. అయితే ఆయన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల మీటింగులో పాల్గొన్నట్టు నిరూపించే రికార్డులను చూపించడంతోపాటు భూముల కొనుగోలుకు ఆమోదించిన తీర్మానం కాపీని అధికారులు ప్రదర్శించడంతో తత్తరపాటుకు గురయ్యారు. వాటిపై సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించడంతో తన న్యాయవాదితో మాట్లాడి చెబుతానన్నారు. అందుకు సీఐడీ అధికారులు అనుమతించడంతో సమీపంలోనే ఉన్న న్యాయవాదితో మంతనాలు జరిపారు. అనంతరం తిరిగి వచ్చి ఆ సమావేశంలో చాలా అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారని, అయితే అవేవీ తనకు గుర్తు లేదని సమాధానమిచ్చారు. రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుల విషయంపై తనకు తెలియదని బుకాయించేందుకు లోకేశ్ చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఎందుకంటే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను అనుకుని ఉన్న భూములనే కొనుగోలు చేయాలని హెరిటేజ్ ఫుడ్స్ నిర్ణయించింది. అక్కడ భూములను కొనుగోలు చేయడం వ్యాపార విస్తరణకు ఉపయోగపడుతుందని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో పేర్కొన్నారు. రాజధాని కోసం భూసమీకరణకు ప్రభుత్వం భూములను తీసుకుంటున్న ప్రాంతంలో భూములు కొనుగోలు చేయడం వ్యాపార విస్తరణకు ఎలా దోహదపడుతుందని భావించారని సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించారు. అంటే ఆ ప్రాంతంలోని భూములు భూసమీకరణకు కిందకు రావని మీకు ముందే తెలుసా? అని సూటిగా నిలదీసేసరికి లోకేశ్ నీళ్లు నమిలారు. హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేయాలని నిర్ణయించిన భూములను ఆనుకునే లింగమనేని కుటుంబానికి చెందిన భూములున్న విషయం మీకు తెలుసా అని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. మీ తండ్రి చంద్రబాబుతో కలసి మీరు నివసిస్తున్న కరకట్ట బంగ్లా లింగమనేని కుటుంబం ఇచ్చిందనే విషయంపై మీకు అవగాహన ఉందా? అని ప్రశ్నించగా ఆయన చాలాసేపు మౌనం వహించారు. క్విడ్‌ప్రోకో కిందే ఆ కరకట్ట నివాసం మీకు వచ్చిందన్న అభియోగంపై మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించినా సరే లోకేశ్ సూటిగా సమాధానం చెప్పకపోవడం గమనార్హం.

వెళ్లండి... రేపు రండి

లోకేశ్ నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు ఆయన్ను మరోసారి విచారించాలని సీఐడీ అధికారులు నిర్ణయించారు. ఈమేరకు బుధవారం విచారణకు హాజరు కావాలంటూ సెక్షన్ 41 ఏ కింద లోకేష్‌కు నోటీసులు ఇచ్చారు.

గూగుల్‌లో వెతికితే చాలు: లోకేశ్

తన గురించి గూగుల్‌లో వెతికినా లభించే సాధారణ సమాచారాన్నే సీఐడీ అధికారులు విచారణలో ప్రశ్నించారని విచారణ అనంతరం లోకేశ్ వ్యాఖ్యానించారు. ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ కేసుకు సంబంధించి సీఐడీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. కక్ష సాధింపు కోసమే తమపై కేసు నమోదు చేశారని ఆరోపించారు.

అన్నిటా బాబు బాటలోనే..

అవినీతికి పాల్పడటంలోనే కాదు సీఐడీ దర్యాప్తునకు సహకరించకుండా మొండికేయడంలో తండ్రి చంద్రబాబు బాటనే లోకేశ్ అనుసరించారు. విచారణను తప్పించుకునేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టడంతో అనివార్యంగా లోకేశ్ సీఐడీ ఎదుట హాజరయ్యారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సంబంధించి సీఐడీ అధికారులు ఏ ప్రశ్న అడిగినా తనకు తెలీదనే చెబుతూ వచ్చారు. అలైన్‌మెంట్‌ను మూడు సార్లు మార్చిన విషయంపై ప్రశ్నిస్తే అసలు తనకు ఆ విషయమే తెలియదని చెప్పుకొచ్చారు. హెరిటేజ్ ఫుడ్స్ భూముల కొనుగోలుకు సంబంధించిన ప్రశ్నలకు తనకు తెలీయదని..గుర్తు లేదని చెప్పడం గమనార్హం. హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్ హోదాలో మీరు ఎలాంటి విధులు నిర్వహించారు..? ఎలాంటి నిర్ణయాల్లో భాగస్వామి అయ్యారనే ప్రశ్నలకు సమాధానాలను దాటవేశారు. సీఐడీ అధికారులు విచారణ నియమావళి ప్రకారం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు గూగుల్‌లో సెర్చ్ చేసినా దొరుకుతాయని లోకేశ్ వ్యాఖ్యానించడం గమనార్హం.

కేసీఆర్‌ను పీకి పారేద్దాం

- ఆదిలాబాద్ జనగర్జన సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- అసదుద్దీన్ ఒవైసీ చేతిలోనే 'కారు' స్టీరింగ్
- తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడితే అభివృద్ధి



సాక్షి, ఆదిలాబాద్: తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను పీకి పారేద్దామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ఎన్నికల గుర్తైన కారు స్టీరింగ్ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేతిలో ఉందని విమర్శించారు. డిసెంబర్ 3న తెలంగాణలో బీజేపీ సర్కార్‌ను తీసుకొద్దామన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న రజాకారుల నుంచి బీజేపీతోనే రక్షణ లభిస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జనగర్జన బహిరంగ సభలో అమిత్ షా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందని అమిత్ షా చెప్పారు. కృష్ణా జలాల వివాదాన్ని ఇటీవల కేంద్ర కేబినెట్‌లో చర్చించి తెలంగాణలో నీటి సమస్య తీర్చేవిధంగా మోదీ సర్కార్ నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం పేదలు, రైతులు, దళితులు, ఆదివాసీలు, బడుగు, బలహీన వర్గాల కోసం చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడం ఎలా? అనే ఒక చింత తప్పితే కేసీఆర్‌కు మరొకటి లేదన్నారు. ఎన్నికలు వచ్చాయంటే కాంగ్రెస్ వాళ్లు కొత్త బట్టలు వేసుకొని వస్తారని, ఇటీవల రాహుల్ బాబా ఏదేదో చేస్తామని చెబుతూ తిరుగుతున్నారని విమర్శించారు. కాగా సిఖ్ విలేజీ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్లో వివిధ రంగాల వృత్తి నిపుణులు, మేధావులు, సైన్యంలో దేశానికి సేవ చేసినవారు, ఇతర వర్గాలతో నిర్వహించిన సమావేశంలోనూ అమిత్‌షా ప్రసంగించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు రూ.400 కోట్ల మిగులుతో ఉన్న రాష్ట్రం కాస్తా ఇప్పుడు రూ.7.5 లక్షల కోట్ల మేర అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో తెలంగాణకు మెట్రో రైలు, హైవేలు, రోడ్లు, ఇరిగేషన్, యూనివర్సిటీలు తదితరాల కోసం రూ.9 లక్షల కోట్లు కేటాయిస్తే.. ఏడున్నర లక్షల కోట్ల అప్పులతో ఏం చేశారో, ఆ డబ్బు ఎక్కడ పెట్టారో చెప్పాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు.

తెలుగు యువత నాయకుల అత్యుత్సాహం

- సీఐడీ సిట్ కార్యాలయం గోడలు దూకేందుకు ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం
- ఏడుగురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా కుంచనపల్లి–ప్రాతూరు రోడ్డులో ఉన్న ఏపీ సీఐడీ సిట్ కార్యాలయం వద్ద మంగళవారం తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. సిట్ కార్యాలయం గోడలు దూకేందుకు ప్రయత్నం చేశారు. అడ్డుకునేందుకు వచ్చిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వీఆర్వో ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ సీఐడీ కార్యాలయం వద్ద ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు విషయమై టీడీపీ నాయకుడు నారా లోకేశ్‌ను సిట్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఆ సమయంలో బయటవారిని ఎవరినీ అనుమతించకుండా రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా కొందరు తెలుగు యువత నాయకులు... సిట్ కార్యాలయం వెనుక వైపు గోడదూకి లోపలికి వచ్చేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న సెక్యూరిటీ, రెవెన్యూ సిబ్బంది వారిని అడ్డుకుని లోపలికి రావొద్దని పదేపదే చెప్పినా వినకుండా గోడదూకేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకోవడంతో దౌర్జన్యానికి పాల్పడ్డారు. అక్రమంగా లోపలికి వచ్చేందుకు ప్రయత్నించినవారిపై వీఆర్వో మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చిన్నబాబు, ప్రధాన కార్యదర్శి నూతలపాటి నాగభూషణం, అధికార ప్రతినిధి సజ్జ అజయ్, చందర్లపాడు మండల అధ్యక్షుడు కమ్మ గోపీచంద్, నందిగామకు చెందిన గుళ్లపల్లి ఠాగూర్‌బాబు, ఈపూరి వినోద్, ఏలూరు జిల్లా ఎన్ఆర్ పేటకు చెందిన నాయుడు పవన్ ఉన్నారని చెప్పారు.

కళ్లు తెరిచి చూడు రామోజీ..

ఈ ప్రభుత్వంలో పీహెచ్‌సీలు బలోపేతమైన తీరు కనిపిస్తుంది



సాక్షి, అమరావతి: చింతకాయను ఎంత చితక్కొట్టినా.. ఉల్లిపాయను ఎంత ఉడకబెట్టినా వాటి సహజ లక్షణం కోల్పోవు. ఈనాడు రామోజీరావు తీరు కూడా అంతే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పైనా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైనా ఆయన నిత్యం వెళ్లగక్కుతున్న అక్కసు, చేస్తున్న విషప్రచారంపై ఎన్ని విమర్శలు ఎదురవుతున్నా ఆయనలో మార్పులేదు.. రాదు. ఎందుకంటే.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలపై ఆయన పనిగట్టుకుని.. కళ్లు మూసుకుని చెప్పిన అబద్ధాలే చెప్పి రాసిన అబద్ధాలే రాస్తున్నారు కాబట్టి. తాజాగా.. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఆయన గుండెలు బాదుకున్న తీరు జగన్‌పై రామోజీకున్న అక్కసును మరోసారి చాటిచెప్పింది. రాష్ట్రంలో వంద శాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) 24/7 పనిచేస్తున్నాయని స్వయంగా కేంద్ర ఆరోగ్య శాఖ ప్రశంసలు కురిపించినా రామోజీకి వినిపించదు. నాడు–నేడు కార్యక్రమంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా పీహెచ్‌సీలు రూపాంతరం చెందాయి. ఈ క్రమంలో దేశంలోనే అత్యధిక పీహెచ్‌సీలకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికేషన్‌తో ఏపీ అగ్రస్థానంలో ఉంది. అయినా, ఆయన విషపుత్రిక ఈనాడుకు అది కనిపించదు. ఎందుకంటే ఆయన లెక్కలు, ఎక్కాలు వేరే. సీఎం జగన్ ప్రభుత్వం మీద విషం చిమ్మడమే ఆయన జెండా.. ఎజెండా. అందుకే ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ వైద్య రంగం ఎంత మెరుగుపడినా ఆయనకు పట్టదు. నిజానికి.. గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో పీహెచ్‌సీలంటే నరకానికి నకళ్లు అన్నట్లుగా ఉండేవి. ఒక్క పీహెచ్‌సీలే కాదు.. బోధనాస్పత్రుల వరకూ అన్ని ఆస్పత్రులది అదే దుస్థితి. అయినా, అప్పట్లో రామోజీరావుకు, ఈనాడుకు అంతా పచ్చగా కనిపించేది. ఆ తర్వాత సీఎంగా వైఎస్ జగన్ పగ్గాలు చేపట్టాక.. ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధితో ఆయన ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం అమలు, 53 వేలకు పైగా పోస్టుల భర్తీ, ఇతర విప్లవాత్మక చర్యలతో ప్రభుత్వ వైద్య రంగం రూపురేఖలను సమూలంగా మార్చినప్పటికీ 'పచ్చ'కామెర్లతో రామోజీరావు కంటికి ఇవేమీ కనిపించడంలేదు. అందుకే 'వైద్య రంగం బలోపేతమా.. ఎక్కడ?' అంటూ ఈనాడులో మంగళవారం చేతికొచ్చింది రాసిపారేశారు. పీహెచ్‌సీల్లో అరకొర సేవలతో రోగుల వెతలు అంటూ ప్రభుత్వంపై ఇష్టానుసారం బురద జల్లారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వైద్యరంగంపై అసలు వాస్తవాలు ఏమిటంటే..

సిబ్బంది, వనరులు ఉండటం బలోపేతం కాదా?

టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పీహెచ్‌సీల్లో ఒకేఒక్క వైద్యుడు ఉండేవాడు. అతను సెలవుపై వెళ్తే ఇక వైద్యసేవల సంగతి దేవుడెరుగు. మందులు, వైద్య పరీక్షల గురించి అయితే చెప్పక్కర్లేదు. ఎందుకంటే.. పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షల పేరిట ప్రజాధనాన్ని టీడీపీ పెద్దలు లూటీచేసిన విషయం జగమెరిగిన సత్యం. అప్పట్లో పీహెచ్‌సీ భవనాలు బూత్‌బంగ్లాలను తలపించేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలకు పెద్దపీట వేసింది. ఈ క్రమంలో.. రాష్ట్రంలోని 1,145 పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్‌లతో కలిపి ప్రతిచోట 14 మందిని నియమించారు. వీటిల్లో రూ.664.96 కోట్లతో నాడు–నేడు పనులను చేపట్టారు. 922 పీహెచ్‌సీలకు మరమ్మతులు పూర్తయ్యాయి. ఇక మరికొన్ని పీహెచ్‌సీలకు కొత్త భవనాల నిర్మాణం వచ్చే నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి కానున్నాయి. అంతేకాక.. ప్రతి మండలానికి రెండు పీహెచ్‌సీలు లేదా ఒక పీహెచ్‌సీ/ఒక సీహెచ్‌సీ ఉండేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నూతనంగా 88 పీహెచ్‌సీలు, 63 కో–లోకేటెడ్ పీహెచ్‌సీలు ప్రారంభించారు. నూతన పీహెచ్‌సీలకు ప్రభుత్వం కొత్త భవనాలను నిర్మిస్తోంది. నాడు–నేడులో భాగంగా అన్ని వసతులతో పీహెచ్‌సీ భవనాలను తీర్చిదిద్దారు. అంతేకాక.. మానవ వనరుల కొరతకు తావు లేకుండా ఎప్పటి ఖాళీలను అప్పుడే ప్రభుత్వం భర్తీచేస్తోంది. ప్రతి పీహెచ్‌సీలో 172 రకాల మందులు, 67 పరీక్షలు నిర్వహించడానికి వీలుగా వైద్య పరికరాలను సమకూర్చడంతో పాటు, పరీక్షలు చేయడానికి అవసరమయ్యే రసాయనాలను ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నారు. ఈ చర్యలన్నీ గమనించినా, పీహెచ్‌సీల్లో వచ్చిన మార్పులు చూసినా రాష్ట్రంలో ప్రాథమిక వైద్యం బలోపేతం అయిందని ఎవరైనా అంగీకరిస్తారు ఒక్క రామోజీ తప్ప. ఎందుకంటే జగన్ అన్నా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నా ఆయన ఉదరం నిత్యాగ్నిహోత్రంలా ఎప్పుడూ రగిలిపోతూ ఉంటుంది కాబట్టి.

24/7 సేవలపై దిగజారుడు రాతలు..

వంద శాతం పీహెచ్‌సీలను 24/7 నడుపుతున్న కొద్ది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని కేంద్ర ఆరోగ్య శాఖ పలుమార్లు తన నివేదికల్లో కొనియాడింది. అయినాసరే.. ఇవేమీ తనకు పట్టవనుకున్న రామోజీ 24 గంటల సేవలు అంతంత మాత్రమేనని దిగజారుడు రాతలు రాశారు. పీహెచ్‌సీలు 24/7 పనిచేసేలా వైద్య, ఆరోగ్య శాఖ పర్యవేక్షణ కొనసాగిస్తోంది. రాత్రి సమయంలో స్టాఫ్ నర్సు సహాయంగా, ఒక లాస్ట్ గ్రేడ్ కేడర్ సిబ్బందిని/ఎఫ్ఎన్ఓను ఉంచడం ద్వారా సేవలు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే..

- కర్నూల్ జిల్లా ఆస్పిరి పీహెచ్‌సీలో 15 రకాల పరీక్షలు మాత్రమే చేస్తున్నారని ఈనాడులో ఆరోపించారు. అయితే, ఈ పీహెచ్‌సీలో నిర్దేశించిన అన్ని రకాల మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షల సదుపాయాలున్నాయి.
- విజయనగరం జిల్లా రామభద్రపురం పీహెచ్‌సీలో ఓపీ, ఇతర సేవలు పడిపోయాయి. ప్రజలు ఇతర ప్రభుత్వాస్పత్రులకు వెళ్తున్నట్టు ఆరోపించారు. అయితే, ఈ పీహెచ్‌సీలో నెల నెలా సుమారుగా 1,500–1,800 ఓపీలు నమోదవుతున్నాయి. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలకు ఫ్యామిలీ డాక్టర్లు నెలలో రెండుసార్లు సందర్శించి అక్కడే ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. 10–20కి.మీ పరిధిలో మూడు సామాజిక ఆసుపత్రులు అందుబాటులో ఉండటంతో ప్రజలు అత్యవసర సేవల కోసం ఆయా ఆస్పత్రులకు వెళ్తున్నారు.

2019 నుంచి వైద్య రంగం బలోపేతానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు..

- నాలుగేళ్లలో దాదాపు 53 వేలకు పైగా వైద్య పోస్టుల భర్తీ. ఎప్పటి ఖాళీలకు అప్పుడే యుద్ధప్రాతిపదికన నియామకం. ఇందుకోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు.
- రూ.16,800 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు, వివిధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతోపాటు నాడు–నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల బలోపేతం.
- గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు.. 12 రకాల వైద్యసేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో సొంత ఊళ్లలోనే ప్రజలకు వైద్యసేవలు.
- దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు. నెలకు రెండుసార్లు గ్రామాలకు పీహెచ్‌సీ వైద్యులు.
- టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ బలోపేతం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లు 1,059 నుంచి ఏకంగా 3,257కి పెంపు. 40 లక్షల మందికి ఉచిత వైద్యం కోసం రూ.8 వేల కోట్ల వ్యయం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆసరాతో విశ్రాంతి సమయంలో జీవన భృతి చెల్లింపు. ఇలా ఇప్పటివరకూ 17.25 లక్షల మందికి రూ. 1,074.69 కోట్లు అందించిన ప్రభుత్వం.
- 108 (768 వాహనాలు), 104 (936) వాహనాలతో వైద్యసేవలు బలోపేతం. మరో 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలతో కలిపి మొత్తం 2,204 వాహనాలతో ప్రజలకు ఉచిత వైద్యసేవలు. ఈ విధంగా మరే ప్రభుత్వంలోనూ లేవు. టీడీపీ హయాంలో కేవలం 108 అంబులెన్స్‌లు 531 మాత్రమే ఉండగా ఇందులో 336 మాత్రమే మనుగడలో ఉండేవి.
- ప్రభుత్వాస్పత్రుల్లో జీఎంపీ, డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలు కలిగిన మందులు ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు.

వచ్చేనెల 15 నుంచి ఎస్ఏ–1 పరీక్షలు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 (ఎస్ఏ–1) పరీక్షలను నవంబర్ 15 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. షెడ్యూలు ప్రకారం సమ్మేటివ్ పరీక్షలను నవంబర్ 4 నుంచి నిర్వహించాలి. అయితే, వచ్చేనెల మూడో తేదీ నుంచి దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎన్‌సీఈఆర్‌టీ స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించేందుకు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించింది. ఈ సర్వేలో విద్యార్థులు ప్రతిభ చాటేందుకు వీలుగా మంగళవారం నుంచి నవంబర్ 2వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ ప్రాక్టీస్ టెస్టులు నిర్వహిస్తోంది. సర్వే అనంతరం వచ్చేనెల 15 నుంచి 25 వరకు సమ్మేటివ్ పరీక్షలు రాయనున్నారు.

12, 13 తేదీల్లో ఎన్జీరంగా వర్సిటీ రెండోదశ వెబ్ ఆప్షన్స్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సులకు సంబంధించి మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 12, 13 తేదీల్లో రెండో దశ వెబ్ ఆప్షన్స్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి కౌన్సెలింగ్ ద్వారా కాలేజీల్లో చేరిన విద్యార్థులు, రిజిస్ట్రేషన్ చేసిన మిగిలిన విద్యార్థులు అందరూ వెబ్ ఆప్షన్స్‌కు అర్హులేనన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

స్పెషల్ ఫీజుతో పలు కోర్సులకు అడ్మిషన్లు

ఎస్వీయూలో ఈ నెల 30 వరకు దరఖాస్తు గడువు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలో స్పెషల్ ఫీజుతో పలు కోర్సుల అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ శ్రీమురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందులో ప్రధానంగా ఎంటెక్ కోర్సు, ఎస్వీయూ ఫార్మసీ కళాశాలలోని ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ కోర్సుకు సంబంధించి విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు వర్సిటీ రిజిస్ట్రార్ ఓ మహ్మద్ హుస్సేన్ అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఈ కేటగిరీలో ఎంటెక్ కోర్సులో చేరడానికి గేట్–2023 ఉత్తీర్ణత ప్రథమ ప్రాధాన్యతగాను, ఏపీపీజీఈ సెట్ ద్వితీయ ప్రాధాన్యతగాను, బీటెక్ ఉత్తీర్ణత తృతీయ ప్రాధాన్యతగాను పరిగణించి అడ్మిషన్లు కేటాయిస్తారని తెలిపారు. ఎం ఫార్మసీలో చేరడానికి జీప్యాట్–2023 ప్రథమ ప్రాధాన్యతగాను, ఏపీపీజీఈసెట్ ద్వితీయ ప్రాధాన్యతగాను, బీ ఫార్మసీ ఉత్తీర్ణత తృతీయ ప్రాధాన్యతగాను పరిగణించి సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. దీంతో పాటు బీ ఫార్మసీ కోర్సులో చేరడానికి ఏపీఈఏపీ సెట్ ప్రథమ ప్రాధాన్యతగాను, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణులైన వారికి చివరి ప్రాధాన్యతగా తీసుకుని అడ్మిషన్లు జరగనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు www.svuniversity.edu.in/doa వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చని, అడ్మిషన్ల ప్రక్రియ ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ చేపడుతుందని పేర్కొన్నారు.

ఇసుక టెండర్లు జ్యుడిషియల్ ప్రివ్యూ పరిధిలోకి రావు

- ప్రభుత్వం రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేసే ప్రాజెక్టులకే జ్యుడిషియల్ ప్రివ్యూ
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నాం
- అవగాహన లేకుండా 'ఈనాడు' తప్పుడు రాతలు
- గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి



సాక్షి, అమరావతి: ఇసుక టెండర్లు జ్యుడిషియల్ ప్రివ్యూ పరిధిలోకి రావని రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఇసుక టెండర్లపై న్యాయ సమీక్ష ఏదంటూ ఈనాడు పత్రికలో రాసిన కథనం పూర్తిగా అవగాహనా రాహిత్యంతో కూడుకున్నదని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై బురద చల్లాలనే ఏకైక లక్ష్యంతోనే ఈ వక్రీకరణ వార్తను ప్రచురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జ్యుడిషియల్ ప్రివ్యూకు సంబంధించిన నిబంధనలు అందరూ తెలుసుకునేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో ఉన్నాయని, కనీసం వాటిని పరిశీలించకుండా ఈనాడు కథనాలు రాయడం బాధ్యతా రాహిత్యమని పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకూడదనే ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జ్యుడిషియల్ ప్రివ్యూ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు.

రూ.100 కోట్లు దాటితేనే..

ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు కోసం రూ.100 కోట్లకు పైగా వ్యయం చేస్తే.. అలాంటి ప్రాజెక్టులకు నిర్వహించే టెండర్లను న్యాయ సమీక్షకు పంపి, ఆమోదం తీసుకోవాలని చట్టంలో ఉందని పేర్కొన్నారు. తాజాగా గనుల శాఖ కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా ఇసుక తవ్వకాలు, విక్రయాల కోసం టెండర్ల ప్రక్రియను నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ఆ టెండర్ల ప్రక్రియకు జ్యుడిషియల్ ప్రివ్యూ ఎందుకు కోరలేదంటూ ఈనాడు అవగాహనా రాహిత్యంతో వార్త రాసిందన్నారు. ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదించే ప్రయత్నం చేయడం కోసమే ఈ కథనం రాశారని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, విక్రయాల కోసం కాంట్రాక్టింగ్ ఏజెన్సీని టెండర్ల ద్వారా ప్రభుత్వం ఎంపిక చేస్తోందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం చేసే వ్యయం చాలా స్వల్పమని తెలిపారు. ఈ టెండర్లలో ఎంపికైన కాంట్రాక్టింగ్ ఏజెన్సీకి ఇసుక తవ్వకాలు, విక్రయాలకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందని తెలిపారు. ఆ సంస్థ ప్రభుత్వం నిర్దేశించిన మొత్తానికి ఇసుకను వినియోగదారులకు విక్రయించి, టెండర్లలో ప్రభుత్వానికి ఎంత చెల్లిస్తానని కోట్ చేసిందో ఆ మొత్తాన్ని చెల్లిస్తుందని వివరించారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వం రూ.100 కోట్ల మేర ఎక్కడ వ్యయం చేస్తోందని ప్రశ్నించారు. అలాంటప్పుడు న్యాయసమీక్షకు పంపలేదని ఎలా ఆరోపిస్తారని నిలదీశారు. బీచ్ శాండ్‌లో ఏపీఎండీసీ చెల్లింపులు జరుపుతుంది కాబట్టే ప్రివ్యూకి బీచ్ శాండ్ టెండర్లను న్యాయ సమీక్షకు పంపి, ఇసుక టెండర్లను పంపలేదంటూ బోడిగుండుకు, మోకాలికి ముడి వేసేలా కథనంలో వాదించడం విడ్డూరంగా ఉందన్నారు. బీచ్ శాండ్ ఆపరేషన్స్ చేసే కాంట్రాక్టింగ్ ఏజెన్సీకి ఏపీఎండీసీ రూ.100 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉండటం వల్లే ఆ టెండర్లను న్యాయ సమీక్షకు పంపామని తెలిపారు. కాంట్రాక్టింగ్ ఏజెన్సీకి ప్రభుత్వం ఎటువంటి చెల్లింపులు చేయడం లేదని వెల్లడించారు. దీనిని అర్థం చేసుకోకుండా సందేహాలు అంటూ ఈనాడు పత్రిక అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు.



బహుజన హితాయ... బహుజన సుఖాయ... లోకానుకంపాయ.
(అందరి మంచి కోసం, అందరి సంతోషం కోసం, ప్రపంచం పట్ల కరుణతో నడుచుకోవాలి.)
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 11 అక్టోబర్ 2023

పతకాల శతకం

కోరినది నెరవేరింది. అనుకున్నట్టే... ఆశించినట్టే... ఆసియా క్రీడోత్సవాల్లో మన దేశం పతకాల శతకం పండించింది. చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన 19వ ఏషియన్ గేమ్స్‌లో 655 మంది సభ్యుల భారత బృందం 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలతో మొత్తం 107 పతకాలు గెలిచింది. మునుపు 2018లో జకార్తా ఏషియన్ గేమ్స్‌లో సాధించిన 70 పతకాల రికార్డును తిరగరాసింది. ఆసియా క్రీడల పతకాల వేటలో మూడంకెల స్కోరుకు మన దేశం చేరడం ఇదే ప్రప్రథమం. శతాధిక పతకాల సాధనలో ఎప్పుడూ ముందు వరుసలో ఉండే చైనా, జపాన్, దక్షిణ కొరియాల సరసన అగ్ర శ్రేణి క్రీడాదేశంగా మనం కూడా స్థానం సంపాదించడం గర్వకారణం. ఈ క్రమంలో అతి సామాన్య స్థాయి నుంచొచ్చి అంతర్జాతీయ వేదికపై చెరగని ముద్ర వేసిన మనవాళ్ళ కథలు స్ఫూర్తిదాయకం.

ఈ క్రీడోత్సవాల్లో 201 స్వర్ణాలతో సహా మొత్తం 383 పతకాలతో తిరుగులేని ప్రథమ స్థానంలో చైనా నిలిచింది. 188 మెడల్స్‌తో జపాన్, 190తో దక్షిణ కొరియా ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. కరోనా వల్ల ఏడాది ఆలస్యంగా 2021లో జరిగిన టోక్యో–2020 వేసవి ఒలింపిక్స్‌లోనూ చైనా, జపాన్‌లు ఇలాగే పతకాల సాధనలో రెండు, మూడు స్థానాల్లోనే ఉన్నాయి. ప్రపంచస్థాయి ఒలింపిక్స్‌లోనే అంతటి విజయాలు నమోదు చేసుకున్న ఆ దేశాలు ఇప్పుడు ఆసియా క్రీడోత్సవాల్లోనూ ఇలా ఆధిక్యం కనబరచడం ఆశ్చర్యమేమీ కాదు. అయితే, ఒలింపిక్స్ పతకాల ర్యాంకింగుల్లో ఆసియా దేశాల కన్నా వెనకాల ఎక్కడో 48వ ర్యాంకులో ఉన్న భారత్, తీరా ఏషియాడ్‌లో మాత్రం వాటన్నిటినీ వెనక్కి నెట్టి, నాలుగో ర్యాంకులోకి రావడం గణనీయమైన సాధన.

మొత్తం 107 పతకాల్లో అత్యధిక పతకాలు (6 స్వర్ణాలతో సహా 29) మనకు అథ్లెటిక్స్‌లోనే వచ్చాయి. ఆపైన అత్యధికంగా షూటింగ్‌లో (22 మెడల్స్), ఆర్చరీలో (9), అలాగే బ్యాడ్మింటన్, రెజ్లింగ్, బాక్సింగ్, హాకీల్లో మనవాళ్ళు ప్రపంచ శ్రేణి ప్రతిభ కనబరిచారు. హాంగ్‌జౌలోని ఈ తాజా ఆసియా క్రీడోత్సవాల్లో మన దేశానికి మరో విశేషం ఉంది. ఈ క్రీడల పోరులో సాంప్రదాయికంగా తనకు బలమున్న హాకీ, రెజ్లింగ్, కబడ్డీ, షూటింగ్ లాంటి వాటిల్లోనే కాదు... అనేక ఇతర అంశాల్లో జమాజెట్టీలైన ఇతర దేశాల జట్లకు ఎదురొడ్డి భారత్ పతకాలు సాధించింది. పట్టున్న హాకీ, కబడ్డీ లాంటి క్రీడల్లో ప్రతిష్ఠ నిలబెట్టుకుంటూనే, ఆటల్లోని ఆసియా అగ్రరాజ్యాలను ఢీ కొని, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ లాంటి ప్రపంచ శ్రేణి ఆటల్లోనూ పతకాలు గెలుచుకుంది. ఇది గమనార్హం.

ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఆదివారం ముగిసిన ఈ ఆసియా క్రీడా సంబరంలో మన ఆటగాళ్ళ విజయగీతిక భారత క్రీడారంగంలో అత్యంత కీలక ఘట్టం. కేవలం పతకాల గెలుపులోనే కాక, క్రీడాజగతిలో మన వర్తమాన, భవిష్యత్ పయనానికీ ఇది స్పష్టమైన సూచిక. క్రీడాంగణంలోనూ మన దేశం వేగంగా దూసుకుపోతూ, రకరకాల ఆటల్లో విశ్వవిజేతల సరసన నిలవాలన్న ఆకాంక్షను బలంగా వ్యక్తం చేస్తున్న తీరుకు ఇది నిలువుటద్దం. 2018 నాటి ఏషియన్ గేమ్స్‌లో పతకాల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచిన భారత్ ఇవాళ నాలుగో స్థానానికి ఎగబాకిందంటే, దాని వెనుక ఎందరు క్రీడాకారుల కఠోరశ్రమ, దృఢసంకల్పం ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, క్రీడా ప్రాధికార సంస్థలు ఆటలకు అందించిన ప్రోత్సాహమూ మరువలేనిది.

ఆతిథ్యదేశమైన చైనా వైఖరి అనేక అంశాల్లో విమర్శల పాలైంది. భారత్‌లో అంతర్భాగమైన అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆటగాళ్ళకు తన వీసా విధానంతో అడ్డం కొట్టి, డ్రాగన్ తన దుర్బుద్ధిని మరోసారి బయటపెట్టుకుంది. జావెలిన్ త్రో సహా కొన్ని అంశాల్లో చైనా అధికారిక రిఫరీలు భారత ఆటగాళ్ళ అవకాశాల్ని దెబ్బ తీసేలా విచిత్ర నిర్ణయాలు తీసుకోవడమూ వివాదాస్పదమైంది. తొండి ఆటతో బీజింగ్ తన కుత్సితాన్ని బయటపెట్టుకున్నా, స్థానిక ప్రేక్షకులు ఎకసెక్కాలాడుతున్నా భారత ఆటగాళ్ళ బృందం సహనంతో, పట్టుదలతో ఈ విజయాలను మూటగట్టుకు వచ్చింది. ఆ విషయం విస్మరించలేం. అందుకే కొన్ని అంశాల్లో అసంతృప్తి ఉన్నా, కొందరు క్రీడాతారలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా, ఆటతీరులో నిలకడ చూపలేక పోయినా తాజా ఆసియా క్రీడోత్సవాల్లో భారత ప్రదర్శనను అభినందించి తీరాలి. వచ్చే ఏటి ప్యారిస్ ఒలింపిక్స్‌కు దీన్ని ఉత్ప్రేరకంగా చూడాలి.

మునుపటితో పోలిస్తే, క్రీడాజగత్తులో మనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం సంతోషకర పరిణామం. అలాగని సాధించినదానితో సంతృప్తి పడిపోతేనే ఇబ్బంది. ఇప్పటికీ జనాభాలో, అనేక ఇతర రంగాల్లో మనతో పోలిస్తే దిగువనున్న దేశాల కన్నా ఆటల్లో మనం వెనుకబడి ఉన్నాం. అది మర్చిపోరాదు. ఆర్థిక, సామాజిక ఇబ్బందులతో పాటు క్రీడావ్యవస్థలోని సవాలక్ష రాజకీయాలు, పెత్తందారీ విధానాలు, క్రీడా సంఘాలను సొంత జాగీర్లుగా మార్చుకున్న నేతలు – గూండాలు మన ఆటకు నేటికీ అవరోధాలు. మహిళా రెజ్లర్లతో దీర్ఘకాలంగా అనుచితంగా వ్యవహరిస్తున్నట్టు అధికార పార్టీ ఎంపీపై అన్ని సాక్ష్యాలూ ఉన్నా ఏమీ చేయని స్వార్థ పాలకుల దేశం మనది. అలాంటి చీకాకులు, చిక్కులు లేకుంటే మన ఆటగాళ్ళు, మరీ ముఖ్యంగా ఇన్ని ఇబ్బందుల్లోనూ పతకాల పంట పండిస్తున్న పడతులు ఇంకెన్ని అద్భుతాలు చేస్తారో! ఏషియాడ్‌లో మనం గెల్చిన 28 స్వర్ణాల్లో 12 మాత్రమే ఒలింపిక్స్ క్రీడాంశాలనేది గుర్తు చేసుకుంటే చేయాల్సిన కృషి, సాధించాల్సిన పురోగతి అవగతమవుతుంది. మహారాష్ట్రలోని దుర్భిక్ష ప్రాంతంలోని రైతు కొడుకు, ముంబయ్‌లో కూరలమ్మే వాళ్ళ కూతురు లాంటి మన ఏషియాడ్ పతకాల వీరుల విజయగాథలెన్నో ఆ లక్ష్యం దిశగా మనకిప్పుడు ఆశాదీపాలు!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.ద్వాదశి సా.5.11 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మఖ ఉ.9.39 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.6.30 నుండి 8.16 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.24 నుండి 12.11 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.57 నుండి 8.44 వరకు, తిరిగి తె.5.07 నుండి 6.40 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఒత్తిడితో పిల్లల్ని ఇంకా చంపుదామా?

విశ్లేషణ



అవిజిత్ పాఠక్

మన దేశంలోని ఐఐటీలు 2018 నుండి 2023 వరకు 33 మంది విద్యార్థుల ఆత్మహత్యలను నివేదించాయి. ఎన్ఐటీలు, ఐఐఎమ్‌లు అలాంటి 61 కేసులను నమోదు చేశాయి. 'విజయం' అనే కలలను అమ్మే బ్రహ్మాండమైన కోచింగ్ ఫ్యాక్టరీలకు అపఖ్యాతి గాంచిన రాజస్థాన్‌లోని కోటాలో ఈ సంవత్సరం జనవరి నుండి ఆగస్టు వరకు ప్రతి నెలా సగటున మూడు ఆత్మహత్యలు నమోదయ్యాయి. ప్లేస్‌మెంట్లు, జీతం ప్యాకేజీల కథలతో ఈ వ్యవస్థ యువ మనస్సులను హిప్నోటైజ్ చేస్తోంది. అర్థం లేని పరుగు కోసం గుర్రాలుగా మారుస్తోంది. గొప్ప ఆకాంక్షలను, కలలను చంపుతోంది. అయినా విద్యార్థుల ఆత్మహత్యలను మనం సాధారణీకరిస్తున్నాం. ఈ ప్రాణాపాయ విద్యకు బలంగా 'నో' అని చెప్పాలి.

ఈ మధ్య ఓ దీర్ఘకాలిక ఆందోళన నాతో ఘర్షించడం మొదలెట్టింది. విద్యార్థుల ఆత్మహత్యలను మనం సాధారణీకరిస్తున్నామా? విద్య పేరిట, 'విజయం' కోసం జరిగే పరుగుపందెంలో కొందరు 'బలహీనమైన', 'భావోద్వేగానికి లోనయ్యే' యువకులు తమ జీవితాలను అంతం చేసుకుంటున్నప్పటికీ, దీన్నంతా మామూలు వ్యవహారం లానే చూస్తున్నామా?

ఇలాంటి విద్య... విద్యార్థి స్ఫూర్తినే నాశనం చేస్తుందనీ, సామాజిక మానసిక వ్యాధిని సాధారణీకరిస్తుందనీ చెబుతూ, మధ్యతరగతి తల్లిదండ్రులతోనూ, ఉపాధ్యాయులతోనూ నేను తరచుగా కమ్యూనికేట్ చేయడానికి ప్రయత్నించాను. గణాంకాల ద్వారా వారిని ఒప్పించేందుకు కూడా ప్రయత్నించాను. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2021 నివేదిక ప్రకారం, ఆ ఏడాది 13,089 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే ప్రతిరోజూ 35 కంటే ఎక్కువ చొప్పున అన్నమాట. అయినప్పటికీ, నేను ఒక తిరస్కరణ లేక నిరాకరణ స్థితిని ఎదుర్కొంటున్నాను. మన కాలంలో వాతావరణ అత్యవసర పరిస్థితికి చెందిన కఠినమైన వాస్తవికతను మనం ఎలాగైతే తిరస్కరిస్తున్నామో దాదాపుగా ఇదీ అంతే! మన దేశంలోని ఐఐటీలు 2018 నుండి 2023 వరకు 33 మంది విద్యార్థుల ఆత్మహత్యలను నివేదించాయి. మరో వైపున ఎన్ఐటీలు, ఐఐఎమ్‌లు అలాంటి 61 కేసులను నమోదు చేశాయి. అయినప్పటికీ, మనం మౌనంగా ఉండటానికే ఇష్టపడతాం లేదా దానిని కేవలం ఒక అపసవ్యతగా భావిస్తాం. అదే విధంగా, 'విజయం' అనే కలలను అమ్మే బ్రహ్మాండమైన కోచింగ్ ఫ్యాక్టరీలకు అపఖ్యాతి గాంచిన రాజస్థాన్‌లోని కోటాలో ఈ సంవత్సరం జనవరి నుండి ఆగస్టు వరకు ప్రతినెలా సగటున మూడు ఆత్మహత్యలు నమోదయ్యాయి.

నిజానికి, జీవితాన్నే నిరాకరించే ఈ పోటీ వ్యాప్తికి సంబంధించిన వ్యవస్థీకృత, సామాజిక కారణాల గురించి నాకు తెలుసు. ఇంకా చెప్పాలంటే, అధిక జనాభా కలిగిన ఈ దేశంలో ఉద్యోగాల కొరత ఉంది. ఉదారవాద కళలు, మానవ శాస్త్రాల విలువ తగ్గిపోయింది. ఇంజినీరింగ్, వైద్యశాస్త్రాలు, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇతర సాంకేతిక కోర్సులపై మక్కువ పెరిగింది. సంస్కృతిపై, విద్యపై నయా ఉదారవాద దాడి కారణంగా జీవిత ఆకాంక్షల మార్కెటీకరణ జరిగింది. అన్నింటికంటే మించి, 'యోగ్యత' లేదా 'బలవంతులదే మనుగడ' సిద్ధాంతాలకు పవిత్రత కల్పించడం కోసం... అన్యాయమైన సామాజిక వ్యవస్థలో ఒక జీవన విధానంగా అతి పోటీతత్వాన్ని లేదా సామాజిక డార్వినిజంను అంగీకరించడం జరిగింది. మన పిల్లలు, యువ విద్యార్థులు బాధపడుతున్న తీరును చూస్తూనే ఉన్నాం. దీర్ఘకాలిక ఒత్తిడి, భయం, ఆందోళన, ఆత్మహత్య ధోరణులతో వారు జీవిస్తున్నందున, మనం మౌనంగా ఉండలేం. ఈ అన్యాయాన్ని మనం సాధారణీకరించలేం.



ఒక ఉపాధ్యాయునిగా, ఈ విధమైన ఏ విద్యనైనా ఏమాత్రం సందిగ్ధత లేకుండా మనం విమర్శించాలనీ, దీని ద్వారా కొత్త అవకాశాల కోసం ప్రయత్నించాలనీ నేను భావిస్తాను. వాస్తవానికి, ప్రతి ఒక్కరూ ఆత్మహత్య చేసుకోవడం లేదు. కానీ ఈ విద్యా వ్యవస్థలో భాగమైన ప్రతి యువ విద్యార్థి కూడా మానసిక ఒత్తిడి, ఆందోళన, 'వైఫల్యానికి' సంబంధించిన అమితమైన భయాలతో అననుకూలమైన వాతావరణంలో పెరుగుతున్నారనేది కూడా అంతే నిజం. ప్రేమ, సహకారానికి సంబంధించిన ఆవశ్యకత; పట్టుదల, ప్రశాంతతకు సంబంధించిన కళ ద్వారా భూమ్మీద మన ఉనికి తాలూకు హెచ్చుతగ్గులను అర్థం చేసుకోగలిగే సామర్థ్యం; సాధారణ విషయాలలో జీవితానికి సంబంధించిన నిజమైన నిధిని కనుగొనడానికి వీలు కల్పించే బుద్ధిపూర్వక స్థితి... ఇలా, అర్థవంతమైన జీవితాన్ని గడపడానికి అవకాశం లేని, నిజంగా ముఖ్యమైన వాటిని పెంపొందించడంలో ఆసక్తి లేని వ్యవస్థ ఇక్కడ ఉంది. ఒక సీతాకోక చిలుక చిన్న పసుపు పువ్వుతో ఆడుకోవడం, ముసలి నాయనమ్మ కోసం ఒక కప్పు టీ తయారు చేయడం, ఆమెతో పారవశ్యంలో ఒక క్షణం పంచుకోవడం, లేదా శీతా కాలపు రాత్రి ఒక నవలను చదవడం... ఇలాంటి వాటికి బదులుగా, ఈ వ్యవస్థ అన్ని గొప్ప ఆకాంక్షలను, కలలను చంపుతోంది. ఇది యువ మనసులను అర్థం లేని పరుగు కోసం గుర్రాలుగా మారుస్తోంది.

పాఠశాలల నుండి కోచింగ్ ఫ్యాక్టరీల వరకు, మనం విద్యను అన్ని రకాల ప్రామాణిక పరీక్షలను 'ఛేదించే' ఒక వ్యూహంగా కుదించి వేశాము. గొప్ప పుస్తకాలను చదవడం, వినూత్న ఆలోచనలను అన్వేషించడం, చర్చించడం, వాదించడం, సైన్స్, సాహిత్యం, కళలతో ప్రయోగాలు చేయడం వంటి వాటి కంటే పరీక్షలు, మార్కులు చాలా ముఖ్యమైనవి కావడంతో నిజమైన అభ్యాసం దెబ్బతింటోంది. 'వేగానికి' సంబంధించిన మాంత్రికతతో ఓఎమ్ఆర్ షీట్‌లో 'సరైన' సమాధానాన్ని టిక్ చేయగల సామర్థ్యమే విలువైనది అయిపోయింది.

ఎమ్‌సీక్యూ – కేంద్రీకృత పరీక్షా వ్యూహాలను విక్రయించే మార్గదర్శక పుస్తకాలు యువ అభ్యాసకుల మానసిక స్థితిని వలసీకరించడం ప్రారంభించాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

ఈ వ్యవస్థ సౌందర్యం, సృజనాత్మకత, ఉత్సుకత లేనిది. ఇది యాంత్రికమైన, ప్రామాణికమైన, కరుడు గట్టిన మనస్సులను తయారు చేస్తుంది. ఉపకరణ 'మేధస్సు'కు మాత్రమే అది విలువనిస్తుంది. దీనిలో సృజనాత్మక కల్పన లేదా తాత్విక అద్భుతం లేదు. కోచింగ్ సెంటర్ వ్యూహకర్త మీ బిడ్డను సూర్యాస్తమయాన్ని చూడడానికీ, ఒక పద్యం చదవడానికీ లేదా సత్యజిత్ రే చలన చిత్రాన్ని మెచ్చుకునేలా ప్రేరేపించాలనీ మీరు ఆశించలేరు. ఈ బోధకులు మీ పిల్లలను వేగంగా పరిగెత్తమని, ఇతరులను ఓడించమని, భౌతిక శాస్త్రాన్ని లేదా గణితాన్ని కేవలం ప్రవేశ పరీక్ష మెటీరియల్‌గా కుదించుకోమని, అతని/ఆమె స్వీయ–అవగాహనను ఐఐటీ–జేఈఈ లేదా నీట్ ర్యాంకింగ్‌తో సమానం చేయమని మాత్రమే అడగగలరు. మరో మాటలో చెప్పాలంటే, ఈ విధమైన విద్య ఒక వ్యక్తిని సాంస్కృతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా కూడా దారిద్ర్యంలోకి నెడుతుంది. ఇది జీవితం కోసం, దాని లోతైన అస్తిత్వ ప్రశ్నల కోసం ఎవరినీ సిద్ధం చేయదు.

కార్ల్ మార్క్స్ ఒకప్పుడు 'సరుకుల మాయ'గా భావించిన దానిని ఈ విధమైన సాధనా విద్య చట్టబద్ధం చేస్తోంది. అవును, మన పిల్లలు ఒక విధంగా శిక్షణ పొందవలసి ఉంటుంది, తద్వారా వారు ఒక ధర ట్యాగ్‌తో వస్తువులుగా లేదా 'ఉత్పత్తులుగా' ఉద్భవించవలసి ఉంటుంది. కఠినమైన వాస్తవాన్ని అంగీకరించండి. చాలా హైప్ చేయబడిన ఐఐటీలు, ఐఐఎమ్‌లు – మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చూసే అంతిమ మోక్షమైన 'ప్లేస్‌మెంట్‌లు మరియు జీతం ప్యాకేజీల' పురాణాల ద్వారా యువ మనస్సులను హిప్నోటైజ్ చేస్తాయి. మన పిల్లలను, ప్రత్యేకమైన స్వయంప్రతిపత్తి గల వ్యక్తులుగా చూడకుండా, కేవలం 'పెట్టుబడి' లేదా విక్రయించదగిన వస్తువుల స్థాయికి తగ్గించి, మనం న్యూరోటిక్, ఆందోళనతో కూడిన, అధిక ఒత్తిడితో కూడిన తరాన్ని సృష్టించడం కొనసాగిస్తాము. 'మోటివేషనల్ స్పీకర్ల'ను 'స్వయం–సహాయ' పుస్తకాల మార్కెట్‌ను అభివృద్ధి చేయడానికి వ్యవస్థ అనుమతించినప్పటికీ, పెరుగుతున్న ఆత్మహత్యల రేటును అరికట్టడం అసాధ్యం.

ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, శ్రద్ధగల పౌరులుగా, మనం అప్రమత్తంగా ఉండాలి, మన స్వరం పెంచాలి, ఈ ప్రాణాపాయ విద్యకు నో అని చెప్పాలి, కొత్త అవగాహనను ఏర్పరచాలి. మన పిల్లలకు జీవితాన్ని ధ్రువీకరించే, కరుణను పెంచే మరో దృక్పథాన్ని అందించాలి.

వ్యాసకర్త సామాజిక శాస్త్రవేత్త
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

హ్యాపీ బర్త్ డే



పుట్టినరోజు (అక్టోబర్ 10) శుభాకాంక్షలు ఎస్.ఎస్.రాజమౌళి సర్. మీ సినిమా దీప్తి మరెన్నో ఏళ్లు వెలగాలి!

– మహేశ్ బాబు, నటుడు

లోపలే ఆనందం!



ఇన్నర్ ఇంజినీరింగ్ అనేది, నీ లోపలే ఆనంద రసాయనాలను కొనసాగించే సాంకేతిక పరిజ్ఞానం. అన్ని పరిజ్ఞానాల్లాగే, దీన్ని ఉపయోగించడం నేర్చుకుంటే, అది మీ కోసం పనిచేస్తుంది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా దాన్ని అభ్యాసం చేయండి.

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక గురువు

ప్రయోజనాలే ముఖ్యం



వ్యక్తులకు ఒక నైతిక స్పష్టత ఉండటం చాలా ముఖ్యం. కానీ విషాదకరంగా దేశాలకు ఆ విలాసం లేదు. ఇస్లామిక్ తీవ్రవాదం అనేది భారతదేశానికి పెద్ద సవాలుగా ఉంది. అలీన విధాన కాలం, తర్వాతి సంవత్సరాల సమతుల్యతా కాలం ముగిసిపోయాయి. స్వీయ ప్రయోజనాల విషయంలో ఇండియా ఒక గట్టి వైఖరి తీసుకుంది. ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలబడింది.

– రాహుల్ పండిత, జర్నలిస్ట్

ఎదగని మనుషులు



లైఫ్ టిప్: మీకు మానసిక ఆరోగ్య ఇబ్బంది ఉందని ఊరికే ఎవరికైనా చెప్పి చూడండి... ఇక వాళ్లు వాదనలో మీతో తార్కికంగా గెలవలేని ప్రతిసారీ... చివరి అస్త్రంగా మిమ్మల్ని సైకో అనేస్తారు. 100 శాతం ఇది నిరూపితమైంది.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

ఇలాంటి అబద్ధాలా?



ఇలాంటి అబద్ధాలను ఎంత పిచ్చిగా వ్యాపింపజేస్తున్నారు! ఇక్కడ అన్ని రకాల తప్పుడు వార్తలూ స్వేచ్ఛగా తేలుతున్నాయి. ట్విట్టర్‌ను పూర్తిగా వదిలేయడానికి ఇదే సమయం. (అమర్త్య సేన్ చనిపోయారన్న వార్త వ్యాపించాక, నివాళిగా నందిత ఒక ట్వీట్ చేశారు. ఇంతలో ఆ వార్త మీద ఖండన వచ్చింది. అప్పుడు మళ్లీ ఆమె చేసిన ట్వీట్ ఇది.)

– నందితా దాస్, నటి, దర్శకురాలు

పద్ధతిగా రానిద్దాం!



ఇంతవరకూ పాకిస్తానీ జర్నలిస్టులకు వీసా ఇవ్వకపోవడం నిరాశగా ఉంది. రాజకీయ తగాదాల్లో జర్నలిస్టులు ఎందుకు ఇరుక్కుపోవాలి? ప్రపంచ క్రికెట్ కప్‌కు పాకిస్తాన్ అర్హత సాధించాక, ఇండియా ఆతిథ్యం ఇస్తున్నాక, జర్నలిస్టులకు వీసా నిరాకరించకూడదు. భవిష్యత్తులో ఇస్లామాబాద్ కూడా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరిస్తుందని ఆశిస్తాను. మనం భారతీయ పద్ధతిలో మంచి అతిథుల్లా ఉందాం!

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

బలవంతుల పక్షం



ఇజ్రాయిల్‌కూ, హిట్లర్‌కూ ఏకకాలంలో భారతీయ రైట్ వింగ్ ఎలా మద్దతిచ్చిందని ఒకరు అడిగారు. 'బలవంతులు' అని అనుకున్న ఎవరికైనా అది మద్దతిస్తుంది. దానిలో లోలోతుగా ఉన్న ఆత్మన్యూనతా భావం అది. ఇందులో నైతిక ఆలోచనేమీ లేదు. నిన్ను నువ్వు బలమైన మనిషిగా బ్రాండ్ చేసుకుంటే, ఇండియన్ రైట్ వింగ్ నీకు మద్దతిస్తుంది.

– శివమ్ శంకర్ సింగ్, రచయిత

ఇన్ బాక్స్

అమ్మాయిల పట్ల వివక్ష తగదు

దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతోందని గొప్పలు చెప్పుకొంటున్నా ఆడపిల్లల పట్ల చూపుతున్న చులకన భావం, వివక్ష కొనసాగుతుండడం గర్హనీయం. బూజు బట్టిన భావజాలం ఇంకా మన భారతీయులను వదల్లేదు. అందుకే ఆడబిడ్డలను తక్కువగా చూడటం, వారిపై అత్యాచారాలకు పాల్పడటం జరుగుతోంది. ఇంటి నుంచి బడికో, బయటికో వెళ్ళిన బాలిక క్షేమంగా తిరిగొస్తుందన్న నమ్మకం లేదు. 'నిర్భయ', 'అభయ', 'దిశ' లాంటి చట్టాలు వచ్చిన తర్వాత కూడా అత్యాచార ఘటనలు లేకుండా ఒక్క రోజైనా గడిచింది లేదు. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' (ఎన్సీఆర్‌బీ) తాజా నివేదిక ప్రకారం, 2021లో 18 ఏళ్ల పైబడిన మహిళలపై అత్యాచారాలకు సంబంధించి మొత్తం 28,644 కేసులు నమోదయ్యాయి. మైనర్లపై 36,069 అత్యాచార కేసులు నమోదయ్యాయి.

ఈ నేపథ్యంలో మనం 'అంతర్జాతీయ బాలికల దినోత్సవం' జరుపుకొంటున్నాం. బాలికల హక్కులు, మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రపంచానికి తెలియజేయడంతో పాటు బాలికలకు సమాజ పోకడల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపుకోవాలని 2011 డిసెంబర్ 19న ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసింది.

కిశోర బాలిక... మహిళగా రూపాంతరం చెందే కీలక దశ 'కౌమార' దశ. ఈ దశలో వర్తమానంలోనే కాదు భవిష్యత్తులోనూ సాధికారత దిశలో నడవడానికి తనకు అవగాహన, చైతన్యం అవసరం. దీనికి సరైన ఆయుధం విద్యే. విద్యాభివృద్ధి ద్వారానే అన్ని రకాల దుర్మార్గాలను అంతం చేయవచ్చు. బాలికలను సాధికారత వైపు నడిపించడానికి అందరూ పూనిక వహిస్తే ఇదేమంత కష్టంకాదు. అన్నిటికీ మించి పురుష దృక్పథంలో మార్పు రావాలి. పురుషుల్లో దైవభీతి, నైతిక పరివర్తన ఉన్నప్పుడే బాలికా సమస్యలతో పాటు, సమస్త సామాజిక సమస్యలకూ పరిష్కారం లభిస్తుంది.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్
(నేడు అంతర్జాతీయ బాలికల దినోత్సవం)

వెన్నంటి ఉన్నందుకే... ఈ ప్రజావిశ్వాసం!

అభిప్రాయం



కైలే అనిల్‌కుమార్

ప్రజాప్రతినిధి నిరంతరం ప్రజల కష్టసుఖాల్లో వారి వెన్నంటే ఉంటే అటువంటి వారిని ప్రజలు ఎప్పటికీ ఆదరిస్తూనే ఉంటారు. ఈ మాటలు ఒక ఎమ్మెల్యేగా స్వానుభవంతో చెబుతున్నాను. ఇదే విషయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చెప్పారు. నేను, నా సహచర ప్రజా ప్రతినిధులు గ్రహించిన విషయాలను ముఖ్యమంత్రి జగన్ పునరుద్ఘాటించినప్పుడు మాకు అంతులేని విశ్వాసం కలిగింది. ఇచ్చిన మాట నిలబెట్టుకొని, ఇవ్వని హామీలనూ నెరవేర్చామని నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఇప్పటికే చెప్పాం. పార్టీ అధినేత జగన్ దిశానిర్దేశం చేసిన విధంగా మరొక మారు ప్రజల ముంగిటకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. ముఖ్యమంత్రి జగన్ 'మాట ఇస్తే చేస్తాడంతే' అనే విశ్వసనీయతే పార్టీకి బలం. ఆయన అనుచరులుగా, ప్రజా ప్రతినిధులుగా మేమూ అదే దారిలో నడవడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేశాం. మాట ఇస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని నిలబెట్టుకోవడానికి గట్టిగా ప్రయత్నించాం. ముఖ్యమంత్రి జగన్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణ, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారనే నమ్మకం, ఇచ్చిన హామీలనే కాదు ఇవ్వని వాటినీ నెరవేర్చారనే కృతజ్ఞత, 'మీ ఇంట్లో మేలు జరిగి ఉంటేనే ఆశీర్వదించమ'ని ధైర్యంగా అడిగన తీరు, సంక్షేమం– అభివృద్ధికి సమ ప్రాధాన్యత, వివక్షతకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు... ఇలా ప్రభుత్వం చేసిన మంచిని చెప్పడానికి ప్రజా ప్రతినిధులుగా, జగన్ అనుచరులుగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించడానికి సిద్ధంగా ఉన్నాం.



రాజకీయ నాయకులంటే మాట మీద నిలబడరనీ, హామీలు నెరవేర్చకుండా మాయ మాటలు చెబుతారనే నిర్వచనాలకు ముఖ్యమంత్రి జగన్ చెల్లుచీటీ రాశారు. విలువలు, విశ్వసనీయత రాజకీయానికి రెండు కళ్లని సరికొత్త నిర్వచనం చెప్పారు. రాజకీయం నిర్వచనాన్నే సమూలంగా మార్చిన జగన్‌కు ప్రజలు ఇప్పటికే బ్రహ్మరథం పడుతున్న తీరును ఎమ్మెల్యేలుగా మేము ప్రజల్లో తిరుగుతున్నప్పుడు స్పష్టంగా చూస్తున్నాం. ఎన్నికలు ముగిసి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే నిరంతరం ప్రజల్లో ఉండాలని ప్రజా ప్రతినిధులకు ముఖ్యమంత్రి జగన్ ఉద్బోధ చేసిన విషయం గుర్తుంది. ముఖ్యమంత్రి సూచనలు/ఆదేశాలతో ప్రజలతో మమేకం కావడం వల్ల సమస్యలు వేగంగా పరిష్కరించడానికి వీలు కలిగింది.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరించడం, తద్వారా ప్రజలకు నేరుగా (మరింత మెరుగ్గా) సేవ చేసే అదృష్టం దక్కింది. నిరంతరం ప్రజలతో మమేకం అయితే ఆదరణకు కొదవే ఉండదని స్వయంగా అనుభవం లోకి వచ్చింది. ప్రజల నుంచి లభించిన ఆదరణ, ప్రేమ ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో ప్రజల గుమ్మం వద్దకు వెళ్లడానికి దోహదం చేస్తాయి. చేసిన మంచి చెప్పి ఆశీర్వదించమని అడగమని ప్రజా ప్రతినిధులకు సీఎం ఇచ్చిన ఆదేశం... సంప్రదాయ రాజకీయాలకు భిన్నమైనదే. తన పాలన పట్ల ఎంతో నమ్మకం ఉంటే తప్ప ముఖ్యమంత్రి జగన్ ఇంత నిక్కచ్చిగా మాట్లాడి ఉండరు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టి రాజకీయాలకు సరికొత్త నిర్వచనాన్ని ఖాయం చేయడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారు.

వ్యాసకర్త పామర్రు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు | 99494 18777


సవరణ: ఆదివారం (8.10.2023) నాటి 'జన తంత్రం'లో 'ఐపీసీ సెక్షన్లు' అనే మాటకు బదులు సీఆర్‌పీసీ సెక్షన్లు అనే పొరపాటు దొర్లింది. గమనించగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

– ఎడిటర్

భ్రాతృ ధర్మాన్ని అనుసరించి...

కుంభకర్ణుడు వరుసగా ఆరు నెలలు నిద్రపోతాడు. ఒక్కరోజు మేలుకొని ఉంటాడు. 'శయితా హి ఏష షణ్మాసాన్, ఏకాహం జాగరిష్యతి'. ఆ ఒక్కరోజే అమితమైన ఆకలితో ప్రాణులను మింగేస్తుంటాడు. యుద్ధంలో వానర సేన ధాటికి తట్టుకోలేక కుంభకర్ణుడిని ఏనుగులతో తొక్కించి మరీ నిద్ర లేపించాడు రావణుడు. మర్కట సైన్యాన్ని మట్టుపెట్టమని కోరాడు.

''అన్నా! ఈ విషయంలో మేం ముందే చెప్పిన హితవు నువ్వు తోసిపుచ్చావు. నీ పాపానికి ఫలం త్వరగానే నీ ముందుకొచ్చింది. బలశాలినని గర్వించి, ఆలోచన లేకుండా అకృత్యం చేశావు. ధర్మం, అర్థం, కామం మూడూ ఆచరించాల్సినవే. తప్పు లేదు. కానీ ఆ మూడింటిలో ధర్మం ముఖ్యం. ఆ ధర్మమేమిటో దీశాలుల నుండి తెలుసుకొని కూడా ఆచరించలేని రాజు నేర్చినదంతా వ్యర్థమే. విభీషణుడు ముందే చెప్పిన హితవు ఇప్పుడన్నా ఆచరించు. అది నీకు మేలు. ఆ తరవాత నీ ఇష్టం. యత్ ఇచ్ఛసి తత్ కురు'' అని మొహమాటం లేకుండా చెప్పేశాడు కుంభకర్ణుడు.



జ్యోతిర్మయం

రావణుడికి కోపం వచ్చింది. ''ఆచార్యుడిలాగా గౌరవించాల్సిన అన్ననే శాసిస్తున్నావు, ఇదేమి ధర్మం? నోరు అదుపులో ఉంచుకో. భ్రమో, బలగర్వమో, చిత్త చాంచల్యమో, కారణమేదయినా ఇప్పుడు కష్ట స్థితిలో ఉన్నవాడి ముందు గతమంతా మళ్ళీ తవ్వడం వ్యర్థం. 'గతం తు గతం ఏవ'. ఇప్పుడేం చెయ్యాలో చెప్పు. నాలాగా తప్పుదారి పట్టిన వాళ్ళకు సహాయం చేసే వాడే అసలైన ఆప్త బంధువు'' అన్నాడు.

అన్న చాలా క్షుభితుడై ఉన్నాడని తమ్ముడు గ్రహించాడు. ''సర్వావస్థలలోనూ నీకు హితమార్గం సూచించడం నా సోదరధర్మం కనక చెప్పాను. అయినా నువ్వు కోరుతున్నావు గనక నేనిప్పుడు భయంకరంగా యుద్ధం చేసి రాముడినీ ఆయన దండునూ హతమార్చి వస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు. శ్రేష్ఠమైన మద్యం తాగుతూ (పిబ చ అగ్ర్య వారుణీమ్) రాజభవనంలో సుఖంగా ఉండు. నేను జీవించి ఉండగా ఆ రాముడు నిన్నేమీ చేయలేడు'' అని, వెంటనే యుద్ధభూమికి చేరాడు.

అధర్మ మార్గంలో ఉన్న అన్నకు హితవు చెప్పబోయి విఫలుడై విభీషణుడు సామాన్య ధర్మాన్ని అనుసరించాడు. అన్నను వదిలి, ధర్మపక్షాన్ని చేరాడు. కుంభకర్ణుడు భ్రాతృ ధర్మాన్ని మాత్రం అనుసరించి, అధర్మం పక్షాన పోరాడి, హతుడయ్యాడు.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

'టెలీమానస్'తో 63 మందికి కొత్త జీవితం

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్

సాక్షి, అమరావతి: ఒత్తిడితో కూడిన ప్రస్తుత జీవనంలో వివిధ మానసిక రుగ్మతల కారణంగా ఆత్మహత్యకు ప్రేరేపితులైన 63 మంది వ్యక్తులకు టెలీమానస్ కాల్ సెంటర్ కొత్త జీవితాన్ని ప్రసాదించిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. కాల్ సెంటర్‌లోని సైకియాట్రిస్టులు, సైకలాజికల్ సోషల్ వర్కర్‌లు, కౌన్సెలర్‌లు సంబంధిత వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి మానసిక సమస్యల నుంచి విముక్తి కల్పించినట్లు నివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పసికందును గొంతు కొరికి చంపిన తల్లి

- మానసిక స్థితి సరిగాలేక తల్లి ఘాతుకం
- నంద్యాల జిల్లా బొమ్మలసత్రంలో ఘటన


భర్త మహేష్‌తో షానుబీ (ఫైల్)

బొమ్మలసత్రం(నంద్యాల): ముక్కుపచ్చలారని పసికందును మానసిక స్థితి సరిగాలేని తల్లి గొంతు కొరికి చంపిన ఘటన నంద్యాల జిల్లా బొమ్మలసత్రం పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గాంధీనగర్‌లో నివాసముంటున్న మహేష్‌కు పట్టణానికి చెందిన షానుబీతో మూడేళ్ల కిందట ప్రేమ వివాహమైంది. మహేష్ ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌లో రోజు కూలీగా పనిచేస్తున్నాడు. షానుబీ పెళ్లైన ఏడాదికి గర్భం దాల్చగా మొదటి కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ బిడ్డ అనారోగ్యంతో చనిపోయింది. తిరిగి రెండోసారి గర్భం దాల్చగా గత నెల 22న షానుబీ మగ శిశువుకు జన్మనిచ్చింది. మంగళవారం షానుబీ అత్త, మామలు అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లారు. ఆ సమయంలో షానుబీకి ఫిట్స్ రావటంతో మానసిక స్థితి సరిగాలేక పక్కనే ఉన్న పసికందు మెడను గట్టిగా కొరికేసింది. పసికందు అక్కడికక్కడే మృతి చెందాడు. కొంత సేపటికి తిరిగొచ్చిన అత్త, మామలు తలుపులు ఎంతసేపు తట్టినా తెరవకపోవడంతో స్థానికుల సాయంతో బద్దలుకొట్టారు. ఇంట్లోకి వెళ్లి చూడగా రక్తపు మడుగులో షానుబీ అపస్మారక స్థితిలో ఉంది. పక్కనే ఉన్న పసికందును పరిశీలించగా గొంతుకు తీవ్ర రక్తగాయమై విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు (పీపీపీ) మోడల్ స్కూళ్ల పేరిట కొంత మంది వ్యక్తులు, సంస్థలు కాంట్రాక్టు ఉద్యోగాలు ఇస్తామంటూ నిరుద్యోగులను మోసగిస్తున్నాయని ఏపీ మోడల్ స్కూల్ జేడీ ఎంవీ కృష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీలో అసలు పీపీపీ మోడల్ స్కూళ్లు లేవని ఆయన స్పష్టం చేశారు. నిరుద్యోగులు మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దని హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ , జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. మాదిగ సామాజికవర్గం అన్ని రంగాల్లోను వెనకబాటుతనంతో ఉందని పలు కమిటీలు తెలిపాయని ఎమ్మార్పీఎస్ న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సీల్లో 50 శాతానికిపైగా మాదిగ సామాజికవర్గం వారు ఉన్నప్పటికీ రిజర్వేషను ఫలాలు అనుభవించలేకపోతున్నారని తెలిపారు. ఈ వర్గీకరణపై పంజాబ్ వర్సెస్ దవీందర్‌సింగ్ కేసును రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తోందని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ కేసును ఆ కేసుతో జతపరుస్తామని తెలిపారు.

బాబు ఆగడాలకు అడ్డుకట్ట తథ్యం

బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసిన చంద్రబాబు అండ్‌కో బినామీలు, కుల ఉగ్రవాదుల ఆగడాలకు న్యాయస్థానాలు అడ్డుకట్ట వేయడం తథ్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,108వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాజధానిలో భూములిచ్చిన రైతులు, అసైన్డ్ రైతుల ప్రయోజనాలను పక్కనబెట్టి.. కులవాదులు చేస్తున్న అమరావతి ఉద్యమ డ్రామా వ్యవహారాన్ని గమనిస్తున్న రైతులు వెంటపడి తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. నాయకులు పులి దాసు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

మళ్లీ మళ్లీ అవే అబద్ధాలా?

- మద్యంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి అడ్డగోలు ఆరోపణలు
- డిస్టిలరీలన్నీ చంద్రబాబు అనుమతిచ్చినవేనని తెలిసినా దాటవేత
- అప్పట్లో 4 డిస్టిలరీలకే 70 శాతం ఆర్డర్లు.. ఇపుడు అన్నిటికీ సమానంగా
- ఈ విషయాన్ని నివేదించిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా
- అయినా సరే.. కావాల్సిన డిస్టిలరీల నుంచే కొంటున్నారని అబద్ధం
- అప్పట్లో ఎక్కువ మద్యం విక్రయించినా ఖజానాకు తక్కువ సొమ్ము
- ఇపుడు తక్కువ విక్రయించినా ఖజానాకు ఎక్కువ సొమ్ము
- మద్యం నిధులు మళ్లించింది చంద్రబాబేనని తేలుతున్నా నోరెత్తని తీరు
- పైపెచ్చు కాకిలెక్కలు చెబుతూ.. ఈ ప్రభుత్వంపై విమర్శలు
- మద్యం వినియోగం తగ్గిందని తేల్చిచెప్పిన కేంద్ర శాఖ
- ఇవేవీ పట్టించుకోకుండా 'ఈనాడు' రూట్లోనే వెళుతున్న ఏపీ బీజేపీ చీఫ్

చంద్రబాబు నాయుడి కోసం 'ఈనాడు' రాతలను లేఖలుగా సంధిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి చిన్నచిన్న లాజిక్కులు కూడా మిస్ అవుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. స్కిల్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న తన బావ చంద్రబాబు మెప్పుకోసం కొన్ని రోజులుగా రాష్ట్రంలో 'మద్యంపై పోరాటం' అంటూ ఆమె చేస్తున్న హంగామా అంతా చూస్తున్నదే. తాజాగా దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ అందజేశారు. తమ పార్టీ ప్రభుత్వానికే ఇలా వినతి పత్రాలివ్వటమేంటని అంతా ఆశ్చర్యపోతున్నా... టీడీపీ సంక్షేమం కోసం పాటుపడుతున్న పురంధేశ్వరికి మాత్రం ఇవేమీ పట్టడం లేదు. లేఖలో ఆమె పేర్కొన్న కొన్ని అంశాలు ఎంత అసంబద్ధమైనవంటే...

ఏది నిజం?

అనుమతులిచ్చిన చంద్రబాబును ప్రశ్నించరేం?

రాష్ట్రంలో మద్యం నాణ్యతపై నోటికొచ్చిన ఆరోపణలు చేస్తున్న పురంధేశ్వరికి... దాన్ని తయారు చేస్తున్న డిస్టిలరీలకు అనుమతులిచ్చింది తన బావ చంద్రబాబు నాయుడేనని తెలియదా? ఒకవేళ తెలియకుంటే తెలుసుకోవాలి కదా? వాస్తవానికి రాష్ట్రంలో ప్రస్తుతం 20 మద్యం డిస్టిలరీలుండగా... వాటిలో 14 డిస్టిలరీలకు అనుమతిచ్చింది చంద్రబాబు నాయుడే. మిగిలిన 6 డిస్టిలరీలకు అంతకు ముందటి ప్రభుత్వాలు అనుమతులిచ్చాయి. అంతే తప్ప వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్కటంటే ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతివ్వలేదు. పైపెచ్చు చంద్రబాబు నాయుడు అనుమతిచ్చిన డిస్టిలరీల్లో చాలావరకూ ఆయన హితులు, సన్నిహితులవే. వాళ్లు అప్పట్లో తయారు చేసిన మద్యాన్నే ఇప్పుడూ తయారు చేస్తున్నారు. మరి అప్పట్లో నాణ్యంగా ఉన్న మద్యం ఇప్పుడు ఎందుకు మారిపోయింది? ప్రభుత్వం మారింది కాబట్టా? ఇదెక్కడి తీరు పురంధేశ్వరి గారూ?!

నాడు నాలుగు డిస్టిలరీలకే 70 శాతం ఆర్డర్లు..

పురంధేశ్వరి తన లేఖలో వాస్తవానికి సమాధి కట్టి వినిపించిన మరో అందమైన అబద్ధమేంటంటే... వైఎస్సార్ సీపీ నాయకులకు చెందిన డిస్టిలరీలకే ఎక్కువ మద్యం సరఫరా చేసే అవకాశమిస్తున్నారని. నిజం చెప్పాలంటే వైఎస్సార్‌సీపీ నేతలకు డిస్టిలరీలే లేవు. అన్నీ చంద్రబాబు నాయుడి హయాంలో అనుమతులిచ్చిన ఆయన సన్నిహితులు, టీడీపీ నేతలవే. పైపెచ్చు చంద్రబాబు హయాంలో డిస్టిలరీల నుంచి మద్యం కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగేది. తమ వారికి చెందిన 4 డిస్టిలరీల నుంచే ఏకంగా 70 శాతం మద్యాన్ని కొనుగోలు చేసేవారు. అంటే తనకు కావాల్సిన ఈ 4 డిస్టిలరీలకూ సగటున ఒక్కోదానికీ 17.5 శాతం ఆర్డర్లు ఇచ్చారు. మిగిలిన 16 డిస్టిలరీలకూ కలిపి 30 శాతం ఆర్డర్లు ఇచ్చారు. అంటే వీటికి సగటున 2 శాతంలోపే ఆర్డర్లు దక్కాయి. కానీ ఇంతటి అవినీతిని పురంధేశ్వరి ఎన్నడూ... ఏ పార్టీలో ఉన్నప్పుడూ ప్రశ్నించలేదు. వాస్తవానికి ఇప్పుడు ప్రతి డిస్టిలరీకీ సమానంగా అవకాశం కల్పిస్తున్నారు. దాదాపు 4 నుంచి 6 శాతం వరకు ప్రతి డిస్టిలరీకీ తయారీ ఆర్డర్లు ఇస్తున్నారు. ఇలా చేస్తున్నందుకే... ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి చెందిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్రంలో మద్యం కొనుగోళ్లు పూర్తి పారదర్శకంగా, నిబంధనల మేరకే జరుగుతున్నాయని ఒక నివేదిక కూడా ఇచ్చింది. కేంద్ర సంస్థే ఇలా చెప్పినపుడు... కేంద్రానికి పురంధేశ్వరి చేసిన ఫిర్యాదులో ఏ కొంచెమైనా అర్థం ఉన్నట్టా?

సత్ఫలితాలనిస్తున్న దశలవారీ మద్య నియంత్రణ..

మద్యం విక్రయాలను ప్రభుత్వ అధీనంలో చేపట్టడం... షాపుల సంఖ్యను తగ్గించటం... విక్రయ వేళల్ని పరిమితం చేయటం... పర్మిట్ రూముల్ని రద్దు చేయటం... బెల్టు షాపుల్ని తొలగించటం... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలతో రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2018–19లో మద్యం విక్రయాలు 3.84 కోట్లు కేసులు. అదే ఏడాది బీర్లు 2.77 కోట్ల కేసులు అమ్ముడు పోయాయి. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక విక్రయాలు గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయి. 2022–23లో మద్యం విక్రయాలు 3.35 కోట్ల కేసులకు, బీర్లు 1.16 కోట్ల కేసులకు పరిమితమయ్యాయి. మద్యం తాగేవారు వెనుకంజ వేసేలా... రేట్లను షాక్ కొట్టేలా పెంచుతామని గత ఎన్నికల హామీల్లో భాగంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. దాన్ని అమలు చేశారు. రేట్లను పెంచటంతో పాటు అదనపు పన్నునూ విధించారు. ఇది కూడా మద్యం విక్రయాలు తగ్గటానికి కారణమే.

నిధులు మళ్లించింది చంద్రబాబు కాదా?

తెలుగుదేశం, 'ఈనాడు' బాటలోనే... రాష్ట్రంలో మద్యం విక్రయించగా వచ్చిన సొమ్ము ఖజానాకు కాకుండా ఇంకెక్కడికో తరలిపోతోందంటూ పురంధేశ్వరి సైతం గగ్గోలుపెట్టారు. రాష్ట్రంలో రోజూ 80 లక్షల మంది తలా రూ.200 విలువైన మద్యాన్ని సేవిస్తున్నారని నోటికొచ్చినట్లు చెప్పేశారు. ఇలా చూస్తే మద్యం అమ్మకాల ద్వారా సంవత్సరానికి రూ.57,600 కోట్లు రావాలని, కానీ రూ.32,600 కోట్లే చూపిస్తున్నారు కనక మిగతా రూ.25 వేల కోట్లు అక్రమంగా మళ్లించేస్తున్నారని నమ్మశక్యం కాని కూతలు కూసేశారు. నిజానికి కేంద్ర జాతీయ కుటుంబ ఆరోగ్య నివేదిక 2019–21 ప్రకారం రాష్ట్రంలో 18 ఏళ్ల పైబడ్డవారిలో మద్యం అలవాటు ఉన్నవారు 63.88 లక్షలమంది. వీరిలో రోజూ తాగేవారు సగటున 18.24 లక్షల మందే. మరి 80 లక్షల లెక్క ఎవరు చెప్పారు పురంధేశ్వరి గారూ? వాస్తవానికి ఈ ప్రభుత్వ హయాంలో తక్కువ మద్యం విక్రయిస్తున్నా ప్రభుత్వ ఖజానాకు ఎక్కువ సొమ్ము సమకూరుతోంది. కానీ చంద్రబాబు హయాంలో ఇప్పటికంటే చాలా ఎక్కువ మద్యాన్ని విక్రయించినా కూడా... ఇప్పటికన్నా తక్కువ మొత్తమే ఖజానాకు చేరేది. మరి నిధుల మళ్లింపు అప్పుడు జరిగినట్టా? ఇప్పుడు జరుగుతున్నట్టా? కాస్త ఆలోచన ఉండాలి కదా? చంద్రబాబును విమర్శించడానికి మనసు ఒప్పుకోకుంటే... ఇలాంటి పనికిమాలిన ఆరోపణలైనా చేయకుండా ఉండాలి కదా?

అంగరంగ వైభవంగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి


టీటీడీ, సింఘానియా గ్రూప్ మధ్య అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ఈవో ధర్మారెడ్డి, ఆ సంస్థ అధినేత సింఘానియా

తిరుమల: అక్టోబరు 15 నుంచి 23వ తేదీ వరకు తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఈవో సమీక్ష నిర్వహించారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ.. అక్టోబరు 14వ తేదీ అంకురార్పణంతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయన్నారు. అక్టోబరు 19న గరుడసేవ, 20న పుష్పక విమానం, 22న స్వర్ణరథం, 23న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో వయోవృద్ధులు, దివ్యాంగులు, సంవత్సరం లోపు చిన్నపిల్లల తల్లిదండ్రుల ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేసినట్లు ఈవో చెప్పారు. అక్టోబర్ 19న గరుడసేవ సందర్భంగా ఆ రోజు ద్విచక్ర వాహనాలను అనుమతించరన్నారు. జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, సీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవీ ముంబయిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం..

నవీ ముంబయిలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తిరుమలలోని సింఘానియా గ్రూప్‌తో టీటీడీ ఎంఓయూ కుదుర్చుకుంది. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, రేమాండ్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ హరి సింఘానియా సమక్షంలో ఈ మేరకు ఒప్పందం జరిగింది. ఈవో మాట్లాడుతూ.. ముంబయి ఉల్వే ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో రూ.70 కోట్లతో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు ఓ దాత ముందుకొచ్చారని తెలిపారు.

పేదల సంక్షేమమే మా ప్రభుత్వ అజెండా

- మీడియాతో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- పార్టీ నాయకత్వానికి సీఎం దిశానిర్దేశం చేశారు
- టీడీపీ ఆరోపణలనే పురందేశ్వరి వల్లెవేస్తున్నారు



ఒంగోలు: పేదల సంక్షేమమే తమ ప్రభుత్వం అజెండా అని టీటీడీ మాజీ చైర్మన్, ఒంగోలు మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తన నివాసానికి వచ్చిన ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. పార్టీ నాయకత్వం మొత్తానికి సీఎం స్వయంగా విజయవాడలో తాజాగా నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేశారన్నారు. కృష్ణా జలాల పంపిణీ విషయంలో ఇప్పటికే కేంద్రం దృష్టికి సీఎం స్వయంగా తీసుకెళ్లారని, అవసరమైతే రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా సుప్రీంను కూడా ఆశ్రయిస్తామన్నారు. ఇసుక మాఫియా, మద్యం మాఫియా అంటూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న ఆరోపణలనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా చేస్తున్నారని అన్నారు. తమది అవినీతికి అవకాశం లేని, పారదర్శక పాలన అని అన్నారు. గత ప్రభుత్వం లాగా పథకాల పేరుతో దోచుకోలేదన్నారు. గత ప్రభుత్వంలోని కుంభకోణాలన్నింటిపై న్యాయస్థానమే విచారించి దోషులను తేలుస్తుందని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఎన్నికల్లో తమ పార్టీ గత ఎన్నికల్లో పోటీచేయలేదని, ఈ దఫా కూడా పోటీచేయదన్నారు. వెలిగొండ ప్రాజెక్టుపై విమర్శలు చేసేముందు టీడీపీ వాళ్లు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. 5 సంవత్సరాల పాలనలో పట్టుమని 3 నుంచి 4 కిలోమీటర్ల టన్నెల్ పనులు కూడా సాగలేదని, కానీ తమ పాలనలో కరోనాతో ఇబ్బంది వచ్చినా ఒక టన్నెల్ పూర్తిచేసి రెండో టన్నెల్ చివరిదశకు చేరుకున్నామన్నారు. త్వరలోనే రెండు టన్నెల్స్ పూర్తిచేసుకుని జనవరి నాటికి నీళ్లు ఇస్తామన్నారు. టీడీపీ, జనసేన పార్టీతో పాటు ఇంకా ఎన్ని పార్టీలు కలిసినా తాము ఒంటరిగానే పోటీచేస్తామన్నారు. జనసేనకు కనీసం 15 చోట్ల అయినా అభ్యర్థులను నిలబెట్టేందుకు అవకాశం ఉందో లేదో పవన్ తెలుసుకోవాలన్నారు.

విజయవాడ రైల్వేస్టేషన్‌లో బ్యాటరీ వాహనాల సేవలు

రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్


బ్యాటరీ వాహనాలను ప్రారంభించిన డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వేస్టేషన్‌లో బ్యాటరీతో నడిచే రెండు వాహనాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. మంగళవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లోని తూర్పు ప్రవేశ ద్వారం వద్ద డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ లాంఛనంగా ప్రారంభించారు. డీఆర్ఎం మాట్లాడుతూ 24 గంటలు అందుబాటులో ఉండే ఈ బ్యాటరీ వాహనాల సేవలను ఉపయోగించుకుని ప్రయాణికులు, లగేజీలను అవసరమైన ప్లాట్‌ఫామ్‌లు, కోచ్‌ల వద్దకు సులభంగా తీసుకెళ్లవచ్చన్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, పిల్లలు, దివ్యాంగులు, ఆర్థోపెడిక్ రోగులకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సేవలు పొందేందుకు 9640694079 ఫోన్‌లో సంప్రదించి.. కేవలం రూ.50 చెల్లించడం ద్వారా బ్యాటరీ వాహనాల సేవలు పొందవచ్చన్నారు. సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, పీఆర్వో నుస్రత్ మండ్రుప్కర్, స్టేషన్ మేనేజర్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యువతలోనూ ఆర్థరైటిస్

- 30 ఏళ్లకే కీళ్ల నొప్పులతో అవస్థ
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ బాధితులే
- ఈ నెల 12న వరల్డ్ ఆర్థరైటిస్ డే



గుంటూరు (మెడికల్): ఆధునిక జీవన శైలి యువతను సైతం ఆర్థరైటిస్ బాధితులుగా మార్చేస్తోంది. 30 ఏళ్లకే కీళ్ల నొప్పుల బారినపడి నరకం అనుభవిస్తున్న వారు రోజురోజుకూ పెరుగుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిత్యం కంప్యూటర్ వద్ద కూర్చుని పని చేసే వ్యక్తులు, వ్యాయామం లేకుండా ఇంటికే పరిమితమయ్యే వ్యక్తులు 30 ఏళ్లు నిండకుండానే ఆర్థరైటిస్ బారిన పడుతున్నారు. ఆర్థరైటిస్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆర్థరైటిస్ అండ్ రుమాటిజం ఇంటర్నేషనల్ సంస్థ అక్టోబర్ 12న ప్రపంచ ఆర్థరైటిస్ డే నిర్వహిస్తోంది.

ఆర్థరైటిస్‌లో మూడు దశలు: మొదటి దశలో ఉదయానే నిద్ర లేవగానే మోకీళ్లు పట్టేసినట్టు ఉండటం, మెట్లు ఎక్కినా, దిగినా నొప్పులు రావటం, కింద కూర్చుని లేచేందుకు ఇబ్బంది పడటం, ఇండియన్ టాయిలెట్ వాడేందుకు ఇబ్బంది పడటం జరుగుతుంది. ఫిజియోథెరపీతో దీనిని నియంత్రణలో పెట్టవచ్చు. రెండో దశలో కూర్చుని లేవటానికి ఇబ్బంది పడటం, నడక ప్రారంభంలో 10 అడుగులు వేశాక నొప్పి ఉండి తర్వాత తగ్గటం, మెట్లు ఎక్కినా, దిగినా ఇబ్బందిగా ఉండటం సంప్రదాయ మరుగుదొడ్డి వాడలేక ఇబ్బంది పడటం జరుగుతుంది. వైద్యుల సలహాలు పాటిస్తూ కొన్ని రకాల మందులు, జాయింట్స్‌లో ఇంజెక్షన్లు చేయించుకుంటూ వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చు. మూడోదశలో కీళ్ల మార్పిడి ఆపరేషన్ (జాయింట్ రీప్లేస్‌మెంట్) తప్పనిసరిగా చేయించుకోవాల్సిందే.

నివారణ చర్యలు: బరువును నియంత్రణలో పెట్టుకోవాలి. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, విటమిన్–డి, కాల్షియం అధికంగా లభించే పాలు, పాల ఉత్పత్తులు, కోడిగుడ్లు, చేపలు, మొలకెత్తిన విత్తనాలు, రాగులు, జొన్నలు తీసుకుంటే ఎముకల్లో గుజ్జు పెరుగుతుంది. 50 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా ప్రతిరోజూ 30 నిమిషాలపాటు మోకాలి చుట్టూ ఉండే కండరాలకు ఫిజియోథెరపీ చేసుకోవాలి.

కొద్ది మందికే ఆపరేషన్ అవసరం



మోకీళ్ల బాధితులకు ఇప్పుడు అత్యాధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. కీళ్ల నొప్పులతో బాధపడే ప్రతి వంద మందిలో కేవలం 5 నుంచి 10 శాతం మందికి మాత్రమే ఆపరేషన్ అవసరమవుతుంది. మోకాళ్లలో అనవసరంగా ఇంజెక్షన్లు చేయించడం వల్ల జాయింట్ దెబ్బతింటుంది. కార్టిలైజ్ డామేజ్ జరగడం, జాయింట్‌లో ఉండే కుషన్ దెబ్బతింటుంది. ఫాస్ట్ ట్రాక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలతో ఆపరేషన్ చేసిన రోజే నడుస్తున్నారు. – **డాక్టర్ పాటిబండ్ల అనిల్‌బాబు, జీజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, గుంటూరు**

తెలంగాణ

రూ. 3.35 కోట్ల హవాలా నగదు పట్టివేత

సాక్షి హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో ఎటువంటి పత్రాల్లేకుండా తరలిస్తున్న నగదు భారీ స్థాయిలో పట్టుబడుతోంది. అదే సమయంలో హవాలా సొమ్ము గుట్టు సైతం రట్టవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో రూ. 3.35 కోట్ల హవాలా సొమ్ముతోపాటు రాష్ట్రమంతటా చేపట్టిన సోదాల్లో సుమారు రూ. కోటిన్నర నగదు, 700 గ్రాముల బంగారం, 4 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కమీషన్ ఆశతో తరలిస్తూ...

బంజారాహిల్స్ రోడ్ నంబర్–2లో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా ఓ కారులో తరలిస్తున్న రూ. 3.35 కోట్ల నగదు బయటపడింది. చందానగర్‌లో నివసిస్తున్న చిత్తూరు జిల్లావాసి చింపిరెడ్డి హనుమంతరెడ్డి (48), మాదాపూర్‌లో ఉంటున్న నెల్లూరు జిల్లా గూడూరువాసి బచ్చల ప్రభాకర్ (52), మదీనాగూడ సాయినగర్ కాలనీకి చెందిన చిత్తూరు జిల్లావాసి మండల శ్రీరాములురెడ్డి, మండల ఉదయ్ కుమార్‌రెడ్డి ఈ డబ్బు తరలిస్తూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అది హవాలా డబ్బుగా తేలింది. రూ. కోటికి రూ. 25 వేల చొప్పున కమిషన్‌పై ఈ డబ్బును గుర్తుతెలియని వ్యక్తులు అరోరా కాలనీలో అందజేయాలని తమకు ఇచ్చారని నిందితులు తెలిపారు. దీంతో ఈ డబ్బును సీజ్ చేసి ఎన్నికల కమిషన్‌కు అప్పగిస్తున్నట్లు హైదరాబాద్ పశ్చిమ మండలం డీసీపీ జోయల్ డెవిస్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ డబ్బు రవాణాలో రాజకీయ కోణం ఉందా అనే విషయమై ఆరా తీస్తున్నట్లు చెప్పారు.

ఆధారాల్లేకుండా తీసుకెళ్తూ...

- నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామ సమీపంలో వద్ద తనిఖీల్లో రూ. 50 లక్షలు పట్టుబడ్డాయి. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లికి చెందిన నాగునాయక్ ఆ నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో ఆ సొమ్మును నల్లగొండ ట్రెజరీకి పోలీసులు అప్పగించారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా జరిగిన తనిఖీల్లో పోలీసులు సుమారు రూ. 30 లక్షలు లభించాయి.

చిన్నారిపై వికృత చేష్టలు... వ్యక్తికి 25 ఏళ్ల జైలు

- పోక్సో కోర్టు న్యాయమూర్తి సంచలన తీర్పు
- శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా

విశాఖ లీగల్: ముక్కుపచ్చలారని చిన్నారిపై తన వికృత చేష్టలతో తీవ్రంగా గాయపరిచిన వ్యక్తికి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 25 సంవత్సరాల శిక్ష విధించింది. న్యాయమూర్తి జీ ఆనందిని ఈ సంచలన తీర్పు వెల్లడించారు. శిక్షతోపాటు రూ.15వేల జరిమానా చెల్లించాలని లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణ వివరాల ప్రకారం... నిందితుడు షేక్ ఖాసిం(45) గాజువాక దగ్గర రాజుల సత్యసాయి నగర్‌లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బాధితురాలు(9) నిందితుడి ఇంటి ముందు వరుసలో నివాసం ఉంటోంది. 2016 జులై ఐదో తేదీ ఉదయం చిన్నారి తల్లిదండ్రులు పని నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లారు. బాలిక ఒంటరిగా ఇంటి వద్దే ఉంది. ఇదే అదునుగా నిందితుడు ఉదయం 9 గంటల సమయంలో బాలికను తన ఇంటికి పిలిచి అత్యాచార యత్నం చేశాడు. భయంతో కేకలు వేసిన చిన్నారిని చుట్టుపక్కల వారు రక్షించారు. జరిగిన విషయాన్ని బాధితురాలు తన సోదరుడికి వివరించింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి దుర్గాదేవికి విషయం తెలిసిన వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు నిందితుడిపై కేసు నమోదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఐపీసీ 354 సెక్షన్ కింద ఐదు సంవత్సరాలు, పోక్సో చట్టం కింద 20 సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుతాన్ని జడ్జి ఆదేశించారు.

సీపీ అభినందన: నిందితుడికి శిక్ష పడడంలో ప్రతిభ కనబరిచిన స్పెషల్ పోక్సో కోర్టు పీపీ కరణం కృష్ణ, కేసు ట్రయిల్ జరపడంలో పురోగతి చూపించిన నగర పోలీస్ అధికారులను, కోర్టు కానిస్టేబుల్ ఆర్.పైడితల్లిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అభినందించారు.

కాశీ వెళ్లిన చిట్టి శివలింగాలు

- 6.50 లక్షల మట్టి లింగాలను తయారుచేసి పంపిన భక్తులు
- కార్తీక మాసంలో కోటి లింగాలకు కాశీ క్షేత్రంలో అభిషేకం


కాశీ పంపేందుకు సిద్ధమైన పార్థివ శివలింగాలు

మచిలీపట్నం టౌన్: కాశీ మహాక్షేత్రంలో ఏటా కార్తీక మాసంలో కోటి లింగాలకు అభిషేకం నిర్వహిస్తారు. ఇందుకోసం పార్థివ (మట్టి) లింగాలను వినియోగిస్తారు. వీటి తయారీలో మచిలీపట్నం, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు కీలకపాత్ర పోషించారు. 6.50 లక్షల శివ లింగాలను తయారు చేసి కాశీ మహాక్షేత్రానికి పంపించారు.

రెండు నెలలు శ్రమించి: శివలింగాల తయారీకి అవసరమైన 100 బస్తాల మట్టి పొడిని, 25 శివలింగాల డైలను హైదరాబాద్‌కు చెందిన శ్రీ విజయానందనాథ గురు సేవాసమితి నిర్వాహకుడు తంగిరాల రామచంద్రసాయి పంపించారు. మచిలీపట్నంతో పాటు పెడన, పామర్రు, నూజివీడు, విజయవాడ ప్రాంతాలకు చెందిన మహిళలు ముందుకొచ్చి శివలింగాల తయారీలో భాగస్వాములయ్యారు. మచిలీపట్నంలోని సామా కుమారి గృహంతో పాటు రామలింగేశ్వర స్వామి ఆలయం, ముత్యం గుడి, బచ్చుపేట శివాలయం, రేవతి థియేటర్ సెంటర్‌లోని గంగానమ్మ గుడి, రాజుపేట రామాలయం, గాంధీ బొమ్మ శివాలయం , ఎస్.ఎన్.గొల్లపాలెం శివాలయం, పరాసుపేట ఆంజనేయస్వామి గుడి, పాండురంగస్వామి, ఇంగ్లిష్‌పాలెం రామాలయానికి చెందిన మహిళా భక్తులు రెండు నెలలుగా శివలింగాల తయారీలో నిమగ్నమై లక్ష్యాన్ని పూర్తి చేశారు.

ఊరేగింపుతో శివలింగాల అప్పగింత: మహిళా భక్తులు తయారు చేసిన శివలింగాలను సోమవారం రాత్రి భారీ ఊరేగింపుతో విజయానంద గురు సేవాసమితి నిర్వాహకులకు అందజేశారు. సామా వారి వీధి నుంచి మేళతాళాలతో భారీ ఊరేగింపు నడుమ ప్రధాన రహదారిలో శివలింగాలను భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. మహిళా భక్తులతో పాటు వారణాసికి చెందిన సైకిల్‌బాబా పాల్గొన్నారు. అనంతరం వాటిని కాశీ తరలించారు.

శ్రీవారి సన్నిధిలో కేసీఆర్ సతీమణి



తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభారావు దర్శించుకున్నారు. అంతకు ముందు కేసీఆర్ సతీమణి తిరుమల శ్రీవారికి తలనీలాలను సమర్పించారు. అనంతరం ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఏపీ ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, కల్వకుంట్ల శోభారావు శ్రీకాళహస్తికి వెళ్లి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

కొత్తగా వెయ్యి ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలు

- 'దసరా' వేళ ప్రయాణికులకు 10 శాతం రాయితీ
- ఆర్టీసీ ఎండీ తిరుమలరావు


ఆర్టీసీ సేవలపై జిల్లా అధికారిని ఆరా తీస్తున్న ఆర్టీసీ ఎండీ తిరుమలరావు

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): ఈ ఏడాది కొత్తగా వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. మంగళవారం ఆయన నర్సీపట్నం ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విజయదశమి ఆర్టీసీకి ఆదాయం తెచ్చే పండుగ అన్నారు. దసరాకు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం 5,500 స్పెషల్ బస్సులను తిప్పుతున్నామన్నారు. గతంలో దసరా పర్వదినాల్లో 50 శాతం అదనపు చార్జీలు విధించటం జరిగేదని, రెండేళ్లుగా చార్జీల పెంపునకు స్వస్తి పలికామని చెప్పారు. రాను పోను ప్రయాణికులకు 10 శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. రాయితీలు కల్పించి ఓఆర్ పెంచి ఆదాయ పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్తగా 1500 డీజిల్ బస్సులు ఆర్డర్ చేశామన్నారు. డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ ఏడాది వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేశామని, మూడు నెలల్లో ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇకపై ప్రతి ఏటా వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు కొనేందుకు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అలాగే పీఎఫ్ బకాయిలు సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లించటం వల్ల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం రూ.3 వేలు నుంచి రూ.4 వేలు పెన్షన్ వచ్చే కేడర్‌లో ఉన్న వారికి ఇకపై రూ.25 వేలు పెన్షన్, రూ.5 నుంచి 6 వేలు ఉన్న వారికి రూ.30 వేలు నుంచి రూ.50 వేలు వరకు పెన్షన్ వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన డిపో ఆవరణలో మొక్కలు నాటారు. స్థానిక ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తిరుమలరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎండీ వెంట జిల్లా ప్రజారవాణా సంస్థ అధికారి పద్మావతి ఉన్నారు.

క్లుప్తంగా...

రెచ్చగొట్టే ప్రసంగాల కేసులో అరుంధతీ రాయ్‌పై విచారణ



న్యూఢిల్లీ: 2010 నాటి రెచ్చగొట్టే ప్రసంగాల కేసులో ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, కశ్మీర్‌కు చెందిన మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌పై విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మంగళవారం అనుమతిచ్చారు. భిన్న గ్రూపుల మధ్య శత్రుత్వం పెంచడం తదితర సెక్షన్ల కింద వారిపై కేసు నమోదైంది. సీఆర్పీసీ సెక్షన్ 196(1) ప్రకారం విద్వేష ప్రసంగాల వంటి కేసుల్లో విచారణకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఈ కేసులో నిందితులైన వేర్పాటువాద నేత సయ్యద్ అలీ షా గిలానీ, ఢిల్లీ వర్సిటీ లెక్చరర్ సయ్యద్ అబ్దుల్ రెహ్మాన్ జిలానీ ఇప్పటికే మరణించారు. భారత్ నుంచి కశ్మీర్ భారత్‌లో ఎప్పుడూ భాగంగా లేదని, దాని స్వాతంత్ర్యం గురించి అన్ని ప్రయత్నాలూ చేయాలని ఆ సమావేశంలో రాయ్ తదితరులు ప్రసంగాలు చేశారంటూ కశ్మీర్‌కు చెందిన సుశీల్ పండిట్ అనే సామాజిక కార్యకర్త ఫిర్యాదు చేశాడు. ఈ సమావేశంలో పౌర హక్కుల నేత వరవరరావు కూడా పాల్గొన్నారు.

హమాస్ తరహాలో దాడులు చేస్తాం

అట్టావా: సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) సంస్థ చీఫ్, ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్ను భారత్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశాడు. భారత్ పంజాబ్‌ను ఇంకా తన అధీనంలో ఉంచుకుంటే హమాస్ తరహాలో దాడులు చేస్తామని హెచ్చరిస్తూ ఒక వీడియో విడుదల చేశాడు. ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధం నుంచి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుణపాఠాలు నేర్చుకోవాలన్నాడు. భారత్ ప్రత్యేక ఖలిస్తాన్ ఏర్పాటు చేయకుండా పంజాబ్‌ను ఇంకా తన అధీనంలో ఉంచుకుంటే హమాస్ తరహాలో భారత్‌లో హింసను సృష్టిస్తామన్నాడు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ముష్కరుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్ర వాదులు హతమయ్యారు. నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు అల్షిపారాలో మంగళవారం వేకువజామున గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు లష్కరే తోయిబాకు చెందిన మొరఫత్ మక్బూల్, జజిమ్ అలియాస్ అబ్రార్ అనే ఉగ్రవాదులు మృతి చెందారు. వీరిలో అబ్రార్‌కు బ్యాంకులో గార్డుగా పనిచేసే కశ్మీరీ పండిట్ సంజయ్ శర్మ హత్యతో సంబంధమున్నట్లు పోలీసులు వెల్లడించారు.

డీఎంకే ఎంపీ బినామీ ఆస్తులు ఈడీ స్వాధీనం

న్యూఢిల్లీ: కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ మాజీ మంత్రి, డీఎంకే ఎంపీ ఎ.రాజాకు చెందినట్లుగా భావిస్తున్న 15 బినామీ స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం తెలిపింది. కోవై షెల్టర్స్ ప్రమోటర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న కంపెనీ ఎంపీకి చెందిన బినామీ ఆస్తిగా భావిస్తున్నామంది. రూ.55 కోట్ల విలువైన ఈ ఆస్తులను అక్రమార్జనగా భావిస్తున్నామని తెలిపింది.

రాజీనామా ఆమోదం కోసం డిప్యూటీ కలెక్టర్ పాదయాత్ర

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఒక మహిళా డిప్యూటీ కలెక్టర్ రాజీనామాను ఆమోదించాలంటూ ఏకంగా సీఎం నివాసానికి పాదయాత్ర చేసి అరెస్టయ్యారు! చత్తర్ పూర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్ గా చేస్తున్న నిషా బాంగ్రే వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతానని ప్రకటించారు. గత జూన్ లోనే రాజీనామా చేశారు. దాన్ని ఇప్పటిదాకా ఆమోదించనందుకు నిరసనగా సెప్టెంబర్ 28నా బేతుల్ జిల్లా నుంచి పాదయాత్ర మొదలు పెట్టారు. సోమవారం సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ నివాసానికి వెళ్తుండగా అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు. ఆమెను కోర్టులో హాజరు పరిచారు. బెయిల్ తీసుకోవడానికి నిరాకరించడంతో జైలుకు పంపారు.

ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఇంట్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీలోని అధికార పార్టీఆప్ నేతలు ఇప్పటికే పలు అభియోగాలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తాజాగా, మనీలాండరింగ్ తదితర కేసులున్న ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌పై మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దాడులు జరిపారు. ఎమ్మెల్యేకు చెందిన మూడు చోట్ల సోదాలు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ అసెంబ్లీలోని ఓఖ్లా నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అమానతుల్లా ఢిల్లీ వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఉన్నారు. ఆ సమయంలో సిబ్బంది నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఢిల్లీ ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దాని ఆధారంగా మనీ లాండరింగ్ కేసు పెట్టింది. ఢిల్లీ ఏసీబీ అధికారులు అమానతుల్లాను 2022 సెప్టెంబర్‌లో అరెస్ట్ చేయగా బెయిల్‌పై బయటకు వచ్చారు.

మహిళా పథకాల ప్రగతిపై మోదీ సమీక్ష

న్యూఢిల్లీ: మహిళల సాధికారత కోసం స్వాతంత్ర్య దిన ప్రసంగం సందర్భంగా ప్రకటించిన పలు పథకాల అమలులో పురోగతిని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సమీక్షించారు. జనరిక్ ఔషధాల విక్రయానికి స్టోర్లు తెరవడం వంటి పలు పథకాలను మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే



గాజా స్ట్రిప్‌లోని ఖాన్‌యూనిస్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన భవనాలు



గాజా స్ట్రిప్‌లోని ఖాన్ యూనిస్‌లో భవన శిథిలాలను తొలగిస్తున్న పాలస్తీనియన్లు



హమాస్ మిలిటెంట్లు 260 మందిని చంపేసిన మ్యూజిక్ ఫెస్టివల్ ప్రాంతమిదే

శవాల దిబ్బలు.. శిథిల దృశ్యాలు

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో 1,800 మందికి పైగా బలి

జెరూసలేం/లండన్/వాషింగ్టన్/గాజా సిటీ/న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ వైమానిక దాడులతో గాజా సిటీ దద్దరిల్లిపోతోంది. వందలాది భవనాలు ధ్వంసమవుతున్నాయి. శిథిలాలు దర్శనమిస్తున్నాయి. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం నాలుగో రోజుకు చేరింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు గర్జించాయి. గాజాపై బాంబుల వర్షం కురిపించాయి. ఇరువైపులా ఇప్పటికే దాదాపు 1,800 మంది మరణించారు. ఇజ్రాయెల్‌లో 1,000 మందికిపైగా, గాజా, వెస్ట్‌బ్యాంకులో 800 మంది మరణించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో శవాల దిబ్బలు కనిపించాయన్నారు. దాడులు, ప్రతిదాడుల్లో వేలాది మంది క్షతగాత్రులుగా మారారు. అంతర్జాతీయ సమాజం నుంచి ఇజ్రాయెల్‌కు మద్దతు వెల్లువెత్తుతోంది. హమాస్ మిలిటెంట్ల ఘాతుకాలను ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. శత్రువులపై తమ ఎదురుదాడి కొన్ని తరాలపాటు ప్రతిధ్వనించేలా ఉంటుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ స్పష్టం చేశారు. ఆయన తాజాగా జాతినుద్దేశించి ప్రసంగించారు. తమ లక్ష్యం కేవలం హమాస్ మాత్రమేనని అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ గనుక తమపై వైమానిక దాడులు ఇలాగే కొనసాగిస్తే.. ఇప్పటికే తమ అధీనంలో ఉన్న బందీలను చంపేస్తామని హమాస్ హెచ్చరించడం ఆందోళన కలిగిస్తోంది. దాడులు వెంటనే ఆపాలని హమాస్ డిమాండ్ చేస్తోంది.

ఇక భూభాగం నుంచి యుద్ధం!

దేశ సరిహద్దులపై పూర్తి పట్టు సాధించామని, తీవ్రవాదులు చొరబడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. తమ దేశంలో వందలాదిగా హమాస్ మిలిటెంట్ల మృతదేహాలను గుర్తించామని తెలియజేసింది. తమ దాడుల్లో వారు మృతిచెందినట్లు పేర్కొంది. హమాస్‌తోపాటు ఇతర మిలిటెంట్ గ్రూప్‌లు తమ దేశం నుంచి 150కిపైగా జనాన్ని బందీలుగా తీసుకెళ్లాయని ఇజ్రాయెల్ తెలిపింది. వీరిలో సైనికులు, సాధారణ పౌరులు ఉన్నారని వివరించింది. హమాస్ అధీనంలో ఉన్న తమ వారిని వెంటనే విడిపించాలని బందీల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. బందీలను క్షేమంగా వెనక్కి తీసుకొస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఎలీ కోహెన్ చెప్పారు. బందీలకు ఏమైనా జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హమాస్‌ను హెచ్చరించారు. గాజాపై భూభాగం గుండా దాడి చేయాలని ఇజ్రాయెల్ సైన్యం నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకోసం 3 లక్షల రిజర్వ్ సైనికులను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి దాడి గాజాపై చివరిసారిగా 2014లో జరిగింది. ఇదిలా ఉండగా, శనివారం కారులో పారిపోతున్న ఇద్దరు హమాస్ తీవ్రవాదులను ఇజ్రాయెల్ బోర్డర్ పోలీసులు బైక్‌లపై వెంటాడి కాల్చిచంపిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

ఇజ్రాయెల్‌కు భారతీయుల అండదండలు: మోదీ

ఉగ్రవాదాన్ని భారత్ బలంగా, నిస్సందేహంగా వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిందేనని అన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ మంగళవారం ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. తమ దేశంపై హమాస్ మిలిటెంట్ల దాడులు, తదనంతర పరిస్థితుల గురించి వివరించారు. అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రస్తుత విపత్కర సమయంలో భారతీయులు ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తున్నారని వెల్లడించారు. తమ మద్దతు ఇజ్రాయెల్‌కు ఉంటుందని చెప్పారు. తనకు ఫోన్ చేసి, తాజా పరిస్థితిని వివరించిన నెతన్యాహూకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

మద్దతు ప్రకటించిన యూకే ప్రధాని రిషి సునాక్

ఇజ్రాయెల్‌కు తమ మద్దతు కచ్చితంగా ఉంటుందని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్ చెప్పారు. హమాస్ రాక్షసకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. యూకేలోని యూదుల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిషి సునాక్ మంగళవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీతో మాట్లాడారు. ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణపై చర్చించారు. వారితో కలిసి ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. హమాస్ ఉగ్రవాద చర్యలను సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తనను తాను రక్షించుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని, ఆ విషయంలో ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ విమానాల రాకపోకలు బంద్

ఇజ్రాయెల్‌లో యుద్ధ వాతావరణం నెలకొంది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో చల్లారే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఇజ్రాయెల్ నుంచి తమ విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పలు అంతర్జాతీయ విమానయాన సంస్థలు ప్రకటించాయి. టెల్ అవివ్‌లోని బెన్ గురియన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మంగళవారం పలు విమానాలు నిలిచిపోయాయి. కొన్ని ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. అమెరికన్ ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్, డెల్టా ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఫ్రాన్స్, కాథీ పసిఫిక్ ఎయిర్‌వేస్, వర్జిన్ అట్లాంటిక్ వంటి సంస్థలు ఇజ్రాయెల్‌కు విమానాలు నడపడం లేదని వెల్లడించాయి. యూరప్, ఆసియాలోని వివిధ విమానయాన సంస్థలు కూడా ఇదే బాటలో నడుస్తున్నాయి.

స్వచ్ఛంద సంస్థల సాయం

గాజాలో యుద్ధంలో చిక్కుకున్న సామాన్య ప్రజలను ఆదుకోవడానికి అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. ఇజ్రాయెల్ అష్ట దిగ్బంధనం చేయడంతో గాజాకు నీరు, ఔషధాలు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఆగిపోయాయి. జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈజిప్షియన్ రెడ్ క్రాస్ సంస్థ 2 టన్నులకు పైగా ఔషధాలను గాజాకు పంపించింది. ఆహారం, ఇతర నిత్యావసరాలు కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గాజాలోని ఆసుపత్రుల్లో రోగులకు ఔషధాలు అందిస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. బాధితుల కోసం నిధులు సేకరిస్తున్నామని పేర్కొంది.



ఇజ్రాయెల్ సైన్యం దాడులతో గాజా సిటీలో చెలరేగిన మంటలు



గాజా సిటీలో శిథిల భవనాల దారుల్లో పాలస్తీనా పౌరులు

పాలస్తీనియన్లు చెల్లాచెదురు

హమాస్ మిలిటెంట్ల పాలనలో ఉన్న గాజా స్ట్రిప్ జనాభా 20.3 లక్షలు. వీరంతా పాలస్తీనా జాతీయులు. ఇజ్రాయెల్‌పై హమాస్ ముష్కరుల దాడి తర్వాత వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. హమాస్‌పై ప్రతీకారంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్ సైన్యం గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడుతోంది. వైమానిక దాడులు కొనసాగిస్తోంది. రాకెట్లు, క్షిపణులు ప్రయోగిస్తోంది. దీంతో పాలస్తీనావాసులు ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. వారంతా చెల్లాచెదురవుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 1,80,000 మందికిపైగా పాలస్తీనియన్లు ఐక్యరాజ్యసమితి శిబిరాలకు చేరుకున్నారు. అక్కడే తలదాచుకుంటున్నారు. బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. హమాస్ దుశ్చర్య తమకు ప్రాణసంకటంగా మారిందని గాజా స్ట్రిప్ పాలస్తీనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల కోసం గాజా సిటీలోని పాఠశాలల్లో పదుల సంఖ్యలో తాత్కాలిక శిబిరాలను ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసింది. మరోవైపు నగరంలో విద్యుత్, నీటి సరఫరా నిలిచిపోవడంతో జనం కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఆహారం దొరకడం లేదు. పిల్లల పరిస్థితి చూసి కన్నీళ్లు ఆగడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఐక్యరాజ్యసమితి శిబిరాలు కూడా ధ్వంసమవుతున్నాయి. ఆదివారం, సోమవారం జరిగిన దాడుల్లో ఆరు శిబిరాలు దెబ్బతిన్నాయి. ఇక్కడ ఎంతమంది చనిపోయారన్నది తెలియరాలేదు. పొరుగుదేశం ఈజిప్టుకు వలస వెళ్లేందుకు కొందరు బాధితులు ప్రయత్నిస్తున్నారు. ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకున్నవారికే ఈజిప్టు నుంచి అనుమతి లభిస్తోంది. మరోవైపు తమ లక్ష్యం హమాస్ మిలిటెంట్లు మాత్రమేనని, సామాన్య ప్రజలు కాదని ఇజ్రాయెల్ చెబుతోంది. ప్రజలకు నష్టం వాటిల్లకుండా ఆపరేషన్ కొనసాగిస్తున్నామని అంటోంది.

ఏడుగురు ముష్కరులను చంపి.. చిన్నారులను కాపాడుకుని..

సైనిక దంపతుల వీర మరణం

ఇజ్రాయెలీల కన్నీటి సెల్యూట్



జెరూసలేం: వాళ్లిద్దరూ చూడచక్కని జంట. పేర్లు అడర్ బెర్డిచివిస్కీ, ఇటాయ్ బెర్డిచివిస్కీ. ఇజ్రాయెల్ సైన్యంలో కమాండర్లు. అది అక్టోబర్ 7. శనివారం. ఇజ్రాయెల్ ఎన్నటికీ మర్చిపోలేని దుర్దినం. తెలతెలవారుతూనే సరిహద్దులు దాటి చొరబడి సమీప ప్రాంతాలన్నింటిపైనా హమాస్ మెరుపుదాడికి దిగిన వేళ. ముష్కర మూకలు సామూహిక జన హననానికి, కనీ వినీ మారణహోమానికి పాల్పడుతున్నాయి. ఒక్కో ఇంటినే వెదుకుతూ, చిన్నా పెద్దా తేడా లేకుండా పాశవికంగా హతమారుస్తూ సాగుతున్నాయి. ఆ సమయంలో అడర్, ఇటాయ్ తమ ప్రేమకు ప్రతిరూపాలైన 10 నెలల కవలలతో ఇంట్లో సరదాగా గడుపుతున్నారు. రాకెట్ల కలకలం వినగానే కీడు శంకించినా, హమాస్ అడపాదడపా చేసే దాడులుగానే తొలుత భావించారు. కానీ అవి అంతకంతకూ పెరిగిపోతుండటం, పరిసరాలన్నీ విపరీతమైన కాల్పుల మోతతో దద్దరిల్లిపోతుండటంతో పరిస్థితి తీవ్రత అర్థం కావడానికి ఎంతోసేపు పట్టలేదు. అంతే! వారిలోని సైనికులు మేల్కొన్నారు. ఇంట్లో దాచిన ఆయుధాలు అందుకుని రంగంలోకి దిగారు. అప్పటికే మిలిటెంట్లు వాళ్ల ఇంట్లోకి చొరబడటంతో ముందుగా పిల్లలను వారి బారిన పడకుండా చూడాలని నిర్ణయించుకున్నారు. ఇజ్రాయెలీ చట్టాల ప్రకారం కొత్త ఇళ్లలో తప్పనిసరిగా నిర్మించాల్సిన సేఫ్ స్ట్రాంగ్ రూమ్ మమ్మద్‌లో వారిని సురక్షితంగా దాచారు. మిలిటెంట్లు అటువైపు రాకుండా తెలివిగా వారి దృష్టి మళ్లిస్తూ వచ్చారు. ఇద్దరూ చెరోవైపు విడిపోయి గందరగోళపరిచారు. వీలు చిక్కినప్పుడల్లా ఒక్కో మిలిటెంట్‌నూ మట్టుబెడుతూ వచ్చారు. అలా ఒకరిద్దరిని కాదు, ఏకంగా ఏడుగురిని నేలకూల్చారు. చివరికి హమాస్ ముష్కరుల సామూహిక దాడిలో ఇద్దరూ నేలకొరిగారు! అడర్, ఇటాయ్ దంపతుల ఈ వీరోచిత విషాద గాథను ఉక్రెయిన్‌లో ఇజ్రాయెల్ దౌత్యాధికారి వ్యష్నికోవ్ ఫేస్‌బుక్‌లో పంచుకున్నారు. దీన్ని చదివిన ఇజ్రాయెలీలంతా బరువెక్కిన గుండెలతో ఆ వీర దంపతులకు సెల్యూట్ చేస్తున్నారు.

కొసమెరుపు: ఇంతకూ చిన్నారుల సంగతి ఏమైందంటారా? సుఖాంతమే అయింది. దారిపొడవునా హమాస్ మిలిటెంట్లను ఎదుర్కొంటూ, వీలైనంత మందిని మట్టుబెడుతూ వాళ్ల మామ, తాతయ్య వచ్చి స్ట్రాంగ్ రూమ్ తెరిచి చూసేదాకా 13 గంటలపాటు అందులోనే ఉండిపోయారు. ఇప్పుడు పునరావాస కేంద్రంలో సేదదీరుతున్నారు.

భారత్‌కు దౌత్య పరీక్షే

- ఇజ్రాయెల్, పాలస్తీనా యుద్ధంపై రెండుగా అంతర్జాతీయ సమాజం
- ఇజ్రాయెల్ పట్ల సానుభూతి ప్రకటించిన మోదీ
- ప్రస్తుతానికి సమదూరమే మేలంటున్న నిపుణులు
- 'రష్యా-ఉక్రెయిన్' తరహా వైఖరే సబబని వ్యాఖ్యలు

పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్‌తో ఇజ్రాయెల్ పోరు అంతర్జాతీయ సమాజాన్ని క్రమంగా రెండుగా విడదీస్తోంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ వంటివి ఇజ్రాయెల్‌కు, ఇరాన్ పాలస్తీనాకు పూర్తిగా మద్దతుగా నిలుస్తున్నాయి. చైనా కాస్త ఇజ్రాయెల్ వైపు, ఇస్లామిక్ దేశాలు పాలస్తీనాకేసి మొగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కల్లోలం భారత్‌కు దౌత్యపరంగా అగ్నిపరీక్షే కానుంది. పశ్చిమాసియాతో మనకున్న సంక్లిష్ట రాజకీయ, ఆర్థిక సంబంధాలే ఇందుకు ప్రధాన కారణం. మధ్యప్రాచ్యంలో మరింత క్రియాశీల పాత్ర పోషించే దిశగా రంగం సిద్ధం చేసుకుంటున్న పరిస్థితుల్లో వచ్చి పడ్డ ఈ పోరు మన దౌత్య చాణక్యానికి విషమ పరీక్షే కానుంది.

అధికారికంగా మౌనమే

ఈ కల్లోలంపై విదేశాంగ శాఖ ఇంకా అధికారికంగా ఏమీ స్పందించకపోయినా, 'దాడులను చూసి ఎంతగానో చలించిపోయా. కష్టకాలంలో ఇజ్రాయెల్‌కు అండగా ఉంటా' మని శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తద్వారా ఇజ్రాయెల్‌కే తమ మద్దతని పరోక్షంగా చెప్పినట్టే అయింది. కాకపోతే ఈ విషయంలో ఇజ్రాయెల్‌కు బాహాటంగా పూర్తిస్థాయి మద్దతివ్వడం మన ప్రయోజనాల రీత్యా శ్రేయస్కరం కాదనే వాదనలే వినిపిస్తున్నాయి. ఇందుకు పలు కారణాలున్నాయి. అరబ్ లీగ్‌లో కీలకమూ, అతి పెద్దదీ అయిన సౌదీ అరేబియాతో భారత సంబంధాలు ప్రస్తుతం దూకుడు మీదున్నాయి. ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఆ వెంటనే ఇజ్రాయెల్ ప్రధాని భారత పర్యటనకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు మద్దతిస్తే పాలస్తీనా అనుకూల సౌదీతో మన సంబంధాలను అది ప్రభావితం చేయగల దంటున్నారు. అంతేగాక మధ్యప్రాచ్యంలో చైనాకు పూర్తిగా చెక్ పెట్టి అక్కడి రాజకీయ, వ్యూహాత్మక అంశాల్లో నిర్ణాయక పాత్ర పోషించేందుకు కొన్నేళ్లుగా భారత్ ప్రయత్నిస్తూ వస్తోంది. పైగా ఇటీవలే మరో కీలక పరిణామమూ జరిగింది. భారత్-మధ్యప్రాచ్య-యూరప్ ఆర్థిక కారిడార్ ఏర్పాటుకు ఇటీవల ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్రంలో నిర్ణయం జరిగింది. చైనా దూకుడుగా వెళ్తున్న బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుకు చెక్ పెట్టడం వంటివి కూడా దీని వెనక భారత్ లక్ష్యాలు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ మాత్రం తప్పటడుగు పడ్డా అరబ్ దేశాలతో ఇన్నేళ్లుగా నిర్మించుకుంటూ వస్తున్న సత్సంబంధాలకు విఘాతం కలిగే ఆస్కారముంది.

ఇప్పటిదాకా ఇలా..

స్వాతంత్ర్యానంతరం నుంచీ ఇజ్రాయెల్, పాలస్తీనా విషయంలో భారత వైఖరి కాస్త సంక్లిష్టంగానే ఉంటూ వచ్చింది. ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా 1950లో అన్యమనస్కంగానే భారత్ గుర్తించింది. అనంతరం కూడా చాలా ఏళ్లపాటు ఆ దేశంతో దూరమే పాటిస్తూ వచ్చింది. అదే సమయంలో పాలస్తీనా విముక్తి సంస్థ నేత యాసర్ అరాఫత్ పట్ల సానుభూతి ప్రదర్శించింది. ఇందిరా, రాజీవ్‌గాంధీ ప్రభుత్వాలు కూడా దీన్నే కొనసాగించాయి. కానీ ఇండో చైనా యుద్ధ సమయంలో అరబ్ దేశాలు భారత్‌కు మద్దతివ్వకుండా తటస్థంగా వ్యవహరించడం, అనంతరం పాక్‌తో జరిగిన యుద్ధాల్లో ఆ దేశానికే దన్నుగా నిలవడంతో మన పాలస్తీనా అనుకూల విధానంపై స్వదేశంలోనే పెద్దపెట్టున విమర్శలొచ్చాయి. అనంతరం కువైట్‌ను ఇరాక్ ఆక్రమించడం, అలీన విధానం తెరమరుగు కావడం వంటి పరిణామాల నేపథ్యంలో భారత్ వైఖరి బాగా మారింది. ఇజ్రాయెల్‌తో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలను ఏర్పాటు చేసుకుంది. వాజ్‌పేయి హయాంలో ఈ బంధం సుదృఢమైంది. కార్గిల్ యుద్ధ సమయంలో అత్యవసర ఆయుధ సరఫరాల ద్వారా ఇజ్రాయెల్ మనకు సమ్మదగ్గ మిత్రునిగా మారిపోయింది. అయినా 2014 దాకా కూడా అంతర్జాతీయ వేదికలపై పాలస్తీనాకు మన మద్దతు కొనసాగుతూనే వచ్చింది. పాలస్తీనా పోరుకు పూర్తిగా మద్దతిస్తున్నట్టు నాటి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటించారు. అదే సమయంలో ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలను కొనసాగిస్తామంటూ ముక్తాయించారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

ఆచితూచి అడుగేయాలి

ప్రస్తుత కల్లోలం నేపథ్యంలో ఇజ్రాయెల్, పాలస్తీనాల్లో ఏదో ఒకదానికి భారత్ మద్దతు ప్రకటించక తప్పదన్న అభిప్రాయాలు గట్టిగా విన్పిస్తున్నాయి. కానీ మధ్యప్రాచ్యంతో మన వర్తక, వ్యూహాత్మక బంధాలు, అవసరాల రీత్యా అదంత శ్రేయస్కరం కాదని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ ఎవరి పక్షమూ వహించని విషయం తెలిసిందే. అమెరికా తదితర దేశాలు ఎంతగా ఒత్తిడి తెచ్చినా ఉక్రెయిన్‌కు మద్దతిచ్చి వ్యూహాత్మకంగా మనకు అత్యంత కీలకమైన రష్యాను దూరం చేసుకునేందుకు ససేమిరా అంది. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని వాటికి సూచిస్తూ వస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి చమురు దిగుమతులు తదితరాలను నిర్నిరోధంగా కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్, పాలస్తీనా విషయంలోనూ అదే వైఖరిని కొనసాగించడం ప్రస్తుతానికి మేలన్నది పరిశీలకుల భావన. "మధ్యప్రాచ్యంతో మన సంక్లిష్ట బంధాల దృష్ట్యా కూడా ఇదే మేలు. ఎందుకంటే సౌదీ అరేబియా మనకు నాలుగో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. మరోవైపు ఇజ్రాయెల్‌కు మనం అతి పెద్ద ఆయుధ వినియోగదారులం" అని వారు గుర్తు చేస్తున్నారు.

బర్త్‌డే బెలూన్.. చిన్నారి ప్రాణం తీసింది!



టెన్నెస్సీ: పుట్టిన రోజు వేడుకలో అందంగా అలంకరించిన బెలూనే చివరికి ఆ చిన్నారి ఉసురుతీసింది. అందుకే, ప్రమాదకరమైన వాయువులతో నింపిన బెలూన్లతో ఆటలొద్దు..జాగ్రత్త..! అంటూ చిన్నారి తల్లి హెచ్చరిస్తున్నారు. అమెరికాలోని టెన్నెస్సీలో ఇటీవల చోటు చేసుకున్న విషాద ఘటన ఇది. అలెగ్జాండ్రా కెల్లీ అనే ఏడేళ్ల చిన్నారి సెప్టెంబర్ 24వ తేదీన ఏడో పుట్టిన రోజు జరుపుకుంది. బర్త్‌డే వేడుకలో ఆమె తల్లి చన్నా కెల్లీ ఏడంకెతో కూడిన పెద్ద బెలూన్‌తోపాటు మరో 10 రబ్బర్ బెలూన్లను అలంకరించారు. అక్టోబర్ ఒకటో తేదీన ఆదివారం నాడు బెలూన్లుంచిన గదిలోకి వెళ్లి ఆడుకుంటోంది. కొద్దిసేపటి తర్వాత వెళ్లి చూడగా గదిలో అలెగ్జాండ్రా పెద్ద బెలూన్‌పై ఉలుకూపలుకూ లేకుండా పడిపోయి ఉంది. వెంటనే కృత్రిమ శ్వాస(సీపీఆర్) కల్పించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బెలూన్‌లోని ప్రమాదకరమైన హీలియం వాయువును పీల్చడం వల్లే ఆమె శ్వాస ఆగిపోయి ఉంటుందని భావిస్తున్నారు. చిన్నారి తల్లి చన్నా కెల్లీ ఈ విషాద వార్తను సోషల్‌మీడియాలో పంచుకోవడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది. బెలూన్ల వాడకం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులను ఆమె హెచ్చరించారు.

రహస్య పత్రాల విషయంలో బైడెన్ 'విచారణ'

వాషింగ్టన్: అమెరికాలో అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. పలు రహస్య పత్రాల ఉదంతానికి సంబంధించి అధ్యక్షుడు బైడెన్‌ను స్పెషల్ కౌన్సెల్ రాబర్ట్ హర్ 'ఇంటర్వ్యూ'చేశారు. వైట్‌హౌస్‌లో ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగినట్టు అధికారులు వెల్లడించారు. అయితే ఇది ఆయన అంగీకరించి పాల్గొంటున్న స్వచ్ఛంద ఇంటర్వ్యూయేనంటూ ముక్తాయించారు. బైడెన్ ఉపాధ్యక్షునిగా ఉండగా డెలావర్‌లోని ఆయన నివాసంలో, వాషింగ్టన్‌లోని కార్యాలయంలో పలు రహస్య పత్రాలు దొరికినట్టు వైట్‌హౌస్ గత జనవరిలో ప్రకటించడం తెలిసిందే.

చైనా కాన్సులేట్‌లోకి దూసుకెళ్లిన కారు

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న చైనా కాన్సులేట్ కార్యాలయంలోకి ఈనెల 9వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి కారుతో దూసుకొచ్చాడు. పోలీసు అధికారి జరిపిన కాల్పుల్లో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు అధికారులు తెలిపారు. కారు ఢీకొనడంతో కాన్సులేట్ వీసా ఆఫీస్ లాబీకి నష్టం వాటిల్లిందని వివరించారు. కారులో ఇతరులెవరూ లేరని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదని చెప్పారు. ఈ ఘటనను చైనా విదేశాంగ శాఖ ఖండించింది.

13 వరకు సంజయ్ సింగ్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్‌కు సంబంధించి ఆప్ నేత సంజయ్ సింగ్ ఈడీ కస్టడీని ప్రత్యేక కోర్టు అక్టోబర్ 13 వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ ఎంకె నాగపాల్ ఈ ఆదేశాలను జారీ చేశారు.



దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లోని టాల్‌స్టాయ్ క్షేత్రంలో 8 అడుగుల మహాత్మా గాంధీ మట్టి విగ్రహాన్ని భారత హై కమిషనర్ ప్రభాత్ ఆవిష్కరించారు. 20వ శతాబ్దపు తొలినాళ్లలో గాంధీ లాయర్‌గా చేసే రోజుల్లో ఈ క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

బుధవారం ౹ 11 ౹ అక్టోబర్ ౹ 2023



మాకు భోజనమేదీ?

బడిలో మధ్యాహ్న భోజనం వండిపెట్టే మాకు అర్ధాకలేనా? అని సిబ్బంది నినదించారు. జీతాల పెంపు, ఇతర డిమాండ్ల సాధనకు బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో భోజన సిబ్బంది నిరసన

అర్ధరాత్రి చినుకు రభస



వర్షంతో బెంగళూరు శివానంద సర్కిల్ ఫ్లై ఓవర్ వద్ద ట్రాఫిక్ జామ్



మంగళవారం ఉదయం బెళ్లందూరులో మడుగులా మారిన ఓ రోడ్డులో అవస్థలు

- ఉద్యాననగరిలో కుండపోత
- చెరువులైన రోడ్లు, అండర్‌పాస్‌లు
- వాహనదారులకు అవస్థలు
- పలు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు

బనశంకరి: కొన్నిరోజులుగా గట్టి వానలు కరువైన ఉద్యాననగరి సోమవారం అర్ధరాత్రి వరకు భారీ వర్షంతో తడిసి ముద్దయింది. అనేక రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, ట్రాఫిక్ స్తంభించి, జనజీవనం అస్తవ్యస్తమైంది. అనేకచోట్ల పల్లపు ప్రాంతాలు చెరువుల్లా మారిపోయాయి. మరో మూడురోజుల పాటు బెంగళూరుతో పాటు అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ఎల్లో అలర్ట్‌ను ప్రకటించడంతో నగరవాసుల్లో దిగులు నెలకొంది.

సాయంత్రం నుంచి మొదలు

- సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షం కొన్ని గంటలపాటు ఎడతెరిపి లేకుండా పడటంతో రాజ కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లలో నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.
- బెళ్లందూరు కరియమ్మన అగ్రహార పూర్తిగా జలమయమైంది. 50 మీటర్ల రోడ్డులో రాజకాలువ పొంగి అగ్రహారలో ఇళ్లలోకి చొరబడడంతో వందలాది కుటుంబాలు జాగారం చేశాయి. నీటిని తోడేయడానికి పాట్లు పడ్డారు. ఇళ్లలోని విలువైన వస్తువులు తడిసిపోయాయి.
- ఈ ప్రాంతంలో 50 మందికి పైగా వాహనదారులు నీటిలో చిక్కుకున్నారు. స్థానికులు, ఫైర్ సిబ్బంది చేరుకుని వారిని కాపాడారు.
- పీణ్యాలో 8వ మైల్ సిగ్నల్‌లో ఒకరు వర్షపు నీటిలో చిక్కుకున్న దృశ్యాలు కనబడ్డాయి. అతడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. నగరవ్యాప్తంగా పలుచోట్ల ఇళ్లు, అండర్‌పాసులు జలమయం అయ్యాయి. లీ మెరిడియన్ అండర్‌పాస్ నిండిపోవడంతో వాహనదారులు అటు ఇటు వెళ్లలేక చుట్టుపక్కల తీవ్ర ట్రాఫిక్ ఏర్పడింది.
- మంగళవారం ఉదయం కూడా వాననీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



3.5 సెంటీమీటర్ల వర్షపాతం

బెంగళూరులో సరాసరి 3.5 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణశాఖ తెలిపింది. కెంగేరిలో 8.3 సె.మీ., అంజనాపురలో 7.6 సె.మీ., ఆర్‌ఆర్.నగర 6.8 సె.మీ., హెచ్‌ఏఎల్ 6.4 సె.మీ., నాయండహళ్లి 6.3, కొట్టిగేపాళ్య 6.8, బీలేకహళ్లి 5.9, పీణ్యాలో 5.8 సె.మీ. చొప్పున వర్షం కురిసింది. అదృష్టవశాత్తు ఎక్కడా పెద్ద ప్రమాదాలు జరగలేదు.



వాననీటిలో బస్సు ప్రయాణం



ఆర్ ఆర్ నగరలో వాననీటి ప్రవాహం



బెళ్లందూరులో ఇంట్లోకి చేరిన వాననీటి తొలగింపు



కరియమ్మన అగ్రహారలో మునిగిన రోడ్డు

న్యూస్‌రీల్

టపాసుల వాడకంపై ఆంక్షలు: సీఎం



శివాజీనగర: అత్తిబెలె టపాకాయల గోదాము విస్ఫోటం దుర్ఘటనతో మేల్కొన్న ప్రభుత్వం.. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు, పండుగ ఊరేగింపులు, పెళ్లిళ్లలో టపాసులను పేల్చడాన్ని నిషేధించనుంది. సీఎం సిద్దరామయ్య, అధికారులతో టపాసుల విషయమై భేటీ జరిపారు. సీఎం మాట్లాడుతూ పై వేడుకల్లో బాణసంచా పేల్చడాన్ని నిషేధించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు దీపావళిలో హరిత టపాసులే పేల్చాలి, ఇందులో సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలన్నారు. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలను తీసుకుంటామని చెప్పారు.

రూ.27 కోట్ల సొత్తు సొంతదారులకు అప్పగింత

శివాజీనగర: సైబర్ నేరాలు ఏటా భారీగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 12,615 ఆన్‌లైన్ సైబర్ కేసులు నమోదయ్యాయి. అధికారులు విచారణ చేపట్టి దాదాపు రూ. 470 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్లు దోచేసినట్లు కనుగొన్నారు. నిందితులపై నిఘా ఉంచి వారి ఖాతాల్లో ఉన్న రూ. 201 కోట్లను స్వాధీనం చేసుకుని రూ. 27.68 కోట్లు సొంతదారులకు అందజేశారు. ఇందులో రూ. 201 కోట్లను వివిధ బ్యాంకుల్లో ఫ్రీజ్ చేశారు. ఆన్‌లైన్ ఉద్యోగ వంచన 3,346 కేసులు, డెబిట్-క్రెడిట్ కార్డు వంచన 3,102, బిట్ కాయిన్ 195 కేసులు నమోదయ్యాయి. కార్డు స్కిమ్మింగ్, డేటా దొంగలింపు, ఎగుమతి అక్రమాలు, ఈ మెయిల్, లాటరీ, ఆన్‌లైన్ గేమింగ్, సిమ్ క్లోనింగ్ కేసులను కనిపెట్టి సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

చాముండి కొండపై నిరసనలకు నో

మైసూరు: మైసూరు నగరంలో మహిష దసరా నిర్వహణను వ్యతిరేకిస్తూ బీజేపీ చేపట్టిన చాముండి బెట్ట చలో కార్యక్రమానికి అనుమతి లేదని పోలీస్ కమిషనర్ రమేష్ బానోతు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నగరంలోని అశోక్‌పురంలో మహిష దసరా నిర్వహించడానికి టౌన్‌హాల్ వరకు ఊరేగింపు చేయడానికి మహిష దసరా నిర్వహణ సమితి దరఖాస్తు చేసిందని, దాన్ని వ్యతిరేకిస్తూ ఐదు వేల మందితో బీజేపీ చేపట్టి చాముండి కొండకు చలో కార్యక్రమానికి అనుమతి లేదని చెప్పారు. మైసూరు దసరా ప్రారంభోత్సవ నేపథ్యంలో వీవీఐపీలు పాల్గొంటారని, ఆ సమయంలో ఎటువంటి ఆందోళనలు జరగకుండా బీజేపీ నేతలు చేపట్టిన కార్యక్రమానికి అనుమతి నిరాకరించినట్లు చెప్పారు.

టెర్మినల్-2లోకి మళ్లీ వర్షపు నీరు

- ఫిర్యాదుల వెల్లువ

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన టెర్మినల్-2లో వర్షం నీరు చేరుతోంది. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి 2వ టెర్మినల్‌లో వర్షం నీరు భారీగా చేరింది. ఇందుకు సంబంధించి ప్రయాణికులు ఫిర్యాదుల వెల్లువెత్తారు. 'ఎక్స్'(ట్విట్టర్)లో ప్రయాణికులు టెర్మినల్ 2లో భోజనం, ఏసీ, వీల్‌చేర్ ఇలా అనేక విషయాలపై ఫిర్యాదులు చేసారు. అయితే ప్రతి విషయంలోనూ డబ్బులు మాత్రం దోచుకుంటున్నారని, సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. టెర్మినల్ 2 పైకప్పులో వెదురు పరికరాలు సరిగా అమర్చకపోవడం వల్ల వర్షం నీరు ధారగా కారుతోందన్నారు.

బిర్యానీ హోటళ్లపై జీఎస్టీ అధికారుల దాడులు



కృష్ణరాజపురం: బెంగళూరు నగరానికి అతి సమీపంలో ఉన్న హోసకోటెలో బిరియాని హోటళ్లపై జీఎస్టీ అధికారులు దాడులు చేశారు. బెంగళూరుకు 30 కి.మీ దూరంలో ఉన్న హోసకోటెలో కొన్ని బిర్యానీ హోటళ్ల నిర్వాహకులు జీఎస్టీ చెల్లించకుండా లక్షలు ఆర్జిస్తున్నారు. ఇక్కడ వారంలో కేవలం మూడు రోజుల మాత్రమే, అది కూడా తెల్లవారుజామున బిర్యానీ అందుబాటులో ఉంటుంది. ప్రతి రోజు లక్షల ఆదాయం ఉన్నా వీరు జీఎస్టీ చెల్లించడం లేదు. దీంతో ఉదయం 50 మంది సిబ్బంది ఏకకాలంలో బిర్యానీ విక్రయించే హోటళ్లపై దాడులు చేశారని వాణిజ్య పనుల శాఖ కమిషనర్ శిఖా తెలిపారు.

తుపాకీతో హల్‌చల్

యశవంతపుర: అక్రమంగా గన్ పట్టుకొని తిరుగుతున్న యువకున్ని చిక్కమగళూరు జిల్లా కడూరు పోలీసులు అరెస్ట్ చేశారు. బీరూరుకు చెందిన సమీర్ సెకెండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేస్తుంటాడు. కొంతకాలం కిందట ముంబైకి వెళ్లి ఒక పిస్టల్‌ను తీసుకొచ్చాడు. వ్యాపార లావాదేవీల్లో ఎవరైనా ప్రశ్నిస్తే తుపాకీతో బెదిరించేవాడు. అతని ఆగడాలపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిర్బంధించి తుపాకీ, 10 తుటాలు, రెండు చాకులు, 40 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కేవైసీ అని రూ.90 వేలు ఖాళీ

తుమకూరు: బ్యాంక్ పేరుతో ఫోన్ చేసిన మోసగాళ్లు కేవైసీ అప్‌డేట్ కాలేదని చెప్పి ఓటీపీ తెలుసుకుని అతని ఖాతాలో ఉన్న సుమారు రూ. 90 వేలను లూటీ చేసిన సంఘటన తుమకూరు జిల్లాలోని తిపటూరు పట్టణంలో చోటు చేసుకుంది. హోటల్ యజమాని రేవణ్ణ సిద్దప్ప అనే వ్యక్తికి ఓ బ్యాంకులో ఖాతా ఉంది. మంగళవారం ఆయనకు ఒక కాల్ వచ్చింది, మీ ఖాతా ఉన్న బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, అప్‌డేట్ చేయాలని చెప్పారు. నిజమేనసుకున్న ఆయన పలు వివరాలు చెప్పాడు, చివరగా ఓటీపీ సంఖ్య చెప్పగానే ఖాతాలోని రూ. 90 వేలు మరో ఖాతాకు బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఆ వెంటనే మోసగాళ్ల నంబర్ కూడా స్విచాఫ్ అని వచ్చింది. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బడి వేళల మార్పులపై చర్చలు

శివాజీనగర: బెంగళూరులో ట్రాఫిక్ ఒత్తిడిని తప్పించేందుకు పాఠశాలల సమయాన్ని సవరించాలనే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు ప్రభుత్వ న్యాయవాదులు హైకోర్టుకు తెలిపారు. ఓ సంస్థ వ్యాజ్యం వేయగా, నివేదికను సమర్పించేందుకు హైకోర్టు 8 వారాలు కాలావకాశం ఇచ్చింది. అక్టోబర్ 5న కార్మిక శాఖ, వ్యాపారులతో, 9న పాఠశాల పాలక మండలితో ప్రభుత్వం సమావేశం జరిపిందన్నారు. రవాణా శాఖ, తల్లిదండ్రులతో చర్చించారని పేర్కొన్నారు.

మాస్కులతో కావేరి నిరసన



మండ్య: తమిళనాడుకు కావేరి నీటిని వదలడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మండ్య జిల్లా రైతు హితరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళవారం రైతులు, నాయకులు సర్ ఎంవి విగ్రహం వద్ద ధర్నా శిబిరంలో బైఠాయించారు. అంతకు ముందు బెంగళూరు- మైసూరు హైవేలో ధర్నా చేసి వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొందరు నిరసనకారులు సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మాస్కులను తగిలించుకుని వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

జ్వరంతో వెళ్తే ప్రాణమే పోయింది

- బెంగళూరులో దారుణం



రాజనందిని ఆస్పత్రి, (ఇన్‌సెట్లో) బాలుడు ప్రీతమ్ (ఫైల్)

యశవంతపుర: చిన్నారికి ఇంజెక్షన్ వికటించి మృతి చెందిన ఘటన బెంగళూరు లో సోమవారం జరిగింది. ఫిర్యాదులో పేర్కొన్న మేరకు.. ఈ నెల 6వ తేదీన కోణనకుంటెలో ఉండే దంపతుల కొడుకు ప్రీతమ్ నాయక్ (10)కు జ్వరం రావడంతో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి బాలునికి ఇంజెక్షన్ వేసి మందులిచ్చారు. కానీ జ్వరం తగ్గకపోవటంతో మరుసటి రోజు అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంజెక్షన్ వేసిన తొడ వద్ద వాపు, విపరీతమైన నొప్పి కూడా వచ్చింది. వైద్యులు చూసి సిరప్, కొన్ని మాత్రలు ఇచ్చి పంపించారు. సూది వేసిన చోట వాపు మరింతగా పెరిగిపోయింది.

అవయవాలు విఫలం

మరో ఆస్పత్రికి వెళ్లి చూపించినా ఏమీ ఫలితం లేకపోవడంతో 8వ తేదీన రాజాజీనగరలోని ఈఎస్‌ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఇంజెక్షన్ వేసిన చోట ఆపరేషన్ చేశారు. బాలునికి పరీక్షలు నిర్వహించగా మూత్రపిండాలతో పాటు కొన్ని అవయవాలు దెబ్బతిన్నట్లు వెల్లడైంది. దీంతో మెరుగైన వైద్యం కోసమని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే బాలుడు మరణించాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రాజనందిని ప్రైవేటు ఆస్పత్రిపై కోణనకుంటె పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

బొమ్మలు భళా



ఇది దసరా సీజన్ కావడంతో అనేకమంది ఇళ్లలో అందమైన బొమ్మల కొలువులను ఏర్పాటు చేస్తున్నారు. అదేరీతిలో బెంగళూరులోని ఓ మాల్‌లో కొలువైన బొమ్మలు. వీక్షిస్తున్న సందర్శకులు



మస్తుగా మల్లయుద్ధం

- 15 నుంచి మైసూరు దసరా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ, చిత్రంలో మల్లయోధులు



కుస్తీవీరుల వ్యాయామ సామగ్రితో పోలీసు అధికారిణులు

మైసూరు: నాడ హబ్బ మైసూరు దసరా వేడుకల్లో నిర్వహించే కుస్తీ పోటీల్లో ఈసారి 440 మంది పహిల్వాన్లు పాల్గొననున్నారు. ఈ నెల 15వ తేదీ నంచి 21వ తేదీ వరకు వారం రోజుల పాటు కుస్తీ పోటీలు జరుగుతాయి. దసరా వస్తు ప్రదర్శనశాల ఆవరణలో ఉన్న పి.కాళింగరాజవు గాన మండపంలో మల్లయుద్ధం పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం కుస్తీ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 440 మంది ఇద్దరు చొప్పున జంటగా రంగంలోకి దిగుతారు. రోజూ సుమారు 30 జంటల కుస్తీ పోటీలుంటాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ఎస్. శ్రీవత్స, కలెక్టర్ కే.వి రాజేంద్ర, జడ్పీ సీఈఓ కే.ఎం.గాయత్రి, పోలీసు కమిషనర్ రమేష్‌బానోత్, ఎస్పీ సీమా లాట్కర్ పాల్గొన్నారు. కుస్తీయోధులు సాముగరడీలు చేసే సాధనాలు పట్టుకుని మహిళా అధికారులు ఫోటోలకు పోజులిచ్చారు.

ఒక్కచోటే ఆహారమేళా

దసరా వేడుకల్లో ఏటా మాదిరిగానే ఈసారి కూడా సందర్శకులకు నోరూరించే వంటకాలు రెడీ అవుతున్నాయి. 15 నుంచి 22వ తేదీ వరకు మైసూరు పాత జిల్లాధికారి ఆఫీసు దగ్గరున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మైదానంలో ఆహార మేళా జరుగుతుంది. గతంలో మాదిరిగా పలుచోట్ల కాకుండా ఒకేచోట మేళా జరుగుతుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితి ఉన్నందున ఆడంబరాలను తగ్గిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జంబూసవారీలో 36 శకటాలు

ఈసారి జంబూసవారీ ఊరేగింపులో 36 శకటాలు పాల్గొంటాయని సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. కన్నడ నాడు సంస్కృతీ సంప్రదాయాలు, వివిధ రంగాల అభివృద్ధిని చాటేలా శకటాలను రూపొందిస్తారు. 24వ తేదీన విజయదశమి రోజున జరిగే జంబూసవారీ ఊరేగింపులో శకటాలు పాల్గొంటాయి. రాష్ట్రంలో మొత్తం 31 జిల్లాల నుంచి, అలాగే మరో 5 శాఖల నుంచి శకటాలు పాల్గొంచుకుంటాయి. మంగళవారం నుంచి శకటాల తయారీ ప్రారంభమైంది.

సిటీలోని చెత్త యార్డుల తరలింపు

- డిప్యూటీ సీఎం హామీ



ఊరి మధ్యలో ఉండే డంపింగ్ యార్డులతో సమస్యలు

బనశంకరి: ప్రజలకు ఇబ్బందులు వస్తున్నందున యశవంతపురతో పాటు ఇతర ప్రాంతాల్లో చెత్త సేకరణ (డంపింగ్) కేంద్రాలను బెంగళూరు బయట గల నిర్మానుష్య కొండ ప్రాంతానికి తరలించాలని తీర్మానించామని డిప్యూటీసీఎం డీకే.శివకుమార్ తెలిపారు. మంగళవారం విధానసౌధలో జలవనరులు, అటవీ, బెంగళూరునగరాభివృద్ధి శాఖల సమన్వయ సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తిస్తున్నామని, బెంగళూరు శరవేగంగా విస్తరించడంతో చెత్తసేకరణ కేంద్రాలు నగర మధ్యలోకి వచ్చాయని అన్నారు. డంపింగ్ కేంద్రాలు చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల వరకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. అనేకమంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోని చెత్త కేంద్రాలను దూరంగా తరలించాలని కోరినట్లు చెప్పారు. ప్రజలకు చెత్త వాసన రాకూడదని వాటిని నగరానికి దూరంగా తరలించాలని నిర్ణయించామన్నారు. దీనికోసం నగర నలుదిక్కుల్లో అటవీశాఖ సరిహద్దు ప్రాంతాల్లో వంద ఎకరాల స్థలం ఇవ్వాలని అటవీ, రెవెన్యూ శాఖలకు మనవిచేశామని, సర్వేచేసిన తరువాత స్థలం ఇస్తారని తెలిపారు. తిప్పగొండనహళ్లి నీటి స్వచ్ఛతను కాపాడడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

శౌర్య జాగరణ యాత్ర


యాత్రలో పాల్గొన్న వీహెచ్‌పీ కార్యకర్తలు

కంప్లి: దురలవాట్లపై యువతలో చైతన్యం తెచ్చి దేశభక్తులుగా తీర్చిదిద్దాలని పీ.పవన్, మల్లికార్జున తెలిపారు. పట్టణంలో వీరాంజనేయ స్వామి చిత్రపటంతో చేపట్టిన శౌర్య జాగరణ యాత్రలో వారు మాట్లాడారు. మహిళలు కలశాలు, వివిధ వాయిద్యాలతో కురుగోడు రోడ్డులోని సాయిబాబా, అయ్యప్పస్వామి ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ఉద్భవ గణపతి ఆలయం వరకు యాత్ర కొనసాగింది.

విద్యుత్ సక్రమ సరఫరాకు వినతి

కోలారు: విద్యుత్‌ను సరిగా సరఫరా చేయాలని కోరుతూ దళిత సంఘర్ష సమితి భీమావాద కార్యకర్తలు మంగళవారం బెస్కాం కార్యాలయం వద్ద ఏఈఈకి వినతిపత్రం అందించారు. సంఘం కార్యకర్తలు మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా విద్యుత్ లోడ్‌షెడ్డింగ్‌తో సరఫరాను నిలిపి వేస్తుండడం వల్ల రైతుల పంటలు ఎండుతున్నాయన్నారు. విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతోందన్నారు. అందువల్ల విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని కోరారు. రాష్ట్ర సమన్వయ సంచాలకుడు మేడిహాళ చంద్రశేఖర్, కె భైరప్ప, బ్యాడహళ్లి సాకప్ప పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చెరుకు తోట దగ్ధం

• రూ.లక్షలాది పంట నష్టం


కాలిపోతున్న చెరుకు పంట

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకాలో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో చెరుకు తోటకు నిప్పంటుకుని లక్షలాది రూపాయల పంట నష్టం జరిగింది. తాలూకాలోని భోగాపుర గ్రామానికి చెందిన రైతు వెంకణ్ణ ఆరు ఎకరాలలో చెరుకు పంటను వేశారు. వానలు లేక కరువుతో తల్లడిల్లుతున్న సమయంలో చేతికొచ్చిన చెరుకు పంటకు అకస్మాత్తుగా తోట మీదుగా వెళ్లిన 11 కె.వి. విద్యుత్ లైన్ తెగి పంటపై పడడంతో మంటలు చెలరేగాయి. మొత్తం పైరుకు మంటలు అంటుకోవడంతో భారీగా నష్టం సంభవించిందని రైతు తెలిపారు. మూడేళ్ల క్రితం కొత్త విద్యుత్ తీగను అమర్చాలని కోరినా జెస్కాం అధికారులు వహించిన నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందంటూ లింగసూగూరు పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు చేశారు.

వన్యజీవి సప్తాహ మారథాన్



మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

కంప్లి: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలోని గుడేకోట కరడిధామ తరఫున 69వ వన్యజీవి సప్తాహాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రామదుర్గ చెరువు ప్రాంతం నుంచి గుడేకోట వలయ అటవీ శాఖ అధికారులు కార్యాలయం వరకు మారథాన్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మారథాన్ పరుగు పోటీని ప్రారంభించిన అటవీ శాఖ అధికారి బీఏ స్.మంజునాథ్ మాట్లాడుతూ అడవులు, వన్యజీవి సంపదను సంరక్షించే బాధ్యత అందరిదని, వాటిని కాపాడుకోవాలని కోరారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

హుబ్లీ: అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని కలఘటిగి తాలూకా హిండసగేరిలో సోమవారం చోటు చేసుకుంది. హిండసగేరి గ్రామానికి చెందిన కల్లప్ప మాజాపుర మృతుడు. గంజిగట్టి గ్రామ బరోడా బ్యాంక్ శాఖలో రూ.8 లక్షలు, ఇతరుల నుంచి రూ.3 లక్షలను అప్పు చేశారు. వానలు సరిగ్గా కురవక అప్పులు తీర్చే మార్గం కానరాక మనోవేదనకు గురైన రైతు తన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకొన్నట్లు మృతుడి కుమారుడు గురుసిద్దప్ప కలఘటిగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వీధి పశువుల స్వైరవిహారం


రోడ్డులో తిరుగుతున్న పశువులు

కంప్లి: హగరిబొమ్మనహళ్లి పట్టణంలోని ప్రధాన మార్గాలు వీధి పశువులకు నిలయంగా మారిపోయాయి. కొట్టూరు రోడ్డు బసవేశ్వర బజార్, బసవేశ్వర సర్కిల్, హౌసింగ్ బోర్డు కాలనీ, రాంనగర్ ప్రాంతాల్లో నిత్యం పశువులు టికాణ వేసి ప్రజలకు వాహన రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తున్నాయి. ఇది పురసభకు సవాల్‌గా మారింది. ప్రజలే పశువులను పట్టుకొని నందీపుర గోశాలకు తరలించారు. కొంత మంది పలుకుబడి గలవారు గోశాలకు తరలించిన పశువులను విడిపించుకొని పట్టణంలోనే విడిచి పెట్టారు. ప్రజలు సహకరించని పక్షంలో ఈ సమస్యకు పరిష్కారం దొరకడం కష్టం అని ప్రజలు అంటున్నారు.

కాసులు కురిపించి..కన్నీరు మిగిల్చి..

• నష్టాల బాటలో టమాటా, పూల రైతులు
• ధర లేక రోడ్డు పక్కన పారబోస్తున్న వైనం


టమాటాలను రోడ్డు పక్కన గుట్టలుగా పారబోసిన దృశ్యం


టమాటాలను కోయకుండా పొలంలోనే వదిలేసిన దృశ్యం

శ్రీనివాసపురం: రెండు నెలల క్రితం రైతులకు కాసులు కురిపించిన టమాటా పంట నేడు ధర లేక రైతులను బజారున పడేస్తోంది. మార్కెట్‌లో ధరలు గణనీయగా తగ్గిపోవడంతో టమాటాలు, పూలను అడిగేవారే కరువయ్యారు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఉండడంతో పలువురు రైతులు టమాటాలను మార్కెట్‌లకు తరలించకుండా పొలంలోనే వదిలేస్తుంటే మరి కొంత మంది రైతులు టమాటాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. పూలు, టమాటాలను శీతలీకరణ గిడ్డంగు(కోల్డ్ స్టోరేజీ)ల్లో ఎక్కువ రోజులు నిల్వ చేయడానికి వీలు లేకపోవడంతో రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. గతంలో వచ్చిన లాభం నేడు నష్టాల రూపంలో పోతోందని పలువురు రైతులు వాపోతున్నారు.

నాడు రికార్డు ధర పలికిన బాక్సు

రెండు నెలల క్రితం 15 కిలోల బాక్సు టమాటా ధర ఏకంగా రూ.2 వేల నుంచి రూ.2500 వరకు పలికి రికార్డు సృష్టించింది. అయితే నేడు అదే 15 కిలోల నాణ్యమైన టమాటా బాక్సు కేవలం రూ.50 ధర పలుకుతూ రైతులకు తీరని ఆవేదన మిగులుస్తోంది. శ్రీనివాసపురం, ముళబాగిలు తాలూకాల్లో అత్యధికంగా రైతులు టమాటాలు, పూలను పండిస్తున్నారు. ఈ ప్రాంత రైతులు టమాటాలను ముళబాగిలు తాలూకాలోని ఎన్.వడ్డహళ్లి మార్కెట్‌కు తరలిస్తారు. మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉన్నాయని తెలిసి పలువురు రైతులు ట్రాక్టర్లలో తరలిస్తున్న టమాటాలను రోడ్డు పక్కనే పారబోసి వెళుతున్నారు. సాధారణంగా మార్చి నుంచి జూన్ వరకు మార్కెట్‌లో టమాటాలకు మంచి రేటు ఉంటుంది. అనంతరం ధరలు తగినంతగా ఉండవు. అయితే ఈసారి ధరలు మరీ తక్కువగా ఉండడంతో రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. టమాటాలను పండించడానికి రైతులకు ఎకరాకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఖర్చు ఇలా ఉంటే 15 కిలోల బాక్సుకు కేవలం రూ.40 నుంచి రూ.50 ధర వస్తుండడంతో పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదు.

పూల రైతుల పరిస్థితి కూడా ఇంతే

మార్కెట్‌లో కేవలం టమాటాలే కాకుండా బంతి పూలు పండించిన రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. మార్కెట్‌లో కిలో బంతిపూల ధర కేవలం రూ.10 మాత్రమే ఉంది. ఇటీవల వినాయకచవితి, వరలక్ష్మి వ్రతం పండుగల సమయాల్లో కూడా బంతిపూలకు ధరలు ఆశించినంతగా లేకపోవడంతో రైతన్నలు నష్టపోయారు. ధరలు లేక రైతులు తీవ్ర సంకష్టంలో నలుగుతున్న సమయంలో ప్రభుత్వం ముందుకు వచ్చి టమాటాలకు, పూలకు మద్దతు ధరను ఇచ్చి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి కిలోకు కనీసం రూ.10 మద్దతు ధరను ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ధరలు తగ్గిపోయి తీవ్ర కష్టాల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం టమాటాలకు, పూలకు కనీసం కిలోకు రూ.10 మద్దతు ధరను ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ కోరారు. గతంలో కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కిలోకు రూ.2 మద్దతు ధరను ఇచ్చి ఆదుకున్నారని, అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతులను ఆదుకోవాలని మనవి చేశారు.

మరణంలోనూ వీడని బంధం

• ఫారంపాండ్‌లో పడి అన్నదమ్ముల మృతి


మృతి చెందిన అన్నదమ్ములు(ఫైల్)

సాక్షి,బళ్లారి: బీదర్ జిల్లా చిటగుప్ప తాలూకా చీమకఖేడ గ్రామానికి చెందిన సాయిగణేష్(15), సాయినాథ్(15) అనే ఇద్దరు అన్నదమ్ములు ఫారంపాండ్‌లో పడి మృతి చెందారు. వీరిద్దరూ కవల పిల్లలు. తొమ్మిదో తరగతి చదువుతుండేవారు. సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని ఫారంపాండ్ వద్దకు వెళ్లారు. కాలు జారి ఒక బాలుడు పడగా, మరొక బాలుడు అతనిని రక్షించేందుకు ప్రయత్నించి ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. సోమవారం ఇద్దరు కుమారులు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. మంగళవారం ఫారంపాండ్‌లో ఇద్దరు శవాలై కనిపించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటన తెలిసిన వెంటనే జిల్లాధికారి, తహసీల్దార్, ఎస్‌ఐ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మరణంలోనూ అన్నదమ్ముల బంధం వీడలేదని కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరు పెట్టారు.

ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం

రాయచూరు రూరల్: జిల్లాలో ఉపాధ్యాయుల సామూహిక బదిలీల విషయంలో గందరగోళం నెలకొంది. 2022-23వ విద్యా సంవత్సరంలో దేవదుర్గలో 373 మంది, మాన్విలో 351 మంది, సింధనూరులో 401 మంది, రాయచూరులో 280 మంది, లింగసూగూరులో 380 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కలబుర్గి డివిజనల్ కమిషనర్ బదిలీ ఆదేశాలను జిల్లా విద్యాశాఖాధికారికి ఇచ్చారు. అయినా తాలూకా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదన్న మాదిరిగా తాలూకా విద్యాశాఖాధికారికి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఆదేశించి 48 గంటలు గడిచినా జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

ప్రభుత్వాలను మార్చే శక్తి మహిళలదే


నారీశక్తి లోగోను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, మహిళలు

బళ్లారిటౌన్: ప్రభుత్వాలను మార్చే శక్తి మహిళలకు ఉందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.నాగేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మోకా రోడ్డులోని కేఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నారీశక్తి మహిళా సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యావత్ దేశం కర్ణాటక వైపునకు చూసేలా తమ ప్రభుత్వం మహిళల కోసం పంచతంత్ర పథకాలను ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. గృహలక్ష్మి, గృహజ్యోతి, గృహశక్తి, అన్నభాగ్య కార్యక్రమాలతో ఎక్కువగా మహిళలే లబ్ధి పొందుతున్నారన్నారు. మహిళలు కేవలం వంట పనికే పరిమితం కాదని, వారు అనుకుంటే సీఎం, పీఎంలను కూడా గద్దె దింపగలరన్నారు. మహిళలు పెట్టిన భిక్షతోనే మంత్రిని అయ్యానన్నారు. సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపట్టిన పథకాల వల్ల మహిళా సబలీకరణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో గీతా శివరాజకుమార్ చేతుల మీదుగా నారీశక్తి లోగోను ప్రారంభించారు. మేయర్ త్రివేణి, ఉపమేయర్ జానకమ్మ, కాంగ్రెస్ నేతలు హుమాయూన్‌ఖాన్, అభిలాక్ష, హుస్సేన్ పీరా, బోయపాటి విష్ణు, ముండ్రగి నాగరాజు, మహిళా నేతలు మంజుల, పద్మావతి, శోభా కాళింగ, చానాళ్ శేఖర్ పాల్గొన్నారు.

పర్భణి-తాండూరు రైలు రాయచూరుకు పొడిగింపు


రైలుకు పచ్చజెండా చూపుతున్న బాబూరావు

రాయచూరు రూరల్: పర్భణి-తాండూరు మధ్య నిత్యం సంచరించే రైలును ఆ శాఖ ఉన్నతాధికారులు ఇకపై రాయచూరు వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబూరావు తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం నగరంలోని రైల్వే స్టేషన్‌లో రాయచూరు లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్ ఆదేశాల మేరకు రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలుతో కర్ణాటక నుంచి తెలంగాణ, మహారాష్ట్రలోని పలు జిల్లాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. ఈ రైలు రాయచూరు నుంచి ప్రారంభమై కృష్ణా, యాదగిరి, సేడం, చిత్తాపుర, తాండూరు, వికారాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, ముత్కేడ్, నాందేడ్ మీదుగా పర్భణి చేరుకుంటుంది. రైల్వే అధికారులు అభిషేక్ కుమార్, నిరంజన్ కుమార్, చౌహాన్, పదాధికారులు నాగేశ్వరరావు, అశోక్ పాటిల్, బసవరాజ్, శ్రీనివాస్, నాగరాజ్‌లున్నారు.

అప్ప తీర్చమన్నందుకు హత్య

• హంతకుల్లో ఒకరు అరెస్టు


నిందితుడు వినోద్

మాలూరు: ఆర్థిక వ్యవహారాలే రియల్టర్ మునియప్ప హత్యకు కారణమని తెలిసింది. హంతకుల్లో ఒకరిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పట్టణానికి చెందిన వినోద్ అలియాస్ విను అరెస్టయిన ప్రధాన నిందితుడు. పట్టణంలోని శ్రీరంగం కళ్యాణమంటపం ముందు రియల్టర్ మునియప్ప సోమవారం సాయంత్రం దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేయాలని మునియప్ప బంధువులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. వినోద్ అనే వ్యక్తికి దాదాపు రూ.40 లక్షల వరకు మునియప్ప డబ్బులు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బును తిరిగివ్వాలని మునియప్ప డిమాండ్ చేయడంతో వినోద్ తన సహచరులతో కలిసి మునియప్పను హత్య చేసినట్లు తెలిసింది. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

అధ్యయన పీఠం ఏర్పాటు చేయరూ..


వినతిపత్రం స్వీకరించిన హరీష్ రామస్వామి

రాయచూరు రూరల్: రాయచూరు విశ్వవిద్యాలయంలో హరిదాస అధ్యయన పీఠం ఏర్పాటు చేయాలని అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభాపతి నరసింగరావ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం రాయచూరు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ హరీష్ రామస్వామికి వినతిపత్రం సమర్పించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హరిదాస అధ్యయన పీఠం ప్రారంభించాలని కోరారు. రాయచూరు జిల్లా దాసులకు పుట్టినిల్లు, వందలాది మంది దాసులు సమాజానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మంగళమూర్తి, మురళీధర్, వెంకటేష్, నాగరాజ్, రమేష్, సుధీర్, వేణుగోపాల్, విష్ణుతీర్థలున్నారు.

జనతా దర్శన్‌తో పేదలకు మేలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున్

హొసపేటె: ప్రజల కోసం ప్రారంభించిన జనతా దర్శన్‌ను రానున్న రోజుల్లో మరింత విస్తరిస్తామని హరపనహళ్లి ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున్ అన్నారు. ఆమె మంగళవారం పట్టణంలోని పర్యాటక మందిరం ఆవరణలో నిర్వహించిన జనతాదర్శన్‌ను ప్రారంభించి మాట్లాడారు. సీఎం సిద్దరామయ్య ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రస్తుతం రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయిలో ప్రారంభమై పేదలకు, కూలీలకు, రైతులకు మేలు చేసిందన్నారు. సమస్యల పరిష్కారానికి హరపనహళ్లి తాలూకాలోని చివరి గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ఫిర్కా స్థాయిలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల నుంచి వినతుల స్వీకరణకు 25 కౌంటర్లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువ కానిస్టేబుల్ ఆత్మహత్య


కానిస్టేబుల్ ప్రకాష్ నాయక్(ఫైల్)

సాక్షి,బళ్లారి: తమ కుమారుడు సమాజంలో మంచి పేరు తెచ్చుకొంటాడని కలలు కని కష్టపడి ఇంజనీరింగ్ చదివించిన తల్లిదండ్రులకు శోకమే మిగిలింది. నగరంలోని డీఏఆర్ పోలీసు క్వార్టర్స్‌లో ఉంటూ పోలీసు విధులు నిర్వహిస్తున్న ప్రకాశ్‌నాయక్(26) సోమవారం రాత్రి క్వార్టర్స్‌లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హగరిబొమ్మనహళ్లి తాలూకా ఆనేకల్ తాండాకు చెందిన ప్రకాష్‌నాయక్ 2021వ బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. డీఏఆర్‌లో పోలీసు విధులు నిర్వహిస్తుండేవాడు. అయితే ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడని మృతుని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తులో ఉంది. కాగా చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవడం ఎంతవరకు సబబు అని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

బోటులో అగ్ని ప్రమాదం

యశవంతపుర: మత్స్యకారుల బోటులో ఆకస్మికంగా మంటలు వ్యాపించి కాలి బూడిదైన ఘటన దక్షిణ కన్నడ జిల్లా బెంగ్రె బందర్‌లో మంగళవారం ఉదయం జరిగింది. మత్స్యకారుడు అరుణ్‌కు చెందిన బోటు లంగర్ వేసి ఉన్న సమయంలో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. ఆ సమయంలో బోటులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది.

విద్యుత్ కోతలను అరికట్టండి


మాట్లాడుతున్న నిజాముద్దీన్

'రాయచూరు రూరల్: విద్యుత్ కోతలను అరికట్టాలని తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు నిజాముద్దీన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఓ వైపు వానలు లేక రైతులు ఇబ్బందుల్లో ఉండగా, మరో వైపు విద్యుత్ కోతలతో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. ఆర్టీపీఎస్, వైటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలున్నా విద్యుత్ కోతల వల్ల విద్యార్థులు, రైతులు కష్టాల్లో ఉన్నారన్నారు. వైటీపీఎస్ విద్యుత్ కేంద్రాన్ని ప్రైవేట్ పరం చేయడానికి ప్రభుత్వం పిలిచిన టెండర్‌ను విరమించుకోవాలన్నారు. కరువు జిల్లాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సవతి తల్లి ప్రేమ చూపడం సరికాదన్నారు.

ప్రత్యేక కార్యదర్శిని నియమించండి

రాయచూరు రూరల్: రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖకు ప్రత్యేక కార్యదర్శిని నియమించాలని హైదరాబాద్ కర్ణాటక వాల్మీకి నాయక్ సంఘం కార్యదర్శి రఘువీర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంలో బీజేపీ సర్కార్ హయాంలో సాంఘీక సంక్షేమ శాఖకు ప్రత్యేక కార్యదర్శిని నియమించలేదని ఆరోపించారు. మహర్షి వాల్మీకి జయంతి నాటికి ప్రత్యేక అధికారిని నియమించాలని ఒత్తిడి చేశారు.

హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ


హాస్టల్ ఆవరణను పరిశీలిస్తున్న అధికారులు

హొసపేటె: విజయనగర జిల్లా హూవినహడగలి తాలూకా సోగి గ్రామంలోని విద్యార్థుల వసతి గృహం, ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయాలను జెడ్పీ ముఖ్యకార్యనిర్వహణాధికారి బి.సదాశివ ప్రభు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల హాస్టల్‌లోని రెండు స్వచ్ఛమైన తాగునీటి యూనిట్లకు మరమ్మతులు లేవని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు గుర్తించారు. మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ విషయమై వెంటనే సరిచేసి ఫోటోలతో కూడిన నివేదికను జెడ్పీకి అందజేయాలని అక్కడే ఉన్న వార్డెన్ రఫీక్‌ను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా రికార్డులు కావాలని అడగగా వార్డెన్ ఇంట్లోనే ఉన్నాయని చెప్పారు. రికార్డులు హాస్టల్‌లోనే ఉండాలని, జాబితా నమోదు చేయాలన్నారు. వాటిని పరిశీలనకు వచ్చిన అధికారులకు అందజేయాలన్నారు. ఈ గందరగోళాన్ని ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. అలాగే సోగి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్డి నిర్వహణకు నోచుకోక పాడైనట్లు గమనించారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో మరుగుదొడ్లు మరమ్మతులు చేశామని ప్రధానోపాధ్యాయుడు బదులిచ్చారని పీడీఓ తెలియజేశారు. దీన్ని సత్వరమే సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని క్షేత్ర విద్యాశాఖాధికారికి తెలిపారు. ఈసందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

విద్యుత్ కోత ఖండిస్తూ ధర్నా


ఎండిన పంటతో ధర్నా చేస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ఇష్టానుసారంగా విధిస్తున్న విద్యుత్ కోతలను ఖండిస్తూ రైతు సంఘం పదాధికారులు సోమవారం బంగారుపేట బెస్కాం కార్యాలయం ముందు ఎండిన పంటతో సహా ధర్నా చేశారు. ఈసందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్‌తో పాటు నిరంతరం విద్యుత్ కోత విధిస్తూ రైతులు, విద్యార్థులకు చీకటి భాగ్యాన్ని అందిస్తోందని ఎద్దేవా చేశారు. విద్యుత్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాము సాగు చేసిన పంటలు ఎండుతూండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. రైతులు, విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు మరగల్ శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ఎ.నళినిగౌడ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పత్రికా సంపాదకుడు మృతి


సంపాదకుడు ప్రహ్లాదరావు(ఫైల్)

కోలారు: సీనియర్ పత్రికా సంపాదకుడు కె.ప్రహ్లాదరావు(80) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం అర్ధరాత్రి మరణించారు. ఆయన 50 ఏళ్ల క్రితం కోలారు పత్రికను స్థాపించి సామాజిక సమస్యలను ప్రజలు, ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడిగా, జిల్లా కసాప అధ్యక్షుడిగానూ సేవలు అందించారు. పత్రికా రంగంలో ఎనలేని సేవలను అందిస్తూ విలువలను కాపాడుకుంటూ వచ్చి నేటి యువ పాత్రికేయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పత్రికా అకాడమి అవార్డును కూడా అందుకున్నారు. ప్రహ్లాదరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంపీ ఎస్ మునిస్వామి, శ్రీనివాసపురం మాజీ ఎమ్మెల్యే కెఆర్ రమేష్‌కుమార్, విధాన పరిషత్ మాజీ ఉప సభాపతి విఆర్ సుదర్శన్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ప్రహ్లాదరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. నగరంలోని పాత్రికేయుల సంఘంలో ప్రహ్లాదరావు మృతికి అధ్యక్షుడు బివి గోపీనాథ్ నేతృత్వంలో సంతాప సభను ఏర్పాటు చేసి పాత్రికేయులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ప్రహ్లాదరావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఇంద్రధనుష్‌ను విజయవంతం చేయాలి

హొసపేటె: విజయనగర జిల్లాలో ఇంద్రధనుష్ 3వ రౌండ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంగళవారం మాతా శిశు ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. ముందుగా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్ చిన్నారులకు టీకాలు వేసి ప్రారంభించారు. జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 3234, గర్భిణులు 560 మంది ఉండగా, వారందరికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో వ్యాక్సీన్లను అందుబాటులో ఉంచారని, 5 ఏళ్లలోపు పిల్లలు, గర్భిణులు వివిధ వ్యాధుల నివారణకు టీకాల సదుపాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ జంబయ్యనాయక్, ఆరోగ్య విద్యాశాఖాధికారి ఎంపీ దొడ్డమని, ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించండి

రాయచూరు రూరల్: జిల్లాలోని సిరవార తాలూకాలో తాగునీటి ఎద్దడిని నివారించాలని రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ తుకారాం పాండే అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణగౌడ మాట్లాడారు. తాలూకాలోని హొక్రాణికి తాగు నీరు, సాగు నీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని అన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పల్లెల్లో కనీసం మూడు కి.మీ.దూరం వెళ్లి నీరు తెచ్చుకొనే పరిస్థితి ఎదురైందన్నారు. వ్యవసాయ బావుల్లో నీటిమట్టం తగ్గిందన్నారు. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు సాగునీటిని అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నూతన తహసీల్దార్‌తో భేటీ



బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శివప్ప లమాణిని మంగళవారం గాంధీ కుటీర సమితి ఉపాధ్యక్షుడు రవిశాస్త్రి, కార్యదర్శి కృష్ణరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

వర్చువల్ మ్యూజియం పోటీలకు ఎంపిక

కోలారు: ఐఐటీ బాంబే, ఈ యంత్రం ఈ నెల 13న నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి వర్చువల్ మ్యూజియం తుది రౌండ్ పోటీలకు నగరానికి చెందిన వీఎం సాయి అనీష్ ఎంపికయ్యారు. ఈ పోటీల్లో సాయి అనీష్ హంపి ప్రపంచ వారసత్వ రాతిరథాన్ని కళాకృతిగా ఎంచుకున్నాడు. వివిధ అప్లికేషన్లతో వర్చువల్ మ్యూజియంను రచించిన నగరంలోని జయనగర నివాసులైన దివ్య, మహేష్ దంపతుల కుమారుడు సాయి అనీష్ నగరంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.

లక్షల విలువైన టపాసులు సీజ్


టపాసు బాక్సులను పరిశీలిస్తున్న అధికారులు

విజయపుర (బెంగళూరు గ్రామీణ) : అత్తిబెలెలో చోటుచేసుకున్న టపాసుల ప్రమాద ఘటనపై తీవ్రంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం టపాసుల గోడౌన్లపై దాడి చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో విజయపుర పురసభ అధికారులు, పోలీసులు పట్టణంలోని కెరెకోడి రోడ్డులోని ఓ గోడౌన్‌పై దాడి చేసి లక్షల విలువైన టపాసులు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా నిల్వ చేసుకోవడంతో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ఉత్తమ మార్గాన్ని ఎంచుకోవాలి


గవర్నర్‌తో విద్యార్థులు

యశవంతపుర: విద్యార్థులు జీవితంలో మంచి మార్గాన్ని ఎంచుకోవాలని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. సోమవారం రేవా వర్సిటీలో జరిగిన 8వ స్నాతకోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు మంచి ఉద్యోగాన్ని సాధించి ఉత్తమ జీవితాన్ని పొందాలన్నారు. రేవా కాలేజీలో ఉత్తమ విద్యాబోధన వల్ల ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని మంత్రి తెలిపారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్ మాట్లాడుతూ...ఉన్నత విద్యను అభ్యసించి దేశ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఓటు హక్కు వినుయోగంపై జాగృతి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మూడు వేల మంది విద్యార్థులకు డిగ్రీ, 56 మందికి పీహెచ్‌డీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. 47 మంది రేవా అకాడమీ ఫర్ కార్పోరేట్ ఎక్స్‌లెన్స్‌ను ఇచ్చారు. కులపతి ఎం ధనంజయ, పి శ్యామరాజు, రిజిస్ట్రర్ ఎన్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టపాసుల గోడౌన్లపై పోలీసు దాడులు


సోదాలు చేస్తున్న అధికారులు, పోలీసులు

దొడ్డబళ్లాపురం: అత్తిబెలెలో చోటుచేసుకున్న టపాసుల ప్రమాదం తరువాత రాష్ట్ర ప్రభుత్వం మేల్కొంది. సంఘటనను సీరియస్‌గా తీసుకోవడంతోపాటు అక్రమంగా టపాసులు నిల్వ చేసిన గోడౌన్లపై దాడి చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో దేవనహళ్లి తహసీల్దార్ శివరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేపట్టారు. దేవనహళ్లి తాలూకా రెడ్డిహళ్లిలో ఉన్న ఒక గోడౌన్‌పై దాడి చేసిన పోలీసులు ఏకంగా రూ.10 లక్షల విలువ చేసే టపాసులు సీజ్ చేసారు. గోడౌన్ గ్రామం మధ్యలో ఉండడంతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, అనుమతులు పొందకపోవడంతో పోలీసులు సీజ్ చేసారు. విజయపుర వద్ద ఎంటీఆర్ రమేశ్‌గౌడకు చెందిన మరో పెద్ద టపాసుల గోడౌన్ ఉందని తెలియడంతో పోలీసులు అక్కడ కూడా దాడి చేసారు. దీపావళి దగ్గర పడుతుండడంతో బెంగళూరు గ్రామీణ జిల్లాలో అనేక చోట్ల టపాసులు భారీగా నిల్వ చేయడం జరిగింది. అనుమతులు లేకుండా, తగిన జాగ్రత్తలు పాటించకుండా నిల్వ చేస్తుండడంతో ప్రమదాలు జరుగుతున్నాయి.

సేవకులు సిద్ధాంతాలకు లోబడి ఉండాలి

- దైవజనుడు డాక్టర్ జాన్‌పాల్


సమావేశంలో పాల్గొన్న వివిధ తెలుగు చర్చీల పాస్టర్లు


శివాజీనగర: క్రైస్తవ బాప్టిస్ట్ సంఘాల్లో సేవకులు సిద్ధాంతాలకు లోబడి ఉండాలని సేవలు అందజేయాలని దైవజనుడు డాక్టర్ జాన్‌పాల్ సూచించారు. మంగళవారం నగరంలోని మత్తికెర హెచ్‌ఎంటీ లేఔట్‌లో ఉన్న రసెల్ మెమోరియల్ తెలుగు చర్చిలో కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు పాస్టర్ల సమావేశంలో పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో ఉన్న ఏడు సంఘాలను గురించి ఆయన విశదీకరించారు. సర్వమానవాళి పాప పరిహారం నిమిత్తం సిలువపై రక్తం చిందించిన ఏసుక్రీస్తు గురించి సువార్తను అందించే సేవకులు దేవుడి వాక్యానుసారంగా సేవలు అందించాలని ఉపదేశించారు. సేవకులు వ్యక్తిగత జీవితంలో కళంకం లేకుండా జీవించాలని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో అతి కష్టంగా సేవలందిస్తున్న పాస్టర్లు దేవుడిపై విశ్వాసముంచి తమ సేవలను కొనసాగించాలని రసెల్ మెమోరియల్ చర్చి సీనియర్ పాస్టర్ డాక్టర్ రెవరెండ్ జే.డీ.మోజస్ తెలిపారు. ప్రతి నెల మొదటి శనివారం కేటీసీఎంఎఫ్ సమావేశం జరపాలని ఈ సందర్భంగా కమిటీ నిర్ధారించింది. సమావేశంలో కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజిమన్, చైర్మన్ డాక్టర్ రెవరెండ్ ఎస్.ప్రేమానందం, కోశాధికారి రెవరెండ్ ఏ.జీ. జయానందం, ఉపాధ్యక్షుడు రెవరెండ్ దాస్, కన్వీనర్ డాక్టర్ ఎస్.ఎస్.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎంలకు జెడ్ కేటగిరి భద్రత

బనశంకరి: మాజీ ముఖ్యమంత్రులకు మళ్లీ జెడ్ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించింది. గతంలో మాజీ ముఖ్యమంత్రులకు జెడ్ భద్రత ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తగ్గించారు. దీంతో మళ్లీ మాజీ ముఖ్యమంత్రులు తమకు జెడ్ భద్రత కల్పించాలని సీఎం సిద్దరామయ్యకు విజ్ఞప్తి చేశారు. దీనికి సీఎం సిద్దరామయ్య అంగీకరించారు. దీంతో జెడ్ భద్రత సౌలభ్యం యడియూరప్ప, కుమారస్వామి, బసవరాజ బొమ్మై, డీవీ.సదానందగౌడ, ఎస్ఎం.కృష్ణ, జగదీశ్‌శెట్టర్ పొందనున్నారు.

భూలోక స్వర్గం బ్రహ్మగిరి


కనువిందు చేసే అందాలు


ప్రకృతి సౌందర్యానికి ఆలవాలమైన బ్రహ్మగిరి ఇరుప్ప వాటర్‌ఫాల్స్

- కొండలతో కమనీయ దృశ్యాలు
- దట్టమైన అడవులు
- ట్రెక్కింగ్‌కు అనువైన ప్రాంతం

బనశంకరి: ఒకప్పుడు హిల్‌స్టేషన్లు అంటే ఎవరికైనా గుర్తుకువచ్చేది ఊటీ, కొడైకెనాల్, కానీ అక్కడ అర్బనైజేషన్ పెరిగిపోవడంతో అక్కడ కూడా పెద్ద పెద్ద సిటీలు వచ్చేశాయి. దీంతో హిల్‌స్టేషన్లు వాటి అసలైన రూపురేఖలు కోల్పోయాయి. కానీ కర్ణాటకలో మనకు తెలియని ఎన్నో ప్రాంతాలు ఇప్పటికీ ఆ ప్రకృతి సోయగాలతో అలరారుతూనే ఉన్నాయి. అలాంటి వాటిలో అద్భుతమైన పర్యాటక ప్రాంతం బ్రహ్మగిరి. ఆకాశాన్ని తాకుతున్నట్టుండే కొండలు, చుట్టూ పచ్చదనానికి నేలకు అరువిచ్చిన అడవులు నులువెచ్చని సూర్య కిరణాలతో పాటు తాకే చల్లని గాలులు. అదో భూలోకస్వర్గం. నాలుగుమాటల్లో ఇది బ్రహ్మగిరి కొండలంటే పశ్చిమ కనుమల్లో మరో సుందరమైన ప్రాంతం బ్రహ్మగిరికొండలు. సముద్రమట్టానికి 1600 మీటర్ల ఎత్తులో ఉత్తర కర్ణాటకలోని కొడగు జిల్లా- కేరళ రాష్ట్ర సరిహద్దులో బ్రహ్మగిరి కొండలు ఉన్నాయి. ఏడాది పొడవునా ఇక్కడ వాతావరణం అద్భుతంగా ఉంటుంది. కాబట్టి ఎక్కడైనా అక్కడికి ట్రిప్ వేయవచ్చు. కానీ ట్రెక్కింగ్ చేయాలనే ఔత్సాహికులు ప్రకృతిని ప్రేమించేవారు మాత్రం అక్టోబరు నుంచి మే చివరి వరకు అనువైన సమయం.

వాయనాడ్ వరకు విస్తరించిన కనుమలు: కర్ణాటకలోని కొడగు జిల్లా నుంచి కేరళలోని వాయనాడ్ జిల్లా వరకు విస్తరించిన కనుమలను బ్రహ్మగిరి కొండలుగా పిలుస్తారు. పశ్చిమ కనుమల్లో భాగంగా ఉన్న ఈ పర్వతాలు విభిన్నమైన వన్యజీవులు, దట్టమైన అడవులతో కూడుకుని ఉంది. పచ్చని అడవులు, చెట్లు, వన్యజీవులతో భూలోక స్వర్గంగా పిలిచే బ్రహ్మగిరి కొండలు ట్రెక్కింగ్‌కు ఎంతో అనువైన ప్రాంతం. ప్రధానంగా వైల్డ్‌లైఫ్, ప్రకృతి ప్రేమికులు కచ్చితంగా చూసి తీరాల్సిన ప్రదేశం. శ్రీవిష్ణువు నిర్మించారని చెప్పే అత్యంత పురాతనమైన తిరునెల్లిదేవస్థానం వాటిలో ఒకటి. ఇంకా ఇరుప్పు వాటర్ ఫాల్స్, పక్షి జలపాతం, ట్రెక్కింగ్‌సైట్, కాదంబ జైన్‌టెంపుల్, బ్రహ్మగిరి వైల్డ్‌లైఫ్ శాంక్చురి ఇక్కడ చూడదగ్గ ప్రదేశాలు. వర్షాకాలంలో కచ్చితంగా చూడాల్సిన ప్రాంతాల్లో బ్రహ్మగిరికొండలు మొదటి వరుసలో ఉంటాయి. రణగొణ ధ్వనులకు దూరంగా జనజీవనానికి అందనంత దూరంలో ప్రకృతిలో మమేకమవడం కంటే అదృష్టం ఏముంటుంది. ప్రకృతి ప్రేమికులకు కావలసినంతా బ్యూటీ, ఆధ్యాత్మిక టూరిస్టులకు దేవాలయాలు ప్రత్యేక ఆకర్షణ. ఫొటోగ్రఫీ, క్యాంపింగ్, బర్డ్-వైల్డ్‌లైఫ్ ప్రేమికులకు అందుబాటులో ఉంది.

బ్రహ్మగిరికి అతి దగ్గర విమానాశ్రయం మైసూరుకు 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడ నుంచి క్యాబ్ తీసుకుని బ్రహ్మగిరి చేరుకోవచ్చు. రైలులో వెళ్లాలంటే మైసూరు రైల్వేస్టేషన్‌లో దిగాలి, రోడ్డు మార్గంలో బ్రహ్మగిరి వెళ్లడం ఉత్తమం. దారిపొడవునా ప్రకృతిని ఆస్వాదిస్తూ సాగే ప్రయాణం, కచ్చితంగా మధురానుభూతులను మిగులుస్తుంది. అందుకే చాలామంది మైసూరు నుంచి నేరుగా కారులో వెళ్లడానికి ఇష్టపడతారు. ట్రెక్కింగ్ చేయాలనుకునే వారు ముందుగా శ్రీమంగళ గ్రామంలోని రేంజ్ పరిరక్షణ్ అధికారి దగ్గర అనుమతి తీసుకోవాలి.


ట్రెక్కింగ్ చేస్తున్న ఔత్సాహికులు


వన్యజీవి కేంద్రంలో విహరిస్తున్న జింకలు


మంచుతెరలతో కప్పేసిన బ్రహ్మగిరి


పెంపుడు ఏనుగుల జలకాలు

పరప్పన, హిండలగా జైళ్లకు బాంబు బెదిరింపు

- నిందితుడి గుర్తింపు

బనశంకరి: బెంగళూరు పరప్పన అగ్రహార, బెళగావి హిండలగా జైళ్లను బాంబులతో పేల్చేస్తామని డీజీకి ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. నిందితుడిని బెళగావి జిల్లా హుక్కేరికి చెందిన కిరణ్ మోషిగా గుర్తించారు. ఇతను 2022లో ఓ వ్యక్తి అకౌంట్ హ్యాక్‌చేసి నగ్నవీడియో అప్‌లోడ్ చేశాడు. ఆ సమయంలో సైబర్ పోలీసులు అరెస్ట్ చేసి హిండలాగా జైలుకు తరలించారు. ప్రస్తుతం జస్టడియల్ ద్వారా ప్రభుత్వ అధికారుల నెంబరు తీసుకుని భార్య పేరుతో ఉన్న సిమ్‌కార్డు నుంచి బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.

తుమకూరు జిల్లాకే గర్వకారణం

తుమకూరు: అమెరికాలో ప్రసిద్ధి చెందిన స్టాన్‌ఫోర్డు వర్సిటీ విడుదల చేసిన ప్రపంచంలోనే ముందు వరుసలో ఉన్న శాస్త్రవేత్తల జాబితాలో తుమకూరు విశ్వవిద్యాలయానికి చెందిన భౌతికశాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ నాగభూషణ్ పేరు రావడం తుమకూరు జిల్లాకే గర్వకారణమని తుమకూరు వర్సిటీ చాన్స్‌లర్ వెంకటేశ్వరులు అన్నారు. రచనలు, సహాయలేఖలు, పరిశోధన ప్రకటనలు, హెచ్ ఇండెక్స్‌లు పరిశీలించిన అనంతరం ప్రపంచ అగ్రగామి శాస్త్రవేత్తలు జాబితా స్టాన్‌ఫోర్డు వర్సిటీ ఇటీవల విడుదల చేసిందని, అందులో తుమకూరు వర్సిటీకి చెందిన నాగభూషణ్ పేరు ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రపంచ స్థాయిలో 22 మంది శాస్త్రవేత్తల పేర్లు ప్రకటించారని, వివిధ రంగాల్లో చేసిన పరిశోధనలను పరిగణలోకి తీసుకుని జాబితా విడుదల చేశారని చాన్స్‌లర్ తెలిపారు.

అలాంటి వ్యక్తితో పొత్తా ?

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో కుమారస్వామి ముఖ్యమంత్రి పదవి పోగొట్టుకోవడానికి కారణం సీపీ యోగేశ్వర్, అలాంటి వ్యక్తితో కుమారస్వామి ఇప్పుడు జతకట్టి కాంగ్రెస్ పార్టీపై పోరాడతానని చెప్పడం విడ్డూరంగా ఉందని మాగడి ఎమ్మెల్యే బాలక్రిష్ణ విమర్శించారు. మంగళవారం మాగడి పట్టణంలో మీడియాతో మాట్లాడిన ఆయన అలాంటి వారిని వేరే ఏ రాజకీయ నాయకుడయినా సరే జీవితాంతం దూరం పెడతారన్నారు. యోగేశ్వర్ సీడీ పట్టుకుని ఢిల్లీ హైకమాండ్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసి తనను మంత్రిని చేసిన యడియూరప్పను ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించేలా కుట్రలు చేసాడన్నారు. యోగేశ్వర్‌కు దమ్ముంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని, సీడీలు పట్టుకుని తిరగడం కాదని ఎద్దేవా చేసారు. జేడీఎస్, బీజేపీ పొత్తు వల్ల కాంగ్రెస్‌కు కలిసివస్తుందేకానీ నష్టం లేదన్నారు. జేడీఎస్ తమ పార్టీకి పడాల్సిన ఓట్లు చీల్చేదని, ఇప్పుడు కాంగ్రెస్ ఓట్ల శాతం పెరుగుతుందన్నారు.

కేంద్రమంత్రితో ఆప్ నేతలు భేటీ

శివాజీనగర: వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో కరువు నెలకొందని, ఇటువంటి తరుణంలో తమిళనాడుకు కావేరి నీటిని విడుదల చేయాలని ఇచ్చిన అశాస్త్రీయ ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్‌ను ఆమ్ ఆద్మీ నాయకులు, రైతు సంఘం నాయకులు కలిసి విన్నవించారు. ఈ మేరకు ఢిల్లీలో రైతు నాయకుడు కురుబూరు శాంతకుమార్, ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ దాసరి, కన్నడ చళువళి నాయకుడు గురుదేవ్ నారాయణకుమార్, కార్యదర్శి విజయ్‌సింగ్, ఆప్ నాయకుడు జగదీశ్‌బాబుతో కూడిన బృందం కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్‌ను కలిశారు. కావేరి జలాశయంలో నీరు లేక అక్కడి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, బెంగళూరు నగరంలో 1.3 కోట్ల మందికి తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. కావేరి నీటి నిర్వహణ ప్రాధికార అశాస్త్రీయ ఆదేశాలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దసరా తరువాతే బీజేపీతో చర్చలు : దేవెగౌడ

బనశంకరి: బీజేపీ-జేడీఎస్ పొత్తుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా జేడీఎస్ అధినేతలు ముందుకే సాగుతున్నారు. తాజాగా ఆ పార్టీ దళపతి, మాజీ ప్రధాని దేవెగౌడ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీతో సీట్ల కేటాయింపులపై దసరా పండుగ తరువాత చర్చిస్తామని చెప్పారు. పొత్తు గురించి జేడీఎస్ శాసనసభ పక్షనేత హెచ్‌డీ.కుమారస్వామి ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో చర్చించారని తెలిపారు. పార్లమెంటు సమావేశాలు అనంతరం తాను, కుమారస్వామి మరోసారి హోం మంత్రితో మాట్లాడుతామన్నారు. దసరా అనంతరం సీట్ల కేటాయింపు గురించి చర్చిస్తామని, గత ఎన్నికల్లో మాదిరిగా ఓట్లు చీలకూడదని ఒక పథకం ప్రకారం ముందు వెళ్తామన్నారు. ఇంకా ఏదీ ఫైనల్ కాలేదని చెప్పారు.

ఖోఖో పోటీలు ప్రారంభం



తుమకూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా పాలుపంచుకోవాలని తుమకూరు నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్ క్రీడాకారులకు సూచించారు. తుమకూరు నగరంలోని విజయనగరలో ఉన్న సర్వోదయ విద్యాసంస్థల ఆవరణంలో నిర్వహించి అండర్-14, అండర్-17 ఖోఖో పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఇష్టమైన క్రీడలను ఎంచుకుని రాణించాలన్నారు.

22, 23 తేదీలలో దసరా ఎయిర్ షో

మైసూరు: విశ్వ విఖ్యాత మైసూరు దసరా వేడుకల సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఎయిర్ షో ఈనెల 22, 23 తేదీలలో నగరంలోని బన్ని మంటపం సమీపంలోని వంజిన కవాతు మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన ప్యాలెస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎయిర్ షోకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే కన్నడ సంస్కృతిక శాఖ ఎయిర్ షో కోసం రూ. 15 కోట్లు, ముడా నుంచి రూ. 10 కోట్లు, ప్యాలెస్ మండలి నుంచి రూ. 5 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. 23న ప్రధాన ఎయిర్ షో జరుగుతుందన్నారు.

నాలుగు రోజులు మాత్రమే యువ దసరా

నాడహబ్బ మైసూరు దసరా వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే యువ దసరాను ఈనెల 18 నుంచి 21 వరకు నాలుగు రోజులు మాత్రమే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.





సాధన.. సాహో

మంగళవారం మైసూరులో దసరా గజరాజుల తాలీము దృశ్యాలు. ప్యాలెస్ నుంచి బన్నిమంటప వరకూ మొత్తం 14 గజరాజులు వరుసగా వెళ్తుంటే నగరవాసులు, పర్యాటకులు అబ్బురంగా తిలకించారు. ప్రధాన గజరాజు అభిమన్యు చెక్క అంబారీని మోస్తూ ముందుకు సాగింది. ప్యాలెస్ ముందు జంబూసవారీ రిహార్సల్స్ కనువిందు చేసింది

టైల్స్ పనికి వచ్చి చోరీ..

- నలుగురు అరెస్ట్
- జైన ఆలయంలో చోరీ కేసు ఛేదింపు

శివాజీనగర: శాంతినగరలో ఉన్న జైన మందిరానికి టైల్స్ పనులు చేయటానికి వచ్చి మందిరంలో ఉన్న లక్షలాది రూపాయల విలువ చేసే వెండి ఆభరణాలను దోచుకొని పరారైన రాజస్థాన్‌కు చెందిన నలుగురు ఖతర్నాక్ దొంగలను అశోకనగర పోలీసులు అరెస్ట్ చేయటంలో విజయం సాధించారు. జోశిరామ్, రేష్మరామ్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.19.75 లక్షల విలువచేసే 14 కేజీ వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని నగర సీపీ దయానంద విలేకరుల సమావేశంలో తెలిపారు. చోరీలో ఆరుగురు పాల్గొన్నట్లు విచారణలో తేలింది. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

చోరీ సొత్తును గుంతలో దాచి..: ఈ విషయంపై కేసు నమోదు చేసుకొన్న పోలీసులు సీసీటీవీతో పాటుగా ఇతర సాక్ష్యాధారాల మేరకు టైల్స్ వేసేందుకు వచ్చిన కార్మికులే ఈ దొంగతనానికి పాల్పడినట్లు స్పష్టమైంది. అరెస్ట్ భయంతో దొంగలు రాజస్థాన్‌కు పారిపోయారు. అక్కడ వెండి ఆభరణాలను ఒక గుంతలో పెట్టి పూడ్చిపెట్టారు. అశోకనగర పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవి తన సిబ్బంది రాజస్థాన్ వెళ్లి నలుగురు నిందితులను పట్టుకున్నారని దయానంద తెలిపారు.

అపాయకరంగా గొయ్యి

కెలమంగలం: డెంకణీకోట- హోసూరు రోడ్డు కోట్టైవాసల్ సమీపంలోని డీఎస్పీ కార్యాలయం ముందు గత కొద్ది రోజుల క్రితం తీసిన గొయ్యిని మూయకపోవడంతో ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. హొగేనకల్ తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపు ధ్వంసం కావడంతో మరమత్తుల కోసం గత 15 రోజుల క్రితం గుంతను తవ్వారు. ఇంతవరకు దానిని మూయకపోవడంతో రాత్రి వేళల్లో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే గొయ్యిని మూయాలని కోరుతున్నారు.

బైక్ దొంగ అరెస్ట్



బాగేపల్లి: బాగేపల్లితో పాటు చుట్టు పక్కల బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని బాగేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 15 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గోరంట్ల మండలం నారసింహపల్లికి చెందిన సోముగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బైక్‌ల విలువ రూ. 9 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

హోసూరు వార్తలు..

రథయాత్ర అమరవీరులకు నివాళులు


అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

కెలమంగలం: 1990లో డెంకణీకోటలో జరిగిన శ్రీ రామ రథయాత్రలో పాల్గొన్న భక్తులపై పోలీసుల కాల్పుల్లో కన్నుమూసిన అమరవీరులకు మంగళవారం విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్, హిందూ సంఘాలు ఘననివాళులర్పించాయి. ఆనాటి తుపాకీ కాల్పుల్లో బాబు, శంకర్, రాజ, నరసింహన్‌లు మృతి చెందగా వందకుపైగా భక్తులను అరెస్ట్ చేశారు. అమరవీరులకు గత 33 ఏళ్లుగా హిందూ సంఘాలు సభ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాయి. ఈ ఏడాది బహిరంగ సభకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. బీజేపీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ఎం .నాగరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని డెంకణీకోట పట్టణంలోని వీరాంజనేయస్వామి ఆలయం నుంచి జ్యోతి ఊరేగింపు నిర్వహించి కోట్టైవాసల్ వద్ద అమరవీరులకు పుష్పాంజలి సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధి 29వ వార్డులో రూ. 1.64 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ సత్య మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని శానసంద్రం, ముల్‌లైనగర్ తదితర ప్రాంతాల్లో మేయర్ ఆకస్మికంగా పర్యటించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, మురికి నీటి కాల్వల పనులు వేగవంతం చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికార్లకు సూచించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మండల అధ్యక్షుడు రవి, స్థానిక ప్రతినిధులు దిల్‌షాద్ రహమ్మాన్, నాగరాజ్, రాజేంద్రన్, పాణ్డువేల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపంతో నిర్మాణ పనులు


నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

హోసూరు: ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా నిర్మాణ పనులు చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటించడం లేదని సామాజిక సేవాకర్తలు ఆరోపిస్తున్నారు. డెంకణీకోట తాలూకా దేవర ఉళిమంగలం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని పాఠశాల యంత్రాంగం, పిటిఏ సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కానీ కాంట్రాక్టర్లు నిర్మాణ పనులకు నాసిరకమైన ఎం శాండ్‌లో, సిమెంట్ ఇతర వస్తువులను వినియోగిస్తున్నారని, దీని వల్ల కొద్ది సంవత్సరాలకే భవనం శిథిలావస్థకు చేరుకుంటుందని, సంబంధిత శాఖాధికారులు పరిశీలించి నాణ్యతతో నిర్మాణ పనులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని, సామాజిక సేవాకర్త డెంకణీకోటకు చెందిన శివకుమార్, ఉళిమంగలం గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న మైసూరువాసులు

మైసూరు: ఇజ్రాయెల్-పాలస్తీనా దేశాల ఉద్రిక్తతల నడుమ ఇజ్రాయెల్‌లో నివాసం ఉంటున్న పలువురు భారతీయులు ఇబ్బందులు పడుతున్నారు. మైసూరుకు చెందిన ఓ కుటుంబం కూడా అక్కడి బంకర్లలో తలదాచుకుంది. మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా దేవనూరు గ్రామానికి చెందిన చేతన్, అతని భార్య శిల్పశ్రీ, కుమారుడు బంకర్‌లో ఆశ్రయం పొందారు. దీంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు చైతన్యం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

కెలమంగలం: రోడ్డు భద్రతపై కళాశాల విద్యార్థుల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాన్ని రహదార్ల శాఖ చేపట్టింది. అందులో భాగంగా మంగళవారం కెలమంగలం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇంజనీర్ శరవణన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... వాహనదారులైన, పాదచారులైన రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని అన్నారు. కళాశాల విద్యార్థులు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని, తప్పని సరిగా హెల్మెట్లు ధరించాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గోవిందరాజ్ అధ్యక్షత వహించారు. అధికారులు శ్రీనివాసన్, నందకుమార్, తిరుమాల్‌సెల్వం, మణ్ణార్‌మణ్ణన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష


ఎన్టీఆర్ జిల్లా నిడమానూరులో రోగులకు మందులు అందిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని


ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో వైద్యపరీక్షల కోసం వచ్చిన ప్రజలు


శ్రీకాకుళం జిల్లా ఆర్.కరాపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షల కోసం వచ్చిన ప్రజలు


నెల్లూరు నగరంలోని జనార్దనరెడ్డి కాలనీలో రోగులకు రక్త పరీక్షలు చేసి మందులు అందిస్తున్న సిబ్బంది


అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు తీసుకుంటున్న రోగులు


విజయనగరం జిల్లా తెర్లాం మండలం పూనువలసలో వృద్ధురాలి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్


అనకాపల్లి జిల్లా కన్నంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్


అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామంలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు


తిరుపతి నరసింహతీర్థం రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం బుర్రారెడ్డిపల్లెలో దివ్యాంగునికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేంద్ర


గుంటూరు తూర్పు నియోజకవర్గం శారదా కాలనీలో వృద్ధుడికి ఈజీజీ తీస్తున్న సిబ్బంది


కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్సలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు


ప్రకాశం జిల్లా కనిగిరి మండలం ఏరువారిపల్లిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

క్లుప్తంగా...

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరినవారితో ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముసునూరు: సీఎం జగన్ అందిస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులైన 60 మంది టీడీపీ కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిని ఏలూరు జిల్లా ముసునూరు మండలం గోపవరంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధి, పురోగతి కోసం క్రమశిక్షణతో పట్టుదలగా కృషి చేయాలని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ సూచించారు.

గిరిజనాభివృద్ధికి మరింతగా కృషి చేయండి

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళి

సాక్షి, పాడేరు(అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజనాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు మరింత అంకితభావంతో కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వైవీ మురళి ఆదేశించారు. మంగళవారం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో డివిజన్ పరిధిలోని అధికారులతో ఆయన సమీక్షించారు. 2020–21, 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గోకులం నిర్మాణాలను, మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అటవీ హక్కు పత్రాలకు సంబంధించి 8 వేల మంది లబ్ధిదారుల వివరాలను గిరి భూమిలో నమోదు చేసి రైతు భరోసా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బర్త్ వెయిటింగ్ హాల్స్ సేవలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరికరాలకు నిధులు విడుదల చేస్తున్నామన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్.. జగనన్న ఆరోగ్య సురక్షతో పాటు పలు అభివృద్ధి పథకాల అమలును వివరించారు.

చంద్రబాబు అరెస్టుతో టీడీపీ బలోపేతం

- టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్
- భువనేశ్వరి, బ్రాహ్మణితో కలసి చంద్రబాబుతో ములాఖత్

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుతో టీడీపీ మరింత బలోపేతం అవుతోందని ఆ పార్టీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్ అనుభవిస్తున్న చంద్రబాబుతో భువనేశ్వరి, బ్రాహ్మణి, పయ్యావుల కేశవ్ మంగళవారం 40 నిమిషాలపాటు ములాఖత్ అయ్యారు. అంతరం పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ చంద్రబాబును చూడగానే బాధ కలిగినా.. ఆయన చెప్పిన మాటలు చూస్తే ధైర్యం వస్తోందన్నారు. జైల్లో ఉన్నా ప్రజల గురించే ఆలోచిస్తున్నారన్నారు. రాష్ట్రానికి జగన్ అవసరం లేదని ఆయనే చెప్పుకుంటున్నారన్నారు. జగన్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. కృష్ణా జలాలపై పోరాటం చేద్దామని సమరభేరి చేపడితే.. చంద్రబాబును జైల్లో పెట్టారని ఆరోపించారు.

చంద్రబాబుకు డీహైడ్రేషన్..

రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబు డీ–హైడ్రేషన్‌కు గురైనట్లు సమాచారం. ఈ విషయాన్ని ములాఖత్‌కు వెళ్లిన భువనేశ్వరి, బ్రాహ్మణిలకు చంద్రబాబు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే జైల్లో చంద్రబాబును ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షిస్తోంది. జైలులో ఉన్న వైద్యులే కాకుండా రాజమండ్రి జీజీహెచ్ నుంచి సైతం వైద్యులను అందుబాటులో ఉంచారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంచలన ఫలితాలు

- తొలి పది రోజుల్లో 13.7 లక్షల ఓపీ సేవలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సంచలన ఫలితాల దిశగా దూసుకుపోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. చిలకలూరిపేటలోని పురుషోత్తమపట్నంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి విడదల రజిని సందర్శించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు అంటే తొలి పది రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4,041 వైద్య శిబిరాల్లో ఏకంగా 13.7 లక్షల ఓపీ సేవలు నమోదయ్యాయని చెప్పారు. మొత్తం 10,057 వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ శిబిరాల్లో వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు నుంచి ఐదు వేల మంది స్పెషలిస్టు వైద్యులను నియమించామన్నారు. ఇప్పటి వరకు 34 వేల మంది రోగులకు మెరుగైన వైద్యం అవసరం ఉందని గుర్తించి, పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేశామని పేర్కొన్నారు. వీరందరికీ ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వమే ఉచితంగా వైద్యం అందిస్తుందని తెలిపారు. వీరి ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు డీఎంఅండ్‌హెచ్‌వోలు, ఆయా గ్రామాల సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తుంటారని పేర్కొన్నారు. వీరు ఆరోగ్యంగా తిరిగి వచ్చేవరకు ఫాలో అప్ ఉంటుందని, ఆ తర్వాతే వారి కేసు ఆన్‌లైన్‌లో ముగుస్తుందని వెల్లడించారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగమే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని ఆమె వివరించారు.


మందుల కిట్లు అందిస్తున్న మంత్రి విడదల రజిని

సీఐడీ విచారణకు చంద్రబాబు సహకరించాలి

కేసుల్లో తీవ్రత ఉంది కాబట్టే బెయిల్ రావడం లేదు: హోం శాఖ మంత్రి తానేటి వనిత



మంగళగిరి: సీఐడీ విచారణకు చంద్రబాబు సహకరించాలని.. అప్పుడే నిజాలు బయటకు వస్తాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. చంద్రబాబుపై నమోదైన కేసుల్లో తీవ్రత ఉంది కాబట్టే ఆయనకు బెయిల్ రావడం లేదని స్పష్టంచేశారు. మంగళగిరిలోని ఆరో ఏపీ ఎస్పీ బెటాలియన్‌లో మంగళవారం జరిగిన జాగిలాల ప్రదర్శనకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హోంమంత్రి మాట్లాడుతూ కక్షతోనే చంద్రబాబును అరెస్ట్ చేశారని చెబుతున్న ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు.. బాబు తప్పు చేయలేదని చెప్పలేకపోతున్నారని గుర్తు చేశారు. చంద్రబాబును మోయడం తప్ప పవన్ కళ్యాణ్‌కు మరే ఎజెండా లేదన్నారు. మంత్రి రోజాపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, ఏపీఎస్పీ బెటాలియన్ ఆవరణలో 21వ జాగిలాల ప్రదర్శనలు నిర్వహించారు. అధికారుల శిక్షణలో ప్రతిభ కనబరిచిన పలు జాగిలాలు, వాటి శిక్షకులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

చంద్రబాబు అత్యంత అవినీతిపరుడు

- 18 సీట్లతో ప్రతిపక్ష నాయకుడు కావాలనేది ఆయన కోరిక
- మాజీ మంత్రి కొడాలి నాని



చిలకలపూడి (మచిలీపట్నం): ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అత్యంత అవినీతిపరుడని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. ఆయన మంగళవారం మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడారు. రెండెకరాలు మాత్రమే ఆస్తి అని చెప్పుకునే చంద్రబాబుకు రూ.లక్షల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. హెరిటేజ్ సంస్థలో 2 శాతం రూ. 400 కోట్లు అని చెప్పుకునే నారా భువనేశ్వరి ఎన్నికల అఫిడవిట్‌లో ఈ విషయాన్ని తెలిపారా.. అని ప్రశ్నించారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 13 సంవత్సరాల పాటు కేంద్ర నాయకులతో జత కట్టి కోర్టుల్లో కేసులు లేకుండా రూ.లక్షల కోట్లు సంపాదించారన్నారు. చివరకు అతడి పాపాలు పండటంతో అవినీతి బయటపడిందన్నారు. ప్రస్తుతం కేసుల్లో ఉన్న ఆధారాల వల్లే కోర్టులు బెయిల్ నిరాకరిస్తున్నాయన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు 18 సీట్లు కావాలి కాబట్టి చంద్రబాబు, తాను ఎమ్మెల్యే కావాలని పవన్‌కళ్యాణ్ ఆరాటపడుతూ పొత్తులు పెట్టుకున్నారని కొడాలి నాని పేర్కొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే..

మంత్రి ఆదిమూలపు సురేష్



ఒంగోలు అర్బన్: 'చట్టం ముందు అందరూ సమానమే.. తప్పు చేస్తే తప్పించుకోలేరు' అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఒంగోలులోని ప్రకాశం భవనంలో మంగళవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ చంద్రబాబు, లోకేశ్ కేసులకు సంబంధించి ఎటువంటి రాజకీయ ఉద్దేశాలు లేవని చెప్పారు. కొన్ని పార్టీలకు అండగా బీజేపీ నేత పురందేశ్వరి ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. మద్యం విక్రయాలపై బురద చల్లడం సరికాదన్నారు. దశలవారీగా మద్య నిషేధానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

అవినీతిని కాపాడటానికా సెక్షన్ 17ఏ?

▶ మొదటి పేజీ తరువాయి

పాల్పడలేదని కానీ... షెల్ కంపెనీల ద్వారా నిధులను కొల్లగొట్టడం జరగలేదని కానీ మొదటి నుంచీ ఒక్క ముక్క కూడా చెప్పని చంద్రబాబు... తాజా విచారణలో సైతం అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ కింద తన అరెస్టు చెల్లదని, కాబట్టి కేసును కొట్టేయాలనే సాంకేతిక అంశాలనే సుప్రీం కోర్టు ధర్మాసనానికి వినిపించారు. నిజానికి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ)ను 2018లో సవరించారు. కొన్ని పదవుల్లో ఉన్నవారికి అరెస్టు విషయంలో రక్షణ ఉండేలా... తగిన అనుమతితో అరెస్టు చేసేలా ఈ సవరణ చేశారు. కాకపోతే స్కిల్ కుంభకోణం 2018కి ముందే జరగటం... ఈ కేసులో పలు ఐపీసీ సెక్షన్లు కూడా ఉండటం వల్ల సెక్షన్ 17ఏ వర్తించదని ప్రతి కోర్టులోనూ చెబుతున్నా... సుప్రీం కోర్టులో సైతం ఇదే విషయంపై చంద్రబాబు లాయర్లు వాదనలు వినిపించటం గమనార్హం.

సెక్షన్ 17ఏ అవినీతి కేసుల నుంచి కాపాడటానికా?

అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ అనేది అవినీతి కేసుల నుంచి కాపాడటానికి కాదని మంగళవారం నాటి వాదనల్లో ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి చెప్పారు. మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదీతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ నేరం కొన్నేళ్ల తర్వాత బయటపడితే అప్పటి చట్టాలకు లోబడే దర్యాప్తు జరుగుతుందని రోహత్గి ధర్మాసనానికి చెప్పారు. 'చంద్రబాబు కేసు విషయానికొస్తే ఈ చట్ట సవరణ 2018లో జరిగింది. కానీ నేరం 2018 కంటే ముందు జరిగింది. మరి అప్పట్లో జరిగిన నేరాన్ని అప్పటి చట్టాల ప్రకారమే దర్యాప్తు చేస్తారు కదా? 17ఏ అనేది ఈ కేసులో ఒక భాగం మాత్రమే' అని వివరించారు. దర్యాప్తు అధికారి వద్ద ఉన్న సాక్ష్యాలు, ఆధారాలను బట్టి కోర్టు నిర్ణయం తీసుకోవాలని చెప్పారాయన. ఈ సందర్భంగా ఇరు పక్షాలకు ధర్మాసనం పలు ప్రశ్నలు వేసింది. ప్రధానంగా ఈ కేసుకు సెక్షన్ 17ఏ వర్తించడంపై ఇరు పక్షాల న్యాయవాదులనూ నిలదీసింది.

తొలుత చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే సోమవారం నాటి వాదనలను కొనసాగించారు. తనకు మరో గంట సమయమివ్వాలని ధర్మాసనాన్ని కోరగా అనుమతించింది. మూడు రోజులుగా వేచి చూస్తున్నామని ఇది ఇప్పటికే కొట్టేయాల్సిన కేసు అని ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనానికి తెలిపారు. అసలు నోటీసులివ్వకుండా మరోసారి వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వకూడదన్నారు. క్రిమినల్ కేసులకు కౌంటరు అఫిడవిట్ అక్కర్లేదని హరీష్ సాల్వే పేర్కొనగా... ముకుల్ రోహత్గి విభేదించారు. కోర్టు ప్రొసీజర్‌ను అనుసరించాలని కోరారు. నిందితుడికి రక్షణ కల్పించే అంశాలు కోర్టుకు వివరిస్తానని, గంట సేపు వాదనలకు అవకాశం ఇవ్వాలని సాల్వే మరోసారి కోరగా ధర్మాసనం అనుమతించింది.

గవర్నరు అనుమతి లేకుండా అరెస్టు చేశారు: సాల్వే

సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి లేకుండా దర్యాప్తు చేయడం సరికాదని సాల్వే తెలిపారు. ముందుగా అనుమతి తీసుకున్నాకే చర్యలు చేపట్టాలన్నారు. సెక్షన్ 17ఏ దుర్వినియోగం కాకుండా ఉండాలనే తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు కేసులో యశ్వంత్ సిన్హాపై దాఖలైన కేసుతో సహా మూడు కేసుల్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దర్యాప్తు అనేది హక్కు కాదని అవినీతి నిరోధక చట్టం చెబుతోందంటూ... ఆర్టికల్ 20(1)కి సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు కూడా సాల్వే ఉదహరించారు. సాల్వే ఇలా పలు తీర్పులను ప్రస్తావిస్తుండగా... జస్టిస్ బోస్ వారించారు. చంద్రబాబు అరెస్టుకు గవర్నర్ అనుమతి ఉండాలని చెప్పడమే తన ఉద్దేశమని సాల్వే వ్యాఖ్యానించారు. దీంతో అసలు ఎఫ్ఐఆర్‌లో ఉన్న అభియోగాలేంటని జస్టిస్ బేలా ఎం త్రివేదీ ఆరా తీశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో కుట్రకు పాల్పడ్డారన్నది ప్రధాన అభియోగం అని సాల్వే తెలిపారు. ఐపీసీ సెక్షన్ 120బీ, సెక్షన్ 420, సెక్షన్ 465, అవినీతి నిరోధక (పీసీ) చట్టం సెక్షన్ 12, సెక్షన్ 13 వంటివి ఈ కేసులో ఉన్నాయన్నారు. 'ఈ కేసు పూర్తిగా అవినీతి నిరోధక చట్టం కిందనే ఉంది. ఆ చట్టం లేకపోతే మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాల్సి వచ్చేది' అని అన్నారు. అయితే ఈ అభియోగాలన్నీ మేజిస్ట్రేట్ ముందు విచారణ చేయతగిన అభియోగాలేనా? అని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. పీసీ చట్టం మినహాయిస్తే ఇవన్నీ మేజిస్ట్రేట్ పరిధిలోవేనని సాల్వే తెలిపారు. మధ్యప్రదేశ్‌లో కొన్ని అంశాల్లో సెషన్స్ కోర్టుకు వెళ్లిన దాఖలాలున్నాయని చంద్రబాబు తరఫు మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా చెప్పగా... జస్టిస్ త్రివేది జోక్యం చేసుకుని దేశమంతా ఒకే విధంగా ఉంటుందని, మేజిస్ట్రేట్ పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో చంద్రబాబు తరఫున వాదనలు ముగించారు.

సవరణల పేరుతో కేసు కొట్టేయమంటే ఎలా?: రోహత్గి

ఏపీ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి... చంద్రబాబుపై నమోదైన కేసులో ఎలాంటి రాజకీయ కక్షా లేదని మరోసారి స్పష్టం చేశారు. 'ఎఫ్ఐఆర్ 2021లో నమోదైంది. 2023లో చంద్రబాబును నిందితుడిగా చేర్చారు' అంటూ సెప్టెంబరు 8 నుంచి జరిగిన పరిణామాలను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. 'చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసింది. ఈ కేసు పీసీ చట్టంలోని సెక్షన్ 17ఏకు లోబడే ఉందని కూడా హైకోర్టు స్పష్టం చేసింది. అయినా అరెస్టయిన వెంటనే బెయిలు గురించో, రిమాండ్ వద్దనో కాకుండా నేరుగా పూర్తి కేసును కొట్టేయాలంటూ క్వాష్ పిటిషన్ వేశారంటే చంద్రబాబు ఏంటో అర్థం చేసుకోవాలి. రెండు రోజుల్లోనే హైకోర్టు ముందుకు క్వాష్ పిటిషన్ విచారణకు వచ్చిందంటే నిందితుడి ఉద్దేశాలను కోర్టు ఆలోచించాలి. కాకపోతే హైకోర్టు ఈ క్వాష్ పిటిషన్ కొట్టేసింది' అని రోహత్గీ వివరించారు. ఒకే కేసులో అవినీతి నిరోధక చట్టం, ఐపీసీ సెక్షన్లు ఉన్నప్పుడు ఏం చేయాలనే దానిపై కోర్టుకు రోహత్గీ వివరణ ఇచ్చారు. చేసిన నేరానికి రెండు సెక్షన్లు వర్తింపజేసినప్పుడు ఏసీబీ కోర్టుకి రెండింటినీ విచారించే పరిధి ఉంటుందన్నారు. అయితే, సాల్వే చెప్పినట్లుగా అవినీతి నిరోధక చట్టాన్ని తొలగిస్తే.. సీఆర్‌పీసీ సెక్షన్ 3 కింద పేర్కొన్న నేరంతోపాటు ఇతర అభియోగాలు కూడా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పరిశీలించవచ్చునని చెప్పారు. ఈ దశలో జస్టిస్ త్రివేది జోక్యం చేసుకుని అవినీతి నిరోధక చట్టం తొలగించినప్పుడు సెక్షన్ 4(3) కూడా వర్తించదు కదా? అని ప్రశ్నించారు. అందుకే ఒకే కేసులో వేర్వేరు అభియోగాలుంటే ఏం చేయాలనే దానిపై సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చిందని రోహత్గీ చెప్పారు. చంద్రబాబు కేసులో పీసీ చట్టాన్ని తొలగించినా మిగతా అభియోగాలపై ప్రత్యేక కోర్టు దర్యాప్తు చేయొచ్చని వివరించారు. 'చంద్రబాబు న్యాయవాది సాల్వే ప్రకారం ఈ కేసులో పీసీ చట్టం అభియోగాలు తొలగిస్తే.. సెక్షన్ 4(3) అభియోగాలకు అర్హత లేదు. అప్పుడు ప్రత్యేక కోర్టు పరిధి... ఆ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు సంగతేంటి' అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించారు. సెక్షన్ 420 కింద అభియోగాలు ఉంటే వాటిని తొలగించలేమని, అదే విధంగా ఈ కేసులో పీసీ చట్టాన్ని కూడా తొలగించలేమని రోహత్గీ చెప్పారు. 'ఒక వ్యక్తి మరో వ్యక్తిని కొడితే ఆ కేసులో ఉద్దేశపూర్వకంగా కొట్టడంతో పాటు స్వచ్ఛందంగా హాని కలిగించడానికి సంబంధించిన సెక్షన్ 323 కూడా ఉంటుంది. ఆ సెక్షన్‌ను గనక తొలగిస్తే అభియోగాలు పోతాయా? చట్ట ప్రకారం సదరు వ్యక్తికి శిక్ష పడాలి కదా? సవరణల ద్వారా వచ్చిన కొత్త సెక్షన్లు చట్టానికి బలం చేకూర్చాలి తప్ప సవరణ పేరుతో కేసును కొట్టేయమంటే ఎలా?' అని రోహత్గి ప్రశ్నించారు.

ఎప్పటి నేరాలకు అప్పటి సెక్షన్లు...

2018 కన్నా ముందు జరిగిన నేరాలకు సెక్షన్ 17ఏ వర్తించదని రోహత్గీ చెప్పారు. 'సెక్షన్ 17ఏ వల్ల దర్యాప్తునకు కొన్ని మినహాయింపులు వచ్చాయి. అంతే!. 2018లో పీసీ చట్టంలో కొన్ని సెక్షన్లు తొలగించారు. కానీ అంతకు ముందు జరిగిన నేరాలకు తొలగించిన సెక్షన్లు కూడా వర్తిస్తాయి. బాబు కేసు కూడా అంతే. చంద్రబాబుపై పీసీ చట్టం సెక్షన్ 13(1), (సీ), (డీ) అభియోగాలు ఉన్నాయి' అన్నారు. ఆ సెక్షన్లను చట్టం నుంచి తొలగించారుగా? అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించగా... ఇంతకు ముందు తాను చెప్పిన అంశం ఇదేనని, సవరణకు ముందు జరిగిన నేరాలకు తొలగించిన సెక్షన్లు వర్తిస్తాయని రోహత్గీ వివరించారు. చంద్రబాబు నిర్ణయాలు, అక్రమాల వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వచ్చిందన్నారు. ఈ అంశాలు దర్యాప్తు సంస్థ ఎప్పుడు గుర్తించిందో తెలపాలని జస్టిస్ త్రివేదీ కోరారు. ట్రయల్ దశలోనే గుర్తించారని రోహత్గి తెలిపారు. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ కొత్త విషయాలు తెరపైకి వచ్చాయని, భారీ స్థాయిలో అవినీతి జరిగినప్పుడు ప్రాథమికంగానే కేసు కొట్టేయాలని కోరడం సరికాదని రోహత్గి తెలిపారు. చట్ట సవరణ ఎప్పుడు చేయాలి? దాన్ని ఎప్పటి నుంచి అమలులోకి తేవాలి? అనేది పార్లమెంటు అధికారమని, అయితే ఈ కేసులో 2018 కన్నా ముందు జరిగిన నేరాలకు సెక్షన్ 17ఏ ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాలని సవరణలో ఎక్కడా లేదని రోహత్గీ వివరించారు. 'తప్పు చేసిన వారంతా సెక్షన్ 17ఏను చూపించి అనుమతులు తీసుకురమ్మంటే ఎలా? ఇలాగైతే దర్యాప్తు చేయడానికి అధికారులు ముందుకొస్తారా? మన పార్లమెంటు విధానమే అవినీతి రహిత దేశం... ఇందులో భాగంగానే చట్టాలు, సవరణలు వచ్చాయి. కాబట్టి అవినీతికి పాల్పడే వారికి సెక్షన్ 17ఏ అండ కాకూడదు. అది ఉన్నది నిజాయితీ పరులకు మద్దతు ఇవ్వటానికి' అని రోహత్గీ వివరించారు. చంద్రబాబు క్వాష్ పిటిషన్ వేశారు కనక ఈ దశలో మెరిట్స్‌లోకి వెళ్లకూడదని ముకుల్ రోహత్గి పేర్కొన్నారు. అధికారిక విధులంటే ఏంటి? సిఫార్సులు అంటే ఏంటి? నిర్ణయాలంటే ఏంటి? ఇవన్నీ సాక్ష్యాల మీద ఆధారపడి ఉంటాయని, మౌఖికంగా వాదించేది కాదని రోహత్గి తెలిపారు. సెక్షన్ 17ఏ రక్షణ కల్పిస్తుందా అని జస్టిస్ బోస్ ప్రశ్నించగా.. గతంలో జరిగిన వాటికి రక్షణగా ఉండదని, కానీ పిటిషనర్ అదే కోరుకుంటున్నారని రోహత్గి తెలిపారు.

ఎప్పుడైనా కేసు నమోదు చేయొచ్చు...

సవరణ తర్వాత సదరు చట్టం నుంచి సెక్షన్‌ను తొలగిస్తే.. ఆ సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చా? అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించారు. దానికి వెసులుబాటు ఉందని రోహత్గి చెప్పారు. 'ఫలానా నేరానికి ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదని ఏ చట్టమూ చెప్పలేదు. కాబట్టి సెక్షన్ తొలగించారని అనడం సరికాదు' అన్నారు. దీన్ని వివరించాలని జస్టిస్ త్రివేది కోరగా... 'ఆర్టికల్ 20(1) ప్రకారం ఓ వ్యక్తి నేరం చేసిన విషయం కొన్నేళ్ల తర్వాత తెలిసినా కూడా కేసు నమోదు చేయొచ్చని చట్టం చెబుతోంది. దీనికి కొన్ని పరిధులు ఉండొచ్చు కానీ కేసు నమోదుకు ఆటంకమేమీ ఉండదు. మూడేళ్లకు మించి శిక్ష పడే కేసులకు ఏదో ఒక దశలో ఎఫ్ఐఆర్ ఉండాలని సీఆర్‌పీసీ సెక్షన్ 468 చెబుతోంది' అంటూ సీఆర్‌పీసీ సెక్షన్ 6 గురించి రోహత్గి చెప్పబోతుండగా.. విచారణ అవసరం లేదంటోందిగా?! అని జస్టిస్ త్రివేది అడిగారు. 'అవును నిజమే. కానీ ఇక్కడ ఎఫ్ఐఆర్ నమోదయిందా లేదా అనేది ముఖ్యం' అని రోహత్గి చెప్పారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం వేరే కేసులు ఉన్నాయని విచారణను శుక్రవారం మధ్యాహ్నానికి వాయిదా వేస్తామని ధర్మాసనం పేర్కొంది. అయితే వాదనలు మంగళవారమే ముగించాలని లూథ్రా కోరగా ధర్మాసనం నిరాకరించింది.

అత్యవసర విచారణ కుదరదు

ఐఆర్ఆర్, అంగళ్లు కేసుల్లో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్లపై హైకోర్టు.. నేడు విచారణ

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్లపై అత్యవసర విచారణ కుదరదని హైకోర్టు స్పష్టంచేసింది. సాధారణ పద్ధతిలోనే ఆ పిటిషన్లను విచారణ చేస్తామని తెలిపింది. ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పులో అక్రమాలు, క్విడ్ ప్రో కోపై సీఐడీ నమోదు చేసిన కేసులో తాను కస్టడీలో ఉన్నట్లు భావించి (డీమ్డ్), తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో... ఆయన మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణ జరపాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులు కోరారు. వారి అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. సాధారణ పద్ధతిలోనే విచారిస్తామని స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యంపై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి విచారణ జరపనున్నారు. కాగా, అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణుల విధ్వంసంపై ముదివీడు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై కూడా లంచ్ మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణ జరపాలని చంద్రబాబు న్యాయవాదులు హైకోర్టును అభ్యర్థించారు. వారి అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. సాధారణ పద్ధతిలోనే బుధవారం విచారణ జరుపుతామని చెప్పింది.

నారాయణ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

ఐఆర్ఆర్ కేసులో తనను ఈ నెల 4న విచారణకు హాజరుకావాలంటూ సీఐడీ ఇచ్చిన నోటీసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి నారాయణ దాఖలు చేసిన పిటిషన్‌లో తదుపరి విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ చక్రవర్తి విచారణ జరిపారు.

నారాయణ బావమరిది పిటిషన్‌పై నేడు విచారణ

ఐఆర్ఆర్ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఈ కేసులో 17వ నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి నారాయణ బావమరిది ఆవుల మునిశంకర్ మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సురేష్‌రెడ్డి బుధవారం విచారణ జరపనున్నారు. మరోవైపు ఐఆర్ఆర్ కేసులో తనను విచారణకు హాజరు కావాలంటూ సీఐడీ జారీ చేసిన నోటీసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి నారాయణ అల్లుడు కె.పునీత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి పిటీషనర్ పునీత్‌ను న్యాయవాది కనిపించేంత దూరంలో ఉంచి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించాలని సీఐడీని ఆదేశించారు.


ప్రమీలా ప్రభ

శత్రు దేశాలు, ఉగ్రమూకలు, తీవ్రవాదులు విరుచుకుపడినప్పుడు ఎంత శక్తిమంతమైన దేశమైనా అల్లకల్లోలంగా మారిపోతుంది. ఆ మధ్యన అఫ్ఘానిస్థాన్ పరిస్థితి ఇలానే ఉండేది. అది మర్చిపోయే లోపు ఉక్రేయిన్ రష్యా యుద్ధం మొదలై నేటికీ కొనసాగుతూనే ఉంది. అఫ్ఘానిస్థాన్, ఉక్రెయిన్‌లలో ఏర్పడిన పరిస్థితులకు భయపడిపోయిన చాలామంది ప్రజలు ప్రాణాలు అరచేత బట్టి దేశం విడిచి పారిపోయారు. ఇక ఆయా దేశాల్లో ఉన్న విదేశీయులు ముందుగానే పెట్టే బేడా సర్దుకుని తమ తమ దేశాలకు పరుగెత్తు కెళ్లారు. ప్రస్తుతం ఇజ్రాయెల్ పరిస్థితి కూడా ఇలానే ఉంది. అయినా అక్కడ నివసిస్తోన్న 41 ఏళ్ల ప్రమీలా ప్రభ మాత్రం "నేను ఇండియా రాను. ఇక్కడే ఉండి సేవలందిస్తాను" అని ధైర్యంగా చెబుతోంది.

పారిపోను.. సాయం చేస్తా

కర్ణాటకలోని ఉడిపి జిల్లా.. హెర్గాలో పుట్టి పెరిగింది ప్రమీలా ప్రభ. మైసూర్‌లో చదువుకుంది. చదువు పూర్తయ్యాక ఉడిపిలోని మణిపాల్ ఆసుపత్రిలో నర్స్‌గా చేరింది. కొన్నాళ్లు ఇక్కడ పనిచేశాక, ఇజ్రాయేల్‌లో మంచి జీతంతో ఉద్యోగం దొరకడంతో.. తన ఇద్దరు పిల్లలతో ఇజ్రాయెల్‌కు వెళ్లింది. గత ఆరేళ్లుగా అక్కడే ఉంటోన్న ప్రమీలా ఆ దేశం మీద అక్కడి ప్రజల మీద మమకారం పెంచుకుంది. అందుకే పరిస్థితులు దారుణంగా ఉన్నప్పటికీ ... ''ఇండియా నాకు జన్మనిస్తే.. ఇజ్రాయెల్ జీవితాన్నిచ్చింది. ఇలాంటి కష్ట సమయంలో దేశాన్ని వదిలి రాను. నేను చేయగలిగిన సాయం చేస్తాను'' అని కరాఖండిగా చెబుతూ అక్కడి పరిస్థితులను ఇలా వివరించింది....

నేను టెల్ అవీవ్ యాఫోలో నివసిస్తున్నాను. అక్టోబర్ 7తేదీన రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో భోజనం చేశాము. అప్పుడు ఎమర్జెన్సీ సైరన్ వినిపించింది. వెంటనే మేమంతా బంకర్‌లోకి వెళ్లిపోయాము. దాదాపు రాత్రంతా సైరన్ వినిపిస్తూనే ఉంది. నేను ఇజ్రాయెల్ వచ్చాక ఇంతపెద్ద హింసను ఎప్పుడూ చూడలేదు. మా ఇంటికి కిలోమీటర్ దూరంలో బాంబులు పడుతున్నాయి. పెద్దపెద్ద శబ్దాలు ఒక్కసారిగా భయపెట్టేశాయి. ఇక్కడ ప్రతి ఇంటికి బంకర్‌లు ఉన్నాయి. పబ్లిక్ ప్లేసుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బంకర్లు కూడా ఉన్నాయి. ఎమర్జెన్సీ సమయంలో ఎవరైనా వీటిలోకి వెళ్లి తలదాచుకోవచ్చు. సైరన్ మోగిన వెంటనే కనీసం ముప్పైసెకన్ల పాటు బాంబుల శబ్దాలు వినపడుతున్నాయి. దశాబ్దకాలంగా ఇజ్రాయెల్‌పై తీవ్రవాద సంస్థ హమాస్ దాడులకు తెగబడుతూనే ఉంది. హమాస్ వల్ల గాజా కూడా దాడులతో కొట్టుమిట్టాడుతూనే ఉంది. ఇప్పటికే వెయ్యిమందికిపైగా చనిపోయారు. ఇక్కడి ప్రజలు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. టెల్ అవీవ్‌లో షాపులు అన్నీ మూసేసారు. వీధుల్లో అక్కడక్కడ ఒకరిద్దరు మాత్రమే విక్రయాలు జరుపుతున్నారు. అందరూ కిరాణా సామాన్లు తెచ్చుకుని నిల్వ చేసుకుంటున్నారు.

అరగంట లోపలే...

మా చెల్లి ప్రవీణ జెరుసలేంలోని ఓ ఆసుపత్రిలో పనిచేస్తోంది. నేను టెల్ అవీవ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాను. ఈ అపార్ట్‌మెంట్‌లో ముప్పై మంది వరకు ఉన్నారు. మేమంతా అత్యవసరమైన ఆహారం, నీళ్లు, టార్చ్‌లైట్ వంటివాటిని దగ్గర ఉంచుకుని బేస్‌మెంట్ తలుపులు తెరుచుకుని ...సైరన్ రాగానే బంకర్‌లోకి పరుగెడుతున్నాం. సైరన్ ఆగినప్పుడు బంకర్‌ల నుంచి బయటకు వస్తున్నాం. బంకర్‌లోకి వెళ్లిన ప్రతిసారి అరగంట పాటు లోపలే ఉండాల్సి వస్తోంది.



ఊహకందని దాడి

ఇజ్రాయెల్‌మీద పాలస్తీనా దాడులు చేయడం ఇది కొత్తేమీ కాదు. కానీ ఇప్పుడు జరిగిన దాడి అస్సలు ఊహించలేదు. ఊహకందని వికృతదాడికి హమాస్ సంస్థ పాల్పడింది. దక్షిణ ఇజ్రాయెల్‌లో శాంతికోసం ఏర్పాటు చేసిన 'మ్యూజిక్ ఫెస్టివల్'ను ఇలా అశాంతిగా మారుస్తారని అసలు ఊహించలేదు. ఆ ఫెస్టివల్ గురించి అత్యంత బాధాకరమైన వార్తలు వినాల్సి వస్తోంది. ఇజ్రాయెల్ ఎప్పుడూ.. యుద్ధానికి అన్నిరకాలా సన్నద్ధమై ఉండి, రక్షణాత్మక చర్యలను పర్యవేక్షిస్తుంటుంది. లేదంటే మరింతమంది హమాస్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయేవారు.

ఇప్పుడు రాలేను..

ఇజ్రాయెల్ నాకు జీవితాన్నిచ్చింది. వీరు కష్టాల్లో ఉన్నప్పుడు నేను నా మాతృదేశం వచ్చి సంతోషంగా ఉండలేను. ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుమతిస్తే నా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాను. ఉడిపిలో ఉన్న మా కుటుంబ సభ్యులు పదేపదే ఫోన్ చేస్తున్నారు. నేను క్షేమంగా ఉన్నానా... లేదా... అని కంగారు పడుతున్నారు. ఇక నా పిల్లలు ఇండియా వెళ్లిపోయారు. వారిని విడిచి ఇక్కడ ఉన్నాను. వాళ్లంతా గుర్తొస్తున్నారు. అయినా ఇంతటి విపత్కర పరిస్థితుల నుంచి పారిపోవాలనుకోవడం లేదు. పరిస్థితులు చక్కబడిన తరువాత ఇండియా తిరిగి రావడం గురించి ఆలోచిస్తాను'' అని చెబుతూ ఎంతోమంది స్ఫూర్తిగా నిలుస్తోంది ప్రమీలా ప్రభ.

పురస్కారం


గౌరీ గిల్

లక్ష సైనికుల కోటి కన్నుల కెమెరా

'నా చేతిలో కెమెరా ఉంటే నాకు భయమనేదే లేదు' అనేది ఫొటోగ్రాఫర్ గౌరీ గిల్‌కు ఇష్టమైన మాట.

ఈ కారణం వల్లే కావచ్చు ఆమె ఏ భయమూ లేకుండా మారుమూల పల్లెల నుంచి మహా అరణ్యాల వరకు వెళ్లింది. తన భుజాల మీద కెమెరా ఉంటే, తన చుట్టూ లక్షల సైన్యం ఉన్నట్లే. వర్తమాన చరిత్ర, సంస్కృతి, సంబరాన్ని తన కెమెరా కంటితో పట్టుకుంది గౌరీ గిల్. తన ఫొటో సిరీస్ 'నోట్స్ ఫ్రమ్ ది డిజర్ట్'తో ప్రతిష్ఠాత్మకమైన ప్రిక్స్ పిక్‌టెట్ అవార్డ్ గెలుచుకుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన మల్టీనేషనల్ ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ పిక్‌టెట్ 'ప్రిక్స్ పిక్‌టెట్' (ఇంటర్నేషనల్ అవార్డ్ ఇన్ ఫొటోగ్రఫీ)కి 2008లో శ్రీకారం చుట్టింది...

చండీగఢ్‌లో పుట్టిన గౌరి గిల్ దిల్లీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో బీఎఫ్ఏ చేసింది. న్యూయార్క్‌లోని 'పార్సన్స్ స్కూల్ ఆఫ్ డిజైన్'లో ఫొటోగ్రఫీలో బీఎఫ్ఏ, స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో ఫొటోగ్రఫీలో ఎంఎఫ్ఏ చేసింది. అమెరికా, ఇండియాలో ఉన్న బంధువులను ఫొటోలు తీయడంతో తన ప్రయాణం మొదలైంది.

రాజస్థాన్‌లోని అట్టడుగు వర్గాల జీవితాలను అధ్యయనం చేసిన తరువాత తాను చేసిన ఫొటో ప్రాజెక్ట్ 'నోట్స్ ఫ్రమ్ ది డెజర్ట్'కు మంచి పేరు వచ్చింది. 'ది మార్క్ ఆన్ ది వాల్' 'జన్నత్'... మొదలైన ఎగ్జిబిషన్‌లు, ప్రాజెక్ట్‌లతో ప్రశంసలు అందుకుంది.

నోట్స్ ఫ్రమ్ ది డెజర్ట్ ప్రాజెక్ట్ విషయానికి వస్తే... ఈ ప్రాజెక్ట్ కోసం రాజస్థాన్‌లోకి అడుగు పెట్టినప్పుడు అక్కడి పరిస్థితుల గురించి పెద్దగా ఏమీ తెలియదు. ఒక్కొక్క అడుగు వేస్తూ అక్కడి సమాజాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించింది. సంచారుల నుంచి రైతుల వరకు ఎంతోమందితో మాట్లాడింది. కాలాలతో పాటు మారే వ్యక్తుల జీవితాలను గమనించింది. తాను పరిశీలించిన జీవితాల గురించి డైరీలో రాసుకుంది.

> 2011లో కెనడాలోని ప్రతిష్ఠాత్మకమైన ఫొటోగ్రఫీ అవార్డ్ గ్రాంజ్ గెలుచుకొని ప్రపంచ దృష్టిని ఆకర్షించిన గౌరికి వినడం ఇష్టమైన పని. విన్న విషయాలను విశ్లేషించుకొని తన కెమెరాకు ముడిసరుకుగా మార్చుకోవడం మరింత ఇష్టమైన పని.

ఆ తరువాత తన కెమెరా ప్రయాణం రాజస్థాన్ మారుమూల ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని ఆదివాసుల ఇళ్ల దగ్గరకు చేరింది. వర్లీ ఆర్ట్‌ను ఒడిసిపట్టుకుంది. ఫలానా ఊళ్లో ఫలానా ప్రత్యేకత ఉందనే మాట చెవికి సోకగానే రెక్కలు కట్టుకొని అక్కడ వాలుతుంది. మోహడా అనే ఊళ్లో గ్రామస్థులు పురాణ పాత్రల మాస్క్‌లను ధరించి పెద్ద ఊరేగింపు తీస్తారు. ఈ మాస్క్‌లనే సబ్జెక్ట్‌గా తీసుకొని ఫొటో ప్రాజెక్ట్ చేసింది. ఒకరోజు ఒక గ్రామంలోని పశువుల ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్ లేడు. అయితే ఆ డాక్టర్ సీట్‌లో దోమ మాస్క్ పెట్టుకొని ఒక వ్యక్తి కూర్చున్నాడు. పేషెంట్ సీట్లో కూర్చున్న వ్యక్తి ఏదో మాస్క్ పెట్టుకున్నాడు. ఆ ఆస్పత్రిలోని పాత సామాను, గోడలకు వేసిన రంగులు, ఆస్పత్రి చుట్టుపక్కల రకరకాల ఆవులు, వాటిని కాచుకు కూర్చున్న రైతులు... ఈ అంశాలన్నీ వచ్చేలా ఫొటోలు తీసింది. ఈ ఫొటోల నుంచి ఆలోచించిన వారికి ఆలోచించినన్ని కోణాలు కనిపిస్తాయి. ఎవరి వ్యాఖ్యానాలూ అవసరం లేకుండానే సమాధానాలు దొరుకుతాయి.

మొదట్లో ఒక పత్రికలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసింది గౌరి. తన ఆసక్తి గ్రామాలు, మారుమూల పల్లెల్లోని స్కూళ్లపై ఉండేది. అయితే తన ఉద్యోగం ద్వారా పల్లెలకు వెళ్లే అవకాశం రాలేదు. దీంతో పల్లెబాట పట్టడానికి ఉద్యోగాన్ని వదిలింది. ఎన్నో స్కూళ్ల చుట్టూ తిరిగింది. 'ఇది స్కూల్ కాదు. ఇదే అసలుసిసలు ప్రపంచం' అనుకుంది. 'ది మార్క్ ఆన్ ది వాల్' ప్రాజెక్ట్‌తో ప్రభుత్వ పాఠశాలల్లోని గోడలపై ఉన్న రాతలు, చిత్రాలను డాక్యుమెంట్ చేసింది. 'ట్రేసెస్' పేరుతో సమాధులపై చేసిన ప్రాజెక్ట్ మరో అద్భుతం. నిజానికి గౌరీ గిల్ అద్భుతాలు సృష్టించడానికి కెమెరా పట్టుకోలేదు. భిన్న సంస్కృతులు, భౌగోళిక అందాలపై ఆసక్తే అద్భుతాలను సృష్టించి ఆమెను అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్‌ని చేశాయి.

బ్యూటిప్స్

తొక్కతో తోమేయండి!



పాదాలను మెరిపించడంలో అరటితొక్కలు చక్కగా పనిచేస్తాయి.

- అరటితొక్కలను పాదాలపైన రుద్దితే మృతకణాలు, దుమ్మూ ధూళీ తొలగిపోతాయి.
- అరటి తొక్కలను ముక్కలుగా తరిగి కొద్దిగా తేనె వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టుని పాదాలకు రాయాలి. అరగంట తరువాత సాధారణ నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల పాదాలు మృదువుగా మారడంతో పాటు, చక్కగా మెరుస్తాయి.
- అరటితొక్కల పేస్టులో కొద్దిగా అలోవెరా జెల్ కలపాలి. ఈ పేస్టుని పాదాలకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. ఈ పేస్టు పాదాలకు తేమనందించి కోమలంగా ఉంచుతుంది.
- అరటితొక్కల పేస్టులో కాఫీపొడి, తేనె వేసి కలిపి స్క్రబర్‌లా పదిహేను నిమిషాలు రుద్దాలి. పాదాలపైన మురికి, మలినాలు పోయి చక్కగా మెరుస్తాయి.

కిచెన్‌టిప్స్

మంచుకొండలా? అమ్మో వద్దు..!

ఫ్రీజర్‌లో చిన్నచిన్న మంచుకొండల్లా ఐస్ పేరుకుపోతుంది. ఇలా గడ్డకట్టిన ఐస్‌పైన కొన్ని ఆహార పదార్థాలు పెడితే పాడవుతాయి. ఐస్ ఒకపట్టాన కరగదు. ఇలాంటప్పుడు ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్య తీరిపోతుంది.



- రిఫ్రిజిరేటర్ పవర్ స్విచ్ ఆపేసి గడ్డకట్టిన ఐస్‌ను కరిగించాలి.
- ఇప్పుడు బంగాళదుంపను శుభ్రంగా కడిగి రెండు ముక్కలు చేయాలి. రెండు ముక్కలతో ఫ్రీజర్ ర్యాక్స్‌ను రుద్దాలి. మూలల్లో కూడా జాగ్రత్తగా రుద్దాలి. ఇలా చేస్తే ఫ్రీజర్‌లో త్వరగా మంచు ఉండలు ఏర్పడవు.
- అవసరాన్ని బట్టి రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతలను మార్చుకుంటూ ఉంటే ఐస్ ఏర్పడదు.
- ఫ్రీజర్‌లో అతిగా ఆహార పదార్థాలను పెట్టకూడదు. ఎక్కువ మొత్తంలో వస్తువులు పెడితే ఐస్ ఏర్పడడానికి ఖాళీ ఉండదని కుక్కేస్తుంటారు. ఫ్రీజర్‌లో ఎంత ఎక్కువమొత్తంలో వస్తువులు ఉంటే అంత ఎక్కువ తేమ ఏర్పడి ఐస్‌గా మారుతుంది.
- చాలామంది ఇంటిని శుభ్రం చేస్తుంటారు కానీ రిఫ్రిజిరేటర్‌ను పెద్దగా పట్టించుకోరు. కనీసం పదిరోజులకొకసారి స్విచ్ ఆపేసి, లోపల ఉన్న పదార్థాలను బయటపెట్టి శుభ్రం చేస్తే ఐస్ సమస్య అంతగా ఉండదు.

గార్డెన్‌టిప్స్

పుల్లలతో పూలు పూస్తాయి!

గార్డెన్‌లో ఎంతో ఇష్టంగా మొక్కలు పెంచుతుంటాము. సమయానికి నీళ్లుపోసి, మొక్కల ఎదుగుదలకోసం ప్రత్యేక శ్రద్ధ వహించినప్పటికీ కొన్ని మొక్కలు బలహీనంగా, వాడిపోయినట్టుగా ఉంటాయి. ఇలాంటి మొక్కలను పూలతో చక్కగా కళకళలాడేలా చేయాలంటే పాదులో అగ్గిపుల్లలు గుచ్చాలి. అవును అగ్గిపుల్లలే...



- అగ్గిపుల్లలను యాంటీమోనీ సల్ఫైడ్, పొటాషియం, సల్ఫర్, మెగ్నీషియం, క్లోరేట్ రసాయనాలతో తయారు చేస్తారు. ఈ రసాయనాలు మొక్కలకు క్రిమిసంహారాలుగా పనిచేస్తాయి.
- అంతేగాక ఇవి వేర్లకు బలాన్ని ఇస్తాయి. సల్ఫర్, మెగ్నీషియం, క్లోరేట్‌లు మొక్కలు వేళ్ల నుంచి చక్కగా పెరిగేందుకు దోహదపడతాయి.
- ముందుగా కుండిలోని మొక్క చుట్టూ కొన్ని నీళ్లుపోయాలి. ఇప్పుడు పది అగ్గిపుల్లలను రసాయనం ఉన్నవైపు మట్టిలోకి గుచ్చాలి.
- పుల్ల పుల్లకు కొద్దిగా దూరం ఉండేలా .. అగ్గిపుల్ల పూర్తిగా మట్టిలోకి చొచ్చుకుపోయేలా గుచ్చాలి.
- ఇలా నెలకు ఒక్కసారి మాత్రమే పుల్లలను గుచ్చాలి. గుచ్చిన పుల్లలను పదిహేను రోజుల తరువాత తీసేయాలి.
- ఇలా చేయడం వల్ల మొక్కల పెరుగుదలకు కావాల్సిన పోషకాలు అగ్గిపుల్లల నుంచి అంది, మొక్క బలంగా పెరిగి పూలూ, పండ్లను చక్కగా ఇస్తుంది.

యూత్ పల్స్

యాప్‌లారిటీ


శివరీన - శిల్పాభట్

యాప్ స్టోర్‌లలో గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్‌ల హవా కొనసాగుతుండగానే 'నేను సైతం' అంటోంది ఫోన్‌పే. 'ఇండస్ స్టోర్' పేరుతో కొత్త యాప్ స్టోర్‌ను తీసుకురానుంది.

యాప్ స్టోర్‌ల పోటీ సంగతి ఎలా ఉన్నా, దేశీయ యాప్‌లు వెలిగిపోతున్న కాలం ఇది. 'ఒక యాప్ ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది' అనేది నిజమే అయినా అది ఎలాంటి ఐడియా అనేదే కీలకం.

ఆ కీలకమైన విషయాలను దృష్టిలో పెట్టుకొని పాపులర్ యాప్‌ల రూపకల్పనపై దృష్టి పెడుతున్నారు యంగ్ యాప్ డెవలపర్‌లు. యాప్–పాపులారిటీని కలిపి నెటిజనులు సరదాగా సృష్టించిన 'యాప్‌లారిటీ'కి న్యాయం చేసేలా కృషి చేస్తున్నారు...


'సాధించాలనుకున్నప్పుడు సాధన చెయ్' అనే మంచి మాట శివరీన సారికను కొత్త దారిలోకి తీసుకెళ్లింది. 'ప్రెగ్‌బడ్డీ' అనే పాపులర్ యాప్ ఆవిష్కరించడానికి కారణం అయింది. స్టార్ డెవలపర్‌గా తన పేరు మారుమోగేలా చేసింది. గేమింగ్ స్టూడియో '99 గేమ్స్' వైస్ ప్రెసిడెంట్ శిల్పాభట్ 'నేను సాధిస్తాను' అంటూ నమ్మకంగా రంగంలోకి దిగి, సక్సెస్‌ఫుల్ డెవలపర్‌ల వరుసలో నిలిచింది.

శివరీన ఐఐటీ–ఖరగ్‌పూర్ గ్రాడ్యుయేట్. తన సోదరికి గర్భస్రావం అయినప్పుడు కుటుంబం మొత్తం విషాదంలో మునిగిపోయింది. 'మనం నిరంతరం టెక్నాలజీ మధ్యలోనే గడుపుతున్నాం అనుకుంటున్నప్పటికీ, ఆ టెక్నాలజీని కీలకమైన సమయంలో మాత్రం ఉపయోగించుకోలేకపోతున్నాం' అనే ఆలోచనతో తల్లులు, తల్లులు కావాలనుకునే వారి కోసం వాట్సాప్ గ్రూప్ మొదలు పెట్టింది. వారిని ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకుంది. నాలుగు నెలల తరువాత తన టీమ్‌తో కలిసి 'ప్రెగ్‌బడ్డీ' యాప్ డెవలప్‌మెంట్‌పై పనిచేసింది. తల్లులు, తల్లి కావాలనుకుంటున్నవారికి అనేక రకాలుగా ఉపయోగపడే ఈ యాప్ సంవత్సర కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయింది.

ఉడిపి (కర్నాటక)లోని 'రోబోసాఫ్ట్' అనే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీలో పనిచేసిన శిల్పాభట్ '99గేమ్స్'తో గేమ్ డెవలపర్‌గా మారింది.

'చాలామందికి టెక్నాలజీ అంటే ఇష్టం ఉన్నప్పటికీ ఆవిష్కరణల విషయం వచ్చేసరికి అది వేరే వాళ్ల వ్యవహారం, మనం చేయలేం అనుకుంటారు. అయితే ఇది సరికాదు. మనం ఏదైనా చేయాలంటే ముందు తెలుసుకోవాలి, నేర్చుకోవాలి. తెలుసుకుంటూ నేర్చుకుంటూనే ఎన్నో చేయవచ్చు' అంటుంది శివరీన.

'సాధించాలనే తపన గట్టిగా ఉంటే ఏదీ అసాధ్యం కాదు. ప్రోగ్రామింగ్ లేదా గేమ్ డెవలప్‌మెంట్ మీ ప్యాషన్ అయితే, ఆ ప్యాషన్‌ను గుండెల్లోకి తెచ్చుకోండి. గుండె నిండా ధైర్యంతో నేను సాధించగలను అనే నమ్మకాన్ని సొంతం చేసుకోండి' అంటుంది శిల్పాభట్.



బిలియన్ డాలర్ ఐడియా

యాప్ బిల్డింగ్‌పై ఆసక్తి ఉన్న యువతరానికి ఇష్టమైన పుస్తకాల్లో ఒకటి... జార్జ్ బెర్కోవోస్కీ 'హౌ టు బిల్డ్ ఏ బిలియన్ డాలర్ యాప్' పుస్తకం. 'మొబైల్ జెనెటిక్స్' 'ఏ బిలియన్ డాలర్ ఐడియా' 'ఈజ్ యువర్ యాప్ రెడీ ఫర్ ఇన్వెస్ట్‌మెంట్?' 'హౌ మచ్ ఈజ్ యువర్ యాప్ వర్త్ అండ్ హౌ మచ్ మనీ మడ్ యూ రైజ్?' 'ది టెన్-మిలియన్- డాలర్ యాప్' 'మేక్ సమ్‌థింగ్ పీపుల్ లవ్' 'డాలర్స్ ఇన్ ది డోర్' 'ఏ కలర్‌ఫుల్ లెస్సన్' 'మనీ ఫర్ సేల్'... మొదలైన ఆసక్తికరమైన చాప్టర్‌లు ఈ పుస్తకంలో ఉన్నాయి. 'బిలియన్ డాలర్‌ల యాప్స్‌ను రూపొందించిన వారి బుర్రలతో ఆలోచింపచేసే పుసక్తం ఇది' అంటున్నాడు బెర్కోవోస్కీ. ఇంజనీర్, సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ అయిన బెర్కోవోస్కీ ఎంతోమంది విజేతలతో మాట్లాడి, తన స్వీయ అనుభవాలను జోడించి ఈ పుస్తకం రాశాడు.

చిన్న వయసులోనే ఎన్నో మిలియన్ డాలర్ యాప్స్‌ను సృష్టించి పెద్ద పేరు తెచ్చుకున్నాడు సిద్ధార్థ్ నాయక్. సక్సెస్‌ఫుల్ యాప్‌లను ఎలా బిల్డ్ చేయాలో బాగా తెలిసిన నాయక్ పదమూడు సంవత్సరాల వయసులోనే వెదర్ ప్రెడిక్షన్ యాప్‌ను క్రియేట్ చేశాడు.

'తనదైన విలువను మార్కెట్‌లో సృష్టించగలిగినప్పుడే ఒక వ్యాపార సంస్థకు సంబంధించిన ప్రయోజనం నెరవేరినట్లు అవుతుంది. వినియోగదారులు, ఉద్యోగులు, ఇన్వెస్టర్‌ల ప్రయోజనాలు పరస్పరం ముడిపడి ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ ఉపయోగపడే యాప్‌ను సృష్టించడంపై దృష్టి పెడతాను. అత్యంత విలువైన సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌ను రూపొందించినప్పటికీ అది వినియోగదారులను ఆకట్టుకోకపోతే ప్రయోజనం నెరవేరనట్లే. యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను దృష్టిలో పెట్టుకొని యాప్‌ను డిజైన్ చేయడం అనేది ముఖ్యమైన విషయం' అంటున్నాడు నాయక్.

చిన్న యాప్‌లు కూడా పెద్ద విజయం సాధించడానికి ప్రధాన కారణం క్రియేటర్‌లు యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను దృష్టిలో పెట్టుకోవడమే.

చైనీస్ యాప్‌లను నిషేధించిన తరువాత ఆ ప్లేస్‌లోకి మన కుర్రాళ్ల యాప్స్ వచ్చాయి. 'ఎంఎక్స్ టకాటక్' అలాంటిదే. 'ఇదే సరియైన సమయం అనుకొని మా టీమ్ ఆరు రోజులు రాత్రి, పగలు కష్టపడి ఈ యాప్‌ను డిజైన్ చేశాం. భారతీయత ఒక్కటే మార్కెట్‌లో విజయం సాధించడానికి కారణం కాదు. ఇతరుల కంటే ఏ రకంగా భిన్నంగా ఉన్నాం అనేదానిపైనే మన విజయం ఆధారపడి ఉంటుంది' అంటున్నాడు 'ఎంఎక్స్ టకాటక్' సీఈవో కిరణ్ బేడీ.

స్వదేశీ యాప్‌లు విజయంతో వెలిగిపోతున్న కాలం ఇది.

'నాణ్యత అంశాలను విస్మరిస్తే ఫలితం వేరేలా ఉంటుంది. ఎప్పటికప్పుడు మెరుగైన యూజర్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలి' అంటున్నారు నిపుణులు.

ఆసియా క్రీడల పతక విజేతలకు మోదీ ప్రశంస

తదుపరి ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మరెన్నో పతకాలు తెస్తారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు మంగళవారం మోదీని కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని వారందరినీ ప్రశంసించారు. 'ప్రభుత్వం క్రీడాకారులకు ఏం కావాలో అది చేస్తుంది. వారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఆసియా క్రీడల్లో వందకు పైగా పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే క్రీడల్లో ఈ రికార్డును అధిగమిస్తారనే నమ్మకముంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఆశిస్తున్నాను'అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో రజత పతకం గెలిచిన సాకేత్ మైనేని, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన రుతుజా భోస్లే ప్రధానికి జ్ఞాపికగా రాకెట్‌ను అందించారు. స్వర్ణ పతకాలు గెలిచిన భారత పురుషుల హాకీ జట్టు హాకీ స్టిక్‌ను, క్రికెట్లు జట్లు బ్యాట్‌ను మోదీకి బహూకరించాయి. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల బృందం 107 పతకాలు సాధించి తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. తదుపరి ఆసియా క్రీడలు 2026లో జపాన్‌లో జరుగుతాయి.



పాక్ అదరగొట్టింది

345 పరుగులు... వన్డే వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టూ ఇంతటి భారీ లక్ష్యాన్ని అందుకోలేదు... శ్రీలంకతో మ్యాచ్‌లో 37 పరుగులకే 2 కీలక వికెట్లు కోల్పోయిన దశలో పాకిస్తాన్‌కు ఇది దాదాపు అసాధ్యం అనిపించింది. కానీ రిజ్వాన్, షఫీక్ కలిసి దానిని చేసి చూపించారు. పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్‌లో గేర్లు మారుస్తూ చివరకు మరో 8 బంతులు మిగిలి ఉండగా పాక్‌కు విజయాన్నందించారు. అంతకుముందు మెరుపు బ్యాటింగ్‌తో కుశాల్ మెండిస్, సమరవిక్రమ చేసిన శతకాలు చివరకు జట్టుకు ఉపయోగపడలేదు. మొత్తం 689 పరుగుల ఈ పోరుతో హైదరాబాద్‌లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు ముగిశాయి.


షఫీక్ · రిజ్వాన్

- ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగుల ఛేదన
- 6 వికెట్లతో శ్రీలంకపై ఘన విజయం
- శతకాలతో గెలిపించిన రిజ్వాన్, షఫీక్
- మెండిస్, సమరవిక్రమ సెంచరీలు వృథా

సాక్షి, హైదరాబాద్: ప్రపంచకప్‌లో మాజీ చాంపియన్ పాకిస్తాన్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ఉప్పల్ స్టేడియంలో ఆడిన రెండు మ్యాచ్‌లనూ సంతృప్తిగా ముగించింది. మంగళవారం జరిగిన పోరులో పాక్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 344 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (77 బంతుల్లో 122; 14 ఫోర్లు, 6 సిక్స్‌లు), సదీర సమరవిక్రమ (89 బంతుల్లో 108; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగగా, పతుమ్ నిసాంక (61 బంతుల్లో 51; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. మెండిస్ రెండో వికెట్‌కు నిసాంకతో 102 పరుగులు, మూడో వికెట్‌కు సమరవిక్రమతో 111 పరుగులు జోడించాడు. 65 బంతుల్లో సెంచరీ సాధించిన మెండిస్ శ్రీలంక తరఫున ప్రపంచకప్‌లో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అనంతరం పాకిస్తాన్ 48.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిజ్వాన్ (121 బంతుల్లో 131 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్లా షఫీక్ (103 బంతుల్లో 113; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు బాది జట్టును గెలిపించారు. కండరాల నొప్పితో బాధపడుతూనే రిజ్వాన్ తన జట్టును విజయతీరానికి చేర్చాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 176 పరుగులు జత చేశారు. ఆరంభంలో శ్రీలంక చెలరేగినా... చివరి పది ఓవర్లలో 61 పరుగులు చేసి 5 వికెట్లు కోల్పోయింది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) షఫీక్ (బి) షాదాబ్ 51; పెరీరా (సి) రిజ్వాన్ (బి) హసన్ 0; మెండిస్ (సి) ఇమామ్ (బి) హసన్ 122; సమరవిక్రమ (సి) రిజ్వాన్ (బి) హసన్ 108; అసలంక (సి) రిజ్వాన్ (బి) హసన్ 1; ధనంజయ (సి) షాహిన్ (బి) నవాజ్ 25; షనక (సి) బాబర్ (బి) షాహిన్ 12; వెలలాగె (సి) షఫీక్ (బి) రవూఫ్ 10; తీక్షణ (బి) రవూఫ్ 0; పతిరణ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 344. వికెట్ల పతనం: 1–5, 2–107, 3–218, 4–229, 5–294, 6–324, 7–335, 8–343, 9–344. బౌలింగ్: షాహిన్ 9–0–66–1, హసన్ అలీ 10–0–71–4, నవాజ్ 9–0–62–1, రవూఫ్ 10–0–64–2, షాదాబ్ 8–0–55–1, ఇఫ్తికార్ 4–0–22–0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (సి) (సబ్) హేమంత (బి) పతిరణ 113; ఇమామ్ (సి) పెరీరా (బి) మదుషంక 12; బాబర్ ఆజమ్ (సి) సమరవిక్రమ (బి) మదుషంక 10; మొహమ్మద్ రిజ్వాన్ (నాటౌట్) 131; షకీల్ (సి) వెలలాగె (బి) తీక్షణ 31; ఇఫ్తికార్ అహ్మద్ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 26; మొత్తం (48.2 ఓవర్లలో 4 వికెట్లకు) 345. వికెట్ల పతనం: 1–16, 2–37, 3–213, 4–308. బౌలింగ్: తీక్షణ 10–0–59–1, మదుషంక 9.2–0–60–2, షనక 5–0–28–0, పతిరణ 9–0–90–1, వెలలాగె 10–0–62–0, ధనంజయ డిసిల్వా 4–0– 36–0, అసలంక 1–0–10–0.


సమరవిక్రమ · మెండిస్

3 ఒక వన్డే మ్యాచ్‌లో నలుగురు బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇది మూడోసారి మాత్రమే కాగా, వరల్డ్ కప్‌లో మొదటిసారి. 1998లో లాహోర్‌లో ఇజాజ్ అహ్మద్, మొహమ్మద్ యూసుఫ్, పాంటింగ్, గిల్‌క్రిస్ట్...2013లో నాగపూర్‌లో కోహ్లి, ధావన్, బెయిలీ, వాట్సన్ సెంచరీలు చేశారు.

మరో విజయం లక్ష్యంగా...

- టీమిండియా బరిలోకి
- నేడు అఫ్గానిస్తాన్‌తో పోరు
- అందరి కళ్లు టాపార్డర్‌పైనే

మ. గం. 2 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



న్యూఢిల్లీ: వన్డే ప్రపంచకప్‌లో భారత్ గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను ఢీకొట్టి మరీ శుభారంభం చేసింది. ఇప్పుడు సులువైన జట్టు అఫ్గానిస్తాన్‌తో పోరుకు సై అంటోంది. పదునెక్కిన బౌలింగ్‌తో 'కంగారు' పెట్టించిన భారత్ ఇప్పుడు టాపార్డర్ ఫామ్‌పై దృష్టి పెట్టింది. అనుభవజ్ఞుడైన కెప్టెన్ రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌ల డకౌట్లు జట్టు మేనేజ్‌మెంట్‌ను కాస్త కలవరపెట్టినా... ఇప్పుడు అఫ్గాన్‌తో పరుగుల వరద పారించి ఫామ్‌లోకి వచ్చే అవకాశం లభించింది. మరోవైపు తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండ్ షోకు విలవిలలాడిన అఫ్గానిస్తాన్ పటిష్టమైన రోహిత్ సేనకు ఏ మేరకు బదులిస్తుందో చూడాలి.

ఆసీస్‌తో టాపార్డర్ మాత్రమే తడబడింది. కేఎల్ రాహుల్, కోహ్లిల సూపర్ ఇన్నింగ్స్‌లతో మాజీ చాంపియన్‌ను మట్టికరిపించింది. అది చెపాక్ పిచ్ అయితే... ప్రత్యర్థి ఆస్ట్రేలియా. కానీ ఇప్పుడు ఎదురవుతోంది మాత్రం అఫ్గాన్, తలపడుతోంది ఢిల్లీలో... కాబట్టి పరుగుల వరద గ్యారంటీ! ఇందులో సందేహమే లేదు. ఫిరోజ్ షా కోట్లా మైదానంలో గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 400 పైచిలుకు పరుగులు చేస్తే లక్ష్యఛేదనలో శ్రీలంక 300 పైచిలుకు చేసింది. ఇప్పుడు రోహిత్, కోహ్లి, అయ్యర్, రాహుల్, పాండ్యాలాంటి మేటి బ్యాటర్లున్న భారత్ ప్రేక్షకులను భారీ షాట్లతో అలరించడం ఖాయం. డెంగీ జ్వరం నుంచి శుబ్‌మన్ గిల్ కోలుకోకపోవడంతో తుది జట్టులో ఏమార్పు ఉండకపోవచ్చు. మరోవైపు అఫ్గానిస్తాన్ రాటుదేలినా... మెగా ఈవెంట్ ఒత్తిడిని తట్టుకొని భారత్‌ను కంగుతినిపించే సత్తా అయితే లేదనే చెప్పాలి. ఇలా ఏ రకంగా చూసినా కూడా ఢిల్లీలో ఏకపక్షమయ్యే మ్యాచే జరుగుతుందనడంలో సందేహమే లేదు.

భారీ విజయంతో ఇంగ్లండ్ బోణీ

- సెంచరీతో చెలరేగిన మలాన్
- 137 పరుగులతో బంగ్లాదేశ్ ఓటమి

ధర్మశాల: డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ భారీ విజయంతో బోణీకొట్టింది. వన్డే ప్రపంచకప్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బట్లర్ బృందం 137 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై జయభేరి మోగించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 364 పరుగులు చేసింది. ఓపెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ మలాన్ (107 బంతుల్లో 140; 16 ఫోర్లు, 5 సిక్సర్లు) తన కెరీర్‌లో ఆరో సెంచరీతో చెలరేగాడు. బెయిర్‌స్టో (59 బంతుల్లో 52; 8 ఫోర్లు)తో తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించిన మలాన్... రెండో వికెట్‌కు రూట్ (68 బంతుల్లో 82; 8 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మరో 151 పరుగులు జతచేశాడు. కెప్టెన్ బట్లర్ (20), బ్రూక్ (20) రెండంకెల స్కోరు చేశారు. మెహదీ హసన్ 4, షోరిఫుల్ ఇస్లామ్ 3 వికెట్లు తీశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించలేక బంగ్లాదేశ్ 48.2 ఓవర్లలో 227 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ లిటన్ దాస్ (66 బంతుల్లో 76; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), ముష్ఫికర్ రహీమ్ (64 బంతుల్లో 51; 4 ఫోర్లు) రాణించారు. టోప్లే 4, వోక్స్ 2 వికెట్లు పడగొట్టారు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (బి) షకీబ్ 52; మలాన్ (బి) మెహదీ హసన్ 140; రూట్ (సి) రహీమ్ (బి) షోరిఫుల్ 82; బట్లర్ (బి) షోరిఫుల్ 20, బ్రూక్ (సి) లిటన్‌దాస్ (బి) మెహదీ హసన్ 20; లివింగ్‌స్టోన్ (బి) షోరిఫుల్ 0; కరన్ (సి) నజ్ముల్ (బి) మెహదీ హసన్ 11; వోక్స్ (సి) మెహదీ హసన్ (బి) అహ్మద్ 14; ఆదిల్ (సి) నజ్ముల్ (బి) మెహదీ హసన్ 11; మార్క్ వుడ్ (నాటౌట్) 6; టోప్లే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 364. వికెట్ల పతనం: 1–115, 2–266, 3–296, 4–307, 5–307, 6–327, 7–334, 8–352, 9–362. బౌలింగ్: ముస్తఫిజుర్ 10–0–70–0, అహ్మద్ 6–0–38–1, షోరిఫుల్ 10–0–75–3, హసన్ 8–0–71– 4, షకీబ్ 10–0–52–1, మిరాజ్ 6–0– 55–0.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: లిటన్ దాస్ (సి) బట్లర్ (బి) వోక్స్ 76; తంజిద్ (సి) బెయిర్‌స్టో (బి) టోప్లే 1; నజ్ముల్ (సి) లివింగ్‌స్టోన్ (బి) టోప్లే 0; షకీబ్ (బి) టోప్లే 1; మిరాజ్ (సి) బట్లర్ (బి) వోక్స్ 8; ముష్ఫికర్ (సి) ఆదిల్ (బి) టోప్లే 51; తౌహిద్ (సి) బట్లర్ (బి) లివింగ్‌స్టోన్ 39; మెహదీ హసన్ (బి) ఆదిల్ 14; అహ్మద్ (బి) కరన్ 15; షోరిఫుల్ (బి) వుడ్ 12; ముస్తఫిజుర్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (48.2 ఓవర్లలో ఆలౌట్) 227. వికెట్ల పతనం: 1–14, 2–14, 3–26, 4–49, 5–121, 6–164, 7–189, 8–195, 9–221, 10–227. బౌలింగ్: వోక్స్ 8–0–49–2, టోప్లే 10–1–43–4, సామ్ కరన్ 7.2–0–47–1, వుడ్ 10–0–29–1, ఆదిల్ రషీద్ 10–0–42–1, లివింగ్‌స్టోన్ 3–0–13–1.


మలాన్

ప్రపంచ నంబర్‌వన్ జోడీగా సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి

- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ జోడీగా కొత్త చరిత్ర



న్యూఢిల్లీ: ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి మరో ఘనత సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో పురుషుల డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకున్న తొలి భారతీయ జోడీగా చరిత్ర సృష్టించింది. మంగళవారం విడుదల చేసిన బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 92,411 పాయింట్లతో అగ్రస్థానాన్ని అలంకరించింది. గతవారం హాంగ్జౌలో ముగిసిన ఆసియా క్రీడల్లో సాత్విక్–చిరాగ్ జోడీ స్వర్ణ పతకం సాధించింది. దాంతో ఈ జంట ఒక స్థానం పురోగతి సాధించి రెండు నుంచి టాప్ ర్యాంక్‌కు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ ఈ సీజన్‌లో స్విస్ ఓపెన్, ఆసియా చాంపియన్‌షిప్‌లో, ఇండోనేసియా ఓపెన్, కొరియా ఓపెన్‌లలో విజేతగా నిలిచారు. గతంలో భారత్ నుంచి పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రకాశ్ పదుకొనే (1980లో), శ్రీకాంత్ (2018లో), మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ (2021లో) ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచారు.

సినిమా


నాగార్జున · మహేశ్‌బాబు · ఎన్టీఆర్ · వెంకటేశ్ · అల్లు అర్జున్

2023 మిస్సింగ్

ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్ కొందరు స్టార్స్‌ని మిస్సయింది. వెంకటేశ్, నాగార్జున, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్.. ఈ హీరోలు నటించిన చిత్రాలు 2023లో రిలీజ్ కాలేదు. ఈ స్టార్స్ వెండితెరపై కనిపించక పోవడం వారి అభిమానులను కాస్త నిరుత్సాహ పరిచే విషయం. మరి.. 2024లో ఈ స్టార్స్ ఏ చిత్రాలతో వెండితెరపై కనబడతారో తెలుసుకుందాం.

'సైంధవ్' రావాలి కానీ...

'సైంధవ్' రిలీజ్ ప్లాన్ మారడంతో ఈ ఏడాది తెలుగు తెరపై వెంకటేశ్ కనిపించే అవకాశం లేదు. వెంకటేశ్ కెరీర్‌లో రూపొందుతున్న 75వ సినిమా 'సైంధవ్'. ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకుడు. నిజానికి ఈ చిత్రాన్ని డిసెంబరు 22న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ అదే తేదీకి ప్రభాస్ 'సలార్: సీజ్ ఫైర్' చిత్రం రిలీజ్‌కు సిద్ధం కావడంతో 'సైంధవ్' రిలీజ్ జనవరి 13కు వాయిదా పడింది. ఇలా ఊహించని విధంగా వెంకటేశ్ ఈ ఏడాది తెలుగు తెరకు దూరంగా కావాల్సిన పరిస్థితి. ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా హీరోయిన్లుగా, చైల్డ్ ఆర్టిస్ట్ సారా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య కీలక పాత్రల్లో నటించారు. ఇక ఈ ఏడాది మార్చి నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న 'రానా నాయుడు' వెబ్ సిరీస్ ద్వారా డిజిటల్ మీడియాలో, సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రంతో హిందీ తెరపై వెంకీ కనిపించడం ఈ స్టార్ ఫ్యాన్స్‌ను కాస్త ఆనందపరిచే విషయం.

నా సామి రంగ.. వచ్చే ఏడాదే

గత రెండేళ్లలో మూడు సినిమాలతో (2021లో 'వైల్డ్ డాగ్', 2022లో 'బంగార్రాజు', 'ది ఘోస్ట్') సిల్వర్ స్క్రీన్‌పై సందడి చేసిన నాగార్జున ఈ ఏడాది మాత్రం గ్యాప్ ఇచ్చారు. నాగార్జున తాజా చిత్రం 'నా సామి రంగ' వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. సో.. ఈ ఏడాది అక్కినేని ఫ్యాన్స్‌కు నాగార్జున సిల్వర్ స్క్రీన్‌పై కనిపించరు. వచ్చే ఏడాది ఆరంభంలో నాగ్ స్టైల్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ 'నా సామి రంగ' రూపంలో ఉంటుందని చిత్ర యూనిట్ పేర్కొంది. విజయ్ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు.

వేసవి నుంచి సంక్రాంతికి..

'సర్కారువారి పాట'తో గత ఏడాది సూపర్ హిట్ అందుకున్నారు మహేశ్‌బాబు. అన్నీ సజావుగా సాగినట్లయితే ఈ ఏడాది కూడా వెండితెరపై మహేశ్‌బాబు సందడి ఉండేది. మహేశ్‌బాబు హీరోగా చేస్తున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'ను ఈ ఏడాది వేసవిలోనే రిలీజ్ చేయాలనుకున్నారు. అయితే వచ్చే ఏడాది జనవరి 12కి వాయిదా వేశారు. ఇలా మహేశ్ ఈ ఏడాది థియేటర్స్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా ఈ చిత్రాన్ని సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్నారు.

2024 నుంచి నో గ్యాప్

2018లో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' చిత్రం తర్వాత ఎన్టీఆర్ మళ్లీ స్క్రీన్‌పై కనిపించింది 'ఆర్ఆర్ఆర్' (2022) సినిమాలోనే. ఆ సినిమా కమిట్‌మెంట్ కారణంగా 2019, 2020, 2021లో ఎన్టీఆర్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించలేదు. ఇక 2023 నుంచి అయినా ఎన్టీఆర్ సినిమాలు వరుసగా విడుదలవుతాయనుకున్న ఆయన ఫ్యాన్స్ మరికొంత సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి. ఎందుకంటే... ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా యాక్షన్ ఫిల్మ్ 'దేవర' తొలి భాగాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సో.. ఈ ఏడాది ఎన్టీఆర్ స్క్రీన్‌పై కనపడరు. 'దేవర' చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. ఇక ఎన్టీఆర్ ఓ లీడ్ రోల్‌లో నటించనున్న 'వార్ 2' (ఇందులో హృతిక్ రోషన్ మరో హీరో), 'దేవర' రెండు భాగాలు, ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్ మూవీ.. ఇలా వరుస సినిమాలతో ఈ స్టార్ 2024 నుంచి గ్యాప్ లేకుండా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించే అవకాశం ఉంది.

లేట్‌గా డ్యూటీ

ఐఏఎస్ ఆఫీసర్ పాత్రలో రామ్‌చరణ్ నటిస్తున్న చిత్రం 'గేమ్ చేంజర్'. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని యూనిట్ ప్లాన్ చేసినా వీలు పడలేదు. వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, సామాజిక అంశాలకు కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి శంకర్ తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఇందులో కియారా అద్వానీ నాయిక. మరోవైపు ఈ ఏడాదే విడుదలైన సల్మాన్ ఖాన్ హిందీ చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్'లోని ఓ పాటలో రామ్‌చరణ్ ఓ గెస్ట్ రోల్ చేశారు. ఇది చరణ్ ఫ్యాన్స్‌కు కాస్త ఊరట కలిగించింది.

రెండేళ్ల తర్వాతే పుష్ప రూల్

'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఎంతటి ఘనవిజయాన్ని నమోదు చేసుకుందో తెలిసిందే. 2021లో విడుదలైన ఈ సినిమా అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి అవార్డును కూడా తెచ్చిపెట్టింది. దీంతో 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్'పై అంచనాలు ఏర్పడ్డాయి. అయితే మేకర్స్ ప్లాన్ చేసినట్లుగా మలి భాగం 2023లో విడుదల కాలేదు. క్యాస్టింగ్, కథ విషయాల్లో ఈ సినిమా స్పాన్ మరింత పెరగడం, చిత్రీకరణ వాయిదా పడుతుండటంతో 2024 ఆగస్టు 15న 'పుష్ప: ది రూల్'ను రిలీజ్ చేస్తామని యూనిట్ ప్రకటించింది. సో.. ఈ ఏడాది కూడా అల్లు అర్జున్ థియేటర్స్‌లో కనిపించరు. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతిబాబు, సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్ కీలక పాత్రధారులు.

ఇలా మరికొందరు స్టార్స్‌ని 2023 సిల్వర్ స్క్రీన్ మిస్సయ్యింది.

మరో సక్సెస్‌ఫుల్ హీరో వచ్చాడు - హీరో నాని


మానస, రోషన్, నాని

''బబుల్‌గమ్' టీజర్ చూస్తే చాలా బలమైన కథ అనిపించింది. రోషన్‌ని స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు చాలా పర్ఫెక్ట్‌గా కనిపించాడు. మరో సక్సెస్‌ఫుల్ హీరో తెలుగు ఇండస్ట్రీకి వచ్చాడని నమ్మకంగా చెప్పగలను. టీజర్ చూసినప్పుడు నాకు ఆ నమ్మకం వచ్చింది'' అని హీరో నాని అన్నారు. నటుడు రాజీవ్ కనకాల, యాంకర్ సుమల తనయుడు రోషన్ కనకాల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. రవికాంత్ పేరెపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మానసా చౌదరి కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 29న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ విడుదల వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– ''రవికాంత్‌కి ఒక యునిక్ స్టయిల్ ఉంది. అది టీజర్‌లో కనిపిస్తోంది. తెలుగులో క్వాలిటీ ఫిలిమ్స్‌కి మారుపేరుగా మారిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్లగారికి 'బబుల్‌గమ్' మరో హిట్‌గా నిలుస్తుంది'' అన్నారు. ''నాకు ఇష్టమైన పని (సినిమాలు) చేయడానికి ప్రోత్సహించిన అమ్మానాన్నలకి థ్యాంక్స్'' అన్నారు రోషన్ కనకాల. ''పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్‌తో పని చేయడం చాలా ఆనందాన్నిచ్చింది'' అన్నారు రవికాంత్ పేరెపు. ''బబుల్‌గమ్' పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్, సహనిర్మాత వివేక్ కూచిభొట్ల. హీరోయిన్ మానస, నటుడు రాజీవ్ కనకాల మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: సురేష్ రగుతు, క్రియేటివ్ ప్రొడ్యూసర్: దివ్య విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మధులిక సంచన లంక.

రజాకార్ చరిత్ర అందరికీ తెలుస్తుంది - మాజీ మంత్రి డీకే అరుణ


అనుశ్రేయ, గూడూరు నారాయణరెడ్డి, అనసూయ, డీకే అరుణ, యాటా సత్యనారాయణ

''దేశమంతా ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటారు. కానీ, హైదరాబాద్‌కి ఆ రోజు నిజమైన స్వాతంత్ర్యం రాలేదని చాలామందికి తెలియదు. 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం వచ్చిందని అతి కొద్దిమందికే తెలుసు. 'రజాకార్' సినిమా ద్వారా రజాకార్ చరిత్ర అందరికీ తెలుస్తుంది'' అని మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. బాబీ సింహా, అనసూయ, వేదిక, అనుశ్రేయా త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రజాకార్'. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలోని 'భారతి భారతి ఉయ్యాలో..' పాటను రిలీజ్ చేశారు డీకే అరుణ. ఈ సందర్భంగా గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ– ''రజాకార్లను ఉద్దేశించి మాత్రమే ఈ సినిమాను తీశాం. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు. ''ఈ సినిమాలో చరిత్రను ఎక్కడా వక్రీకరించలేదు'' అన్నారు యాటా సత్యనారాయణ. ''ఈ సినిమాలో భాగం అయినందుకు ఆనందంగా ఉంది'' అన్నారు అనసూయా భరద్వాజ్.

వారం ముందే దీపావళి!


అపర్ణ, రక్షిత్

రక్షిత్ అట్లూరి హీరోగా, అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ హీరోయిన్లుగా సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వం వహించిన చిత్రం 'నరకాసుర'. డాక్టర్ అజ్జ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబర్ 3న ఉషా పిక్చర్స్ ద్వారా రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. సెబాస్టియన్ నోవా అకోస్టా మాట్లాడుతూ– ''నరకాసుర అంటే దీపావళి గుర్తుకొస్తుంది. ఈ సినిమాతో దీపావళి ఓ వారం ముందుగానే థియేటర్స్‌కి వస్తుంది'' అన్నారు. ''నరకాసుర' మేమందరం గర్వపడే సినిమా అవుతుంది'' అన్నారు రక్షిత్ అట్లూరి. ''నేను వృత్తి రీత్యా డాక్టర్‌ను. సినిమాలంటే ప్యాషన్‌తో ఈ సినిమా తీశాను'' అన్నారు అజ్జ శ్రీనివాస్.

మ్యాడ్‌తో నలభైమంది జీవితాలు మారాయి - దర్శకుడు కల్యాణ్ శంకర్


నాగవంశీ, కల్యాణ్ శంకర్, నార్నే నితిన్, సంగీత్

''మ్యాడ్' కోసం మా బాబాయ్ (చినబాబు) ఓ రచయితలా కల్యాణ్‌తో కలిసి పని చేశారు'' అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ హీరోలుగా, శ్రీ గౌరీ ప్రియారెడ్డి, అనంతిక సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ హీరోయిన్లుగా కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'మ్యాడ్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలైంది. ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ– ''నాగవంశీ అన్నని కలవడం నా జీవితంలో గొప్ప మార్పు. ఈ కథ చినబాబుగారికి నచ్చడంతో నాతో పాటు దాదాపు 40 మంది జీవితాలు మారిపోయాయి'' అన్నారు. ''మా సినిమాకి వస్తున్న స్పందనకు హ్యాపీ'' అన్నారు హారిక సూర్యదేవర.

సాక్షి బిజినెస్
బుధవారం
11-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	567	66,079
నిఫ్టీ ▲	177	19,690

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,571	▲ 91
డోజోన్స్	33,792	▲ 187
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,628	▲ 136
డాక్స్	15,433	▲ 295
షాంఘై	3,075	▽ 22
నికాయ్	31,746	▲ 752

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారట్)	57,479 ▲ 147
బంగారం (22 క్యారట్)	57,249 ▲ 147
వెండి (కిలో)	68,583 ▲ 90

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.53	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.09	103.29
€	యూరో	ఎస్‌బీఐ	87.58	89.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.51	57.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.16	54.23
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.95	63.88
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.29	12.35

కొత్త కస్టమర్లను యాప్‌లో చేర్చుకోవద్దు

బ్యాంక్ ఆఫ్ బరోడాకు ఆర్‌బీఐ ఆదేశాలు



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా తమ 'బీవోబీ వరల్డ్' మొబైల్ యాప్‌లో కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా రిజర్వ్ బ్యాంక్ నిషేధం విధించింది. ఇది తక్షణమే అమల్లోకి వచ్చింది. యాప్‌లో కస్టమర్లను చేర్చుకునే ప్రక్రియకు సంబంధించి పర్యవేక్షణాపరమైన లోపాలను గుర్తించిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. బ్యాంకు వాటిని సరిచేసి, సంబంధిత ప్రక్రియను పటిష్టం చేసినట్లు ఆర్‌బీఐ సంతృప్తి చెందితే తప్ప కొత్త కస్టమర్లను చేర్చుకోవడానికి ఉండదు. దీనివల్ల ప్రస్తుత బీవోబీ వరల్డ్ ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలంటూ బ్యాంకుకు సూచించింది. ఆర్‌బీఐ సూచించిన అంశాలను ఇప్పటికే సరిదిద్దినట్లు, ఇతరత్రా ఏవైనా లోపాలుంటే వాటిని కూడా సరిచేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. ఆర్‌బీఐ ఆదేశాలను అమలు చేసే క్రమంలో కస్టమర్లకు సర్వీసులపై ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండబోదని పేర్కొంది.

టాంజానియాతో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎంవోయూ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియాతో రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ (ఆర్‌సీఎంఎల్) అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఆరోగ్య సంరక్షణ సేవలకు సంబంధించి సంస్థల మధ్య సమగ్ర సహకారానికి ఇది తోడ్పడనుంది. పిల్లల్లో గుండె, న్యూరాలాజికల్ శస్త్ర చికిత్సలు, కిడ్నీ మార్పిడి తదితర చికిత్సలకు సంబంధించి నైపుణ్యాలు, టెక్నాలజీ మొదలైన వాటి మార్పిడికి ఇది ఉపయోగపడనుంది. ఈ ఎంవోయూ విషయంలో కేంద్ర ఆరోగ్య శాఖ కీలకపాత్ర పోషించింది. టాంజానియా పిల్లలకు భారత్‌లోని తమ ఆస్పత్రిలో చికిత్స చేయడంతో పాటు వైద్యులకు శిక్షణ కార్యక్రమాలపరంగా సహాయం అందించేందుకు ఇది ఉపయోగపడగలదని ఆర్‌సీఎంఎల్ సీఎండీ రమేష్ కంచర్ల తెలిపారు. ఈ ఎంవోయూ మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

భారత్ కుబేరుల్లో అంబానీ టాప్

- రూ. 8 లక్షల కోట్ల సంపద
- రూ. 4.74 లక్షల కోట్లతో రెండో ర్యాంకులో అదానీ
- హురున్ ఇండియా 2023 జాబితా




ముంబై: పారిశ్రామిక దిగ్గజం, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తాజాగా 360 వన్ వెల్త్ హురున్ ఇండియా సంపన్నుల జాబితా 2023లో అగ్రస్థానంలో నిల్చారు. రూ. 8.08 లక్షల కోట్ల సంపదతో ఆయన టాప్ ర్యాంకు దక్కించుకున్నారు. గత ఏడాది వ్యవధిలో అంబానీ సంపద స్వల్పంగా రెండు శాతం పెరిగింది. అటు మరో దిగ్గజం గౌతమ్ అదానీ రూ. 4.74 లక్షల కోట్ల సంపదతో రెండో స్థానం దక్కించుకున్నారు. ఆయన సంపద 57 శాతం కరిగిపోయింది. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాలు, షేర్లలో ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణల దెబ్బతో అదానీ సంస్థల షేర్లు కుదేలవడం ఇందుకు కారణమని హురున్ ఎండీ, చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. ఆగస్టు 30 తేదీ ప్రాతిపదికగా హురున్ ఈ జాబితాను రూపొందించింది. ఈసారి లిస్టులో 138 నగరాలకు చెందిన 1,319 మంది కుబేరులకు చోటు దక్కింది. రూ. 2.78 లక్షల కోట్ల సంపదతో (36 శాతం వృద్ధి) సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత సైరస్ పూనావాలా మూడో స్థానంలో, రూ. 2.28 లక్షల కోట్లతో (23 శాతం వృద్ధి) హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ ఆ తర్వాత ర్యాంకులో ఉన్నారు. గత ఏడాది వ్యవధిలో భారత్‌లో ప్రతి మూడు వారాలకు కొత్తగా ఇద్దరు బిలియనీర్లుగా ఎదిగారు. ప్రస్తుతం 259 మంది బిలియనీర్లు ఉన్నారు. గత 12 ఏళ్లలో వారి సంఖ్య 4.4 రెట్లు పెరిగింది.

మరిన్ని విశేషాలు..

- గోపిచంద్ హిందుజా (5), దిలీప్ సంఘ్వీ (6), ఎల్ఎన్ మిట్టల్ (7), కుమార మంగళం బిర్లా (9), నీరజ్ బజాజ్ (10) టాప్ టెన్‌లో ఉన్నారు.
- డీమార్ట్ అధినేత రాధాకిషన్ దమానీ సంపద 18 శాతం క్షీణించి రూ. 1.43 లక్షల కోట్లకు పడిపోవడంతో ఆయన 8వ స్థానంతో సరిపెట్టుకున్నారు.
- అసమానతలు పెరిగిపోతుండటంపై ఆందోళన నేపథ్యంలో ఏడాది వ్యవధిలో 51 మంది కుబేరుల సంపద రెట్టింపయ్యింది. అంతక్రితం ఏడాది వ్యవధిలో ఈ సంఖ్య 24గా నమోదైంది.
- నగరాలవారీగా చూస్తే 328 బిలియనీర్లతో ముంబై అగ్రస్థానంలో ఉంది. న్యూఢిల్లీ (199), బెంగళూరు (100), హైదరాబాద్ (87) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. తొలిసారిగా టాప్ 20 నగరాల్లో తిరుప్పూర్ చోటు దక్కించుకుంది.
- ప్రైవేట్ ఈక్విటీ రంగం నుంచి తొలిసారిగా కేదార క్యాపిటల్‌కు చెందిన మనీష్ కేజ్రీవాల్ చోటు దక్కించుకున్నారు. ఆయన సంపద రూ. 3,000 కోట్లు.
- ప్రెసిషన్ వైర్స్‌కు చెందిన మహేంద్ర రాతిలాల్ మెహతా 94 ఏళ్ల వయస్సులో లిస్టులో నిలిచారు.

తెలుగు రాష్ట్రాల్లో ఇలా...

టాప్ 100లో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి రూ. 55,700 కోట్ల సంపదతో దివీస్ ల్యాబొరేటరీస్ అధినేత మురళి దివి 23వ ర్యాంకులో నిల్చారు. 196% సంపద వృద్ధితో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాకు చెందిన పీవీ పిచ్చిరెడ్డి (రూ. 37,300 కోట్లు), పీవీ కృష్ణారెడ్డి (రూ. 35,800 కోట్లు) వరుసగా 37, 41వ ర్యాంకుల్లో ఉన్నారు. హెటిరో గ్రూప్ చైర్మన్ బి. పార్థసారథి రెడ్డి కుటుంబం రూ. 21,900 కోట్ల సంపదతో 93వ స్థానంలో, అరబిందో ఫార్మా నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి రూ. 21,000 కోట్ల సంపదతో 98వ స్థానంలో, అపోలో హాస్పిటల్స్ అధినేత ప్రతాప్ రెడ్డి కుటుంబం రూ.20,900 కోట్లతో 99వ ర్యాంకులో ఉన్నాయి.

ఏపీలో గ్రీన్‌లామ్ ప్లాంటు ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లామినేట్ షీట్స్ తయారీలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన ప్లాంటులో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. తిరుపతి జిల్లాలోని నాయుడుపేట వద్ద ఉన్న ఈ అత్యాధునిక తయారీ కేంద్రానికి ఏటా 35 లక్షల లామినేట్ షీట్స్, కాంపాక్ట్ బోర్డులను ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. నూతన ప్లాంటు కోసం కంపెనీ రూ.239 కోట్లు వెచ్చించింది. పూర్తి సామర్థ్యానికి చేరుకుంటే ఈ ఫెసిలిటీ ద్వారా రూ.600 కోట్ల వార్షికాదాయం సమకూరగలదని కంపెనీ ప్రకటించింది. 4 ప్లాంట్లలో కలిపి వార్షిక స్థాపిత సామర్థ్యం 2.45 కోట్ల లామినేట్ షీట్స్, కాంపాక్ట్ బోర్డులకు చేరిందని గ్రీన్‌లామ్ ఎండీ, సీఈవో సౌరభ్ మిత్తల్ వెల్లడించారు.

యుద్ధ భయాల నుంచి కోలుకున్న మార్కెట్

- కలిసొచ్చిన షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు
- ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు
- అన్ని రంగాల షేర్లకు డిమాండ్
- సూచీలు ఒక శాతం జంప్



ముంబై: ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధ భయాల నుంచి దలాల్ స్ట్రీట్ తేరుకుంది. షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతో మంగళవారం సూచీలు దాదాపు ఒక శాతం లాభపడ్డాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న రికవరీ ర్యాలీ కలిసొచ్చింది. క్రూడాయిల్ ధరలు గరిష్ట స్థాయిల నుంచి దిగివచ్చాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) తాజాగా 2024 ఆర్థిక సంవత్సరానికి గానూ భారత వృద్ధి రేటును 20 బేసిస్ పాయింట్లు పెంచి 6.3 శాతానికి పెంచింది. ఫలితంగా ఫైనాన్స్, బ్యాంకింగ్, ఆటో, ఐటీ షేర్లలో నెలకొన్న కొనుగోళ్లతో సెన్సెక్స్ 567 పాయింట్లు పెరిగి 66,079 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 177 పాయింట్లు బలపడి 19,690 వద్ద నిలిచింది. ఒకదశలో సెన్సెక్స్ 668 పాయింట్లు బలపడి 66,180 వద్ద, నిఫ్టీ 206 పాయింట్లు దూసుకెళ్లి 19,718 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. ఇటీవల అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్న చిన్న, మధ్య తరహా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఫెడ్ రిజర్వ్ అధికారుల సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాలతో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఇజ్రాయెల్‌లోని హైఫా పోర్ట్‌లో పనిచేస్తున్న తమ ఉద్యోగుల భద్రతకు తగిన చర్యలు తీసుకున్నామని, ఉద్యోగులందరూ సురక్షితంగా ఉన్నారని అదానీ పోర్ట్స్, సెజ్ వివరణ ఇవ్వడంతో ఈ కంపెనీ షేరు 4% లాభపడి చేసి రూ.819 వద్ద స్థిరపడింది.
- పండుగ డిమాండ్‌తో సెప్టెంబర్ రిటైల్ అమ్మకాల్లో 20% వృద్ధి నమోదైనట్లు డీలర్ల సమాఖ్య ఫెడా ప్రకటనతో ఆటో షేర్లు దూసుకెళ్లాయి. టాటా మోటార్స్ 2%, ఎంఅండ్ఎం 1.50%, మారుతీ 1.32% లాభపడ్డాయి. అశోక్ లేలాండ్ 1.22%, హీరో మోటో 0.66%, బజాజ్ ఆటో 0.64%, ఐషర్ 0.42%, టీవీఎస్ 0.36% పెరిగాయి.

బ్రిడ్జ్‌స్టోన్ డీలర్‌షిప్‌లలో ఈవీ చార్జర్లు

టాటా పవర్‌తో జట్టు



న్యూఢిల్లీ: టైర్ల తయారీ సంస్థ బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా తమ డీలర్‌షిప్‌లలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జర్ల ఏర్పాటు కోసం టాటా పవర్‌తో చేతులు కలిపింది. ఈ ఒప్పందం ప్రకారం గంట వ్యవధిలోనే కార్లు వంటి నాలుగు చక్రాల వాహనాలను చార్జింగ్ చేసే సామర్థ్యం ఉండే ఫాస్ట్ చార్జర్లను టాటా పవర్ ఇన్‌స్టాల్ చేస్తుంది. తద్వారా ఒక్కో చార్జరుతో రోజులో 20–24 వాహనాలను చార్జింగ్ చేయడానికి వీలవుతుందని బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ రాజర్షి మొయిత్రా తెలిపారు. బ్రిడ్జ్‌స్టోన్ కస్టమర్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనదారులందరికీ దేశవ్యాప్తంగా తమ డీలర్‌షిప్‌లలో ఈ చార్జర్లు 24 గంటలూ అందుబాటులోకి ఉంటాయన్నారు. ఇన్‌స్టాలేషన్, చార్జింగ్, మెయింటెనెన్స్, ఈ–పేమెంట్స్ మొదలైన వాటికి సంబంధించి టాటా పవర్ సహాయ, సహకారాలు అందిస్తుంది.

వృద్ధి అంచనాలను పెంచిన ఐఎంఎఫ్

- 2023–24లో 6.3 శాతం
- తొలి అంచనా 6.1 శాతం
- క్యూ1లో అంచనాలకు మించిన వినియోగం నేపథ్యం



న్యూఢిల్లీ: భారత్ ఏప్రిల్ 2023తో ప్రారంభమయిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో 6.3% స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిని నమోదుచేసుకుంటుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తాజా 'వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్' అంచనా వేసింది. తొలి జూలై నెల అంచనా 6.1 శాతాన్ని ఈ మేరకు 20 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు 1%) పెంచింది. తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) అంచనాలకు మించి వినియోగ గణాంకాలు నమోదవడం తాజా అప్‌గ్రేడ్‌కు కారణమని అవుట్‌లుక్ వివరించింది. 2024–25లో కూడా భారత్ వృద్ధి అంచనాలను ఐఎంఎఫ్ 6.3%గా పేర్కొంది.

వృద్ధి స్పీడ్‌లో టాప్..

ప్రపంచంలోని రెండవ ఆర్థిక వ్యవస్థ చైనాకన్నా భారత్ వృద్ధి స్పీడ్ వేగంగా ఉండడం మరో అంశం. 2023లో చైనా వృద్ధి రేటు అంచనాలను ఐఎంఎఫ్ 20 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఈ రేటు 5%కి తగ్గింది. 2024లో అంచనాలను 30 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఫలితంగా ఈ రేటు 4.2%కి దిగింది. చైనాలో ప్రాపర్టీ మార్కెట్ సంక్షోభంలో ఉండటం కూడా వృద్ధి రేటు కోతకు కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది.

ప్రపంచ వృద్ధి అంచనా డౌన్

కాగా, 2023 ప్రపంచ వృద్ధి అంచనాలను మాత్రం ఐఎంఎఫ్ తగ్గించడం గమనార్హం. ఇంతక్రితం 3.2 శాతంగా ఉన్న గ్లోబల్ వృద్ధి అంచనాలను తాజాగా 3%కి కుదించింది.

కొన్ని సంస్థల అంచనా ఇలా..

(వృద్ధి శాతాల్లో)

సంస్థ	2023–24
ఆర్‌బీఐ	6.5
ప్రపంచబ్యాంక్	6.3
ఎస్అండ్‌పీ	6.0
ఫిచ్	6.3
మూడీస్	6.1
ఏడీబీ	6.3
ఇండియా రేటింగ్స్	6.2
ఓఈసీడీ	6.3



కులగణన దేశానికి ఎక్స్‌రే

కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్న రాహుల్

బియోహరి: కులగణన దేశానికి ఎక్స్‌రే తీయడం లాంటిదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఇది చేపట్టడం వల్ల దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీల వాస్తవ పరిస్థితులు తెలుసుకోవచ్చునని అన్నారు. ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టేలా కాంగ్రెస్ ఒత్తిడి తీసుకువస్తుందన్నారు. మధ్యప్రదేశ్‌లోని షాదోల్ జిల్లా బియోహరిలో మంగళవారం జరిగిన ఎన్నికల సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ''మన దేశంలో కులగణన చేపట్టడం అత్యవసరం.



షాదోల్ జిల్లాలో ప్రచార సభలో రాహుల్, మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్

గాయాలపాలై ఉన్న ఆదివాసీలు, దళితులు, ఓబీసీలు ఎలా ఉన్నారో తెలుసుకోవాలని కులగణన చేయాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం. రాజస్తాన్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు కులగణన ప్రక్రియను మొదలు పెట్టాయి'' అని రాహుల్ చెప్పారు. దళితులు, ఆదివాసీలు తమ హక్కుల్ని పొందడానికే ఈ కులగణన అవసరమని వ్యాఖ్యానించారు. కులగణనపై మాట్లాడకుండా ప్రధాని మోదీ తప్పించుకుంటున్నారని, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌ల గురించి మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని నడిపించే, బడ్జెట్‌ను నియంత్రించే 90 మంది ఉన్నత స్థాయి అధికారుల్లో ముగ్గురు మాత్రమే ఓబీసీ కేటగిరీకి చెందిన వారని రాహుల్ వెల్లడించారు. ఓబీసీలు నిర్ణయాత్మక పదవుల్లో లేకపోవడం వల్లే వారిలో నిరుద్యోగం అధికంగా ఉందన్నారు. ఆరెస్సెస్, బీజేపీలకు మధ్యప్రదేశ్ ఒక ల్యాబొరేటరీ వంటిదని, ఈ విషయాన్ని ఆ పార్టీ అగ్రనాయకుడు ఎల్.కె అద్వానీయే తాను రాసిన ఒక పుస్తకంలో వెల్లడించారని అన్నారు.

అందరిదీ ఉచిత జపమే!

మధ్యప్రదేశ్‌లో పార్టీలన్నింటిదీ అదే దారి | ఎలాగైనా ఓటర్లను ఆకట్టుకునేందుకు పాట్లు

దేశానికి హృదయ స్థానమైన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల పోరు ఉచితాల జాతరను తలపిస్తోంది. ప్రజలకు ఉచిత పథకాలు ప్రకటించడంలో ప్రధాన పార్టీలైన అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్ రెండూ నువ్వా నేనా అన్నట్టుగా పోటాపోటీగా దూసుకెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓటరు ఎవరిని 'సముచితం'గా ఆదరిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది...

మధ్యప్రదేశ్‌లో దీర్ఘకాలంగా బీజేపీ, కాంగ్రెస్ ద్విముఖ పోరు కొనసాగుతూ వస్తోంది. ఈసారి బీఎస్పీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా బరిలో ఉన్నా ప్రధాన పోరు మాత్రం మళ్లీ ఆ రెండింటి మధ్యేనని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయం కోసం సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ (64), పీసీసీ చీఫ్ కమల్‌నాథ్ (76) సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి ఎలాగైనా అధికారాన్ని నిలుపుకోవాలని బీజేపీ పట్టుదలగా ఉంది. ముఖ్యంగా దక్షిణాదిన తాము అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటక కాంగ్రెస్‌కు చేజారిన అనంతరం జరుగుతున్న కీలక అసెంబ్లీ ఎన్నిక కావడంతో దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కేంద్ర మంత్రులతో పాటు పలువురు సీనియర్ ఎంపీలను కూడా ఇప్పటికే అసెంబ్లీ బరిలో దింపింది. తద్వారా మధ్యప్రదేశ్‌లో విజయం తనకెంత ముఖ్యమో చెప్పకనే చెప్పింది. వీటన్నింటికీ మోదీ చరిష్మా తోడై ఈసారి కూడా గట్టెక్కిస్తుందని ఆశిస్తోంది. 'ఎంపీ కే మన్ మే మోదీ...'నినాదంతో ఊరూవాడా హోరెత్తిస్తోంది. అంతేగాక సీనియర్లలో విభేదాలు తలెత్తకుండా, ప్రభుత్వ వ్యతిరేకత నేరుగా పార్టీ విజయావకాశాలపై పడకుండా చూసేందుకు ప్రయత్నిస్తోంది. అందుకే చౌహాన్‌ను సీఎం అభ్యర్థిగా కూడా ప్రచారం చేయకుండా గుంభనంగా వ్యవహరిస్తోంది. నిన్నటితరం బీజేపీ దిగ్గజాలైన ఎల్‌కే అద్వానీ కాలానికి చెందిన నేటికీ బీజేపీలో చురుగ్గా ఉన్నది బహుశా ఆయనొక్కరే. ఇక కాంగ్రెస్ కూడా వర్గాలవారీగా ఓట్ల వేటలో పడింది. దళితుడైన పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే 35 ఎస్సీ స్థానాలపై లోతుగా దృష్టి సారించినట్టు సమాచారం.

బీజేపీ..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చిన నేపథ్యంలో ఈసారి ఏ చిన్న అవకాశాన్నీ వదలకూడదన్న అభిప్రాయంలో బీజేపీ ఉంది. అందుకే గిరిజన, ఓబీసీ, మహిళా... ఇలా ఓటర్లను సెగ్మెంట్లవారీగా విభజించుకుని మరీ లోతుగా దృష్టి పెడుతోంది. వీటికి తోడుగా హిందూత్వ కార్డు ఎలాగూ అండగా ఉంటుందని ఆశిస్తోంది. సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రధానంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని పలు ఉచిత పథకాలు ప్రకటించారు.

- ➤ లాడ్లీ బెహనా యోజన కింద రాష్ట్రంలోని 1.32 కోట్ల మహిళలకు అందుతున్న నెలవారీ ఆర్థికసాయాన్ని ఏకంగా రూ.3,000కు పెంచుతామని పేర్కొన్నారు.
- ➤ గత జూన్‌లో ఈ పథకాన్ని మొదలు పెట్టినప్పుడు ఈ సాయం తొలుత రూ.1,000 ఉండగా రూ.1,250కి, తర్వాత రూ.1,500కు పెంచారు. ఆర్థికంగా వెనకబడ్డ మహిళలకు ఉద్దేశించిన ఈ పథకంపై సర్కారు ఇప్పటికే ఏకంగా ఏటా రూ.16,000 కోట్లు వెచ్చిస్తోంది.
- ➤ రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ప్రకటించారు.

కాంగ్రెస్..

పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ కూడా వరుసబెట్టి ఇప్పటికే పలు ఉచిత పథకాలు ప్రకటించారు. ఓబీసీ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

- ➤ మహిళలకు నారీ సమ్మాన్ నిధి'పేరుతో నెలకు రూ.1,500 అందజేస్తామని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రకటించారు.
- ➤ ప్రతి ఇంటికీ రూ.500కే ఎల్పీజీ సిలిండర్ అందజేస్తామని పేర్కొన్నారు.
- ➤ రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని తిరిగి తెస్తామని ప్రకటించారు.
- ➤ రాష్ట్రంలో ఏకంగా 45 శాతమున్న ఓబీసీలకు రిజర్వేషన్లను 14 శాతం నుంచి 27 శాతానికి పెంచుతామని కమల్‌నాథ్ ప్రకటించారు. ఆయన సీఎంగా ఉండగా ఈ మేరకు నిర్ణయం తీసుకోగా కోర్టు దాన్ని కొట్టేసింది.
- ➤ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని కూడా ప్రకటించారు.

ప్రచారంలో పెద్దలు...

రాష్ట్రంలో ఎన్నికల ప్రచార బరిలో అన్ని పార్టీల నుంచీ అగ్రనేతలు ఇప్పటికే బరిలో దిగారు. బీజేపీ నుంచి ప్రధానిమోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు.

- ➤ కాంగ్రెస్ ప్రచార భారాన్ని ఖర్గేతో పాటు రాహుల్, ప్రియాంక మోస్తున్నారు. కమల్‌నాథ్‌కు దన్నుగా వెటరన్ నేత దిగ్విజయ్ సింగ్ నిలుస్తున్నారు.
- ➤ ఆప్ నుంచి కేజ్రీవాల్, భగవంత్ మాన్ మరిన్ని సభలూ, సమావేశాలకు ప్లాన్ చేస్తున్నారు.



పార్టీల భక్తి బాట...

- ➤ ఓట్ల వేటలో భాగంగా మధ్యప్రదేశ్‌లో బీజేపీతో పాటు కాంగ్రెస్ కూడా ఈసారి భక్తి బాట పట్టడం విశేషం.
- ➤ ఆలయాల పునర్నిర్మాణం, సుందరీకరణపై చౌహాన్ పెద్ద ఎత్తున దృష్టి పెట్టారు. ఇందుకు రూ.3,000 కోట్లు వెచ్చిస్తున్నారు. ప్రఖ్యాత ఉజ్జయినీ మహాకాళేశ్వర మందిరాన్ని, దాని అనుబంధ మ్యూజియాలను మెరుగు పరుస్తున్నారు.
- ➤ ఖాండ్వా జిల్లాలోని ప్రఖ్యాత ఓంకారేశ్వర్‌లో 108 అడుగులతో ఆది శంకరుల విగ్రహాన్ని ఇటీవలే ఆవిష్కరించారు.
- ➤ కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ కూడా ఇటీవల జబల్‌పూర్‌లో నర్మదా నదిలో పాల్గొన్నారు. జై నర్మద, జై బజరంగబలి అంటూ నినాదాలతో ఆకట్టుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్ కూడా పలు మతపరమైన కార్యక్రమాల్లో జోరుగా పాల్గొంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆప్, బీఎస్పీ కూడా...

ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ కూడా ఈసారి బలంగా ఉనికి చాటుకునే ప్రయత్నంలో ఉన్నాయి. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే ఆ పార్టీ పాలిత పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో కలిసి రాష్ట్రంలో నాలుగుసార్లు పర్యటించారు. ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించారు.

- ➤ ఉచిత విద్య, వైద్యం, కరెంటు అందిస్తామని ఆప్ ప్రకటించింది.

బీజేపీ ఐఏఎస్

బ్యూరోక్రసీ టూ పాలిటిక్స్

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వేళ బీజేపీలో బ్యూరోక్రాట్ల ప్రభ వెలిగిపోతోంది. మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొందరు, ఉన్న పదవుల్ని వదులుకొని మరికొందరు కొద్ది నెలలుగా కాషాయం కండువా కప్పుకుంటున్నారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. పార్టీలో పట్టున్న నాయకుల్ని కూడా కాదనుకొని కమలనాథులు బ్యూరోక్రాట్లకు టికెట్‌లు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

త్రిమూర్తులకు టికెట్లు

- రాజస్తాన్ అసెంబ్లీలో బస్సి నియోజకవర్గం నుంచి 1980 బ్యాచ్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి చంద్రమోహన్ మీనాను బీజేపీ ఎన్నికల బరిలోకి దింపింది. గత జూన్‌లో పార్టీలో చేరిన మీనాకు టికెట్ ఇస్తున్నారన్న ప్రచారం మొదలవగానే నియోజకవర్గానికి చెందిన కీలక నాయకులు ఢిల్లీకి వెళ్లి పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ దగ్గర తమ అసంతృప్తి ప్రకటించినా బీజేపీ పెద్దలు మీనా వైపే మొగ్గుచూపించారు.
- ఛత్తీస్‌గఢ్‌లో రాయగఢ్ నియోజకవర్గం నుంచి యువతరానికి ప్రతినిధిగా నిలిచే మాజీ ఐఏఎస్ అధికారి ఒ.పి. చౌధరి పోటీకి దిగారు. 2005 బ్యాచ్‌కు చెందిన చౌధరి గత కొన్నేళ్లుగా బీజేపీలో మంచి పాపులారిటీ సంపాదించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఈసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.
- ఛత్తీస్‌గఢ్‌లో నీల్‌కాంత్ టికమ్ ఆగస్టులో ఐఏఎస్‌గా రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ సారి కేష్‌కల్ నియోజకవర్గం నుంచి ఆయనకు టిక్కెట్ దక్కింది. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండే బస్తర్ జిల్లాకు చెందిన అధికారి అయి న నీల్‌కాంత్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకి సేవ చేయకుండా తన చేతులు కట్టేసిందని ఆరోపించారు.



ఛత్తీస్‌గఢ్‌లో ప్రచారం చేస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి నీల్‌కాంత్ (ఫైల్)

ఎందుకీ ప్రాధాన్యం ?

పరిపాలనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్టైలే వేరు. ప్రభుత్వానికి కార్పొరేట్ కలర్ ఇవ్వడానికి ఆయన నిరంతరం తాపత్రయపడుతుంటారు. ఇందుకోసం ఆయన ఎన్నుకున్న మార్గం మాజీ ఐఏఎస్ అధికారుల్ని పార్టీ గూటిలోకి చేర్చుకోవడం. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు కూడా మోదీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై అచంచల విశ్వాసం కలిగి ఉండేవారు. గత ఏప్రిల్‌లో జరిగిన సివిల్స్ సర్వీస్ డేలో బ్యూరోక్రాట్లు మార్పుకి ఏజెంట్లు అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. సమర్థుడైన అధికారి లేకుండా రాజకీయ పార్టీకి కూడా గుర్తింపు ఉండదని బలంగా నమ్మే ప్రధాని మోదీ ఐఏఎస్‌లను అక్కున చేర్చుకుంటున్నారు. కార్పొరేట్ స్టైల్‌లో పని చేయడం వ్యవస్థలో ప్రతీ ఒక్కరిని జవాబుదారీగా చేయడమే లక్ష్యంగా ఉన్న మోదీ ఐఏఎస్‌లను అధిక సంఖ్యలో చేర్చుకుంటున్నారన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే కేంద్రంలో అత్యంత కీలకమైన రైల్వే, విదేశీ వ్యవహారాలు, పెట్రోలియం శాఖలకు మంత్రులైన అశ్విని వైష్ణవ్, జై శంకర్, హర్‌దీప్ పూరి ఐఏఎస్ అధికారులుగా పనిచేసిన అనుభవంతోనే రాజకీయాల్లో రాణిస్తున్నారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా బ్యూరోక్రాట్ల తెలివితేటలు, సమర్థతని పార్టీ ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలన్న వ్యూహంతో ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మూడు రాష్ట్రాల్లో 'ఆప్' పోటీ: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. మూడు రాష్ట్రాల్లో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను రంగంలోకి దించుతామని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ఆప్ సీనియర్ నేత సందీప్ పాఠక్ పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల్లో ప్రజలు వేర్వేరు పార్టీలకు అవకాశం ఇచ్చారని, ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాలన్న ఆలోచనలో ఉన్నారని ఉద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ఎజెండాలో విద్య, వైద్యం, విద్యుత్, నీటి సరఫరా వంటి కీలక అంశాలకు స్థానం లేకుండాపోవడం దారుణమని విమర్శించారు.

ఇక చంద్రగిరి కోట ధగధగ



సాక్షి, అమరావతి: చారిత్రక వారసత్వ సంపద కలిగిన 'చంద్రగిరి కోట'కు పర్యాటక అభివృద్ధి సంస్థ కొత్త వెలుగులు అద్దనుంది. అద్భుతమైన కట్టడాలు, అబ్బురపరిచే శిల్ప కళలకు తోడు అంతర్జాతీయ ప్రమాణాలతో సౌండ్, లైటింగ్ షోలను అందుబాటులోకి తేనున్నది. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) కింద సుమారు రూ.5కోట్ల వ్యయంతో కోట ప్రాంగణంలో పర్యాటకులకు మౌలిక వసతులు మెరుగుపరచనుంది. దీన్లోభాగంగా ఏపీటీడీసీ చెన్నైకు చెందిన ఓ ప్రఖ్యాత కంపెనీతో ఒప్పందం చేసుకుంది. కోటపై లైటింగ్ షోతో పాటు ప్రత్యేకంగా డిజైన్ చేసిన ప్రాజెక్షన్ మ్యాప్ ప్రదర్శించనుంది. సమీపంలోని కొలనులో ఆట విడుపుగా బోటింగ్‌తో పాటు అధునాతన కియోస్క్‌లు, ఫుడ్ కోర్టులు, పర్యాటకులు సేదతీరేందుకు ప్రత్యేక గొడుగులు వంటి సౌకర్యాలను కల్పించనుంది. కోట చారిత్రక ప్రాశస్త్యంతో సుమారు 20–30 నిమిషాల లోపు రోజుకు రెండు ప్రాజెక్షన్ షోలు ఏర్పాటు చేయనుంది. వచ్చే మూడు నుంచి ఆరు నెలల్లోగా ప్రాజెక్టును అమలులోకి తెచ్చేలా ఏపీటీడీసీ కసరత్తు చేస్తోంది.

తేలికైన శిక్షలు... ఆగని అకృత్యాలు



అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రంగంపేటలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు దేవిన సోహిత, ధన్యత సైకతాన్ని రూపొందించారు. సైకతంతో బాలికను అరచేతిలో బంధించినట్లుగా తీర్చిదిద్ది దానిపై 'తేలికైన శిక్షలు...ఆగని అకృత్యాలు...థింక్ జడ్జస్' అని పేర్కొన్నారు. – రంగంపేట

షార్‌లో జోరుగా అంతరిక్ష వారోత్సవాలు




సూళ్లూరుపేట రూరల్ (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహిస్తున్న అంతరిక్ష వారోత్సవాలు శ్రీహరికోటలో (షార్) జోరుగా జరుగుతున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు ఈ వారోత్సవాలు తిలకించేందుకు భారీగా తరలివస్తున్నారు. దీన్లో భాగంగానే నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన 600 మంది విద్యార్థులు మంగళవారం షార్‌ను సందర్శించారు. వీరి కోసం అధికారులు ఆర్‌హెచ్–200 రోహిణి సౌండింగ్ రాకెట్ ప్రయోగించారు. దీంతోపాటు ప్రయోగాలపై అవగాహన కల్పించి, స్పేస్ టెక్నాలజీ గురించి క్షుణ్ణంగా వివరించారు. సైన్స్‌పై అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని వివరించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ, ఏడీ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కృష్ణా జలాల వినియోగంపై కౌంటరు దాఖలు చేయండి

కేంద్రం, కేఆర్‌ఎంబీలకు సుప్రీంకోర్టు నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణానది జలాల వినియోగం, విద్యుదుత్పత్తి అంశంలో కౌంటరు దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)లకు సుప్రీం కోర్టు నోటీసులు జారీచేసింది. తెలంగాణకు విద్యుదుత్పత్తి నిమిత్తం కృష్ణాజలాల విడుదల ఆపాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసిందని ఆ రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ధర్మాసనానికి తెలిపారు. దీంతో కౌంటరు దాఖలు చేయాలని కేంద్రం, కేఆర్ ఎంబీలను ధర్మాసనం ఆదేశించింది. రిజాయిండరు దాఖలుకు ఏపీ ప్రభుత్వానికి రెండు వారాలు గడువిస్తూ విచారణ నవంబరు 21కి వాయిదా వేసింది.

జగనన్న పాలన మళ్లీ రావాలి

- శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శ్రీకాళహస్తిలో మంగళవారం మసీదు, చర్చిలు, ఆలయాలు ముందు టీడీపీ పలు కార్యక్రమాలు నిర్వహించింది. శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన సమావేశంలో సుధీర్ రెడ్డి మాట్లాడుతూ..జగనన్న చల్లని పాలన మళ్లీ రావాలని ఈశ్వరుని ప్రార్థిస్తున్నానని అన్నారు. ఆయన చుట్టూ ఉన్న టీడీపీ నేతలు కూడా ఆయనను వారించకపోవడం విశేషం. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

రెడ్‌రన్‌లో ఏపీ విద్యార్థులకు బహుమతులు

సాక్షి, అమరావతి: హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ఈనెల 8వ తేదీన గోవాలో జాతీయస్థాయి రెడ్‌రన్ నిర్వహించారు. ఈ రన్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు రెండు జాతీయ బహుమతులు కైవశం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. కేటగిరి–3లో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థి జీ రమేశ్ ప్రథమ బహుమతి సాధించగా, పార్వతీపురం జిల్లా గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ కళాశాలకు చెందిన సత్యనారాయణ నాయక్ ద్వితీయ బహుమతి సాధించారు.

ఏపీ ఎల్పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న శ్రీనాథ్‌రెడ్డి

తాడేపల్లి రూరల్: ఏపీ ఎల్పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల కార్యవర్గం నూతనంగా ఎన్నికైంది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ..ఈ ఎన్నికల్లో తమ ప్యానల్ విజయం సాధించిందని చెప్పారు. తమకు కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన 1,100 మంది డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యక్షులుగా కోన శరత్, ప్రధాన కార్యదర్శిగా ఎఎస్ రామ్‌కుమార్, కోశాధికారిగా ముత్యాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా సతీష్‌చంద్ర రెడ్డి, మహిళా ఉపాధ్యక్షులుగా నిమ్మగడ్డ సాధన, ఉపాధ్యక్షులుగా పి.సుధీర్, వి.కోదండ రామారావు, కే సంజీవ్ కుమార్, రాయలసీమ సంయుక్త కార్యదర్శిగా సీవీ సుబ్బారెడ్డి, సెంట్రల్ ఆంధ్రా సంయుక్త కార్యదర్శిగా త్రిమూర్తి రాజు, ఉత్తరాంధ్ర సంయుక్త కార్యదర్శిగా బండి సమత ప్రమాణ స్వీకారం చేశారని తెలిపారు.

మారింది పేరొక్కటే

డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులకు నాడు నేడూ అవే విధులు

- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రమోట్ చేయడం వారి విధుల్లో భాగమే
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలుగా అభివర్ణిస్తూ తప్పుడు కథనాలు
- అయినా వారంతా ఈనాడు మాజీ ఉద్యోగులే కదా?
- అర్హతలు, నిబంధనలను అనుసరించే నియామకం
- రూ.500 కోట్లు వ్యయం శుద్ధ అబద్ధమే.. ఇప్పటిదాకా ఖర్చు రూ.88.56 కోట్లే

సాక్షి, అమరావతి: ఏపీ డిజిటల్ కార్పొరేషన్ (ఏపీడీసీ) ప్రధాన ఉద్దేశం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రమోట్ చేయడం. ప్రభుత్వాన్ని నడిపే ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలను హైలైట్ చేస్తూ వివిధ పథకాల ద్వారా ప్రజలు ప్రయోజనం పొందేలా విస్తృత ప్రచారం కల్పించడం వారి విధుల్లో భాగమే. టీడీపీ హయాంలోనూ అదే జరిగింది. ఇప్పుడు కూడా అంతే. ఒక్క పేరు మార్పు మినహా ఎలాంటి తేడా లేదు. నాడు కంటెంట్ కార్పొరేషన్‌గా వ్యవహరించగా ఇప్పుడు డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగంగా డిజిటల్ కార్పొరేషన్‌గా మార్పు చేశారు. డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులను వైఎస్సార్ సీపీ కార్యకర్తలుగా అభివర్ణిస్తూ కథనాలను ప్రచురించిన ఈనాడుకు వారిలో కొందరు గతంలో తమ వద్ద కూడా పని చేశారనే విషయం తెలుసా? చంద్రబాబు హయాంలో పీఆర్వోలుగా పనిచేసిన వారంతా ఈనాడు, ఆంధ్రజ్యోతి లాంటి మీడియా సంస్థల్లో పనిచేసిన వారే కదా? ఇక ఏపీడీసీ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు జీతభత్యాలు, కార్యక్రమాల ప్రమోషన్ల కోసం చేసిన మొత్తం ఖర్చు రూ.88.56 కోట్లు కాగా రూ.500 కోట్లు దోచిపెట్టారంటూ ఈనాడు తప్పుడు కథనాలను అచ్చోసింది. ఏపీడీసీకి నాలుగేళ్లలో సగటున రూ. కోట్లు కూడా ఖర్చు కాలేదన్నది వాస్తవం.

- గతంలో చంద్రబాబు హయాంలో ఏర్పాటైన ఏపీ కంటెంట్ కార్పొరేషన్ పేరును మారుస్తూ జారీ చేసిన జీవో 19 ద్వారా ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఏర్పాటైంది. ఇదేమీ ఇవాళ కొత్తగా ఏర్పాటైన కార్పొరేషన్ కాదు. ఏపీడీసీ ప్రధాన లక్ష్యం ప్రభుత్వ కార్యక్రమాలకు బహుళ ప్రాచుర్యం కల్పించడం, ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం, ప్రభుత్వం – ప్రజల మధ్య వారధిగా పనిచేయడం.
- రాష్ట్ర ప్రభుత్వం సహా అన్ని విభాగాల తరఫున ఏపీడీసీ ప్రకటనలు రూపొందిస్తుంది. ప్రభుత్వాధి నేతగా, ప్రభుత్వ సారథిగా, ఆ కార్యక్రమాల రూపకర్తగా ముఖ్యమంత్రి ఈ ప్రకటనలన్నింటిలోనూ కనిపిస్తారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇదేమీ నిబంధనలకు, చట్టానికి వ్యతిరేకం కాదు. దీనిపై విమర్శలు చేయడం వెనుక ఆంతర్యం కేవలం బురద జల్లడమే.

- గత సర్కారు చంద్రబాబు ఇమేజీని పెంచడానికి గ్రూప్– ఎమ్ లాంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని కోట్లాది రూపాయలు చెల్లించిన మాట వాస్తవం కాదా?
- కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలైన ఎమ్ఈఐటీవై, ఎమ్ఐబీ, డీఏవీపీ లాంటి వాటి మార్గదర్శకాలనే ఏపీడీసీ కూడా అనుసరిస్తోంది. వాటికి అనుగుణంగానే ఏపీడీసీ డిజిటల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ తయారైంది. పద్ధతి ప్రకారం ఇవన్నీ **నడుస్తున్నప్పుడు పసలేని విమర్శలు ఎందుకు?**
- రేట్ కార్డులను కూడా కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల మార్గదర్శకాలకు అనుగుణంగానే ఏపీడీసీ స్వీకరించింది. దానికి అనుగుణంగానే వెబ్‌సైట్లు, సోషల్, డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, యాడ్ ఏజెన్సీలు మొదలైన వాటికి ఎంప్యానెల్ చేయడానికి ప్రముఖ జాతీయ, ప్రాంతీయ ప్రింట్ మీడియా పబ్లికేషన్స్‌లో ఆర్ఎఫ్‌పీలను ఏపీడీసీ ప్రచురిస్తుంది. అన్నీ సక్రమంగా జరిగాకే ఎంప్యానెల్ ఏజెన్సీలకు ఏపీడీసీ వర్క్ ఆర్డర్లను జారీ చేస్తుంది.
- ఏపీడీసీ ఇప్పటివరకు ఏ ఒక్క కార్యక్రమానికి సంబంధించిన ప్రకటనలను కూడా ఏదో ఒక ఏజెన్సీకి కట్టబెట్టిన సందర్భం లేదు. ప్రతి ప్రచార కార్యక్రమంలోనూ కనీసం 5 లేదా అంతకంటే ఎక్కువ ఏజెన్సీలకు ఏపీడీసీ ప్రకటనలు విడుదల చేసింది. కేవలం ఒక మీడియా సంస్థకు మాత్రమే ప్రత్యేకంగా ప్రకటనలు ఇస్తున్నారనే ప్రశ్నే తలెత్తదు. కార్యక్రమాలు, లక్షిత వీక్షకుల ఆధారంగా వీలైనంత ఎక్కువ మందికి చేరే ప్లాట్‌ఫామ్స్‌కే ఏపీడీసీ ప్రకటనలు విడుదల చేస్తూ వచ్చింది. ప్రకటనల జారీలో వివిధ ఆధీకృత సంస్థలు పాటించే పద్ధతే ఇది.
- వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ కాన్సెప్ట్ అనేది అసలు ఏపీడీసీ పరిధిలోకే రాదు. ఏపీడీసీ దానికి ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీ కూడా కాదు. **ఇలాంటి** పచ్చి అబద్ధాలను ప్రచారం చేయడం ఈనాడుకే చెల్లింది.
- ఐప్యాక్‌కు ప్రకటనలు ఇస్తున్నారన్నది పూర్తి అబద్ధం. ఐప్యాక్ అనేది ఎంప్యానెల్ అయిన ఏజెన్సీ కాదు. ఐప్యాక్‌కు ఏపీడీసీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనలూ ఇవ్వలేదు. ఐడ్రీమ్‌కు కూడా ఎలాంటి ప్రకటనలూ ఇవ్వలేదు.
- రిక్రూట్‌మెంట్ విషయానికి వస్తే సాంకేతిక పరిజ్ఞానం, మీడియాలో అపార అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అర్హతలు ప్రామాణికంగా నియామకాలు జరిగాయి. నియామకాలన్నీ జీఓ 94 ప్రకారమే జరుగుతున్నాయి. గతంలో ఇదే ఉద్యోగులు ఈనాడులో కూడా పనిచేశారు. సలహాదారులైన సజ్జల రామకృష్ణారెడ్డి, జీవీడీ కృష్ణమోహన్, ధనుంజయ్‌రెడ్డి, ముఖ్యమంత్రి సీపీఆర్వో శ్రీహరి తదితరులు ఈనాడులో పనిచేసిన వారే అన్న విషయాన్ని ఆ పత్రిక ఖండించగలదా? ఈనాడులో పని చేసి అక్కడనుంచి సాక్షికి వచ్చారన్నది వాస్తవం. వారికి అర్హతలున్నాయి కాబట్టే ఈనాడు ఉద్యోగాలు ఇచ్చింది. అవే అర్హతల ప్రామాణికంగా సాక్షిలో కూడా ఉద్యోగాలు పొందారు. వాటిని పరిగణలోకి తీసుకుని ఇటు ప్రభుత్వంలోనూ అటు ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ వారికి సముచిత స్థానం కల్పించారు. ఈ విషయంలో టీడీపీ, ఈనాడు చేస్తున్నవి అడ్డగోలు వాదనలని ఇక్కడే తేలిపోతోంది.
- ఓ కార్పొరేషన్‌గా ఏపీడీసీ వివిధ విభాగాల నుంచి ఆదాయాన్ని కూడా ఆర్జిస్తోంది. అన్ని ప్రభుత్వ విభాగాలూ ఏపీడీసీ సేవలను, డిజిటల్ స్పేస్‌లో అనుభవాన్ని ఉపయోగించుకోవాలని సాధారణ పరిపాలన శాఖ సూచించింది. ఏపీడీసీ ఖర్చు చేసే ప్రతి రూపాయికీ లెక్క ఉంటుంది.
- రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేసే యత్నాలను తీవ్రంగా పరిగణిస్తున్న ఏపీడీసీ సంబంధిత వ్యక్తులు, సంస్థలపై న్యాయపరమైన చర్యలు తీసుకునే యోచనలో ఉంది.

'జగనన్న ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం

- అధ్వానంగా ఉన్న ప్రజారోగ్య వ్యవస్థకు జీవం పోశారు
- లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ప్రశంసిస్తూ ఓ వీడియో విడుదల



సాక్షి, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం దేశానికే ఆదర్శం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం దగ్గరకు వైద్యులను, ఆరోగ్య కార్యకర్తలను పంపించడం గొప్ప విషయం' అంటూ లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ కొనియాడారు. మంగళవారం ఆయన 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ప్రశంసిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. 'బేస్‌లైన్ ఆరోగ్య పరీక్షలతో పాటు హెల్త్ స్క్రీనింగ్ రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా పేదల ఆరోగ్యంపై శ్రద్ధకు శ్రీకారం చుట్టారు. తెలుగునాట మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ రూపంలో, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో 'ఆరోగ్య సురక్ష' ద్వారా అధ్వానంగా ఉన్న ప్రజారోగ్య వ్యవస్థకు జీవం పోశారు. దేశంలోని కోట్లాది మంది ప్రజలు కేవలం అనారోగ్యం, సరైన వైద్యం అందక, వైద్య ఖర్చులు భరించలేక పేదరికంలోకి వెళ్లిపోతున్నారు. అలాంటి సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడం శుభపరిణామం. ఆరోగ్యశ్రీలో పేదలు తమకు నచ్చిన నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే సౌలభ్యాన్ని కల్పిస్తుండటంతో.. ఆస్పత్రులు కూడా మెరుగైన వైద్యం అందించాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రస్తుతం జీవనశైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ముందుగానే వాటిని గుర్తించి సరైన వైద్య సహాయం అందిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది' అంటూ వీడియో సందేశంలో జయప్రకాశ్ నారాయణ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశంసల జల్లు కురిపించారు.

పాజిటివ్ ఓటుతోనే మళ్లీ పగ్గాలు..

- పాలనా సంస్కరణలు, సంక్షేమ పథకాలు, పారదర్శక పాలనే మా వజ్రాయుధాలు
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ పాజిటివ్ ఓటుతోనే మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ధీమా వ్యక్తంచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగేళ్ల నాలుగు నెలల కాలంలో అమలుచేసిన పాలన సంస్కరణలు, సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన, అవినీతి రహిత కార్యక్రమాలే తమ పార్టీకి వజ్రాయుధాలన్నారు. గత ఎన్నికలకు ముందు చెప్పినవి చిత్తశుద్ధితో అమలుచేశామని, దీంతో ప్రజలు ప్రభుత్వంపట్ల పూర్తి సంతృప్తిని కనబరుస్తున్నారని చెప్పారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'సీఎం వైఎస్ జగన్ ఎన్నికల కోసం పనిచేసే మనిషి కాదు. ప్రజలకు వీలైనంత ఎక్కువ మంచి చేసి, ప్రజల మనసులో స్థానం సంపాదించుకోవాలన్న ఆశయంతో పనిచేస్తున్న వ్యక్తి. రాష్ట్రంలో 1.62 కోట్ల కుటుంబాల ఇళ్లకు వలంటీర్లను పంపి, అందరి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని, ఆ ఊళ్లో డాక్టర్ల క్యాంపులు పెట్టి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారంటే రాష్ట్ర ప్రజలపట్ల సీఎం చిత్తశుద్ధి తెలిసిపోతోంది. ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన కార్యక్రమాలతో ఇప్పుడు రాష్ట్రంలో ప్రతి కుటుంబం జగన్‌మోహన్‌రెడ్డిని తమ సొంత కుటుంబ సభ్యుడిగా భావించే పరిస్థితి ఉంది. మరోవైపు.. రాష్ట్రంలో ప్రతిపక్షాలు ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలకు అడ్డుపడడమే పనిగా పనిచేస్తున్నాయి'అని అన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు..

విజయవాడ దుర్గగుడితో పాటు రాష్ట్రంలో పలు ప్రముఖ ఆలయాల్లో దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సజావుగా జరుగుతున్నాయి. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. రాష్ట్రంలో కొన్ని ఆలయాల స్థాయిని పెంచడం ద్వారా దేవదాయ శాఖలో అదనంగా 14 డిప్యూటీ కమిషనర్లు, నలుగురు అసిస్టెంట్ కమిషనర్ల పోస్టులు అవసరమవుతాయి. పదోన్నతుల ద్వారా ఇప్పటికే ఉన్న సిబ్బందికి ఈ పోస్టుల భర్తీలో ఎక్కువ అవకాశం ఉంటుంది. అలాగే, బ్యాంకుల్లో ప్రస్తుతం నగదు డిపాజిట్లకు ఎక్కువ వడ్డీ రేట్లు ఉన్నందున.. గతంలో తక్కువ వడ్డీ రేటుకు డిపాజిట్లు చేసిన చోట సమీక్షించి, అవసరమైతే పాత డిపాజిట్లను రద్దుచేసి కొత్తగా అదనపు వడ్డీ రేటుకు డిపాజిట్ చేసే విషయాన్ని పరిశీలించాలని అధికారులకు ఆదేశించాం.

మేలు జాతి పశువుల పునరుత్పత్తికి చర్యలు

అధికారులకు మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశం



సాక్షి, అమరావతి: పశుసంపద పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెయ్యదూడల శాతాన్ని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, అందుకు అవసరమైన మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. మంగళవారం విజయవాడలోని పశు సంవర్ధకశాఖ సంచాలకుల కార్యాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల పశుసంవర్ధక, ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ అధికారులతో జరిగిన ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదీతో కలిసి మంత్రి మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన పశుగ్రాస విత్తనాలు, దాణా, ప్రాథమిక పశు వైద్యం వంటి సేవలను అందిస్తున్నామని మంత్రి చెప్పారు. జిల్లాల్లోని రైతు భరోసా కేంద్రాలను అధికారులు సందర్శించి, సిబ్బంది పనితీరును సమీక్షించాలని ఆదేశించారు. పశుసంవర్ధక సహాయకులు తమ పరిధిలో ఎప్పటికప్పుడు పశుగణన చేపట్టాలని సూచించారు. గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ గ్రామాల్లోనే కాకుండా ఇతర గ్రామాల్లోను కూడా పశుపోషకులకు కనీసం 50 పశుకిసాన్ క్రెడిట్ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్రీకృత పర్యవేక్షణ కమిటీ ద్వారా పశుసంవర్ధక సహాయకుల పనితీరును పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. 1,00,761 పశుకిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరుతో దేశంలోనే రాష్ట్రం ఆరో స్థానంలో ఉన్నట్టు ఆయన వివరించారు.

టీడీపీ నేతల గ'లీజు' దందా

- చిత్తూరులో బినామీ పేరుతో మునిసిపల్ స్థలం కొట్టేసేందుకు యత్నం
- టీడీపీ హయాంలో నామమాత్రపు రుసుముతో లీజుకు స్థలం
- అందులో వాణిజ్య సముదాయం నిర్మించి వ్యాపారం
- లీజు గడువు ముగిసినా మునిసిపాలిటీకి అప్పగించని వైనం



దుకాణ సముదాయం సీజ్ చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: మునిసిపల్ స్థలాన్ని కొట్టేసేందుకు బినామీ పేరుతో టీడీపీ నేతలు సాగించిన గలీజు దందాకు అడ్డుకట్ట పడింది. మంగళవారం చిత్తూరులోని ఎంఎస్ఆర్ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని వాణిజ్య సముదాయాన్ని మునిసిపల్ కమిషనర్ అరుణ, అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2016లో చిత్తూరుకు చెందిన టీడీపీ కార్పొరేటర్, ఓ క్రియాశీలక నేత.. జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న మునిసిపల్ ఖాళీ స్థలంపై కన్నేశారు. ఇందులో భాగంగా కమలహాసన్ అనే వ్యక్తి పేరుతో అప్పటి మేయర్‌కు లేఖ రాశారు. తనకు ఎలాంటి ఆసరా లేదని, మునిసిపల్ స్థలం లీజుకు ఇస్తే బతుకుదెరువు చూసుకుంటానని అందులో పేర్కొన్నారు. ఆ వెంటనే మునిసిపల్ కౌన్సిల్ రూ.కోట్ల విలువైన స్థలాన్ని ఏటా రూ.15 వేలు చెల్లించేలా మూడేళ్ల పాటు లీజుకిచ్చింది. ఆ వెంటనే టీడీపీ నేతలు చిత్తూరులోని ఎంఎస్ఆర్ షాపింగ్ కాంప్లెక్స్ పరిధిలో.. ఏడు దుకాణాలు నిర్మించారు. వాటిని ఏటా రూ.70 వేల వరకు అద్దెలకు ఇచ్చారు. అడ్వాన్సుల పేరుతో రూ.లక్షలు వసూలు చేశారు. మూడేళ్ల లీజు పూర్తయినా స్థలాన్ని మునిసిపాలిటీకు అప్పగించకుండా రూ.లక్షలు దండుకున్నారు. ఇదే సమయంలో లీజు పొడిగించాలంటూ హైకోర్టుకు వెళ్లగా.. కొన్నాళ్ల పాటు స్టే ఇచ్చింది. తాజాగా న్యాయస్థానం స్టేను డిస్మిస్ చేయడంతో రూ.కోట్ల విలువైన స్థలాన్ని, వాణిజ్య సముదాయాన్ని మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

చంద్రబాబు తప్పించుకోలేరు

- నేరం జరగలేదని టీడీపీ నేతలు కూడా చెప్పడం లేదు
- మరిదిని కాపాడుకోవడానికే పురందేశ్వరి తాపత్రయం
- పవన్ కళ్యాణ్ పీకే కాదు.. కేకే (కిరాయి కోటిగాడు)
- మంత్రి అంబటి రాంబాబు ధ్వజం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు తప్పించుకోలేరని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తేల్చిచెప్పారు. ఆయనను సీఐడీ అరెస్టు చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా నేరం జరగలేదని ఆ పార్టీ నేతలు కానీ, వందిమాగధులు కానీ వాదించడం లేదని గుర్తు చేశారు. అవినీతి నిరోధక చట్టంలో సెక్షన్–17ఏ ప్రకారం చంద్రబాబు అరెస్టు జరగలేదని.. గవర్నర్ అనుమతి తీసుకోలేదని.. అరెస్టులో రాచమర్యాదలు పాటించలేదని రంధ్రాన్వేషణ చేస్తూ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ మండిపడ్డారు. విచారణ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. స్కిల్ స్కామ్‌లో రూ.371 కోట్లు చంద్రబాబు దోచేసిన వ్యవహారంపై విచారణ చేసుకోండి అనే ధైర్యం టీడీపీకి, ఆయనను మోస్తున్నవారికి లేదన్నారు. దీన్ని బట్టి చూస్తే గజదొంగ చంద్రబాబు దొరికిపోయారు అనేది రాష్ట్ర ప్రజలకు అర్థమవుతోందన్నారు. తన అక్రమాస్తులపై విచారణ చేయకుండా కోర్టుల్లో స్టేలు తెచ్చుకుని బతుకుతున్న చంద్రబాబు స్కిల్ స్కామ్ నుంచి తప్పించుకోలేరన్నారు. ఇంకా అంబటి ఏమన్నారంటే..

చంద్రబాబుకు అందుకే కోర్టులు బెయిల్ ఇవ్వలేదు..

షాపూర్‌జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని నుంచి రూ.118 కోట్లు ముడుపులు మీ పీఏ పెండ్యాల శ్రీనివాస్ ద్వారా మీకు చేరాయని, వాటికి సమాధానం ఇవ్వాలని ఐటీ శాఖ చంద్రబాబుకు నోటీసులు ఇచ్చింది. అయితే కేంద్ర కార్యాలయం నాకు నోటీసులు ఇవ్వడానికి వీల్లేదని, హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయం ఇవ్వాలని సాంకేతిక కారణాలు చూపి తప్పించుకోవాలని చంద్రబాబు ప్రయత్నించారు. అంతేకానీ ఆ రూ.118 కోట్లతో తనకు సంబంధం లేదని మాత్రం ఆయన చెప్పలేదు. విచారణ జరిగితే దొరికిపోతాననే భయంతోనే తప్పించుకోవడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. స్కిల్ స్కామ్‌లో ఈడీ నలుగురిని అరెస్టు చేసింది.. 1,400 మంది సాక్షులను విచారించింది. డాక్యుమెంట్లు సేకరించి.. 164 స్టేట్‌మెంట్స్ తీసుకున్నాక.. అక్రమాలకు పాల్పడ్డారని తేల్చాక ఆ ఆధారాలతోనే సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసింది. అందుకే ఈ కేసును కోర్టులు క్వాష్ చేయలేదు.. చంద్రబాబుకు బెయిల్ ఇవ్వలేదు.

ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్‌లో లోకేశ్

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? లోకేశ్‌ను చంద్రబాబు దొడ్డిదారిన ఎమ్మెల్సీని చేసి.. మంత్రి పదవి కట్టబెడితే.. ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్‌కు పాల్పడ్డారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చడం ద్వారా భూముల ధరలు పెరిగేలా చేసి.. లోకేశ్ లంచాలు వసూలు చేసుకున్నారు. హెరిటేజ్‌కు భూములు ఎందుకు కొన్నారు? వాటి పక్కనే ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్లేలా అలైన్‌మెంట్ ఎందుకు మార్చారని అడిగితే.. రింగ్‌రోడ్డు వేయలేదు కదా.. రాజధాని లేదు అంతా గ్రాఫిక్సే కదా అనే రీతిలో లోకేశ్ మాట్లాడుతున్నారు. ఎన్టీఆర్‌కు చంద్రబాబుతో కలిసి వెన్నుపోటు పొడిచిన పురందేశ్వరి.. ఇప్పుడు అదే బంధుప్రీతితో చంద్రబాబును కాపాడేందుకు తాపత్రయపడుతున్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు అత్యంత పారదర్శకంగా జరుగుతుంటే.. లిక్కర్ స్కామ్‌పై విచారణ జరపాలంటూ అమిత్ షాకు లేఖ ఇచ్చారు. ఆ ముసుగులో చంద్రబాబును కాపాడుకోవడానికి రాయబారానికి వెళ్లారు. టీడీపీని తెచ్చి బీజేపీలో కలిపేస్తామని, బీజేపీకి టీడీపీని పాదాక్రాంతం చేస్తామని హామీ కూడా ఇచ్చారు. పవన్ కళ్యాణ్ పీకే కాదు కేకే (కిరాయి కోటిగాడు). జనసేనను స్థాపించింది కాపులను పైకి తెద్దామని కాదు చంద్రబాబును అందలం ఎక్కిద్దామనే. పవన్ చేసే ప్రతి ప్రయత్నం వల్ల టీడీపీ మరింత బలహీనపడుతుంది. టీడీపీ బలహీనపడిందని పవన్ చెప్పడమే అందుకు నిదర్శనం.

బీసీల సత్తా చాటాలి

బీసీ ప్రతినిధుల రాష్ట్రస్థాయి సమావేశంలో మంత్రి కారుమూరి



బీసీ చైతన్యవేదిక సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని బీసీలంతా ఐక్యంగా ఏకతాటిపైకి వచ్చి రాజకీయాల్లో తమ సత్తా చాటాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరులో నిర్వహించిన బీసీ ప్రతినిధుల రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుని వదిలేస్తే నాలుగేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నింటా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. లోక్‌సభకు ఆరుగురు, రాజ్యసభకు నలుగురు బీసీలను పంపడంతో పాటు రాష్ట్ర మంత్రివర్గంలో 11 మంది బీసీలకు స్థానం కల్పించారని, 31 మంది బీసీలు ఎమ్మెల్యేలుగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో బీసీల సమగ్ర కులగణనకు సీఎం వైఎస్ జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని మంత్రి కారుమూరి గుర్తు చేశారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బలహీన వర్గాలకు చెందిన మేధావులంతా ఒకే వేదికపైకి రావడం అభినందనీయమన్నారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో బీసీలను పట్టించుకోకపోవడం వల్లే గత ఎన్నికల్లో వారు ఆ పార్టీకి దూరమయ్యారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి, డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు అన్నా రామచంద్ర యాదవ్, డీసీ రమణ తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

శౌర్య జాగరణ యాత్ర



యాత్రలో పాల్గొన్న వీహెచ్‌పీ కార్యకర్తలు

కంప్లి: దురలవాట్లపై యువతలో చైతన్యం తెచ్చి దేశభక్తులుగా తీర్చిదిద్దాలని పీ.పవన్, మల్లికార్జున తెలిపారు. పట్టణంలో వీరాంజనేయ స్వామి చిత్రపటంతో చేపట్టిన శౌర్య జాగరణ యాత్రలో వారు మాట్లాడారు. మహిళలు కలశాలు, వివిధ వాయిద్యాలతో కురుగోడు రోడ్డులోని సాయిబాబా, అయ్యప్ప స్వామి ఆలయాల్లో పూజలు జరిపిన అనంతరం అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ఉద్భవ గణపతి ఆలయం వరకు యాత్ర కొనసాగింది.

ఇంద్రధనుష్‌ను విజయవంతం చేయాలి

రాయచూరు రూరల్: జిల్లాలో ఇంద్రధనుష్ పథకాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి సురేంద్రబాబు సూచించారు. మంగళవారం జిల్లాధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో ఆశాపూర్ జనతా కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చుక్కలు వేసి ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు సాగే కార్యక్రమంలో ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలకు చుక్కలు వేయించుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో చెరుకు తోట దగ్ధం

- రూ.లక్షలాది పంట నష్టం



కాలిపోతున్న చెరుకు పంట

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకాలో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో చెరుకు తోటకు నిప్పంటుకుని లక్షలాది రూపాయల పంట నష్టం జరిగింది. తాలూకాలోని భోగాపుర గ్రామానికి చెందిన రైతు వెంకణ్ణ ఆరు ఎకరాలలో చెరుకు పంటను వేశారు. వానలు లేక కరువుతో తల్లడిల్లుతున్న సమయంలో చేతికొచ్చిన చెరుకు పంటకు అకస్మాత్తుగా తోట మీదుగా వెళ్లిన 11 కె.వి. విద్యుత్ లైన్ తెగి పంటపై పడడంతో మంటలు చెలరేగాయి. మొత్తం పైరుకు మంటలు అంటుకోవడంతో భారీగా నష్టం సంభవించిందని రైతు తెలిపారు. మూడేళ్ల క్రితం కొత్త విద్యుత్ తీగను అమర్చాలని కోరినా జెస్కాం అధికారులు వహించిన నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందంటూ లింగసూగూరు పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు చేశారు.

వన్యజీవి సప్తాహ మారథాన్



మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

కంప్లి: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలోని గుడేకోట కరడిధామ తరపున 69వ వన్యజీవి సప్తాహాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రామదుర్గ చెరువు ప్రాంతం నుంచి గుడేకోట వలయ అటవీ శాఖ అధికారులు కార్యాలయం వరకు మారథాన్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మారథాన్ పరుగు పోటీని ప్రారంభించిన అటవీ శాఖ అధికారి బీఎస్.మంజునాథ్ మాట్లాడుతూ అడవులు, వన్యజీవి సంపదను సంరక్షించే బాధ్యత అందరిదని, వాటిని కాపాడుకోవాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

హుబ్లీ: అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని కలఘటిగి తాలూకా హిండసగేరిలో సోమవారం చోటు చేసుకుంది. హిండసగేరి గ్రామానికి చెందిన కల్లప్ప మాజాపుర మృతుడు. గంజిగట్టి గ్రామ బరోడా బ్యాంక్ శాఖలో రూ.8 లక్షలు, ఇతరుల నుంచి రూ.3 లక్షలను అప్పు చేశారు. వానలు సరిగ్గా కురవక అప్పులు తీర్చే మార్గం కానరాక రైతు తన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకొన్నట్లు మృతుడి కుమారుడు గురుసిద్దప్ప కలఘటిగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వీధి పశువుల స్వైరవిహారం



రోడ్డులో తిరుగుతున్న పశువులు

కంప్లి: హగరిబొమ్మనహళ్లి పట్టణంలోని ప్రధాన మార్గాలు వీధి పశువులకు నిలయంగా మారిపోయాయి. కొట్టూరు రోడ్డు బసవేశ్వర బజార్, బసవేశ్వర సర్కిల్, హౌసింగ్ బోర్డు కాలనీ, రాంనగర్‌తో పాటు అనేక ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో నిత్యం పశువులు టికాణ వేసి ప్రజలకు వాహన రాకపోకలకు ఇబ్బందులు కల్గిస్తున్నాయి. దీంతో ప్రజలే పశువులను పట్టుకొని నందీపుర గోశాలకు తరలించారు. కొంత మంది పలుకుబడి గల వారు గోశాలకు తరలించిన పశువులను విడిపించుకొన్నారు. ప్రజలు సహకరించని పక్షంలో ఈ సమస్యకు పరిష్కరించడం కష్టం అంటున్నారు.

కాసులు కురిపించి..కన్నీరు మిగిల్చి..

- నష్టాల బాటలో టమాటా, పూల రైతులు
- ధర లేక రోడ్డు పక్కన పారబోస్తున్న వైనం



టమాటాలను రోడ్డు పక్కన గుట్టలుగా పారబోసిన దృశ్యం



టమాటాలను కోయకుండా పొలంలోనే వదిలేసిన దృశ్యం

శ్రీనివాసపురం: రెండు నెలల క్రితం రైతులకు కాసులు కురిపించిన టమాటా పంట నేడు ధర లేక రైతులను బజారున పడేస్తోంది. మార్కెట్‌లో ధరలు గణనీయగా తగ్గిపోవడంతో టమాటాలు, పూలను అడిగేవారే కరువయ్యారు. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఉండడంతో పలువురు రైతులు టమాటాలను మార్కెట్‌లకు తరలించకుండా పొలంలోనే వదిలేస్తుంటే మరి కొంత మంది రైతులు టమాటాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. పూలు, టమాటాలను శీతలీకరణ గిడ్డంగు(కోల్డ్ స్టోరేజీ)ల్లో ఎక్కువ రోజులు నిల్వ చేయడానికి వీలు లేకపోవడంతో రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. గతంలో వచ్చిన లాభం నేడు నష్టాల రూపంలో పోతోందని పలువురు రైతులు వాపోతున్నారు.

నాడు రికార్డు ధర పలికిన బాక్సు

రెండు నెలల క్రితం 15 కిలోల బాక్సు టమాటా ధర ఏకంగా రూ.2 వేల నుంచి రూ.2500 వరకు పలికి రికార్డు సృష్టించింది. అయితే నేడు అదే 15 కిలోల నాణ్యమైన టమాటా బాక్సు కేవలం రూ.50 ధర పలుకుతూ రైతులకు తీరని ఆవేదన మిగులుస్తోంది. శ్రీనివాసపురం, ముళబాగిలు తాలూకాల్లో అత్యధికంగా రైతులు టమాటాలు, పూలను పండిస్తున్నారు. ఈ ప్రాంత రైతులు టమాటాలను ముళబాగిలు తాలూకాలోని ఎన్.వడ్డహళ్లి మార్కెట్‌కు తరలిస్తారు. మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉన్నాయని తెలిసి పలువురు రైతులు ట్రాక్టర్లలో తరలిస్తున్న టమాటాలను రోడ్డు పక్కనే పారబోసి వెళుతున్నారు. సాధారణంగా మార్చి నుంచి జూన్ వరకు మార్కెట్‌లో టమాటాలకు మంచి రేటు ఉంటుంది. అనంతరం ధరలు తగినంతగా ఉండవు. అయితే ఈసారి ధరలు మరీ తక్కువగా ఉండడంతో రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. టమాటాలను పండించడానికి రైతులకు ఎకరాకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఖర్చు ఇలా ఉంటే 15 కిలోల బాక్సుకు కేవలం రూ.40 నుంచి రూ.50 ధర వస్తుండడంతో పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదు.

పూల రైతుల పరిస్థితి కూడా ఇంతే

మార్కెట్‌లో కేవలం టమాటాలే కాకుండా బంతి పూలు పండించిన రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. మార్కెట్‌లో కిలో బంతిపూల ధర కేవలం రూ.10 మాత్రమే ఉంది. ఇటీవల వినాయకచవితి, వరలక్ష్మి వ్రతం పండుగల సమయాల్లో కూడా బంతిపూలకు ధరలు ఆశించినంతగా లేకపోవడంతో రైతన్నలు నష్టపోయారు. ధరలు లేక రైతులు తీవ్ర సంకష్టంలో నలుగుతున్న సమయంలో ప్రభుత్వం ముందుకు వచ్చి టమాటాలకు, పూలకు మద్దతు ధరను ఇచ్చి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి కిలోకు కనీసం రూ.10 మద్దతు ధరను ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ధరలు తగ్గిపోయి తీవ్ర కష్టాల్లో ఉన్న రైతులకు ప్రభుత్వం టమాటాలకు, పూలకు కనీసం కిలోకు రూ.10 మద్దతు ధరను ఇచ్చి ఆదుకోవాలని రైతు సంఘం ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ కోరారు. గతంలో కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కిలోకు రూ.2 మద్దతు ధరను ఇచ్చి ఆదుకున్నారని, అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతులను ఆదుకోవాలని మనవి చేశారు.

ప్రభుత్వాలను మార్చే శక్తి మహిళలదే



నారీశక్తి లోగోను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, మహిళలు

బళ్లారిటౌన్: ప్రభుత్వాలను మార్చే శక్తి మహిళలకు ఉందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మోకా రోడ్డులోని కేఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నారిశక్తి మహిళా సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యావత్ దేశం కర్ణాటక వైపునకు చూసేలా తమ ప్రభుత్వం మహిళల కోసం పంచతంత్ర పథకాలను ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. గృహలక్ష్మి, గృహజ్యోతి, గృహశక్తి, అన్నభాగ్య కార్యక్రమాలతో ఎక్కువగా మహిళలే లబ్ధి పొందుతున్నారన్నారు. మహిళలు కేవలం వంట పనికే పరిమితం కాదని, వారు అనుకుంటే సీఎం, పీఎంలను కూడా గద్దె దింపగలరన్నారు. మహిళలు పెట్టిన భిక్షతోనే మంత్రిని అయ్యానన్నారు. సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపట్టిన పథకాల వల్ల మహిళా సబలీకరణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో గీతా శివరాజకుమార్ చేతుల మీదుగా నారీశక్తి లోగోను ప్రారంభించారు. సమావేశంలో మేయర్ త్రివేణి, ఉపమేయర్ జానకమ్మ, కాంగ్రెస్ నేతలు హుమాయూన్‌ఖాన్, అభిలాష, హుస్సేన్ పీరా, బోయపాటి విష్ణు, ముండ్రగి నాగరాజు, మహిళా నేతలు మంజుల, పద్మావతి, శోభా కాళింగ, చానాళ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్భణి-తాండూరు రైలు రాయచూరుకు పొడిగింపు



రైలుకు పచ్చజెండా చూపుతున్న బాబూరావు

రాయచూరు రూరల్: పర్భణి–తాండూరు మధ్య నిత్యం సంచరించే రైలును ఆ శాఖ ఉన్నతాధికారులు ఇకపై రాయచూరు వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబూరావు తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం నగరంలోని రైల్వే స్టేషన్‌లో రాయచూరు లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్ ఆదేశాల మేరకు రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలుతో కర్ణాటక నుంచి తెలంగాణ, మహారాష్ట్రలోని పలు జిల్లాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. ఈ రైలు రాయచూరు నుంచి ప్రారంభమై కృష్ణా, యాదగిరి, సేడం, చిత్తాపుర, తాండూరు, వికారాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, ముత్కేడ్, నాందేడ్ మీదుగా పర్భణి చేరుకుంటుంది. కార్యక్రమంలో రైల్వే అధికారులు అభిషేక్ కుమార్, నిరంజన్ కుమార్, చౌహాన్, పదాధికారులు నాగేశ్వరరావు, అశోక్ పాటిల్, బసవరాజ్, శ్రీనివాస్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన పీఠం ఏర్పాటు చేయరూ..



వినతిపత్రం స్వీకరించిన హరీష్ రామస్వామి

రాయచూరు రూరల్: రాయచూరు విశ్వవిద్యాలయంలో హరిదాస అధ్యయన పీఠం ఏర్పాటు చేయాలని అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభాపతి నరసింగరావ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం రాయచూరు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ హరీష్ రామస్వామికి వినతిపత్రం సమర్పించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హరిదాస అధ్యయన పీఠం ప్రారంభించాలని కోరారు. రాయచూరు జిల్లా దాసులకు పుట్టినిల్లు, వందలాది మంది దాసులు సమాజానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఈసందర్భంగా జయలక్ష్మి మంగళమూర్తి, మురళీధర్, వెంకటేష్, నాగరాజ్, రమేష్, సుధీర్, వేణుగోపాల్, విష్ణుతీర్థలున్నారు.

జనతా దర్శన్‌తో పేదలకు మేలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున్

హొసపేటె: ప్రజల కోసం ప్రారంభించిన జనతా దర్శన్‌ను రానున్న రోజుల్లో మరింత విస్తరిస్తామని హరపనహళ్లి ఎమ్మెల్యే ఎంపీ లతా మల్లికార్జున్ అన్నారు. ఆమె మంగళవారం పట్టణంలోని పర్యాటక మందిరం ఆవరణలో నిర్వహించిన జనతాదర్శన్‌ను ప్రారంభించి మాట్లాడారు. సీఎం సిద్దరామయ్య ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రస్తుతం రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయిలో ప్రారంభమై పేదలకు, కూలీలకు, రైతులకు మేలు చేసిందన్నారు. సమస్యల పరిష్కారానికి హరపనహళ్లి తాలూకాలోని చివరి గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ఫిర్కా స్థాయిలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల నుంచి వినతుల స్వీకరణకు 25 కౌంటర్లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువ కానిస్టేబుల్ ఆత్మహత్య



కానిస్టేబుల్ ప్రకాష్ నాయక్(ఫైల్)

సాక్షి,బళ్లారి: తమ కుమారుడు సమాజంలో మంచి పేరు తెచ్చుకొంటాడని కలలు కని కష్టపడి ఇంజనీరింగ్ చదివించిన తల్లిదండ్రులకు శోకమే మిగిలింది. నగరంలోని డీఏఆర్ పోలీసు క్వార్టర్స్‌లో ఉంటూ పోలీసు విధులు నిర్వహిస్తున్న ప్రకాశ్‌నాయక్(26) సోమవారం రాత్రి క్వార్టర్స్‌లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హగరిబొమ్మనహళ్లి తాలూకా ఆనేకల్ తాండాకు చెందిన ప్రకాష్‌నాయక్ 2021వ బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. డీఏఆర్‌లో పోలీసు విధులు నిర్వహిస్తుండేవాడు. అయితే ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడని మృతుని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తులో ఉంది. కాగా చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవడం ఎంతవరకు సబబు అని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ కోతలను అరికట్టండి



మాట్లాడుతున్న నిజాముద్దీన్

'రాయచూరు రూరల్: విద్యుత్ కోతలను అరికట్టాలని తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు నిజాముద్దీన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఓ వైపు వానలు లేక రైతులు ఇబ్బందుల్లో ఉండగా, మరో వైపు విద్యుత్ కోతలతో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. ఆర్టీపీఎస్, వైటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలున్నా విద్యుత్ కోతల వల్ల విద్యార్థులు, రైతులు కష్టాల్లో ఉన్నారన్నారు. వైటీపీఎస్ విద్యుత్ కేంద్రాన్ని ప్రైవేట్ పరం చేయడానికి ప్రభుత్వం పిలిచిన టెండర్‌ను విరమించుకోవాలన్నారు. కరువు జిల్లాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సవతి తల్లి ప్రేమ చూపడం సరికాదన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గురురాజ్ కర్జిగి

రాయచూరు రూరల్: దేశంలో నేటి యువకులు అన్ని రంగాల్లో ప్రతిభను కనబరచాలని ప్రముఖ విద్యావేత్త గురురాజ్ కర్జిగి అన్నారు. మంగళవారం విద్యా భారతి పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన మొక్కలకు నీరు పోసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు మానవతా విలువలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు అన్ని రంగాల్లో జ్ఞానం, విద్య అత్యంత ప్రధానమని అన్నారు. ఈసందర్భంగా కార్యక్రమంలో సుఖాణి, రవిరాజన్‌లున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్ తదితరులు

కంప్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే గణేష్, వైద్యాధికారి రవీంద్ర కనిగేరి తెలిపారు. పట్టణంలోని సముదాయ ఆరోగ్య కేంద్రంలో బళ్లారి విమ్స్ రక్తభండార ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం ప్రేరిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు ఎలా యోగ్యులో అదే మాదిరిగా రక్తదానం చేయడానికి కూడా అర్హులేనన్నారు. కార్యక్రమంలో 107 మంది రక్తదానం చేశారు. 48 మంది అవయవదానికి సమ్మతించారు. తహసీల్దార్ శివరాజ్, టీపీ ఈఓ శ్రీకుమార్, డాక్టర్ సుధాకర్‌రావ్, డాక్టర్ భాగ్యలక్ష్మీ, డాక్టర్ నిఖిత సౌమ్య, డాక్టర్ సమద్, డాక్టర్ రేణుకారెడ్డి, డాక్టర్ అనూష, డాక్టర్ ఎస్‌కే హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పత్రికా సంపాదకుడు మృతి



సంపాదకుడు ప్రహ్లాదరావు(ఫైల్)

కోలారు: సీనియర్ పత్రికా సంపాదకుడు కె.ప్రహ్లాదరావు(80) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం అర్ధరాత్రి మరణించారు. ఆయన 50 ఏళ్ల క్రితం కోలారు పత్రికను స్థాపించి సామాజిక సమస్యలను ప్రజలు, ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షుడిగా, జిల్లా కసాప అధ్యక్షుడిగానూ సేవలు అందించారు. పత్రికా రంగంలో ఎనలేని సేవలను అందిస్తూ విలువలను కాపాడుకుంటూ వచ్చి నేటి యువ పాత్రికేయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పత్రికా అకాడమి అవార్డును కూడా అందుకున్నారు. ప్రహ్లాదరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంపీ ఎస్ మునిస్వామి, శ్రీనివాసపురం మాజీ ఎమ్మెల్యే కెఆర్ రమేష్‌కుమార్, విధాన పరిషత్ మాజీ ఉప సభాపతి విఆర్ సుదర్శన్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ప్రహ్లాదరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. నగరంలోని పాత్రికేయుల సంఘంలో ప్రహ్లాదరావు మృతికి అధ్యక్షుడు బివి గోపినాథ్ నేతృత్వంలో సంతాప సభను ఏర్పాటు చేసి పాత్రికేయులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ప్రహ్లాదరావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ



హాస్టల్ ఆవరణను పరిశీలిస్తున్న అధికారులు

హొసపేటె: విజయనగర జిల్లా హూవినహడగలి తాలూకా సోగి గ్రామంలోని విద్యార్థుల వసతి గృహం, ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయాలను జెడ్పీ ముఖ్యకార్యనిర్వహణాధికారి బి.సదాశివ ప్రభు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల హాస్టల్‌లోని రెండు స్వచ్ఛమైన తాగునీటి యూనిట్లకు మరమ్మతులు లేవని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు గుర్తించారు. మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ విషయమై వెంటనే సరిచేసి ఫోటోలతో కూడిన నివేదికను జెడ్పీకి అందజేయాలని అక్కడే ఉన్న వార్డెన్ రఫీక్‌ను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా రికార్డులు కావాలని అడగగా వార్డెన్ ఇంట్లోనే ఉన్నాయని చెప్పారు. రికార్డులు హాస్టల్‌లోనే ఉండాలని, జాబితా నమోదు చేయాలన్నారు. వాటిని పరిశీలనకు వచ్చిన అధికారులకు అందజేయాలన్నారు. ఈ గందరగోళాన్ని ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. అలాగే సోగి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్డి నిర్వహణకు నోచుకోక పాడైనట్లు గమనించారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో మరుగుదొడ్లు మరమ్మతులు చేశామని ప్రధానోపాధ్యాయుడు బదులిచ్చారని పీడీఓ తెలియజేశారు. దీన్ని సత్వరమే సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని క్షేత్ర విద్యాశాఖాధికారికి తెలిపారు. ఈసందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో భారత అసిస్టెంట్ ప్రొఫెసర్ క్షేమం

హుబ్లీ: ధార్వాడ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుమేశ కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఆగస్ట్ 7 నుంచి ఈ నెల 22 వరకు శిక్షణలో పాల్గొనడానికి ఇజ్రాయిల్‌కు వెళ్లారు. అయితే ఇటీవల హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయిల్‌లో ఉన్న ఫళంగా దాడులు చేసి యుద్ధవాతావరణానికి నాంది పలికిన విషయం తెలిసిందే. ఆ దేశంలోనే ఉన్న డాక్టర్ సుమేశ్‌ను స్వదేశానికి పిలుచుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు విశ్వవిద్యాలయం జీసీ మెంబర్ డాక్టర్. పీఎల్ పాటిల్ మీడియాకు తెలిపారు. డాక్టర్.సుమేశ్ ఇజ్రాయిల్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆయన విజయపుర పరిశోధన కేంద్రంలో పని చేసేవారు. శిక్షణలో భాగంగా అక్కడికి వెళ్లారు. వీలైనంతా త్వరగా ఆయన్ను భారత్‌కు తీసుకొస్తామన్నారు. ఢిల్లీ ఐసీఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌కు కూడా విషయం తెలిపామన్నారు. ఇజ్రాయిల్ రాయబారికి కూడా లేఖ రాశామన్నారు. వీలైనంత త్వరగా స్వదేశానికి పంపించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రెండు రోజుల్లో ఆయన సురక్షితంగా ఇండియాకు తిరిగి వస్తున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రత్యేక కార్యదర్శిని నియమించండి



మాట్లాడుతున్న రఘువీర్ నాయక్

రాయచూరు రూరల్: రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖకు ప్రత్యేక కార్యదర్శిని నియమించాలని హైదరాబాద్ కర్ణాటక వాల్మీకి నాయక్ సంఘం కార్యదర్శి రఘువీర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీజేపీ సర్కార్ హయాంలో సాంఘీక సంక్షేమ శాఖకు ప్రత్యేక కార్యదర్శిని నియమించలేదని ఆరోపించారు. మహర్షి వాల్మీకి జయంతి నాటికి ప్రత్యేక అధికారిని నియమించాలని ఒత్తిడి చేశారు.

మరణంలోనూ వీడని బంధం

- ఫారంపాండ్‌లో పడి అన్నదమ్ముల మృతి



మృతి చెందిన అన్నదమ్ములు(ఫైల్)

సాక్షి,బళ్లారి: బీదర్ జిల్లా చిటగుప్ప తాలూకా చీమకఖేడ గ్రామానికి చెందిన సాయిగణేష్(15), సాయినాథ్(15) అనే ఇద్దరు అన్నదమ్ములు ఫారంపాండ్‌లో పడి మృతి చెందారు. వీరిద్దరూ కవల పిల్లలు. తొమ్మిదో తరగతి చదువుతుండేవారు. సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని ఫారంపాండ్ వద్దకు వెళ్లారు. కాలు జారి ఒక బాలుడు పడగా, మరొక బాలుడు అతనిని రక్షించేందుకు ప్రయత్నించి ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. సోమవారం ఇద్దరు కుమారులు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. మంగళవారం ఫారంపాండ్‌లో ఇద్దరు శవాలై కనిపించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటన తెలిసిన వెంటనే జిల్లాధికారి, తహసీల్దార్, ఎస్పీ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మరణంలోను అన్నదమ్ముల బంధం వీడలేదని కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరు పెట్టారు.

ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం

రాయచూరు రూరల్: జిల్లాలో ఉపాధ్యాయుల సామూహిక బదిలీల విషయంలో గందరగోళం నెలకొంది. 2022–23వ విద్యా సంవత్సరంలో దేవదుర్గలో 373 మంది, మాన్విలో 351 మంది, సింధనూరులో 401 మంది, రాయచూరులో 280 మంది, లింగసూగూరులో 380 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కలబుర్గి డివిజనల్ కమిషనర్ బదిలీ ఆదేశాలను జిల్లా విద్యాశాఖాధికారికి ఇచ్చారు. అయినా తాలూకా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదన్న మాదిరిగా తాలూకా విద్యాశాఖాధికారికి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఆదేశించి 48 గంటలు గడిచినా జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

అప్పు తీర్చమన్నందుకు హత్య

- హంతకుల్లో ఒకరు అరెస్టు



నిందితుడు వినోద్

మాలూరు: ఆర్థిక వ్యవహారాలే రియల్టర్ మునియప్ప హత్యకు కారణమని తెలిసింది. హంతకుల్లో ఒకరిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పట్టణానికి చెందిన వినోద్ అలియాస్ విను అరెస్టయిన ప్రధాన నిందితుడు. పట్టణంలోని శ్రీరంగం కళ్యాణమంటపం ముందు రియల్టర్ మునియప్ప సోమవారం సాయంత్రం దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేయాలని మునియప్ప బంధువులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. వినోద్ అనే వ్యక్తికి దాదాపు రూ.40 లక్షల వరకు మునియప్ప డబ్బులు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బును తిరిగివ్వాలని మునియప్ప డిమాండ్ చేయడంతో వినోద్ తన సహచరులతో కలిసి మునియప్పను హత్య చేసినట్లు తెలిసింది. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

నీటి ఎద్దడిని నివారించండి



వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలోని సిరవార తాలూకాలో తాగునీటి ఎద్దడిని నివారించాలని రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడు లక్ష్మణగౌడ మాట్లాడారు. తాలూకాలోని హొక్రాణికి తాగునీరు, సాగు నీరు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. మూడు కి.మీ.దూరం వెళ్లి నీరు తెచ్చుకొనే పరిస్థితి ఎదురైందన్నారు. వ్యవసాయ బావుల్లో నీటిమట్టం తగ్గిందన్నారు. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందించాలని కోరారు.

చిన్నారులకు చుక్కల మందు



చుక్కలు వేస్తున్న డాక్టర్ శంకర్‌నాయక్ తదితరులు

హొసపేటె: ఇంద్రధనుష్ 3వ రౌండ్ వ్యాక్సినేషన్‌ను మాతా శిశు ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్ చిన్నారులకు టీకాలు వేసి ప్రారంభించారు. జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 3234, గర్భిణులు 560 మంది ఉండగా, వీరందరికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచారని, 5 ఏళ్లలోపు పిల్లలు, గర్భిణులు వివిధ వ్యాధుల నివారణకు టీకాల సదుపాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ జంబయ్యనాయక్, ఆరోగ్య విద్యాశాఖాధికారి ఎంపీ దొడ్డమని, ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.